పట్టువిడువని విక్రమార్కుని పట్టుదల హెచ్చెను. ఆ కాలములో ఎటు పోవుటకు తోచని వందలాది కార్యకర్తలను కూడగట్టుకున్నారు. జైళ్లలో మరియు అక్కడక్కడ నుండే వారెందరో ఉన్నారు. క్రమశిక్షణ, రాజకీయ చైతన్యము, సరియైన దృక్పథము మొదలగునవి బాగా రావాలంటే 1934 నుండి ప్రతి సంవత్సరము రంగాగారు వందలాది వేలకొలది విద్యార్థులను (కార్యకర్తలను) సిద్ధము చేసినటువంటి రైతాంగ విద్యాలయము ఒకటి నడుపవలెనని సంకల్పించినారు. అప్పటి హైదరాబాదు నాయకుల కా ధోరణి లేకుండెను. ఇదంతా యువకుడైన మరియు ఉత్సాహవంతుడైన వెన్నారెడ్డిగారే వ్యక్తిగతముగా పట్టుదలతో చేయుచుండిరి. కార్యకర్తలు ఎంతో ఉత్సాహముగా ఉండిరి. కాని, ఆర్థికవ్యవస్థ అస్తవ్యస్తముగా నుండెను. నిర్మాణాత్మక కార్యక్రమములకు, ఆర్థిక వనరులకు అవినాభావ సంబంధము ఉండును. ఒకవైపు "హైదరాబాదు" వారపత్రిక నడుపు భారము, మరియొక వంక రాజకీయ తరగతులకు, నిర్మాణాత్మక కార్యక్రమాలకు ఆర్థిక వనరులు, వాటికొరకు భగీరథ ప్రయత్నము రెడ్డిగారిని కృంగదీసెను. ఎంతో విసుగు జెందియు, విశ్రాంతి కావలెనని కోరిక యుండియు కార్యదీక్షను వదలలేదు. ఇట్టి స్థితిలో ఆచార్య రంగాగారి సకల విధములైన సహాయ సహకారములు రెడ్డిగారికి ఐరావతము నెక్కినంత తృప్తి నిచ్చెను.

### ఒకరికి భయం, మరొకరికి కుతూహలం

ఇప్పుడు 'హైదరాబాదు'' పత్రికను గురించి ఒక విషయము ముచ్చటింతము. హైదరాబాదు స్టేటు నుండి తండోపతండములుగా ప్రజలు విజయవాడ, కర్నూలు మొదలగు ప్రాంతములకు వలసపోయి యుండిరి. అట్టి కాందిశీకులు "హైదరాబాదు" పత్రికను కొనుట అటుంచి, ఉచితంగా యిచ్చినను సర్పమును చూసినట్లు భీతిల్లేవారు. తమచేత ఆ పత్రిక ఉన్నట్లయితే నైజాం ఖుఫ్యా వాళ్ల కంట బడినచో ఇంకా స్వస్థానములలో ఉన్న తమవారికి కడగండ్లు తప్పవని భావించేవారు. ఆంధ్ర ప్రాంతమువారు మాత్రము మితిమీరిన కుతూహలముతో ఆ పత్రికను చదివేవారు.

ఒకవైపు రామానంద అనుయాయులు సాగించే హింసతో కూడుకున్న బార్డర్ ఉద్యమం, వేరొకవైపు దేశాయి వర్గమువారి కాందిశీకుల శిబిరములు సాగుచునే యుండెను. వెన్నారెడ్డిగారు మాత్రము కాందిశీకుల కేంద్రములతో పరోక్షముగా గాని ప్రత్యక్షముగా గాని సంబంధము పెట్టుకోలేదు. మండుముల రామచంద్రరావుగారు మొదలగు వారికే వాటితో నేరుగా సంబంధము. అయినను రెడ్డిగారు కాందిశీకుల కేంద్రముల సందర్శనముగా అన్ని ప్రాంతములలో పర్యటన చేయుచుండిరి. కాని, రెడ్డిగారు "హైదరాబాదు" పత్రిక, రాజకీయ తరగతులు, వేసవి బడులు వీటిపైననే దృష్టిని కేంద్రీకరించిరి. కాలము గడుచు కొలది ఆంధ్ర ప్రాంతములో వీరి యునికి స్థానిక నాయకులకును, హైదరాబాదు నాయకులకును ఒక విధమైన తలనొప్పిగా పరిణమించినది. కారణము దినదిన ప్రవర్ధమానముగా పెరుగుచున్న వారి పలుకుబడి మరియు హోదా. కాని, రెడ్డిగారు మాత్రము వారితో ఎక్కడా ఏవిధమైన తంటాలు పెట్టుకొనకుండా చాలా జాగ్రత్తగా మసలుచుండిరి.

తరువాత కొద్ది కాలమునకే పోలీసు చర్య, ఆ తరువాత రాజకీయములు వాటి పరిణామములు అంద రెరిగినవే.

రెడ్డిగారు నిరాడంబరులు. కాని, 'శుచియైన జీవితం, రుచియైన భోజనం' కావలె నంటారు. కర్కశులుగా కనబడుదురు. కాని, దాని వెనుక ఎంతో మమత దాగియుండును. మిత్రులును ఎరిగినవారును తమను రెడ్డిగారు నిర్లక్ష్యము చేయుచున్నట్లు భావించి బాధపడుదురు. కాని, అయాచితముగా అనుకోని విధముగా వారిపై ప్రసరించు కటాక్షవీక్షణములకు తబ్బిబ్బయి, తాము పొరబడితిమని సిగ్గిల్లుదురు. పరిపాలనా యంత్రాంగము ఎడల చాలా కఠినముగా ప్రవర్తించునట్లు కనబడుదురు కాని, దాని వెనుక వారియొక్క పరిపాలనా సామర్థ్యము పెంపొందించుకొనవలెననెడి ప్రగాఢ వాంఛ, తపన గుప్తమై యుండును! నేటి పని రేపు కాదు; ఈరోజే కావలెననెడి కర్తవ్యదీక్ష వారి రక్తములో జీర్ణించుకున్నారు. ఒక్కసారి మాత్రమే చూసిన వ్యక్తిని సహితము అతని పేరుతో గూడా శాశ్వతముగా జ్ఞాపక ముంచుకొనగల అసాధారణ ధారణ శక్తిలో వారికి వారే సాటి.

డాక్టర్ వెన్నారెడ్డిగారు పరిపాలనాదక్షులు, దేశ సేవానురక్తులు, ఆర్తజన రక్షకులు, బాధ్యత లెరిగిన భటుడు. వేయేల; రెడ్డిగారు సంపూర్ణవ్యక్తి !



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# నిత్యం ఎదుగుతున్న నాయకుడు

కోదాటి నారాయణరావు

1940 అనుకొంటాను. నల్లగొండ జిల్లా చిలుకూరులో అష్టమాంధ్ర మహాసభ సమావేశము జరిగింది. అది ఒక చరిత్రాత్మక సన్నివేశము. మల్కాపురంలో జరిగిన ఏడవ ఆంధ్ర మహాసభ తర్వాత ఎనిమిదవ మహాసభ వరకు దివంగతులయిన మహనీయులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ మొట్టమొదటి తీర్మానం చర్చకు వచ్చినది విషయ నిర్ణయ సభలో— దురదృష్టవశాత్తు ఆ మధ్యకాలంలో అనేక మంది ఆంధ్ర భాషాసేవకులు, దేశభక్తులు మృతి చెందారు. అందులో పేర్కొన దగినవారు: కీ. శే. వేదం వెంకటరాయశాస్త్రి, చిలకమర్తి లక్ష్మీనర్సింహం, కూచి నరసింహం, పానుగంటి లక్ష్మీనరసింహారావు, పుల్లెల శ్యామసూర్యారావుగార్లు, మొదలయినవారు. వారి మృతిపట్ల కూడా సానుభూతి చూపించి శ్రద్ధాంజలి ఘటించవలెనని నేను సూచించాను. పెద్దలందరూ వ్యతిరేకించారు. వారు చూపించిన కారణం ఒకే ఒకటి. దివంగతులు నిజాం రాష్ట్ర ప్రాంత నివాసులు కారు అని. అప్పుడు నేను 'మౌలానా మహమ్మదలీ మొదలయిన యు. పి. వాసులకు శ్రద్ధాంజలి ఎలా ఘటించారు?' అని ప్రశ్నించాను. 'వారు దేశనాయకు'లన్నారు పెద్దలు. వీరున్నూ ఆంధ్రభాషా సంస్కృతి రంగాల్లో నాయకులని నేను వాదించాను. గత మహాసభల నివేదికల నుండి అనేక నిదర్శనలు చూపించాను. ససేమిరా అన్నారు పెద్దలు. చివరకు నా సవరణ వీగిపోయింది. అట్లే, నిజాం రాష్ట్ర ఆంధ్రుడు అనే నిర్వచనాన్ని మార్చాలని పెద్దలు అన్నారు. అమలులో ఉన్నదే చక్కగా ఉన్నదన్నాను నేను. కొంత ఘర్షణ తర్వాత నా సవరణను వోటుకు పెట్టి వీగిపోయిం దన్నారు. విషయ నిర్ణయ సభకు నోటీసు యిచ్చి మహాసభలో నా సవరణను ప్రవేశపెట్టాను. నా సవరణను బలపరచినవారిలో— కాళోజీ, కొమరగిరి, ఆళ్వారుస్వామి ముఖ్యులు. మా ఉపన్యాసాలు చాలా ఉద్రేకాన్ని, ఉత్సాహాన్ని పురికొల్పినవి యువకుల్లో. అప్పటినుంచి కాళోజీ, కోదాటి, కొమరగిరి 'నారాయణత్రయం' అనే పదం వాడుకలోనికి వచ్చింది. ఈ కథంతా ఎందుకు చెప్పానంటే: అంతవరకు పనులు చేసుకుంటుండే మేము వేదిక నెక్కి పెద్దల నెదిరించడం అదే మొదటిసారి.

ఈ సన్నివేశం గడిచి కొన్ని నెలలయిన తర్వాత నేను హైదరాబాదుకు వచ్చాను. అప్పుడు మిత్రులు శ్రీ చెన్నారెడ్డి గారు వైద్య కళాశాల విద్యార్థి. ఆంధ్ర విద్యార్థి సంఘ సంస్థను నిర్వహిస్తుండేవారు. దాని వార్షికోత్సవ సందర్భంలో నన్ను ఆహ్వానించా రాయన. నేను ఆ సభలో మాట్లాడాను. ఈ సందర్భంలో చెన్నారెడ్డిగారితో నాకు తొలిసారిగా పరిచయమైంది. ఎనిమిదవ మహాసభ నుండి తొమ్మిదవ మహాసభ వరకు అంతర్జాతీయ రంగంలో పరిస్థితులు మారాయి. జర్మనీ రష్యామీద దాడి చేసింది. అప్పటివరకు ప్రపంచ యుద్ధాన్ని సామ్రాజ్యవాదుల యుద్ధం అని ఎలుగెత్తి చాటిన కమ్యూనిస్టులు ఒక్కసారిగా ఇది ప్రజాయుద్ధ మన్నారు. ఈ ప్రజా యుద్ధంలో బ్రిటిష్ ప్రభుత్వంతోనూ దానికి అనుబంధమయిన నిజాం ప్రభుత్వంతోనూ, తలపడగూడ దన్నారు. వీలయితే సహకరించ మన్నారు. దీని కనుగుణంగా అప్పటివరకు మేమంతా కలిసి బహిష్కరించిన రాజ్యాంగ సవరణలను కొన్ని షరతులతో అంగీకరించా లన్నారు కమ్యూనిస్టులు. దీని ననుసరించి మహాసభ విధానంలో చాలా పెద్ద మార్పు వచ్చినది. కీ. శే. మందుముల రామచంద్రరావుగారి నాయకత్వంలో మేము రాజ్యాంగ సంస్కరణలను బహిష్కరించా లనుకున్నాము. కీ. శే. బూర్గుల రామకృష్ణారావుగారు కూడా మా పక్షమే. మందుముల నర్సింగరావుగారు కమ్యూనిస్టు వాదానికి ప్రోత్సాహకారులు. అందుకనే సభాంతంలో మిత్రులు కాళోజీ అన్నారు: 'హాయ్ హాయ్ నర్సింగన్, హోగయే, క్రామేడోం మే జమ్'. మేమంతా ఆలోచించుకుని ఆంధ్ర మహాసభలో ఎటువంటి కార్యకారిణి పదవులు నిర్వహించగూడదని నిశ్చయించు కున్నాము. ఈ వైఖరి ఫలితంగానే కొద్దికాలం తర్వాత ఆంధ్ర జాతీయ పక్షం ఏర్పడింది. ఇది తెలంగాణాలో ఆకులందు అణిగి మణిగి నిర్వహించిన పాత్ర అమోఘమయినది. ఈ సందర్భంలో నే నొకసారి ఖమ్మం నుండి భువనగిరి రైలులో వెళ్తున్నాను. చెన్నారెడ్డిగారు కూడా ఖమ్మంలో రైలు ఎక్కి మానుకోట (మహబూబాబాద్) వెళ్తున్నారు. అప్పుడు ఆయన ప్రభుత్వోద్యోగి. మానుకోటలో మెడికల్ ఆఫీసర్. రైలులో



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

చాలాసేపు మేము మాట్లాడుకున్నాము. ప్రభుత్వోద్యోగాన్ని వదిలిపెట్టి రాజకీయ రంగంలో ప్రవేశించవలసినదని మేము గట్టిగా సలహా ఇచ్చాము. అందుకోసం మేము చెప్పిన హేతువులన్నీ ఇప్పుడు పేర్కొనడం అనవసరం. ఆయన మామాటలలో విని పోతూ, 'మీరు చెప్పిన మాటలన్నీ బాగానే ఉన్నాయి. ఆలోచించి నిర్ణయం చేస్తా' నన్నారు. తర్వాత కొద్ది కాలానికే ఆయన ప్రభుత్వోద్యోగానికి రాజీనామా చేశారు. రాజకీయ రంగంలో ప్రవేశించారు. ఆంధ్ర జాతీయ పక్షంలో సభ్యులుగా చేరారు. అప్పటినుండి ఆయనకూ నాకూ సన్నిహిత సంబంధం ఏర్పడింది. ఆయనను, మందుముల రామచందర్‌రావుగారిని ఆంధ్ర మహాసభ కార్యదర్శులుగా చేశారు. కొంతకాలం తర్వాత కారణాంతరాలవల్ల చెన్నారెడ్డిగారు ఆంధ్ర జాతీయ కార్యక్రమాలలో పనిచేయుటను విరమించుకున్నారు. అయినప్పటికీ ఆంధ్రోద్యమములో పనిచేయవలసిందిగా మేము ప్రోత్సహించాము.

## ఎదురీత, వాలుఈత

మరీ వివరాలలోకి పోకుండా సంగ్రహంగా చెప్తాను. చెన్నారెడ్డిగారు రాజకీయాలలో అనేక పక్షాలు, సంస్థలు మారి రాజకీయ సముద్రంలో ఈదుతున్నారు. సముద్రంలో ఈదేవాడికి ఈత రెండు విధాలు. ఒకటి వాలు, మరొకటి ఎదురీత. కొన్నిసార్లు ఆయన ఎదురీత ఈదినా, కొన్నిసార్లు వాలులో ఈదినా, కెరటాలు ఆయనను ముంచివేయలేదు. అది ఆయన జీవిత ధన్యత అని చెప్పుకోవాలి. బహుశః ఈనాడు ఆయనకు కలిగిన ఈశ్వర విశ్వాసానికి ఇదే ప్రధాన కారణం అయివుండాలి. రాజకీయ రంగంలో కలిసి రావడం, కలిసి రాకపోవడం మూడు విధాలుగా ఉంటుంది. మొదటిది—ఒక మనిషి ధ్యేయం ఫలవంతం కావడం, అతడు కూడా రాజకీయ రంగంలో గణుతి కెక్కడం. రెండవది—ఒక వ్యక్తి ధ్యేయం నెరవేరినా ఆ వ్యక్తికి చెప్పుకోదగ్గ గణ్యత రాకపోవడం. మూడవది—ఒక వ్యక్తికి ధ్యేయం ఫలించినా ఫలించక పోయినా ఆ వ్యక్తికి ప్రాధాన్యం లభించడం, సమాజంలో అతడు గణుతి కెక్కడం. చెన్నారెడ్డిగారిని గురించి చెప్పవలసి వస్తే పైన చెప్పిన మూడు విధాలలో మూడవ విధానికి చెందుతారని చెప్పవచ్చు. అట్లా ఒక వ్యక్తి గొప్పవాడు కావడానికి అతనిలో సహజంగా కొన్ని శక్తి సామర్థ్యాలు, గుణాలు ఉండాలి. అవి రాణించడానికి అవకాశాలు కూడా కలిసి రావాలి. లేకపోతే, ఎట్లా పెరిగినాడు బూజు పట్టిన ప్రబంధం విశ్వకోశం దిగజారిన ట్లవుతుంది. ఆవిధంగా అవకాశాలు కలిసివస్తే 'పిలిచిన రాని లక్ష్మిని తాల్' ఉంటుంది. చెన్నారెడ్డిగారిలో సహజసిద్ధంగా కొన్ని శక్తి సామర్థ్యాలు ఉన్నాయి. ఏ సమస్య తీసుకున్నా క్షుణ్ణంగా పరిశీలిస్తారు. దానికి సంబంధించిన సాహిత్యాన్నంతా చదువుతారు. పూర్వాపరాలు అవగాహన చేసుకుంటారు. అందువల్ల అడ్మినిస్ట్రేటర్‌గా ఆయన రాణించ గలుగుతున్నారు. బ్యూరాక్రసీ అనే పద్మవ్యూహంలో పడిపోకుండా దానిని అదుపు చేయడానికి ప్రయత్నిస్తారు. ఈ రోజుల్లో ఈ ప్రజ్ఞ, పాటవం, చాలామంది నాయకుల్లో అంతగా చూడము. పెక్కుమంది ప్రభుత్వ యంత్రాంగంలో చిక్కుకొని పోతుంటారు. ఎదిరిస్తే గాని బ్యూరాక్రసీ కొంచెమైనా లొంగదు. ఇక రెండవది—ఆయనలో ఒక సంకల్పం కలిగితే అది నెరవేర్చటకు ఎంతో పట్టుదలగా పని చేస్తారు. ఇటువంటి పట్టుదల ఇతరులలో అంతగా అగుపడదు. దీనితో పాటు మరొక విశేష మేమిటంటే—ఆయన పరిస్థితులు మారితే పరిస్థితుల కనుగుణంగా తమను తాను మార్చుకోగలరు. అందువల్లనే క్రమక్రమేణా మారుతున్న పరిస్థితులలో గూడా ఆయన రాణించ గలుగుతున్నారు. ఈ విధమైన గుణ విశేషాలు ఉదాహరణలు చూపిస్తూ వివరించవలసి వస్తే కొద్దిపాటి గ్రంథమే రాయవలసి రావచ్చును.

చెన్నారెడ్డిగారికి షష్టిపూర్తి అవుతున్నదంటే వింతగానే అనిపిస్తుంది. ఇంకా నా దృష్టిలో ఆయన యువకులే. బహుశః ఆయన దృష్టిలో కూడా యువకులే. ఉత్సాహంలోనూ, పట్టుదలలోనూ, పాటవంలోనూ ఆయన ఏ యువకుడికీ తీసిపోరు.

ఈ షష్ట్యబ్ది పూర్తి శుభ సందర్భంలో మిత్రులు చెన్నారెడ్డికి ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలుగజేసి, ఇంకా ప్రజాసేవ చేసే మహదవకాశం కలిగించవలెనని ఈశ్వరుణ్ణి ప్రార్థిస్తున్నాను. ఇక్కడ ఐశ్వర్యము అంటే సాధారణంగా మనం అనుకునే సంపద కాదు. ఈశ్వర గుణసంపద అని దాని అర్థము. ఇంకా ఆయన ఎంతో ఎత్తుకు ఎదగవలసి ఉన్నారు. అట్లా ఎదగాలని ఆశిద్దాం. ఈ సందర్భంలోనే వారి శ్రీమతి సావిత్రిని 'దీర్ఘసుమంగళీ భవ!' అని ఆశీర్వదిస్తున్నాను. ఆయన కుటుంబ జీవితం, ప్రజాహిత జీవితం సుఖసంతోషాలతో వర్ధిల్లుగాక!



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# తెలంగాణ అభివృద్ధి—డాక్టర్ చెన్నారెడ్డిగారు

టి. హయగ్రీవాచార్యులు

అనేక సంవత్సరాలపాటు రాచరిక, ఫ్యూడల్ వ్యవస్థల క్రింద అణగిపోయిన ప్రాంతం తెలంగాణం. ఈ కారణంవల్ల సహజంగానే సాంస్కృతికంగా, సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా తెలంగాణ ప్రాంతం వెనుకబడి పోయింది. రాచరికపు పాలన నుంచి విముక్తి పొందిన తరువాత పూర్వపు హైదరాబాద్ రాష్ట్రం యథాతథంగా కేవలం ఏడెనిమిది సంవత్సరాలే కొనసాగింది. గడచిన సంవత్సరాల గాయాలు మానడానికే ఈ ఏడెనిమిది సంవత్సరాల కాలం సరిపోయింది. అందువల్ల, వాస్తవానికి ఆంధ్ర ప్రదేశ్ అవతరణతోనే తెలంగాణ ప్రాంతంలో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ అభివృద్ధి కార్యక్రమాలకు అంకురార్పణ జరిగింది. విద్యారంగంలో, రవాణా సౌకర్యాలలో, ఆరోగ్య—వైద్య రంగాలలో, నీటిపారుదల సౌకర్యాలలో, పారిశ్రామిక రంగంలో, ఆధునిక అభివృద్ధికి సంబంధించిన ఇతర రంగాలలో ఎంతో వెనుకబడ్డ తెలంగాణ ప్రాంతపు ప్రగతి సాధారణ విషయం కాదు. ఇది చాల క్లిష్టమైన కార్యం. అంతకుముందే వివిధ రంగాలలో కొంత అభివృద్ధి సాధించిన ఇతర ప్రాంతాలతో పోల్చినప్పుడు తెలంగాణ ఆర్థిక, సామాజిక అసమానత్వం తీవ్రంగా కన్పించడం సహేతుకమే.

## సాహచర్యం

పూర్వపు హైదరాబాద్ స్వాతంత్ర్య సమరంలో అగ్రగణ్య పాత్ర వహించి, ఆటు తరువాత విముక్త హైదరాబాద్ రాష్ట్రంలో వ్యవసాయ శాఖ వంటి కీలక మంత్రిత్వ బాధ్యతలను నిర్వహించిన డాక్టర్ చెన్నారెడ్డిగారు, మొదటినుంచి ఆయనతో సాహచర్యం జరిపే అవకాశం లభించిన నా వంటివారు తెలంగాణ అభివృద్ధిపట్ల ప్రత్యేక శ్రద్ధాసక్తులను కనబరచడం జరిగింది. ఏ విషయమైనయినా, ఏ సమస్య వచ్చినా లోతుగా, సాకల్యంగా, ఎంతో శ్రద్ధతో పరిశీలించి పరిష్కారం సాధించే వరకు విశ్రమించని కార్యదక్షత, నాయకత్వ పటిమ, వజ్రసంకల్పం, దృఢదీక్ష, అకుంఠిత డాక్టర్ చెన్నారెడ్డి విశిష్ట వ్యక్తిత్వంలోని ప్రత్యేక లక్షణాలు. చెన్నారెడ్డిగారిలోని ఈ గుణ విశేషాలు ఆయన స్వభావంలో సహజసిద్ధమైనవి. గడచిన నలభయి సంవత్సరాల కాలంలో అనేక రాజకీయ, ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించడంవల్ల ఆయనలోని ఈ గుణ విశేషాలకు ద్విగుణీకృత మయిన రాణింపు వచ్చింది. చెన్నారెడ్డిగారితో నా పరిచయం ఈనాటిది కాదు. దాదాపు నలభయి సంవత్సరాల క్రిందట, 1939 వ సంవత్సరంలో డాక్టర్ చెన్నారెడ్డిగారు విద్యార్థి నాయకుడుగా ఉన్నప్పుడే నా పరిచయం ప్రారంభ మయింది. తొలి పరిచయంలోనే చెన్నారెడ్డిగారి నాయకత్వ దక్షతను, బహుముఖ ప్రతిభా సంపదను, ఆయన ఉజ్జ్వల భవిష్యత్తును నేను స్పష్టంగా గుర్తించగలిగాను. ఆనాటి మా పరిచయం గడచిన నాలుగు దశాబ్దాల కాలంలో సన్నిహిత సంబంధంగా దృఢపడింది. 1939 వ సంవత్సరంలో, నల్లగొండ జిల్లాలోని మల్కాపురంలో జరిగిన ఆంధ్ర మహాసభ నాటినుంచి ఈనాటి వరకు, మొదట ఆంధ్ర మహాసభ ఉద్యమాలలో, ఆటుతరువాత హైదరాబాద్ స్వాతంత్ర్య ఉద్యమంలో, విముక్త హైదరాబాద్ రాజకీయ రంగంలో, ఆటుతరువాత ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో, అభివృద్ధి కృషిలో, ఈరోజు ఆయన ముఖ్యమంత్రిత్వం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో చెన్నారెడ్డిగారితో కలిసి అతి సన్నిహితంగా ప్రజాహిత జీవనం గడిపే అవకాశం నాకు కలిగింది.

## సమాన అభివృద్ధి

అసమానత్వం, తారతమ్యం, విచక్షణ అన్నవి లేకుండా అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందినప్పుడే దేశం పరిపూర్ణ సౌష్ఠవంతో, సమగ్ర స్వరూపంతో పటిష్ఠ మవుతుంది. ఇదే ఉద్దేశంతో, ఆంధ్రప్రదేశ్ అవతరణ



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

జరిగినప్పుడు హర్యానా, పంజాబ్‌లలో వలె కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రాంతానికి ఒక ప్రాంతీయ సంఘాన్ని ఏర్పాటు చేసింది. తెలంగాణ శాసనసభ్యులందరు ఈ ప్రాంతీయ సంఘంలో సభ్యులుగా ఉండేవారు. మొదటి ప్రాంతీయ సంఘంలో అభివృద్ధి కార్యక్రమాల ఉపసంఘానికి అధ్యక్షులుగా ఉండి డాక్టర్ చెన్నారెడ్డిగారు వివిధ రంగాలలో తెలంగాణ అభివృద్ధికి పునాదులను, ప్రాతిపదిక పథకాలను, మార్గదర్శక సూత్రాలను రూపొందించినారు. తరువాత 1962–67 సంవత్సరాల మధ్య కాలంలో తెలంగాణ ప్రాంతీయ సంఘానికి నేను అధ్యక్షుడుగా పనిచేసినప్పుడు చెన్నారెడ్డిగారు అంతకుముందు రూపొందించిన మార్గదర్శక సూత్రాలు ఎంతో ఉపకరించినవి.

## విజ్ఞత, దూరదృష్టి

తెలంగాణ సర్వతోముఖ అభివృద్ధి దృష్ట్యా చెన్నారెడ్డిగారు ఆ రోజుల్లో ప్రదర్శించిన విజ్ఞతకు, దూరదృష్టికి నిదర్శనంగా ఈ సందర్భంలో ఎన్నో ఉదాహరణలు ఇవ్వవచ్చు. నేను తెలంగాణ ప్రాంతీయ సంఘం అధ్యక్షుడుగా ఉన్న కాలంలో చెన్నారెడ్డిగారు పంచాయతీరాజ్, ఆర్థిక మంత్రిత్వ శాఖలను అతి సమర్థవంతంగా నిర్వహిస్తూ తెలంగాణ అభివృద్ధి కృషిలో, ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖ అభ్యుదయ యాత్రలో మహత్తర పాత్ర వహించినారు. 1962–67 సంవత్సరాల కాలంలో ముప్పదికోట్ల రూపాయల వరకు వ్యయం చేసి, చెన్నారెడ్డిగారి అండదండలవల్లనే తెలంగాణ ప్రాంతీయ సంఘం ప్రధానమైన ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్ట గలిగింది; ఎన్నో అభ్యుదయ పథకాలకు రూపకల్పన చేయగలిగింది; భావి అభ్యున్నతికి బాటలు వేయగలిగింది.

## అధిక ప్రాధాన్యం

అభ్యుదయ ప్రాథమిక పాఠశాలల పథకంతో విద్యారంగానికీ, రోడ్లు, రవాణా సౌకర్యాల అభివృద్ధి పథకంతో గ్రామీణ రంగానికీ ముఖ్యమంత్రిగా డాక్టర్ చెన్నారెడ్డిగారు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. వాస్తవానికి చెన్నారెడ్డిగారి ఈ ప్రగతిశీల భావాలు, పురోగామి దృక్పథం, శాంతియుత విప్లవ వైఖరి, అభ్యుదయ పథకాలు కొత్తవి కావు. ఆ రోజుల్లో గూడ చెన్నారెడ్డిగారు ఇవే ఆశయాలతో పరిశ్రమించడం జరిగింది. ఇందుకు నిదర్శనంగా ఆ రోజుల్లో తెలంగాణా ప్రాంతీయ సంఘం అమలు జరిపిన వివిధ కార్యక్రమాలను ఉదాహరించవచ్చు. సామాజిక ఆర్థిక విప్లవానికీ, అభ్యుదయానికీ విద్యాభివృద్ధి ప్రాతిపదిక వంటిది. అందువల్ల తెలంగాణ ప్రాంతీయ సంఘం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల భవనాల నిర్మాణం కోసం అయిదు సంవత్సరాల కాలంలో (1962–67) మూడు కోట్ల రూపాయలను వెచ్చించింది. ఇదేకాలంలో తెలంగాణ జిల్లాలలోని కళాశాలల అభివృద్ధికోసం గూడ ప్రాంతీయ సంఘం తన నిధులను కేటాయించింది. తెలంగాణ ప్రాంతీయ సంఘం పక్షాన డాక్టర్ చెన్నారెడ్డిగారి ప్రోత్సాహంతో మూడు కోట్ల రూపాయలను ఉస్మానియా విశ్వవిద్యాలయం పేరిట ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి బోర్డుకు అప్పుగా ఇవ్వడం జరిగింది. ఇది ఉస్మానియా విశ్వవిద్యాలయానికి స్థాపక నిధి **(Foundation grant)**. ఈ అప్పుమీద ఇప్పటికీ ఏటా పద్దెనిమిది లక్షల రూపాయలు వడ్డీ రూపేణ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఆదాయంగా లభిస్తున్నది. ఆదే కాలంలో కాకతీయ విశ్వవిద్యాలయ స్థాపన ప్రతిపాదనకు, ఆలోచనకు అపూర్వమైన బలం చేకూరింది. కాకతీయ విశ్వవిద్యాలయ స్థాపక నిధిని గూడ ఏర్పాటు చేయాలని తెలంగాణా ప్రాంతీయ సంఘం భావించింది.

## రవాణా సౌకర్యాలు

గ్రామీణ ప్రాంతాలలో, ప్రతి ఊరికి రోడ్లను నిర్మించి రవాణా సౌకర్యాలను కల్పించే కార్యక్రమానికి తెలంగాణ ప్రాంతీయ సంఘం పైన వివరించిన అయిదు సంవత్సరాల కాలంలోనే అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఈ కార్యక్రమం కొరకు ప్రాంతీయ సంఘం పదికోట్ల రూపాయలను ఖర్చు చేసింది. పంచాయతీరాజ్, రోడ్స్ అండ్ బిల్డింగ్ శాఖల ద్వారా రోడ్ల నిర్మాణం జరిగింది. రాష్ట్రంలోని ప్రధాన మార్గాలలో ముఖ్యమైన వంతెనలు, కల్వర్టులు నిర్మించబడ్డాయి. ఇటువంటి పథకంతో గ్రామ ప్రాంతాలలోని రవాణా సౌకర్యాలను పెంపొందించడానికి తెలంగాణ ప్రాంతీయ సంఘం ఎంతో కృషి జరిపింది.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

## పోచంపాడు ప్రాజెక్టు

వెనుకబడ్డ తెలంగాణ ప్రాంతంలో వ్యవసాయాభివృద్ధికి పోచంపాడు ప్రాజెక్టు ప్రాణాధారం వంటిది. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం తెలంగాణ ప్రజలు ఎన్నో సంవత్సరాల నుంచి కలలు కంటున్నారు. పోచంపాడు ప్రాజెక్టు సత్వర నిర్మాణం కోసం అవసరమైన చర్యలను తీసుకోవడానికి తెలంగాణ ప్రాంతీయ సంఘం ప్రత్యేకమైన ఒక ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ విషయంలో ఎన్నో పర్యాయాలు ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపవలసి వచ్చింది. ఈ ప్రయత్నాలన్నిటి ఫలితంగా 1963వ సంవత్సరంలో అప్పటి ప్రధాన మంత్రి జవహర్లాల్ నెహ్రూ పోచంపాడు ప్రాజెక్టుకు శంకుస్థాపన గావించినారు.

పోచంపాడు ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేసిన వారిలో చెన్నారెడ్డిగారు ప్రముఖులు. ఇటీవల ముఖ్యమంత్రి చెన్నారెడ్డిగారు పోచంపాడు ప్రాజెక్టుకు శ్రీరామ సాగర్‌గా నామకరణం కావించినారు. ఈ ప్రాజెక్టు ఉత్తరపు కాలువకు సరస్వతి కాలువగా, దక్షిణపు కాలువకు కాకతీయ కాలువగా గూడ చెన్నారెడ్డిగారు నామకరణం జరిపినారు.

## పారిశ్రామిక విప్లవం

విద్యుచ్ఛక్తి సౌకర్యం ఉన్నట్లయితే గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయరంగం, పరిశ్రమల రంగం రెండూ అభివృద్ధి పొందడానికి అవకాశం ఉంటుంది. ఈ ఉద్దేశ్యంతో, పైన పేర్కొన్న అయిదు సంవత్సరాల కాలంలో తెలంగాణ గ్రామీణ విద్యుదీకరణ కార్యక్రమానికి ప్రాంతీయ సంఘం తొమ్మిది కోట్ల రూపాయలను కేటాయించింది. అప్పటినుంచి తెలంగాణ ప్రాంతంలో గ్రామీణ విద్యుదీకరణ కార్యక్రమం అపూర్వంగా విస్తరించింది. ఇదేకాలంలో, మునిసిపాలిటీలకు, టవును కమిటీలకు అయిదుకోట్ల రూపాయలను కేటాయించి మంచినీటి సదుపాయాలను ప్రాంతీయ సంఘం గణనీయంగా అభివృద్ధిపరచింది. ఆ అయిదు సంవత్సరాల కాలంలోనే డాక్టర్ చెన్నారెడ్డిగారి నేతృత్వంలో, తెలంగాణా పారిశ్రామిక విప్లవానికి ప్రాంతీయ సంఘం అంకురార్పణ గావించింది.

## గ్రామాభివృద్ధి

పారిశ్రామిక అభివృద్ధిని సాధించే నిమిత్తం ప్రతి జిల్లాలోను పారిశ్రామిక వాడలను స్థాపించడంలో తెలంగాణ ప్రాంతీయ సంఘం పెద్ద యెత్తున సహాయపడింది. గ్రామీణ ప్రాంతాలలో పారిశ్రామిక వాడల స్థాపనకు గూడ ప్రాంతీయ సంఘం తోడ్పడింది. ముప్ఫయి యూనిట్లతో హైదరాబాద్ నగర సమీపంలోని బాలానగర్‌లో ప్రాంతీయ సంఘం సహాయంతో ప్రారంభమయిన సహకార పారిశ్రామిక వాటిక ఎంతో అభివృద్ధి పొంది జయప్రదంగా నిర్వహించబడుతున్నది. ప్రతి పంచాయతీ సమితిలోను ఒక పరిశ్రమను స్థాపించి, అభివృద్ధిపరచాలన్న కార్యక్రమాన్ని తెలంగాణా ప్రాంతీయ సంఘం రూపొందించింది. గ్రామీణ ప్రాంతాల పారిశ్రామిక అభివృద్ధిపట్ల తెలంగాణ ప్రాంతీయ సంఘం డాక్టర్ చెన్నారెడ్డిగారి ప్రోత్సాహముతో ఆనాడే శ్రద్ధ వహించింది.

## శుభాకాంక్షలు

అభివృద్ధి కార్యక్రమాలలో, ప్రగతిశీల కార్యకలాపాలలో డాక్టర్ చెన్నారెడ్డిగారి దూరదృష్టిని, విజ్ఞతను వివరించే ఇటువంటి ఉదాహరణలను అనేకం ఇవ్వవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి దోహదకరంగా ఆరు సూత్రాల పథకం రూపుదాల్చింది. డాక్టర్ చెన్నారెడ్డిగారి అసాధారణ రాజకీయ విజ్ఞత ఫలితంగా, ఆయన సమర్థవంతమయిన నేతృత్వంలో తెలంగాణ ప్రాంతం, ఈ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు ఆరు సూత్రాల పథకం ప్రాతిపదికగా అపూర్వమైన ప్రగతిని సాధించి నూతనయుగంలో ప్రవేశించగల మనడంలో నాకు ఎంతమాత్రం సందేహంలేదు. చెన్నారెడ్డిగారి షష్టిపూర్తి జరుగుతున్న ఈ శుభసందర్భాన భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలను, జాతీయ స్థాయిలో అత్యున్నత పదవులను ప్రసాదించవలెనని ప్రార్థిస్తూ హార్దిక శుభాకాంక్షలను అందజేస్తున్నాను.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# శుభశకము

ముదిగొండ వీరభద్రమూర్తి

అను. బస్సుగమ్యః ప్రతిగ్రామః
గ్రామగమ్యః పరిశ్రమః
ఋణం తస్మై ధనం తస్మాత్
ఆంధ్రా లక్ష్మీయుతాందవాః.

మధ్యా. అక్షరాల్‌తో మిఠాయ్ వండి అమ్ముకొను కవీశ్వరులకు
అక్షరాల అర్థమ్మేదో ఆకళించుకొను ప్రజకు వి
రక్షరాస్యత రూపుమాపు అద్యతన మహోద్యమంబు
అక్షయ శుభశకము నేటి ఆంధ్రమే మార్గదర్శకము.

క. తలవని తలపుల బ్రతుకుల్
తళతళలాడు పథకాల్ భళా! చీకటినే
ఇలలో వెన్నెల పంటలు
కలలోని సుఖమ్ము లొందగలిగెద మిలలో!

మధ్యా. సురుచిరంబైన ప్రభాతశోభను కప్పుకొని దిన
కరబింబముకురమందు తిలకంబు దిద్దుకొని యీనాడు
పరిమళించిన గాలిఁ బీల్చి పరవశించె తెలుగుతల్లి
మరిమరి బోధించె సమసమాజ సంస్థాపన గూర్చి.

ఆ. వె. సకలరాష్ట్రములు విశాలాంధ్ర విభవముల్
వినుతిసేయుకొలకు ననవరతము
మ్రి గుబురునుండి మధురము చెన్నైన
కోకిలస్వరంబు కొసరుగాత!

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# ఆంధ్రుల ఆత్మబంధువు

ఎ. వి. యస్. ఆర్. ఆంజనేయులు

అంతకుముందు నిజానికి డా. చెన్నారెడ్డిగారు నన్ను ఎరుగరనే చెప్పవచ్చు. నా సంగతీ అంతే. అప్పటికి వారికి నేను దగ్గర వాడిని అని చెప్పుకోవేందుకు ఏ సన్నివేశము ఉత్పన్నమవలేదు. అయినా కొన్ని మధురమైన అనుబంధాలు ఎప్పుడు ఎల్లా ఏర్పడతాయో చెప్పటం కష్టం. అది కేవలం దైవికం. దానికే పెద్దలు ఋణానుబంధం అంటారు. 1977 జులై నెలలో వారు ఉత్తర ప్రదేశ్‌కు గవర్నరుగా ఉన్నప్పుడు, నేను ఒక ఉత్తరం వ్రాశాను సాహసించి. "పదవి వదలి ఆంధ్ర దేశానికి వచ్చేయండి; మీరే మాకు కాబోయే ముఖ్యమంత్రి" అని. అయితే ఇంత ధైర్యంగా ఈ మాటలు వ్రాయటానికి నాకు నైతికమైన బలాన్ని ప్రసాదించింది పుణ్యమూర్తి తపస్వి అయిన ఒక ఉద్యోగి. వారి పేరెందుకులెండి. ఏదీ ఆశించకుండా జగత్కల్యాణం కోసం ఎక్కడో ఒక మూల కూర్చొనే మహనీయుడు పేరు కోసం ప్రాకులాడడు గదా!

నా లేఖకు ఒకనాడు సమాధానం వచ్చింది. డా. చెన్నారెడ్డిగారు గవర్నరుపదవికి రాజీనామా చేసి అక్టోబరు 3వ తేదీ హైదరాబాదు వస్తున్నట్లు, అంతేకాదు భవిష్యత్ కార్యక్రమాలలో మీలాంటి కార్యకర్తల సంపూర్ణ సహాయము, సహకారము కావలసి ఉంటుందన్నది వారి లేఖ సారాంశము. నిజానికి ఆ లేఖ వస్తుందని నే నెప్పుడూ ఊహించలేదు. అంత పెద్ద వారి నుంచి ఇంత చిన్నవాడికి లేఖలు రాకపోవటమే లోకంలో సహజము నేటి పరిస్థితుల్లో. ఈ లేఖతో డా. చెన్నారెడ్డి గారు తాను కోరిన రీతికి అభిమానుడనని నిరూపించుకున్నారు. అదే ఆయనకూ నాకూ మధ్య దైవము నిర్మించిన స్నేహపు వంతెన. వారి అప్పటి భవిష్యత్ రాజకీయ కార్యక్రమాన్ని గూర్చి కొన్ని వదంతులు గాలిలో తేలుతున్నాయి. అది ఏమంటే—వారు జనతా పార్టీలో చేరబోవుతున్నారని. అది కేవలం వదంతులేనని 1977 నవంబరు 12వ తేదీన తేలిపోయినది. ఆనాడు వారి ప్రాంగణములో ఒక సదస్సు ఏర్పాటైనది. ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ ప్రాంతముల నుండి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు బహుళ సంఖ్యలో పాల్గొన్నారు. మా గుంటూరు జిల్లానుండి నేను, శ్రీ బి. వెంకట్రామిరెడ్డి మాత్రమే పాల్గొన్నాము. ఆనాటి ఉదయం సమావేశంలో చాలామంది కార్యకర్తలు 'ఆంధ్ర ప్రదేశ్‌లో ఆనాటి పరిస్థితుల్లో 'జనతాకే' గెలవటానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి; డా. చెన్నారెడ్డిగార్ని జనతాపార్టీలో చేర'మని ఉద్రేకపూరితోపన్యాసాలు చేశారు. అప్పటికే మధ్యాహ్నము రెండు అయినది. అంతా భోజనాలకు లేచినాము. మిత్రుడు గోవిందరెడ్డిగారు నన్ను డాక్టరు రెడ్డిగారికి పరిచయము చేసినారు. డా. రెడ్డిగారు నాతో ఎంతో ఆప్యాయముగా కరచాలనము చేసి, "నేను లక్నో నుంచి ఉత్తరం వ్రాశాను అందిందా" అని మందహాసముతో అడిగారు. నేను వారి జ్ఞాపకశక్తికి, ఆప్యాయతకు ఉబ్బితబ్బిబ్బై కలవరించాను. డా. రెడ్డిగారు ఆనాటి సాయంకాలపు సమావేశములో నన్ను మాట్లాడవలసిందిగా ఆజ్ఞాపించారు. సాయంకాలము 4 గం.లకు మరల సమావేశము ప్రారంభమైనది. సమావేశం మధ్యలో నే నెక్కడో కూర్చున్నాను. నావైపు వ్రేలుపెట్టి గుర్తుచేసి డా. రెడ్డిగారు మాట్లాడమన్నారు. నేను భయం భయంగా వేదికమీద నిలబడ్డాను. నాలుగు వైపులా పరికించాను. అంతా క్రొత్తవారే. అయినా ధైర్యంచేసి యిలా అన్నాను. "డా. చెన్నారెడ్డిగారికి దైవయోగము అనుకూలముగా ఉన్నది. వారు ఎంతో దైవభక్తులు, నిగర్వి, కుశాగ్రబుద్ధి. అందుకే డా. చెన్నారెడ్డిగారు కాబోయే ముఖ్యమంత్రి అని దైవంమీద పూర్తి నమ్మకం ఉన్న మామూలు కార్యకర్తగా మనవి చేస్తున్నాను" అన్నాను. డా. రెడ్డిగారు మందహాసంతో నావైపు చూచారు. సదస్సులోని వారంతా నా మాటలకు నివ్వెరపోయారు. ఆంధ్ర ప్రదేశ్‌లో శ్రీమతి ఇందిరా గాంధీకి పేద ప్రజలలో బలమున్నదని, ఆమెకు అనుకూలముగా డా. రెడ్డిగార్ని మెలగవలెనని నా ఉపన్యాస సారాంశము. ఉపన్యాసము అయిన తరువాత సదస్సులో కొందరు నన్ను అవహేళన కూడా చేశారు. 'ఆంధ్రప్రదేశానికి డా. రెడ్డిగారు నాయకత్వం వహించుట దైవనిర్ణయ'మని మరల చెప్పుచూ



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

నేను వారికి నూతన వస్త్రములు కూడా సమర్పించాను. ఆనాటి సమావేశము అంతటితో వాయిదా పడినది. జిల్లాల వారీగా కన్వీనరులను వేయుట జరిగినది. నన్ను గుంటూరు జిల్లాకు నియమించారు.

1977 నవంబరు 13 వ తేదీన హఠాత్తుగా కర్నాటక ముఖ్యమంత్రి శ్రీ దేవరాజ్ అర్సు హైదరాబాద్ వచ్చి డా. రెడ్డిగారితో మంతనాలు జరిపి ఢిల్లీ వెళ్లారు. డా. చెన్నారెడ్డిగారింట్లో నవంబరు 14 వ తేదీన మరల కన్వీనర్ల సమావేశము జరిగినది. అదే నెల 19 వ తేదీ కోస్తా ప్రాంతములో ప్రకృతి ప్రళయతాండవము చేసి పెనుతుఫానులో కొన్ని వేల మంది ప్రాణాలను బలిగొన్నది. డా. రెడ్డిగారు ఆంధ్ర ప్రదేశ్‌లో అప్పటి మంత్రుల కంటే ముందుగా నవంబరు 22 వ తేదీన మిత్రులైన శ్రీ ధర్మారెడ్డిగారితో కలసి సహజమైన ప్రజాసేవకునిగా దివిసీమ, బెజవాడ, గుంటూరు దర్శించిరి. అప్పటి విషాద పరిస్థితిని చూసి ఆయన ఎంతగానో దుఃఖించిరి. మా ప్రాంతమంతా జలమయమై పోవుటచేత మా రేపల్లె రాలేకపోయారు. అయినా నవంబరు 30 వ తేదీన తన సానుభూతిని అప్పటి ప్రజలకు అందించమని నాకు ఉత్తరం వ్రాశారు. ఆ ఉత్తరంలో వారు నాపై వ్యక్తం చేసిన, ప్రేమ, ఆర్ద్రత ఇంతింతని వర్ణించి చెప్పలేను. "**You are very much in my mind all the time**" అని అందులో వ్రాశారు. ఆయన నాయకత్వ ప్రతిభకు, సేవాదీక్షకు, స్నేహవాత్సల్యాలకు ఈ ఉత్తరం ఒక మచ్చుతునక. ఇప్పటికీ నా హృదయములో ఆ మాటలు నిరంతరం మారు మ్రోగుతూ ఉంటాయి. మరల 1977 డిసెంబరు 8 వ తేదీన మరో సదస్సు ఏర్పాటు చేయబడినది. అందులో ఎన్నో తర్జన భర్జనలు జరిగాయి. సమావేశము వాయిదా పడింది. శ్రీమతి ఇందిరా గాంధీ ఆహ్వానాన్ని స్వీకరించి ఆ తరువాత కొద్ది రోజుల లోనే ఢిల్లీ వెళ్లి ఆమెతో మంతనాలు జరిపారు. కాంగ్రెసు సంస్థ రెండుగా చీలిపోక తప్పదని డా. రెడ్డిగారు శ్రీమతి ఇందిరా గాంధీకి నచ్చచెప్పారు. తిరిగి వచ్చి డిసెంబరు 23 వ తేదీన మరలా ప్రకాశం హాలులో శ్రీమతి ఇందిరా గాంధీకి మద్దతుగా రాష్ట్రస్థాయి సమావేశము జరిపారు. తదుపరి డాక్టర్ రెడ్డిగారు తమ అనుచరులతో 1978 జనవరి 1, 2 తేదీలలో 'ఢిల్లీ' కాంగ్రెసు సమావేశములలో పాల్గొన్నారు. ఆ సమావేశ కాలంలోనే ఇందిరా కాంగ్రెసు ప్రభవించినది. ఆనాడు ఆయన తీసికొన్న నిర్ణయము ఆయన ముందుచూపునకు, రాజకీయ విజ్ఞతకు నిదర్శనము.

### ముఖ్యమంత్రి పదవికి ముందే జోస్యం

డా. చెన్నారెడ్డిగారికి జోతిశ్శాస్త్రము మీద నమ్మకము మెండు. ప్రముఖ జోతిశ్శాస్త్రవేత్త శ్రీ కాశా కనక సుందర శాస్త్రి మా రేపల్లెలో ఉన్నారు. వారికి నేను డా. చెన్నారెడ్డిగారి పుట్టిన తేదీ యిచ్చి జాతకఫలము వ్రాయమన్నాను. కాని, రెడ్డిగారి పుట్టిన తేదీ అది అని చెప్పక రహస్యంగా ఉంచితిని. 1977 డిసెంబరు 6 వ తేదీన నేను తేదీ ఇవ్వగా శాస్త్రిగారు మరునాడు జాతక విశేషాలను వ్రాసి నా కందజేశారు. అప్పుడు అసలు విషయాన్ని చెప్పాను. అందులో శ్రీశాస్త్రిగారు ఈ జాతకునికి 28–2–1978 తేది నుండి 'రాజముద్ర యోగము ప్రాప్తించు'నని వ్రాసియుండిరి. నేనా వాక్యాన్ని చదివి, సంభ్రమాశ్చర్యాలను పొందాను. డిసెంబరు 8 వ తేదీన నేను డా. చెన్నారెడ్డిగారిని హైదరాబాదు సదస్సులో కలిసినప్పుడు ఆ వాక్యం కింద గుర్తుపెట్టి ఆ కాగితాన్ని వారి కందించాను. రెడ్డిగారు ఒక్క క్షణం ఆ జాతక రచనను పరిశీలించారు. చిరునవ్వు నవ్వి "మీ శాస్త్రిగారికి ఏమి ప్రతిఫల మిస్తారు?" అని నాతో చమత్కరించారు. నేను వినయ విశ్వాసంతో—'మీకు రాజముద్ర యోగం ప్రాప్తించిన తర్వాత శాస్త్రిగారికి మీ చేతనే మా రేపల్లెలో సన్మానం చేయించా' లని అనుకుంటున్నానని అన్నాను. రెడ్డిగారు తల ఊపి, భవిష్యదభ్యుదయాన్ని పొందటానికి వెళ్తున్నట్లుగా కారెక్కి వెళ్లారు.

దైవయోగము మీద పూర్తి నమ్మకము, ధైర్యము ఉన్న వారు ఆ ఇందిరా కాంగ్రెసు ఆంధ్ర ప్రదేశ్‌లో అఖండ విజయాన్ని పొందినప్పుడు గాని, డా. చెన్నారెడ్డిగార్ని ఆంధ్ర ప్రదేశము ఏకైక నాయకుడుగా, ముఖ్యమంత్రిగా ఏకగ్రీవముగా ఎన్నుకొన్నప్పుడు గాని ఆశ్చర్యం కలుగలేదు. కారణం దైవయోగము మీద నాకున్న నమ్మకం మరీ పెరగటమే. వారు ముఖ్య మంత్రి అయిన తరువాత 1978 మే 13 వ తేదీన వారిని దర్శించగా "నిన్ను ఆంధ్ర ప్రదేశ్ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థలో డైరెక్టరుగా నియమించాను" అని చెప్పారు. ఈ పదవి నేను ఆశించినది కాదు. ఇదీ దైవనిర్ణయమే. పరుల మనస్సుని సూక్ష్మముగా గ్రహించగల 'అంతర్ద్రష్ట' డా. రెడ్డిగారని ఈ సంఘటనలో నాకు అనిపించింది. సెప్టెంబరు 1 వ తేదీన 'గద్వాల' లోని ప్రభుత్వపు బంగళాలో వారిని కలుసుకొన్నప్పుడు డా. రెడ్డిగారు ఇలా అన్నారు: "నేను నిన్ను రేపల్లె నియోజకవర్గ అభ్యర్థిగా నిర్ణయించి ఉంటే గెల్చియుండేవాడివి". వారికి నాపై ఉన్న ప్రేమకు నేను విలువెల్ల



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

ఉప్పొంగిపోయాను. నా దృక్పథంలో పదవికన్నా ప్రజాసేవ ముఖ్యము. అందులో డాక్టరు చెన్నారెడ్డిగారిలాంటి ప్రముఖ నాయకుని ఆధ్వర్యంలో పని చెయ్యటం మరీ మరీ ముదావహం. వారికి ఏకలవ్య శిష్యునిగా మొదలైన నా సంబంధము ఈవిధంగా ప్రత్యక్ష శిష్యునిగా పరిణమించినది. ఇదీ దైవయోగమే. కోరితే వచ్చేవాటికన్నా, కోరకుండా వచ్చేవాటిలో ఎంతో తియ్యదనం ఉంది.

### "తెలుగు దేశమంతా నా దేశమే"

డా. రెడ్డిగారు మా కార్పొరేషన్ మీటింగుకి 1978 నవంబరు 15 వ తేదీన వచ్చారు. ఆ రాత్రి అంతా కలిసి భోజనం చేస్తూ ఉన్నాం. డా. రెడ్డిగారు అన్నింటికంటే ముందుగా అన్నములో "గోంగూర" పచ్చడి కలుపుకున్నారు. నేను "మా గుంటూరు 'గోంగూరనే' ప్రథమముగా ఇష్టపడుతున్నారా" అని చమత్కరించాను. " 'గోంగూర'కు మరో పేరు ఆంధ్ర మాత గదా! ఆమెను మొదట ఆదరించవద్దా" అన్నారు డా. రెడ్డిగారు. అంతేకాదు "నేను 1977 డిసెంబరు 23 వ తేదీన ప్రకాశం హాలులో నాకు తెలంగాణాలో కంటే ఆంధ్రలోనే ఎక్కువ మంది అభిమానులు ఉన్నారని చెప్పాను గుర్తు ఉందా? రు. 200 కోట్ల పెట్టుబడితో ఉక్కు ఫ్యాక్టరీని విశాఖపట్టణములోను, మరో 200—కోట్ల పెట్టుబడితో నాగార్జున ఫెర్టిలైజరు ఫ్యాక్టరీని కాకినాడలోను స్థాపించుటకు చేస్తున్న నా ప్రయత్నము మీకు తెలుసుగా? తెలుగు దేశమంతా నా దేశమే" అన్నారు. ఈ మాటలు విన్నప్పుడు డా. రెడ్డిగారిపై ప్రాంతీయ అభిమాని అన్న దురూహలకు ఏమాత్రం చోటు లేదని తెలిసికోవటం ఏమంత కష్టంగాదు.

డా. చెన్నారెడ్డిగారు పరిణతి చెందిన రాజకీయ ప్రజ్ఞాధురంధరుడు. వయస్సు, అనుభవం తెచ్చిన మార్పులే కాక ఆయన జీవిత కాలంలో నడిపిన ఉద్యమాలు, నిర్వహించిన పదవులు ఆయన వ్యక్తిత్వాన్ని పెంచాయి. ఆయన నాయకత్వ ప్రతిభకు ఆ అనుభవాలన్నీ కిరీటప్రాయముగా భాసిల్లినవి. ఆయన కార్యశూరుడు, ప్రతిభాసంపన్నుడు, పరిపాలనాదక్షుడు. పదవితో వచ్చే వైభవం బంగారు పంజరం లాంటిదని ఆయన ఉద్దేశం. ఆయన జీవితంలో ఎన్నో పదవులు వచ్చాయి; ఎన్నో సార్లు ఆ పదవులకు రాజీనామాలు చేసినారు. పదవులు వచ్చినా, పోయినా తొణకని, బెణకని స్థితప్రజ్ఞుడాయన. ప్రజల మనిషిగా, ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసము ఆయన ధరించిన సేవాకంకణము ఈ జాతికి శ్రీరామరక్ష!





CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# సువర్ణాక్షతలు

కేశవపంతుల నరసింహశాస్త్రి

---

శా. శ్రీశైలేశ్వర వేంకటేశ్వర మహాసిద్ధేశ కాళేశ్వరుల్
ధీశక్త్యున్నత నాయకత్వము సముద్దీపింప నాశీర్వచః
ప్రాశస్త్యప్రసృతధారలన్ దనుపుమన్ ప్రత్యగ్రసౌభాగ్య ల
క్ష్మీశోభాఢ్యు నొనర్తు రాంధ్ర ధరణిన్ శ్రీ చెన్న మంత్రీశ్వరున్.

శా. చెన్నారెడ్డికి ముఖ్యమంత్రికి జగజ్జేగీయమాన ప్రదే
శౌన్నత్యంబు ఘటించు నాయకునికిన్, హర్షాతిరేకోజ్జ్వల
త్సన్నాహంబున షష్టిపూర్తిమహమున్ సల్పంగనున్నారు, రం
దన్నల్ తమ్ములు నెల్లవారలును దీర్ఘాయుష్యవాగ్గుమ్మలై.

సీ. నీ యశోలత దిశా నీరజాస్యల కేశబంధంబులను పూలబంతు లిడఁగ,
నీ కృపావాహిని నిఖిలదేశక్షేత్ర పాళిని బంగారు పంటఁ గూర్ప,
నీ దానరమ కవిశ్లోకరంబుపై నిరంతరము మాడల వసంతంబుఁ జల్ల,
నీకోశ శిల్పి విప్రజాతుల కుటీరములకు రత్నహారములు గట్టఁ,

గీ. జాలునట్టుల, పాలనాచతురుఁ డగుచు, సేవలను జేయుచున్నట్టి చెన్నరెడ్డి
కాయురారోగ్య భాగ్యంబు లబ్బునటుల, దీవనలు సేయు మాంధ్రప్రదేశలక్ష్మి!

శా. దాతృత్వంబున కర్ణుఁ, డాయతభుజాదర్పంబునన్ క్రీడి, భూ
నేతృత్వంబున ధర్మరాజు, కరుణానీరంధ్రతన్ రాఘవుం
డితండంచు జనుల్ నుతింప, కవివాగీశుల్ ప్రశంసింప, నా
నా తంత్రజ్ఞత ధాత్రి నేలుమయా! చెన్నారెడ్డి మంత్రీశ్వరా!

సీ. ప్రతి వర్షమున మంచి పంటలు పండుటన్, దుర్భిక్ష దోషంబు తొలఁగుఁగాక,
తమతమ ధర్మవర్తనముల మెలఁగుటన్, ప్రజలకు సంపదల్ వరలుఁగాక,
పచ్చబయళులలోని పచ్చికల్ మేయుటన్, గోగణంబులు పాలు గురియుఁగాక,
యోగ్య బాంధవ్యంబు లొనగూడుచుండుటన్, నిత్యకల్యాణముల్ నెగడుఁగాక.

గీ. నీదు పాలనలో, మహనీయ సుగుణ, సంపదకు స్థానమగుఁగాక జనగణంబు
ఈతిబాధలు లేని సమృద్ధితోడ, మ[illegible]వంశాంబునిధిసోమ! మహితధామ!

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

M.S. Reddy
22, Dr NAIR ROAD
MADRAS - 600017


## చిరుకానుక

చిరకీర్తికి చిహ్నముగా
జరిగెడు నీ షష్టిపూర్తి సంవత్సరమునన్
విరిసిన కవితా సుమముల
చిరుకానుక నందుకొనుము చెన్నారెడ్డీ! ॥—

సేవ స్వాతంత్ర్యమే దివ్య దీక్షకాగ
ప్రజలచేదోడె శ్రీరామరక్షకాగ
ప్రగతి సూత్రములస్త్ర శస్త్రములుకాగ
గెలుపుకొంటివి ఈనాడు తెలుగునాడు ॥—

ఏ మహా కవికైన ఎన్ని కావ్యమ్ములు
రచియించెనన్నది ప్రతిభకాదు
ఏ నటునకైన ఎన్ని పాత్రలు తాను
ధరియించెనన్నది గరిమకాదు
ఏ గాయకునకైన ఎన్ని కచేరీలు
చేసినాడన్నది వాసికాదు
ఏ నాయకునకైన ఎన్నేళ్ళ పదవిలో
కొనసాగెనన్నది ఘనతకాదు
ఎవ్వరే కానికోరి తామెన్నుకొన్న
బాటలోన సాధించిన ఫలితమెంత?
అవనిలో జని సిసలైన ఆయువెంత?
అన్నదొక్కటే ముఖ్యాంశ మరసి చూడ ॥—

చైతన్యమె ఊపిరిగా
నీతియు రీతియును నిత్యనియమమ్ములుగా
జాతిని తీర్చిదిద్దెడు
నేతవుగా మనుము కనుము నిఖిల శుభమ్ముల్ ॥






CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# ధీరోదాత్తుడు

అంతటి నరసింహం

కవులపాలిట నాటి కామధేనువు నాట్య
కోవిదులకు నాటి భువిసముడు
సంగీతభారతీ సంసేవకుల కల్ప
వృక్షమ్ము శిల్పుల చిత్రగురుడు
సత్కృత్యశిల్ప విద్వాంస భాషావాణు
దమర భాషాయోష కవివసముడు
చతుర సంభాషణాపణుల క్రగేసరు
దష్టభాషలలో విశిష్టవాగ్మి

లలిత ఫలిత చతుష్షష్టి కళలయందు
కలదు దక్షత చోర క్షౌరాల గూడ
చోర కళ శత్రు హృదయాల చౌర్యమందె
క్షౌర కళ మాత్రము విపక్ష క్షౌరమందె.

పట్టు పట్టుమగాని స్వార్థప్రయోజనా
ర్థము కాదు, ప్రజల ఉద్ధరణగాని
కపి వహించునుగాని కయిలాట కాండ్రపై
కాదు, కైలాటపై కక్షగాని
కంటగించునుగాని కాంతార జనముపై
కాదు, తద్గుణముపై కసియెగాని

కోపగించునుగాని కలహాశనులమీద
కాదు, తద్బుద్ధిపై కక్షగాని
పైకి కనిపించు చేష్టలు బాహిరమ్ము
లైన ఆకారములపైన అసలు లేదు
మానసాంతర నిక్షిప్తమైనయట్టి
పాప నిర్నిద్ర గుణములపైనెగాని.

అంతరిక్షము విరిగి పొదలపై బడిన
వదరని గుండె నిబ్బరమువాడు
కువిమర్శకారు లొక్కుమ్మడిగా దాడి
చేసిన లొంగక ని[illegible]వాడు
వ్యాసఘట్టమువంటి వ్యవహారములగూడ
నవలీలగా తేల్చునట్టివాడు
అన్య భోజనము పరాన్న భోజనముగా
నెంచి స్వార్జితమే భుజించువాడు

అతడు మేరుమహీధ్ర ధీరాధిధీరు
డతుల మేధావి మ[illegible] వంశాబ్ధి విధుడు
జనుల పాలిటి కల్పభూజమ్ము చెన్న
రెడ్డి సాగించు నిక గూడ రెడ్డిగమ్ము.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# మా శ్రీవారు

సావిత్రీదేవి

'పతిప్రాణసదృశబంధువు
పతి దైవం బేడుగడయు......
సతికి'

అనే పద్యభావం నా కెప్పుడూ మనస్సులో మెదులుతుంది. అంతేకాదు; నా సర్వస్వం వారికే ఎత్తుకట్టు. నేను దాదాపు పదకొండు సంవత్సరాల పిల్లగా ఉన్నప్పుడు నాకు శ్రీ మర్రి చెన్నారెడ్డిగారితో పెళ్లి జరిగింది. వీరెవరో కాదు, నాకు సొంతం మేనబావ. మేమిద్దరం చిన్నప్పటినుండీ ఒకే ఇంట్లో ఉండి, ఒకచోట ఆడుకుని, గోలచేసి, గిల్లికజ్జాలు పెట్టుకొని, ముట్టికాయలు వేయించుకుని, అలిగి, అలక కట్టుంగా ఐస్క్రీంలు కొనిపించుకుని పెరిగాము. ఆ బావే నా మెళ్లో తాళిగట్టి భర్త అయ్యారు. అప్పటికే నా తల్లిదండ్రులు పరమపదించారు. శ్రీ కొండా రంగారెడ్డిగారు—అంటే మా పెదనాన్నగారు కన్యాదానం చేశారు. ఆ రోజుల్లో పెళ్లయిన ఆడపిల్లలకు కొంతకాలంవరకూ తలనూనె నుండి వొంటిపిండి వరకూ తల్లిగారే పంపవలసిన ఆచారం కొందరికి ఉండేది. కాని, మా డాక్టరుగారు ఈ విషయం ఎప్పుడూ పట్టించుకోలేదు. నన్ను చిన్నచూపు చూడలేదు. అంతేకాదు, నేను తొలిసారి గర్భవతిగా ఉన్నప్పుడు స్త్రీ విషయం తెలిసిన డాక్టరుగా, నాకు తల్లిగా నాకు ఇష్టమైన వస్తువులు కొనుక్కొమ్మని చాటుగా నాకు డబ్బు ఇచ్చిన ఆప్యాయత నే నెప్పుడూ మర్చిపోలేను.

## మావారే నాకు గురువు

నాటికీ నేటికీ శ్రీవారికి చదువుకున్న స్త్రీ అంటే అభిమానం ఎక్కువ. అయితే కొందరు ఈ అభిరుచికి ఇంట్లో ప్రవేశం కల్పించరు. కాని, నా డాక్టరుగారు మాత్రం నా చదువు విషయంలో ఎంతో శ్రద్ధ చూపారు. అంతే కాదు, తాను విద్యార్థిగా ఉండి, నా పరీక్షకు ఫీజు కూడ కట్టి నన్ను ప్రోత్సహించారు. అయితే, మా కెప్పుడూ కలతలు రాలేదని కాదు. ఇంటింటికో మంటిపొయ్యి అన్నారు పెద్దలు. ఈ చిన్నచిన్న ఆటుపోట్లకు కారణం కేవలం నా అజ్ఞత; వారి హృదయ వైశాల్యాన్ని తెలుసుకోలేనితనం; గంటకు కొన్ని వేల మైళ్ల వేగంతో పరుగెత్తే వారి ముందుచూపును అర్థం చేసుకోలేని శక్తిహీనత. మావారే నాకు గురువు. అంటే నన్ను కూర్చోబెట్టుకుని పాఠాలు నేర్పారని కాదు. వారు పాఠం చెప్పే తీరు విచిత్రంగా ఉంటుంది. తాను ఎదుటివాళ్ల మనస్సు పసిగట్టి ప్రవర్తిస్తారు. అట్లే, ఇతరులు తన మనస్సును అర్థం చేసుకొని ప్రవర్తించాలని కోరుతారు. ఇల్లూ సంసారం అంతా నా ఇష్టానుసారమే నడుస్తుంది. కాని, వారి అభిరుచులను తెలుసుకొని ప్రవర్తించడం సామాన్యమైన మాట కాదు. ఒక్కొక్కప్పుడు చిన్న తప్పును గాని పొరపాటును గాని క్షమించరు. మరోసారి ఎంతో పెద్ద తప్పును చీపురుపుల్లగా తీసి పారవేస్తారు. తప్పు జరిగిందని బాధపడేకన్నా ఇకముందు జరుగకుండా చూసు కొమ్మంటారు. ఏదో సంసారపక్షంగా మాట్లాడుతూ, 'అనవసరంగా ఈ డబ్బు పోయింది' అని అంటే, 'పరే' డబ్బు పోయింది కాని ఎంత అనుభవం గడించాం? ఈ అనుభవాన్ని భావిలో ఒక మెట్టుగా ఉపయోగిస్తే కాని దాని విలువ నీకు తెలియ దంటారు. నిజమే నా కేం తెలుసు?

## మావారు మెచ్చిన నా జీవితం ధన్యం

ఈనాడు నా భర్త ఇంతవారై ముఖ్యమంత్రి, గవర్నరు, సెంట్రలు మినిష్టరుగా ఉన్నప్పుడే కాదు, ఆయన



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

డాక్టరుగా ఉన్నప్పుడు కూడ అందరికీ ఇష్టుడే. వీరి హస్తగుణం ఎంతో మంచిదని జనం మూగేవారు. కడుపునొప్పి, తీవ్రమైన ఇతర బాధలతో రోగులు డాక్టరుగారి దగ్గరకు వస్తూ వస్తూ డాక్టరుగారి పేరు తల్చుకుంటేనే కొంత రోగోపశమనం కలిగేదట. అంటే రోగులకు మా వారిపై ఉన్న నమ్మకం అటువంటిది. ఇటు రాజకీయాలు అటు వైద్యవృత్తి చేస్తూ రెంటికీ న్యాయం కూర్చలేక నర్సింగ్‌హోం మూసివేసినప్పుడు బీదవారు ముఖాన బట్ట వేసుకుని 'మమ్ములను ఎవరి చేతుల పెట్టి తమరు ఈ దవాఖానా బందు చేస్తుండరు' అని బోరుమన్నారు.


మావారు గాంధీ సిద్ధాంతాలను నమ్మినా, జీవితంలో దీనంగా చస్తుంటూ బ్రతకడానికి ఇష్టపడరు. భోజనంలో రుచి, పరిసరాల్లో శుచి, కంటికి ఇంపైన అలంకరణ అన్నీ కోరుతారు. అవన్నీ ఆయన మనస్సుకు నచ్చేటట్లుగా చూసి, వారు మెచ్చుకుంటే నా జీవితం ధన్యం అయినట్లుగా భావిస్తాను. ఇంకో విషయం— నాకన్నా ఆయన నిద్రాదేవిని జయించినట్లు కనబడ్తారు. నెపోలియన్ గుర్రపు స్వారీ చేస్తూ నిద్రపోయి అలసట తీర్చుకునేవారట. అట్లే, డాక్టరుగారు అవసరం వచ్చినప్పుడు అహోరాత్రాలు పనిచేస్తూ ప్రయాణ సమయంలో కార్లో కూడా చర్చిస్తూ రెండవ వ్యక్తి సమాధానం ఆలోచించేలోపల నిద్రపోయి తిరిగి మామూలుగా కూర్చుంటారు. ఇది ఎంత ప్రయత్నం చేసినా అందరికీ సాధ్యమయ్యే విషయం కాదు.

**తారతమ్యాలు చూపని ప్రజల మనిషి**

ఇంత ఉన్నత పదవిలో ఉన్నా వారి దృష్టిలో వచ్చేవాళ్లందరూ ఒకే రూపు. హోదాలను బట్టి ఆప్యాయతలు, తారతమ్యాలు వారు చూపరు. చూపినా సహించరు.

నాకు చిన్నప్పటినుండి దేవునిపై నమ్మకం. నా అదృష్టవశాత్తు మా వారికి కూడ దైవభక్తి ఉంది. ఆ భగవంతుడే నా ఎదలో ఉండి వారివెంట ఉండి అడుగడుగునా కాపాడుతున్నాడనే సంపూర్ణ విశ్వాసం నాకుంది. ఏదో తీరికగా కూర్చున్నప్పుడు నాకు నా కృష్ణుడు ఎక్కువా? మా రెడ్డిగారా? అనే సందేహం వస్తుంది. సమాధానం చెప్పటానికి నాకే సందేహం కలుగుతుంది. అసలు సమాధానం చెప్పడానికి నే నెవరు? ఇద్దరూ సమానమే అని తప్పుకుంటాను.

నాకు కావలసినవారు—'సావిత్రీ! నీ వెంత పుణ్యాత్మురాలివో' అంటారు. అంటారు నిజమే. ఆయనకు భార్య కావటంకన్నా అదృష్టం ఏముందని? అధికారంతో హోదా, గౌరవం, డబ్బు, ఆస్తి, సుఖం వస్తాయి కాని నా భర్తకు వీటన్నిటితోపాటు ప్రజల మనిషిగా, మేధావిగా, మెడికల్ డాక్టరుగా, నాయకుడుగా, కీర్తి ఉంది. మహోన్నత శిఖరాలను అందుకున్న ఆ నాయకుని సరస కూర్చునే అర్హతను సంపాదించుకున్నానంటే కేవలం పూర్వజన్మ సుకృతం అని చెప్పకతప్పదు. ఇట్లే మీ అభిమానం, ఆశీస్సులే మంగళాక్షతలై మమ్ములను కాపాడవలెనని కోరుతున్నాను.





CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

**K. VENKAT RANGA REDDY**
*( High Court Vakil )*

*requests*

*Mr.* ..............................................

*for giving the pleasure of participation in the marriage ceremonies of his nieces*

*Savitri Devi*

*with*

*Chenna Reddy*

AND

*Savitri Devi*

*with*

*Venkat Narasa Reddy*

*taking place at*

*Sri Sadan, Feelkhana Chaman, Hyderabad-Dn.*

*on Sunday, the 29th of Khurdad, 1345 F.*
*( 3rd May 1936 )*
*at 10-37 a. m.*
*and*
*bless the couples.*

పెండ్లి పిలుపు



శ్రీ లక్ష్మారెడ్డి (తండ్రి)



శ్రీమతి శంకరమ్మ (తల్లి)




శ్రీ కె. నారాయణరెడ్డి (మామగారు)



శ్రీమతి రాజమ్మ (అత్తగారు)

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org



సహోదరి శ్రీమతి విమలాదేవి ఆమెభర్త కె. వెంకటరెడ్డిగారు


CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

నాలుగు తరాలు: తాతగారు అనంతరెడ్డి, తండ్రిగారు లక్ష్మారెడ్డి,
పెద్దకుమారుడు కృష్ణతో




స్నాతకోత్సవానంతరం డాక్టర్


CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org



శ్రీమతి సావిత్రీదేవి చెన్నారెడ్డి హృదయంలో ఆధ్యాత్మిక జ్యోతిని వెలిగించిన మహోన్నతుడు,
శ్రీ చిదూరు వెంకట శేషయ్యగారు

డా॥ చెన్నారెడ్డిగారి జ్యేష్ఠ పుత్రుడు
కీ. శే. కృష్ణారెడ్డి

జననం: 10–4–1940 నిర్యాణం: 15–6–1961



అమ్మ యెదలోని తీయదనాల శ్రుతులనూ
నాన్న తలలోని ఉన్నతులనూ గతులనూ
అనుజమిత్రాప్తుల రసార్ద్ర సంగతులనూ
మనసులో కలుపుకొని మాటలో నిలుపుకొని
మెరుపులా మెరిసి కనుమరుగైన 'కృష్ణు'నికి
గురు విమ్ము స్మృతిసమాదరణాక్షరాంక మిది.

—సి. నారాయణరెడ్డి

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org




సకుటుంబంగా

# మా నాన్న

**రవి, శశి, వసు**

మా నాన్న అంటే మాకు భయమూ భక్తీ ప్రేమ—ఈ మూడింటిలో ఏది ఎక్కువో, ఏది తక్కువో చెప్పలేము. ఒక్కొక్కప్పుడు నాన్న ఇంట్లో అడుగు పెడుతున్నారంటే అంతా గప్‌చుప్. ఇంకొకప్పుడు మా స్నేహితులతో చెస్, బాడ్మింటన్, టెన్నిస్ ఆడుకున్నట్లుగానే ఆడుకునేవాళ్ళం. అప్పుడప్పుడు ఉల్లాసంగా అమ్మను 'సావిత్రీ!' అంటూ పిల్చి, 'రవి, శశి, వసూ అంతా రెడీగా ఉండండి, పిక్చర్‌కు పోదాం' అంటారు. మా నాన్న దృష్టిలో సినిమా అంటే రోజూ రొటీన్‌గా చేసే పనిలో కొంత డైవర్షన్ అన్నమాట. చిన్నప్పుడు మేము హాయిగా పిక్నిక్స్‌కు కూడా పోయేవాళ్ళం. మా నాన్న దృష్టిలో కేవలం పుస్తకాలు ముందర వేసుకుని బట్టీ పెట్టడం చదువుకాదు. పిల్లలు ఉల్లాసంగా పెరిగి, శారీరకంగా ఆరోగ్యవంతులై ఉంటే మానసికంగా బలపడి విజ్ఞానవంతులు కాగలరని అంటారు. అందుకే మమ్మల్నెప్పుడూ చదువు విషయంలో కఠినంగా శిక్షించలేదు. 'పరీక్షలో మంచి మార్కులు వస్తాయి అనే నమ్మకం ఉంటే క్రికెట్ టెస్ట్ మాచ్ కామెంట్రీ వినవచ్చు; నాటకం చూడవచ్చు' అనేవారు. అయినా, మేం ఎప్పుడూ విచ్చలవిడిగా ప్రవర్తించలేదు. మా నాన్న పైకి అంతగా పట్టించుకోనట్లుగానే ఉంటారు. కాని, ప్రతి చిన్న విషయాన్ని కూడ ఎంతో సూక్ష్మంగా పరిశీలిస్తారు. అంటే: మా ఇంట్లో, వారికి తెలియకుండా అటు పుల్ల ఇటు కదలదు. వారు తప్పయినా క్షమిస్తారేమో కాని పనిలో నిర్లక్ష్యాన్ని, సోమరితనాన్ని మాత్రం క్షమించరు. అప్పుడు చండశాసనుల వలె కనబడ్తారు. ఆ నిముషం తరువాత ఆలోచిస్తే ఆ కోపంలో మా బాగును గూర్చి ఎంత తపన ఉందో అర్థమవుతుంది. ఇది ఒక్క మా విషయంలోనే కాదు; వారితో సంబంధం ఉన్న ప్రతివారి పట్ల కూడ ఈ విషయం యథార్థం అని చెప్పవచ్చు. కోపం ఎంత తొందరగా వస్తుందో అంత తొందరగా పోతుంది. కాని, ఇప్పుడిప్పుడు పూర్తిగా కోపాన్ని మర్చిపోతున్నారు. రానురాను శాస్త్రీయ దృష్టిని పెంచుకుంటున్నారు. నాన్న రాజకీయంగా ఇంత ఉన్నత పదవిలో ఉన్నా, మేం ఉద్యోగాలలో ప్రవేశించలేదు. దేశం ఆర్థికంగా స్వావలంబన సంపాదించుకోవాలి అంటే పారిశ్రామికంగా, వ్యవసాయికంగా ప్రగతి సాధించాలి. అందుకు అవకాశం ఉన్న యువకులు ముందుకు రావాలి అంటారు. అందుకే మాలో ఒకరం ఇండస్ట్రీ, మరొకరం వ్యవసాయాన్ని చేపట్టాం. 'మనం చేత బట్టింది మట్టి అయినా సరే, బుద్ధిని ఉపయోగించి బంగారం చేయవచ్చు' అంటారు. 'ఏ రంగంలో నైనాసరే, ఉత్తమ ఫలితాలను సాధించాలి అంటే తగిన పరిశ్రమా, పరిశోధనలు చేయాలి' అంటారు. వారి దృష్టిలో వరి పంటకన్నా కమర్షియల్ క్రాప్‌కే ప్రాధాన్యం ఎక్కువ. అందుకే, మేం మెడిసినల్ ప్లాంట్స్, పట్టుపురుగుల పెంపకానికి ఉపకరించే మల్బరీ చెట్లను పెంచుతున్నాం. ఇంతకు పూర్వం హైదరాబాదు జిల్లాలో ద్రాక్ష పంటను ప్రారంభం చేసి, దేశవ్యాప్తంగా ఆ పంటను కమర్షియల్ క్రాప్‌గా పండించడానికి నాన్నగారు ఎంతో చేయూత నిచ్చారు. ఆవుల, కోళ్ళ పెంపకం, పాల ఉత్పత్తి మొదలైన విషయాల్లో కూడ శ్రద్ధచూపి ఆ రంగంలో తగు సౌకర్యాలను కల్పించి, ఎందరికో ఉపాధి కల్పన గావించారు. పుష్పాలంటే మా నాన్నకు ఎంతో ఇష్టం. ప్రత్యేకంగా దేశియ జాతి పుష్పాలంటే వారికి అభిమానం. ఈ పుష్పాల తోట పెంపకాన్ని వారెంతో ప్రోత్సహించారు. ఇప్పుడు వారు నిర్వహిస్తున్నట్టి ఉన్నత పదవుల బాధ్యతలు, నిర్విరామంగా సాగిస్తున్న ప్రయాణాలు, అందుకుంటున్న సన్మానాలు, చేస్తున్న ప్రసంగాలు చూస్తుంటే యువకులమైన మాకే ఆశ్చర్యం కలుగుతుంది. పనుల వొత్తిడి కొంత తగ్గించాలని, హాజరు కావలసిన మీటింగుల వివరాలు, చూడవలసిన వ్యక్తుల పట్టికలు, తదితర రికార్డు అంతా దినము వారీగా వ్రాసి ఉంచినా సరే, వారికి తృప్తి ఉండదు. ఆనాటి కార్యక్రమం ముగిసిన తరువాత ఎంత రాత్రి అయినా సరే నిద్రపోయేముందు ఈ వివరాలన్నీ స్వయంగా చూసి, మాతో మాట్లాడి కాని పడుకోరు. ఇంత ఓపిక, ఇంత చేవ ఎట్లా వచ్చిందో అని అనిపిస్తుంది.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

మా నాన్న సూక్ష్మగ్రాహి అని మాకు తెలుసు. అయినా ఎదుటివారితో, వారెవరైనా, ఏ పార్టీకి చెందినవారైనా సరే, ఏ అరమరికలు లేకుండా హృదయం విప్పి స్నేహితులతో మాట్లాడినట్లే వివరాలన్నీ మాట్లాడుతారు. అప్పుడు మేం "అయ్యో! ఏమిటి మా నాన్నగారు? రాజకీయాల్లో కూడ దాపరికం లేదు" అని అనుకుంటాం. కాని, విచిత్రంగా సూటిగా ఎదుటివారితో ప్రవర్తించే ఈ విధానమే మేలు చేకూరుస్తుంది.

మా నాయనగారు ఎం. బి. బి. ఎస్. డాక్టరు డిగ్రీ పొంది, ఈ ఆధునాతన యుగంలో నవీన భావాలతో ఉన్నా కూడా వారికి కొన్ని నమ్మకాలు ఉన్నాయి. మా చెల్లి అంటే వారికి శుభశకునం అని నమ్మకం. అట్లే ఆరవ అంకె వారికి అచ్చి వచ్చిన సంఖ్య.

**మానవత్వాన్ని మరచిపోరు**

మా ఇంట్లో కులతత్త్వం పట్టింపు లేదు. లేదని కేవలం ఉపన్యాస వేదికలపై చెప్పే విషయం కాదు. మా అక్క వర్ణాంతర వివాహం చేసుకున్నారు. అంతేకాదు, తెలంగాణా ఉద్యమం ముమ్మరంగా సాగిన కొంతకాలానికి ఈ పెళ్లి జరిగింది. అప్పుడు మా నాయన ప్రాంతీయ భేదాన్ని పాటించి అడ్డు చెప్పలేదు. దానివల్ల ఆయన విశాల హృదయం అవగత మవుతుంది. ఒక తప్పును ప్రతిఘటించి, అన్యాయాన్ని ఎదుర్కొంటారే కాని మానవతను మరచిపోరు. ప్రాంతీయత సమస్యాపరిష్కారము వరకే. అందరికీ సమానమైన హక్కులు, అవకాశాలు లభించాలి అన్నంత వరకే కాని, ఈ విషయం మమతలను తెంపివేసి బాంధవ్యాలను తెగగొట్టేందుకు కాదని రుజువు చేశారు.

ఇట్లా మా నాన్నను గూర్చి చెప్పాలి అంటే ఒక పెద్ద గ్రంథం వ్రాయవచ్చు. కాని, ఉచితం కాదేమో అని భయం. మా నాన్నగారు డాక్టరు మర్రి చెన్నారెడ్డిగారి షష్టిపూర్తి ఉత్సవ సందర్భంలో ఈ రెండు మాటలు వ్రాసే భాగ్యం కలిగింది. వారికి ఆయురారోగ్య ఐశ్వర్యాదులను ఇచ్చి కాపాడవలెనని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాం.





CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# విజయసారథి

**సంగం లక్ష్మీబాయి**

మన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టరు చెన్నారెడ్డిగారి షష్ఠిపూర్తి ఉత్సవం ఎంతో వైభవంగా, ఆబాల గోపాలం చేసుకుంటున్నందుకు డాక్టరుగారిని అభినందిస్తున్నాను. ఎందుకంటే, ఎన్నో సంవత్సరాల నుండి ప్రజలు ఈ పదవ కాలమునకు వేచియున్నారు. ఒక సమర్థుడు, శక్తిశాలి, ధీమంతుడు, నిరంతర విశ్రాంతి ఎరుగకుండ అహర్నిశలు ప్రజాక్షేమం కోసం పనిచేసే శక్తిమంతుడు ముఖ్యమంత్రి కావడం ముదావహమైన విషయము. ఇది ప్రజల అభిప్రాయం. ఇదే నా అభిప్రాయం కూడా. విద్యావంతులు, ధనవంతులు, పేదవారు, పిల్లలు, పెద్దలు, అందరూ ఆదేరీతిగా ఆయనను కొనియాడు తున్నారు. దేనికి? ఆయన పెద్ద కోటీశ్వరుడనా? కాదు. ప్రజల మంచి చెడ్డలను తెలుసుకొని, వారియొక్క సమస్యలను జాగ్రత్తగా, ఆ క్షణంలోనే, అప్పుడే ఆలోచించి వాటి పరిష్కార మార్గాలు వెదకి తీర్చడంలోనే వారి ధైర్యం, ఉదాత్తత స్పష్టపడుతున్నది.

వారి స్వగ్రామం నిజామాబాదులో ఒక మూలలో ఉన్నది. అన్నీ రాళ్లే; శివలింగాలే; అవి నల్లని. ఆ రాళ్లలో రత్నం పుట్టింది; ఆ శిలల్లో నుండి సజీవ లింగం పుట్టింది; ఆ తాలూకాలో శివదీక్ష గలవారిని లింగాయతులు అంటారు. వీరి కులదేవుడు శివుడు. సకల దేవతలను పూజిస్తారు. కాని, శివుడంటే ఎంతో యిష్టము. తన గ్రామములో (తన తోటలో) ఒక శివ మందిరం కట్టించారు రెడ్డిగారు; అందులో ఇప్పటికీ పూజ జరుగుతుంది. ఒక చిన్న నది రాళ్లను చీల్చుకుని తిప్పలను దాటి ప్రవహించి సాగరంలోకి ఎలా చేరుకుంటుందో, ఆ రీతిగా వీరు ఈ స్థితికి చేరుకోవడం చాలామందికి తెలుసు. ఆయన పుట్టింది పెద్దమంగళారంలో. 'తెలంగాణా సర్దార్ పటేల్' అని పేరు తెచ్చుకున్న కొండా వెంకటరంగారెడ్డిగారు వీరి మేనమామ. మేనమామగారింట్లో పుట్టినారు. దాదాపు ఆయిదారు సంవత్సరాలు స్వగ్రామము శిరిపురంలో ఉన్నారు డాక్టరుగారు. ఒకడే ఒక కొడుకు. ఒక చెల్లెలు. వీరి తల్లి శంకరమ్మగారు. వారి నాయన లక్ష్మారెడ్డిగారు. చదువుకోసం మేనమామ యింటికి పంపించారు. కొండా వెంకటరంగారెడ్డిగారికి ఫీల్ఖానాలో సొంత బంగ్లా ఉండేది. డాక్టరుగారికి మేనమామలు చాలా మంది. బావమరదులు రెండు డజనులు, మరదళ్లు రెండు డజన్లు. చదువుకునేటప్పుడు కూడ డాక్టరుగారు కొంతమందిని దగ్గర పెట్టుకొని పాఠాలు చెప్పేవారు. యువకులను వెంబడి పెట్టుకోవడం అనేది ఆయన సహజగుణం. ఆయనది వృషభరాశి. వృషభరాశి వారికి మహాశక్తి ఉంటుంది.

**రాజకీయాలలోకి దిగిన పరిచయం**

నే నొకసారి శ్రీనివాసరెడ్డిగారి కోసం అక్కడికి వెళ్లాను. ఆయన లోపల ఉండిరి. నేను గంటసేపు వరండాలో నిలచాను. చెన్నారెడ్డిగారు లోపలికి బైటికి, అటూ ఇటూ పచార్లు చేస్తూవుండిరి. కాని, నన్ను కూర్చోమనలేదు; ఎందుకు వచ్చినా వని కూడా అడుగలేదు. నాకు కోపం వచ్చింది.

ఆడవారిని కూర్చోమని చెప్పే మర్యాద లేదా? అని కయ్యం పెట్టుకున్నాను డాక్టరుగారితో. నా మాటకు వారికి కోపము వచ్చి, అక్కడ ఒక పాత బల్లపీట తెచ్చి పడేసి, కోపముతో లోపలికి వెళ్లారు. శ్రీనివాసరెడ్డిగారు బయటికి వచ్చి ఉభయులకు పరిచయం చేయించారు. ఆవిధముగా మా మొదటి పరిచయము. రెండోసారి ఉస్మానియా ఆసుపత్రిలో, మూడవసారి క్విట్ ఇండియా మూవ్‌మెంట్ సందర్భములో. హైదరాబాదులో ప్రతివారి గుండెలో బ్రిటిషువారికి వ్యతిరేకంగా బడబాగ్ని రగులుతున్నది. నిజాం నిరంకుశ ప్రభుత్వం క్రింద ఉంటూ బాహాటంగా పనిచేయలేకపోయినా అందరి గుండెలలో అవమానాగ్ని రగుల్కొని ఉండేది. జయప్రకాశ్ నారాయణ్, అరుణా ఆసఫ్ అలీ హైదరాబాదు రావడంతో డాక్టరు చెన్నారెడ్డిగారు నిర్వహిస్తున్న యువ సంఘాన్ని, మహిళా సంఘాలనూ, ఆయన వెంబడి ఉన్న యువక బలగాన్ని



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

వెంబడి పెట్టుకొని హైదరాబాదు జిల్లా వారందరు, బోజ్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, వరకాంతం గోపాలరెడ్డి— ఇత్యాదు లందరు బాహాటంగా బైటపడ్డారు. సుల్తాన్ బజారులో రాళ్లవర్షం కురుస్తుండేది; పోలీసులు గ్యాస్ వదులుతూ లాఠీచార్జీలు చేస్తుండేవారు. నేను అప్పుడు టీచరును. మహిళా సంఘాలను ఆర్గనైజ్ చేస్తుంటిని. మా ఉభయుల పరిచయం రాజకీయాలలోనికి దిగింది. వేరే రాజకీయం ఏమీ లేదు. ఖాదీ ఉత్పత్తి, ఖాదీ బట్టలు కట్టడం, ఖాదీ అమ్మకము, గ్రంథాలయములు స్థాపించడము జరిపించేవారం. ఒకసారి గాంధీ జయంతినాడు (1945 అనుకుంటాను) ఎవరు ఎక్కువ ఖాదీ అమ్మితారో పోటీ పెట్టి ఆఖరు రోజున వారికి బహుమతి ఇవ్వాలని సర్వోదయ సంఘం తరఫున తీర్మానించబడింది. శ్రీ రావాడ సత్యనారాయణగారు దానికి అధ్యక్షత వహించారు. అందరం-ఖాదీ అమ్మినవారందరం ప్రతాపగిర్జి కోఠీలోకి చేరుకున్నాము. మేమందరం మహిళల తరఫున ఎన్నో అమ్మాము. చెన్నారెడ్డిగారు మా దగ్గరకు వచ్చి మీరందరు వాతో కలవండి అని చెప్పి మమ్ముల్ని అటు ఇటు తిప్పి, ఆనగా ఒప్పించి మమ్ములను కలుపుకొని ప్రైజు కొట్టేశాడు. ఇక 1945 సం. వచ్చింది. ఇంతలో ఇంటెరిం గవర్నమెంటు వచ్చింది భారతదేశానికి. హైదరాబాదులో జాతీయ భావాలు గలవా రందరు ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటక కాంగ్రెసు పేరుతో కాంగ్రెసును స్థాపించినారు. మహాసభకు స్వామీజీ అధ్యక్షులు. ఇట్లా ఉండగా అన్ని ప్రాంతాలు కలిపి మహాసభ జరిపించుటకు నిశ్చయించబడినది.

అశోక్‌నగర్ ఈనాడు పెద్ద పట్టణం అయినది. అప్పుడు అడవి. ఎవ్వరూ అక్కడికి పోయేవారు కారు. అక్కడ జరిగే మహాసభకు చెన్నారెడ్డిగారు స్వాగత సమితి కార్యదర్శి అన్నమాట. నేను గవర్నమెంటు టీచరును. చేరాలంటే సులభం కాదు. డాక్టరుగారు నన్ను పిలిచి మహిళలను తీసుకొని మీరు మూడు రోజులు మహాసభ పెండాలులో ఉండాలని చెపుతూ ఉండారు. నేను "డాక్టరు! నేను టీచరును, రాకూడదు" అంటే "ఏయ్, అదేమీ కాదు. నీవు కాంగ్రెసులో పనిచేస్తే బాగుంటుంది" అన్నారు. అది వారి కోరిక. నా ఉద్యోగము ఎప్పుడూ పోవాలని వారి కోరిక. మహిళా సంఘాలు ఏర్పాటు కావలెనని వారి దీక్ష. ఆర్గనైజేషన్ నడపడంలో ఒక ప్రక్క రజాకారులు, కమ్యూనిస్టులు. కమ్యూనిస్టులు పక్కలో బల్లెంగా ఉండే రోజులలో సాగించారు సభను. మూడు రోజులు సభ జరిగింది. చివరిరోజు మా పాకలన్నీ తగులబెట్టారు. రజాకార్లు ఒక ప్రక్క ఉండేవారు. మరొక ప్రక్క కమ్యూనిస్టు లుండేవారు. 'నైజాం రాజ తురకవాడు, మనం హిందువులం' అని చెప్పేవరికి తెలంగాణాలోని గ్రామాలు కమ్యూనిస్టులైన కమ్యూనిస్టులకు బలం బాగా ఇచ్చారు. రజాకార్లు ఒక ప్రక్కన ఉండేవారు. కాంగ్రెసువారు అహింసావాదులు. కొంత అలజడి, సత్యాగ్రహము జరిపించారు. ఇది ఇట్లా ఉండగా హైదరాబాదు జిల్లాలో ఉండే నాయకుల నందరిని అరెస్టు చేశారు. చెన్నారెడ్డిగారిని, రంగారెడ్డిగారిని, రామకృష్ణా రావుగారిని. వీరందరిని చెంచల్‌గూడ జైలులో ఉంచారు.

## సావిత్రీదేవి సాహసం

అదొక చిన్న ఇల్లు. దాంట్లో చిన్న గది తన ఆఫీసు. అందులో కంబళి, దానిపై దుప్పటి, వెనకాల పెద్ద దిండు, విరామము లేని ప్రజలు. కృష్ణ, రవి కార్యదర్శులు. వారి చెల్లెలు విమలమ్మ శ్రీమతి సావిత్రమ్మగారికి తోడు. బావమరిది వెంకటరెడ్డి ఆఫీస్ ఇంచార్జి. ఎంత కొసరినా విశ్రాంతి శూన్యము. డాక్టరుగారు భార్య మైత్రేయీదేవిని చదవాలని ట్యూషను పెట్టించారు. అది ఆమెకు పరీక్షా సమయం. అతిథు లందరికి వేళకు అన్నీ స్వయంగా అమర్చాలి. భర్తకు అన్ని పనులు జరిపించాలి. ఈలోగా నిజాం రాష్ట్రంలో రజాకారులు ఆడవారిని మానభంగం చేస్తున్నారని భీబత్సమైన వార్తలు వచ్చేవి. దాని వివరాలు తెలుసుకుందామని వార్ధా నుండి ప్రొఫెసర్ భన్సాలి బెజవాడ వచ్చారు. వారు కాలినడకతో నిజాం సరిహద్దుల గ్రామాలు తిరగాలని నిశ్చయించుకున్నారు. డాక్టరుగారు సావిత్రమ్మను కూడా భన్సాలిగారి వెంట వెళ్లమన్నారు. ఆమెకు హిందీ వచ్చును. భయంకరపు రోజులు. గ్రామాలు వదిలి పారిపోతున్నారు స్త్రీలు. మానధనము మంటగలిసే భయం అందరినీ బాధిస్తోంది. ఆ రోజుల్లో డాక్టరుగారు సాహసంతో తన భార్యను శ్రీ భన్సాలిగారి వెంబడి వెళ్లుటకు తయారు చేశారు. ఆమె పిల్లలను, భర్తను వదలుట ఎలా ఉన్నా, రాబోవు అవమానమునకు బెదిరింది. కాని, పోనని భర్తకు చెప్పలేదు. భన్సాలిగారి వెంట వెళ్లి తన శక్తిని చాటింది. ప్రొఫెసర్ రంగాగారు ఆ రోజులలో రాజకీయ పాఠశాల నడిపించారు. ఆ సమ్మరు స్కూలుకు భార్య తయారు కావాలి. పనులకు ఆలస్యం కాకూడదు. దేనికీ లోటు రాకూడదు. విధులు తప్పకూడదు. అలా పరీక్ష కత్తిమీద సాము చేసినట్లు ఉండేది. అది 1949వ సంవత్సరము. పోలీసు యాక్షను



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

కావడం, వెంటనే రిలీఫ్ వర్కు. అక్కడ భంగపడినవారిని పునరుద్ధరించడం. కమ్యూనిస్టులు, రజాకార్లు చంపినవారి పిల్లలను, భార్యలను ఆదరించడం వంటి రిలీఫ్ వర్కులో కీర్తిశేషులు రామాచారి మరికొంతమంది, వారికి సహాయము కొరకు డాక్టరు చెన్నారెడ్డిగారు, మేమూ అందరం ఉండేవారం. గ్రామాలలో తిరిగాము. ఉదాహరణకు—చెరుకుపాగారమో ఏదో ఊరు జ్ఞాపకంలేదు. అది పెద్ద కమ్యూనిస్టు ఊరు. ఇండియా గవర్నమెంటువారు మిలిటరీ సెంటరు పెట్టినారు. అక్కడి పెద్దమనుష్యులు మాకు ఆశ్రయం ఇవ్వడానికి భయపడినారు. ఒక పెద్దమనిషి దయతలచినాడు. అక్కడ ఒక పశువులశాల ఉంది. పశువులు వరండాలో ఉన్నవి. ఆ గదిని మాకు ఇచ్చాడు. గదినిండా గడ్డి ఉంది. ఎలుకలు, పందికొక్కులు, దోమలు, బల్లులు. గదిలో దీపము లేదు. మావద్ద నిప్పుపెట్టె గూడ లేదు. దోమలు కుట్టకుండా నిండా ముసుగులు వేసుకొని మాట్లాడుకుంటూ రాత్రి గడిపినాము. ప్రొద్దున్నే ఒకాయన వచ్చి పట్వారీ యింట్లో స్నానాలు, నాస్తా వేయుండి అవి మర్యాదగా ఏర్పాటు చేసినారు. ఇటువంటి ఘటనలు ఎన్నో అనుభవించినాము. ఎండలో ఎండి, వానలో తడిసి ఎన్ని అవస్థలు పడినామో భగవంతునికి తెలుసును. రిలీఫ్ వర్కు అయిన తరువాత గోల్కొండ దగ్గర, సంగెం దగ్గర ఒక సర్వోదయ కేంద్రం నడిపారు. అప్పుడు కొండా వెంకటరంగారెడ్డిగారు మొదలైన నాయకులు సర్వోదయ శిక్షణా కేంద్రాన్ని నడిపించారు. శ్రీ హరిశ్చంద్ర హెడా, శ్రీమతి జ్ఞానకుమారి హెడా, శ్రీమతి సరస్వతి మొదలైన మహిళలు కూడా ఉన్నారు. శ్రీమతి సావిత్రమ్మగారు కూడ కృష్ణ, రవి, శశి (6 నెలల పిల్లవాడు) తో కలిసి 15 రోజులు ఉన్నారు. ఈవిధంగా శిక్షణా కేంద్రాన్ని 15 రోజులు నడిపించారు. గంట గంటకు ప్రత్యేక కార్యక్రమంలో ఒక క్రమశిక్షణలో వార్ధా పద్ధతి ప్రకారం శిక్షణ యిస్తూ 15 రోజులు గడిపారు. చెన్నారెడ్డిగారికి తన భార్య సెక్రటరీగా పనిచేయాలని, కొడుకులు జాతీయ భావాలతో ఉండాలని వారి చిరవాంఛ. డాక్టరుగారి కంటె పెద్దవారు ఉన్నప్పటికీ చెన్నారెడ్డిగారు ప్రవేశపెట్టిన ప్రతిపాదనలు, తీర్మానాలు, వారి ఉపన్యాసాలు విన్న తరువాత అందరూ ఏకగ్రీవంగా ఆమోదించేవారు. ఆవిధముగా సర్వోదయ సంఘ శిక్షణా శిబిరం వార్ధా పద్ధతులతో ముగించబడినది.

## బాపూజీకి శ్రద్ధాంజలి

1948 వ సంవత్సరము. బాపూజీ మరణించిన రోజు. హైదరాబాదు అగ్నిగుండంలో ఉంది. ఆనాడు చెన్నారెడ్డిగారు, నాయకు లందరూ లక్షలాది జనము, మిగతా జిల్లాల వారందరూ ఉపవాసముతో, గాంధీగారి ఫోటో తీసుకుని కలోల్‌బాగ్ వరకు ఊరేగింపు సాగించారు. ఉదయం 10 గంటలకు బయలుదేరిన ఊరేగింపు సాయంకాలం 5 గంటలకు సికింద్రాబాదు చేరుకుంది. ఎన్నో లక్షల మంది జనం. ఆడవారు, మగవారు, పిల్లలు, ఎండిపోయిన మొగాలు, వాడిపోయిన బుగ్గలతో 5 గంటలకు—బాపూజీని రాజఘాట్‌లో దహనం చేసినప్పుడు—అదే సమయానికి యిక్కడ మేము అంతా ప్రార్థన చేశాము. అదేరీతిగా 12 వ తేదీనాడు బాపూజీ ఫోటో జీపులో పెట్టుకుని డాక్టర్ చెన్నారెడ్డిగారు ఒకచేత డ్రయివింగు, రెండవచేత లౌడ్‌స్పీకరు పట్టుకుని "రఘుపతి రాఘవ" పాడుకుంటూ సంగానికి బయలుదేరారు. ఆనాడు హైదరాబాదుకు స్వరాజ్యం లేదు. ప్రజలు హతాశులు. ఆకాశం నెత్తిమీద లేనట్లు, కాళ్ల క్రింద భూమి లేనట్లుగా అయిపోయింది. చెన్నారెడ్డి లౌడ్‌స్పీకర్‌లో గొంతు చించుకొని "ఆహో ఆహో బాపూజీ అంతిమ యాత్రా" అంటూ ఇంగ్లీషులో, తెలుగులో, ఉర్దూలో అరుచుకుంటూ సంగంలో బాపూజీ భస్మం వదలిపెట్టడం, నమస్కారం చేయడం, శ్రద్ధాంజలి ఘటించడం జరిగింది.

## రైతు కూలీల శిక్షణా కేంద్రం

1949 తరువాత 1950 లో ఆంధ్ర, మహారాష్ట్ర, కర్నాటక కాంగ్రెసులు ఏ రాష్ట్రానికి ఆ కాంగ్రెసు కావాలనుకున్నారు. తెలంగాణా శాఖకు రంగారెడ్డిగారు అధ్యక్షులు. స్వామీజీ కర్నాటకకు. ఇట్లా మూడు కాంగ్రెసులుగా ఏర్పాటు అయినవి. రంగారెడ్డిగారు అధ్యక్షులుగా ఉన్న కాంగ్రెసుకు చెన్నారెడ్డిగారు కార్యదర్శి. ఆడవారి సభకు మహిళా సంఘ కన్వీనరును నేను. సిటీలో పాటి కాంగ్రెసు సంఘం అయిపోయింది. దేశాయి కాంగ్రెసు, గోపాల్ కాంగ్రెస్ సంఘం అని ఉండేవి. దేశాయి కాంగ్రెసుకు డబ్బు లేదు. ఇదివరకు నిజాం ఎగ్జిక్యూటివ్ కమిటీలో మెంబరుగా ఉన్న రంగారెడ్డిగారికి మంచి పలుకుబడి ఉండేది. తెలంగాణాలో ఒక్కుమ్మడిగా రంగారెడ్డిగారు అధ్యక్షులు, చెన్నారెడ్డిగారు కార్యదర్శి అవడంతో అందరికీ ఏకగ్రీవంగా ఒకటే కాంగ్రెసు ఒకటే మాట అయిపోయింది. అప్పుడు ఎన్నికలు వచ్చినవి.


CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

1949వ సంవత్సరములో రైతు కూలీల శిక్షణాకేంద్రాన్ని ప్రొఫెసర్ రంగాగారి ఆధ్వర్యంలో డాక్టరు చెన్నారెడ్డి గారు ఏర్పాటు చేశారు. ఖమ్మంలోని కమ్మ హాస్టలులో శిబిరం ఏర్పాటు చేశారు 15 రోజులు. రాజకీయ తరగతులు ఏర్పాటు చేశారు. రంగాగారు తక్కిన పెద్దమనుష్యులతో ప్రొద్దున 8–30 నుండి 11–00 వరకు ఒకరు, కొంత విశ్రాంతి తర్వాత 1–00 నుండి 5 గం. వరకు ఒకరు, ఈవిధముగా తరగతులు ఏర్పాటుచేసి వివిధ విషయాలను వివిధ పండితులను ఏర్పాటు చేశారు. గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారిని, పాతూరి నాగభూషణంగారిని పిలిపించి ఉపన్యాసాలు చెప్పించారు. చుట్టుప్రక్కల ఉండే రైతులు యువజనులు హాజరైనారు. వచ్చినవారికి విశ్రాంతి సమయం ఉండేది కాని డాక్టరుగారికి మాత్రం వ్యవధి లేకుండేది. కించిత్తు కూడా విశ్రాంతి లేకుండ పని చేసేవారు. మహిళలకు కొన్ని తరగతులు ఏర్పాటు చేశారు. ప్రతిరోజు రాత్రి బహిరంగసభలు జరిగేవి. చుట్టుప్రక్కల ఏదో ఒక గ్రామంలో బహిరంగసభ జరిగేది. ఇదంతా చూసి కమ్యూనిస్టులకు కడుపుమంట. కొంతమంది కమ్యూనిస్టులు కూడ వచ్చి కూర్చుండేవారు. అక్కడ చెప్పే సబ్జెక్ట్సు అట్లా ఉండేవి. ఒక్కొక్క ఊరిలో ఈవిధంగా చలనం వచ్చింది. ఇలా 1949 అయిపోయింది.

**రెడ్డిగారి భవిష్యవాణి**

1950–51 సంవత్సరం చివరకు పార్లమెంటుకు డాక్టరుగారు ఎన్నికయ్యారు. పార్లమెంటులో పార్లమెంటరీ సెక్రటరీ అయ్యారు. వారు చక్కటి ఉర్దూలో, పర్షియన్‌లో, ఇంగ్లీషులో మాట్లాడుతుంటే యు. పి. వారందరూ ఆశ్చర్య పడేవారు. కొన్ని మాటలు అర్థం అయ్యేవి కావు. వారికి కలుపుగోలుతనంతో, ఉత్సాహంతో చకచకా తిరగడంవల్ల గొప్ప పేరు వచ్చింది. అక్కడ ఉండే మంత్రులు మాత్రమే కాకుండా అధికారులు, ఎం. పీ.లు, అన్ని పార్టీలవారు ఆయనను గౌరవిస్తూండేవారు. 1950 డిసెంబరు 12వ తేదీనాడు జరుగు అఖిలభారత లోకల్ సెల్ఫ్ గవర్నమెంటు కాన్ఫరెన్సుకు హైదరాబాదు జిల్లాబోర్డువారు నన్ను నామినేటు చేశారు. దానికోసం నేను రెండు నెలల ముందు అక్కడకు వెళ్లాను. డాక్టర్ చెన్నారెడ్డి, రామస్వామి ఎం. పీ.లు కాబట్టి వారి దగ్గర ఉండిపోయాను. ప్రతిరోజూ గాలరీలో కూర్చునేదాన్ని. అక్కడ ఎందరితోనో పరిచయం అయినది. అదృష్టం అనుకోవాలి. ఢిల్లీలో పాకిస్తాను నుండి వచ్చిన ప్రజలు లక్షలాది జనం ఉండేవారు. వారికి ఉండడానికి ఇండ్లు లేకపోయినందువల్ల ఢిల్లీ ప్రభుత్వం వారికి ఎన్నో వసతులు ఏర్పాటుచేసి, అనేక వృత్తి సంఘాలు ఏర్పాటుచేసింది. ఫరీదాబాదును పెద్దపట్టణం చేయాలనే స్కీముంది. అక్కడ ముఖర్జీ ఉండిరి. హైదరాబాదులో చీఫ్ సెక్రటరీగా ఉండేటప్పుడు వారు పరిచయం. కమలాదేవి ఛటోపాధ్యాయ ఉండేవారు. చెన్నారెడ్డిగారు అక్కడ డెవలప్‌మెంటు కార్యక్రమాలు ఎట్లా జరుగుతున్నవో గ్రామాలకు పోయి చూసి వస్తుండేవారు. అయితే, ఈలోగా సర్దార్ వల్లభాయి పటేల్ గారికి జబ్బుచేసి 15–12–1950 తేదీనాడు కన్నుమూశారు. దానితో మా కాన్ఫరెన్సు, పార్లమెంటు కూడా మూసివేశారు. నేను, డాక్టరు చెన్నారెడ్డిగారు, సావిత్రి, శశి (ఒకటిన్నర సంవత్సరం) మే మందరము హైదరాబాదు తిరిగి వస్తున్నాము. ఆగ్రాలో దిగి కొన్ని ప్రదేశాలు చూసి మరీ పోవాలని నేను మొండిపట్టు పట్టాను. అయితే, డాక్టర్ చెన్నారెడ్డిగారికి భవిష్యవాణి ఉన్నట్లు ఉంది. వారు 'మనము ఇక్కడికి ఎన్నిసార్లో రావలసి ఉంటుంది'—అని అన్నారు. నేను అన్నాను: 'నువ్వు రావచ్చునేమో కాని నే నెక్కడ వస్తాను' అన్నాను. ఆయన తప్పకుండా 'నీకు కూడా అటువంటి అవకాశం వస్తుం' దన్నారు. ఆయన చెప్పింది నిజం అయింది. నేను 1957 ఎలక్షన్సులో ఎం. ఎల్. ఎ. కాకూడదు; ఢిల్లీ పోవాలి అన్నారు చెన్నారెడ్డిగారు. నేను ఏడ్చినాను.. ఇందిరా సేవాసదనము నా కూతురు వంటిది. నేను విడిచి వెళ్లలేను అన్నాను. అయినా ఢిల్లీకి పంపుతున్నాను అనే మాట ఒకసారి కాదు మూడుసార్లని నన్ను ఢిల్లీకి పెట్టేయడం జరిగింది. నా జీవితంలో దేశం అంతా తిరగడం, ఎన్నోవిషయాలు తెలుసుకోవడంతోపాటు 14 సంవత్సరాలు ఢిల్లీలో ఉన్నానంటే అది వారి చలవేనని చెప్పగలను.

ఇక 1950 అయిపోయిన తరువాత 1951. మళ్లా ఎన్నిక తయారు. తెలంగాణాలో రెండు కాంగ్రెసులు ఎన్నికల యుద్ధానికి తయారుకావాలి. ఒకటే తిరగడం. హైదరాబాదులో మూడు రోజులు, మిగతా రోజులు గ్రామాలలో తిరిగి వచ్చేవారు. గ్రామాలలో తిరిగి, తిరిగి ఒక జనరల్ ఎలక్షనుకు తయారుచేశారు ప్రజలను. జనరల్ ఎలక్షన్సుకు తయారవడం 1952 వచ్చేవరకు నవంబరులో, డిసెంబరులో మొదలుపెట్టి ఏ సభ్యుడు ఎక్కడనుంచి రావాలి, ఎవరిని పెట్టాలి యిన్నీ బాగా ముమ్మరంగా ఆలోచించి చేసేవారు. ఎలక్షన్సు సమయంలో చెన్నారెడ్డిగారు తమ ఇంటిలో, ఆగాపురాలో ఉండేవారు. అక్కడ కాండిడేట్సు లిస్టు తయారు చేసేది. కేశాయి గ్రూపువారు మాత్రం చెన్నారెడ్డిగారు ఎట్లా



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

వ్రాయమంటే అల్లా వ్రాసి సంతకాలు పెట్టేసేవారు. ఎక్కడ సంతకాలు పెట్టాలి? ఏమేమి చేయాలి అని ఎలక్షన్సులో మంచి అనుభవం ఉన్న చెన్నారెడ్డిగారు దరఖాస్తులను బాగా పరిశీలించి పంపేవారు. దేశాయి గ్రూపువారికి ఎన్నికలలో మెజారిటీ వచ్చింది. అప్పుడు హైదరాబాదులో ముఠాతత్వం బాధ ఉండేదికాదు. రంగారెడ్డిగారికి అనివార్యంగా రామకృష్ణారావుగారిని చీఫ్ మినిస్ట్రు చేయాలని పట్టుదలవుండేది. ప్రత్యేకముగా హైదరాబాదు స్టేటులో ఎంతో శక్తి గల బూర్గుల రామకృష్ణారావుగారిని నాయకునిగా ఎన్నుకోవడం జరిగింది. ఆ రోజులలో చీలిక సిద్ధంగా ఉండేది. కాని సభలో కమ్యూనిస్టు సభ్యులు చాలామంది ఉండేవారు. విశ్వాసరాహిత్య తీర్మాన ప్రమాదం ఉండేది. రామకృష్ణారావుగారు మేధావి. మొదటినుండీ రామానందతీర్థ పంజరములోనికి తెచ్చినట్లు కొందరిని తమ కాంగ్రెసులోకి చేర్చుకున్నారు. కాంగ్రెసును గట్టి పరచడం జరిగింది. స్వామీజీ గ్రూపువారు నల్గురు మంత్రులు మంత్రివర్గానికి రాజీనామా చేశారు. కాంగ్రెసుకు ముప్పు వచ్చునని, హైదరాబాదు పరిస్థితిని చూసి పండిట్‌జీ పరుగెత్తుకుని వచ్చారు. పార్టీ మీటింగులో రంగారెడ్డిగారిని ఏదిది అడిగారు. రామకృష్ణారావుగారు తిరిగి నాయకులుగా వస్తారనే నమ్మకం నాకు ఉందని హామీ ఇచ్చారు. కాంగ్రెసులో అలజడి జరిగింది. మనుష్యుల సందడిని పార్టీ మీటింగులో వెళ్ళవాళ్ళు కూర్చోబెట్టారు. చెన్నారెడ్డిగారి బంగళాలో ముకాం. పోలీసులు దొంగలను పట్టుకొని పోయినట్లు మనుష్యులను మీటింగుకు తీసుకొని వెళ్ళడం జరిగింది. షామియానాలో మీటింగు పెట్టారు. అందరం చేరింది ఒక్కచోటికి. పండిట్‌జీ వచ్చి దర్వాజా బంద్ కరో అన్నారు. అందరం హాలు లోపలికి వచ్చామో లేదో చూశారు. ఆయన టేబుల్‌మీద కూర్చున్నారు. మేము మొదటి వరుసలో కూర్చున్నాం. సహాయం లేని నా చేతిలోనున్న అంటాకీ పూసంలో పెదవిని నా చేయి పంపి సంతకున్నారు. మేం తిరగబడి చూస్తావుండగా బల్లమీద సంచిలో ఉన్నవన్నీ—చిన్నచిన్న కాగితాలు, చిల్లర పైసలు ఇన్నీ—బల్లమీద కుమ్మరించారు. బల్లమీద సంచిలో అంతకుముందే చింపి ఇచ్చిన చీటీల మీద తమ వోటును నమోదు చేయాలని చెప్పి ఎవరూ లేచి రావద్దని పండిట్‌జీ బల్ల ఎక్కారు. తనే స్వయంగా తన చేతి క్రింద సంచితో ఉంచుకొని, చేతిలో నా సంచి పట్టుకొని తనే స్వయంగా మా దగ్గరకు వచ్చి ఒకటి, రెండు, మూడు అని వోట్లు లెక్క పెట్టుకున్నారు. అలాగ కావలసిన్ని అందరి దగ్గరకు వెళ్ళారు. లెక్కపెట్టి చూస్తే బిందూగారికి 8 వోట్లు, పూల్‌చంద్‌గారికి 4 వోట్లు, తక్కిన వోట్లు అన్నీ రామకృష్ణారావుగారికి వచ్చినవి. ఆవిధంగా రామకృష్ణారావుగారు మరొకసారి రావడంతో రంగారెడ్డిగారి పార్టీకి "జై" అని అందరూ అరిచారు.

## మహిళా సంఘాలు - హరిజన సంఘాలు

ఇంకా కొన్ని విషయాలు మనవి చేస్తున్నాను. చెన్నారెడ్డిగారికి చిన్నప్పటినుండి మహిళా సంఘాలు, హరిజన సంఘాలు, యువజన సంఘాలు, గ్రంథాలయ సంస్థలు స్థాపించుట ప్రథమ కర్తవ్యముగా భావించేవారు. పట్టణాలలో పని చేయవలసిన పని ఉండదు. పల్లెటూళ్ళలోనే శ్రద్ధగా పని చేయాలని వారి పట్టుదల. అయితే 1946–47 నుండి మహిళా సంఘాలు, హరిజన సంఘాలు పెంచినారు. ప్రతిచోట హరిజనులకు, మహిళలకు ప్రాతినిధ్యం ఉండవలసినదే. వారి అధినేతృత్వంలో మేమంతా చెన్నారెడ్డిగారి బలము, బలగము కూడ.

అన్ని సంఘాలవారిని సంప్రదిస్తుంటూ ఉండేవారు చెన్నారెడ్డిగారు. అయితే కొన్ని తమాషాలు కూడా ఉన్నాయి. ఆయన పార్లమెంటులో ఉన్నప్పుడు ఎంత పెద్ద ఆడవారినైనా వెటకారంగా నవ్వుతూ మాట్లాడుతూ ఉండేవారు; నవ్విస్తూ ఉండేవారు. వారు (స్త్రీలు) కూడా దూరంగా చెన్నారెడ్డి ఉంటే "హేయ్ చెన్నారెడ్డి" అని పిలుచుకునేవారు. అదేవిధముగా మిసెస్ స్వామినాథన్, రుక్మిణీ అరుండేల్, సుచేతా—అనేకమంది దాక్టరుగారితో తమాషాలు చేస్తుండేవారు. చెన్నారెడ్డిగారికి ఆడవారంటే చాలా అభిమానం, గౌరవం కూడా. అందరికీ సహాయం చేయడం వారి స్వభావము. పిల్లలను, యువకులను ఎప్పుడూ ఆదుకోవడం, సహాయం చేయడం వారికి ఇష్టము.

ఇక ఆయన ఏదైనా సభలకు వెళ్ళినప్పుడు లోకల్‌గా ఉండే పెద్దమనుష్యులను అధ్యక్షులుగా చేసి తాము చివర మాట్లాడేవారు. మాలాంటివారికి ముందు మాట్లాడటానికి అవకాశం దొరుకుతూ ఉండేది. మేము చెన్నారెడ్డిగారిని ప్రశ్నించేవాళ్ళము: 'మీరు ముందు మాట్లాడితే మాకు హాయిగా ఉండదు; అందుకని ఆఖరున మాట్లాడవలసిం'దని. అందుకని ఆయన ఆఖరున మాట్లాడేవారు.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

### పేరుపేరునా పలకరించే ఆప్యాయత

మరొక సంఘటన చెబుతాను. ఒక పర్యాయం ఢిల్లీ ఎక్స్‌ప్రెస్‌లో మహబూబాబాద్ పోవాలని రంగారెడ్డిగారు, చెన్నారెడ్డిగారు, నేను, రామస్వామి నలుగురం కూర్చున్నాం. రంగారెడ్డిగారు తొందరలో వారి బ్యాగ్ మరచిపోయినారు. స్టేషను దగ్గరకు కాంగ్రెసువారు వందలమంది వచ్చారు. ఆ హడావిడిలో సామానులు పోయినవి. బయటకు వెళ్లి చూచిన తరువాత బ్యాగులు లేవు అని తెలిసిపోయినది. కాంగ్రెసువారిని కమ్యూనిస్టులు రైలులో దోపిడి చేసినారని పేపరులో పెద్ద అక్షరాలతో వేశారు.

ఇంకో తమాషా. చెన్నారెడ్డిగారు ఏ ఊరు వెళ్లినా అక్కడ యిదివరకు జరిగిన సంఘటనలు చాలా వివరంగా గుర్తుకు తెస్తారు. ఆ గ్రామములోని వారిలో అనేకులను పేర్లతో పిలుచుట వారికి ఇప్పటికీగూడా అలవాటులో ఉన్నది. 'ఏమి చంద్రయ్యా, ఏమి చేస్తున్నవు ఇప్పుడు?' అని పేరుపేరునా పిలిచి అడుగుతూంటే, 'మా దొరకు అన్నీ జ్ఞాపకమే; నేను బాగా గుర్తున్నాను' అని ప్రతి ఒక్కరూ ప్రతి గ్రామంలోనూ ఆయనంటే ఎంతో అభిమానాన్ని పెంచుకుంటున్నారు. ఆయన జ్ఞాపకశక్తి అలాంటిది.

### సాహసంలో సవ్యసాచి

ఆయన ఎప్పుడు ప్రయాణం చేసినా జీపు ఆయనే నడిపేవారు. పాత రోజులలో ఒక ఊరిలో మాకు భోజనం పెట్టినందుకు ఒక సాహుకారును సఫా చేసినారు దుండగులు. ఆ విషయం కూడా చెన్నారెడ్డిగారికి బాగా జ్ఞాపకం ఉంది. రాత్రి రెండు గంటలు, మూడు గంటలవరకు మేలుకొని ఉన్నప్పటికీ ఆయనే డ్రయివు చేసేవారు. ఒకరోజు సాయంత్రంవరకు కష్టపడి రాత్రంతా మేలుకొని డ్రయివు చేసిన పిమ్మట, మళ్లా ఆదిలాబాదు నుండి నిర్మల్‌కు పోవలసి వచ్చినప్పుడు "నాయనా! అలసిపోయావు కనుక నీవు డ్రయివు చేయవద్దు" అని నేను చెప్పినాను. కొంతమంది పెద్దమనుష్యులు కూడా చెప్పారు. ఆయనకు ధరుణ కోపం వచ్చింది. "ఏమిటి అనుకున్నారు? మిమ్ములను యాక్సిడెంటుపాలు చేస్తాననుకుంటున్నారా? ఏమీ ఫరవాలేదు. నేను డ్రయివు చేసితీరుతాను" అని ఒక చేతితోనే అది కూడా ఎడమ చేతితో డ్రయివు చేశారు. 5 గంటలు ప్రయాణం సాహసముతో చేశారు. 'సవ్యసాచి' అనేవారము. అటువంటిది ఆయన పట్టుదల. ఆయన కష్టపడి పనిచేస్తారు. తనతో ఉన్నవారిని కూడా కష్టపడి పనిచేయమంటారు. అందుకనే అధికారులకు ఇబ్బందిగా ఉంటుంది. అయినా, తాను సుఖపడి వారిని కష్టపడమనడం లేదుకదా! తరువాత నాసిక్‌నగర్ కాంగ్రెసు వచ్చింది. రాకరాక ఆలిండియా కాంగ్రెసు సెషను జరుగుతున్నది. అన్ని స్టేట్సువారు హైదరాబాదు చూడాలని పోలీసు యాక్షను జరిగిన ప్రదేశం ఎలా ఉందా చూద్దామని ఎంతో జనం వచ్చారు. రాజేంద్రప్రసాదుగారు కూడా వచ్చారు. వా రందరికీ ఏర్పాట్లు అన్నీ స్వయంగా చూచి, చెన్నారెడ్డిగారు, వారి బలగము ఏ కొరత లేకుండా బ్రహ్మాండంగా కాంగ్రెసు సెషను జరిపించి పేరు గాంచారు.

మరికొన్ని ఘటనలు : పోలీసు యాక్షను తరువాత మాకు మరీ కష్టాలు అధికమైనవి. రజాకార్లు, కమ్యూనిస్టులు ఏకమై గ్రామాలను నాశనము చేయుట అనివార్యమైనది.

జయపూరులో అఖిలభారత కాంగ్రెసు మహాసభలు జరుగుచుండెను. డాక్టరుగారి తండ్రికి చాలా జబ్బుగా ఉండెను. డాక్టరుగారు తండ్రికి ఏకైక కుమారుడు. డాక్టరుగారి ఇద్దరు కొడుకులకు—కృష్ణకూ, రవికీ టైఫాయిడ్ జ్వరము. భార్య కేమీ తెలియదు. పిల్లలు ఎముకల బొమ్మలుగా తయారైనారు. కాని, జయపూరు కాంగ్రెసు మహాసభలకు, ఇక్కడ నుండి కొన్ని వేల మందిని, రైళ్ళ నింపుకుని జయపూరు వెళ్లి వచ్చేవరకు, వారి నాయనగారు కన్ను మూశారు. వారి కర్మ వారి తమ్ముడి కొడుకు చేశారు. తల్లి జబ్బుతో దవాఖానలో ఉన్నది. కాని, ఆనాడు తాను దౌరాలో ఉన్నారు. తల్లి కన్ను మూసింది. రెండవరోజు కర్మ చేయుటకు అందినారు. ఆనాడు డాక్టరుగారు ఆడపిల్లలకంటే అధికంగా వాపోయారు. వెక్కిళ్ళు బట్టినవి. అందరి గుండెలు దెదరినవి.

### ఇంటికి లక్ష్మి 'వసుధ'

డాక్టరుగారు ఢిల్లీలో ఉన్నారు. సావిత్రమ్మకు కాన్పు రోజులు. సావిత్రమ్మకు ఆపరేషను కావలసి వచ్చింది. భర్త అనుమతి లేనిది ఆపరేషను కాకూడదని డాక్టర్లు అభ్యంతరము చెప్పారు. ఢిల్లీకి ఎన్నిసార్లు ఫోను

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

చేసినా, డాక్టరుగారు ఇంటిలో లేరు. తల్లి బ్రతుకదని అందరు కన్నీరు కార్చుచుంటే, కీర్తిశేషులు కొండా వెంకటరంగారెడ్డి గారు సావిత్రమ్మ తండ్రిచేత సంతకము చేసిన పిదప, పాపను బైటికి తీసారు. ఈ పాపయే వసుధ. డాక్టరుగారి ఏకైక ముద్దుల కూతురు. ఆమె ఇంటికి లక్ష్మి అని డాక్టరుగారి నమ్మకము, విశ్వాసము. ఆమె ఏమి చేసినా శుభమగునని వారి నమ్మకము.

## విషమును మ్రింగిన శివుడు

తన ఆత్మీయుడై, తండ్రి కష్టకాలంలో తిరిగిన వారి పెద్దకుమారుడు బి. ఏ., చదివిన కృష్ణ కొంత జబ్బుచేసి తండ్రి ఒడిలోనే అసువులు వదలినాడు. ఇదొక కత్తికోత ఆ తల్లితండ్రులకు. గుండెలో కారుచిచ్చు చొచ్చినది. డాక్టరుగారి ఆధ్యాత్మికశక్తి ఆ విషమును క్రమేణ తగ్గించినది. సావిత్రమ్మ ఆ పోటుకు తట్టుకోలేక పోయింది.

ఆంధ్రప్రదేశ్ రాకముందు రజాకారులు, కమ్యూనిస్టులు, రెండు కాంగ్రెసులు—అవి ఒక రీతి ఘటనలు. 1957 నుండి మరొక రకమైన ద్వంద్వయుద్ధాలు.

విద్యార్థి దశనుండి ప్రారంభించిన వివిధ రీతుల సంఘాలు, సమస్యలు, ఎడతెగకుండా సాగింపబడుచున్నవి. ఇన్నేళ్లనుండి, తిండి, నిద్ర, విశ్రాంతి, సరిగా లేకుండ ఈవిధంగా పనిచేయుట ఆశ్చర్యము.

రెడ్డిగారికి ఆధ్యాత్మికశక్తి చాల మెండు. ఉతారులు, చెదాపులు ఎన్నో ఘటనలు వచ్చినా, చెదరి బెదరి దిగాలుపడిన ఘట్టము లేదు. ఏదైన, వచ్చిన ''మన మంచికొరకే'' వస్తుం దనే మనోధైర్య మున్నది వారికి. తాను ఢిల్లీలో ఉన్నా, లక్నోలో ఉన్నా, ఇక్కడ ఉన్నా తన భార్య, తన పిల్లలు, చేయవలసిన విధులు (వారికి వప్పజెప్పినవి) యథావిధిగా జరిగేవి. వారికి రిపోర్టు చూపవలసినదే.

తెలంగాణములో ఇన్ని రకాల, వివిధ రంగాలలో 40 ఏళ్ల నుండి ప్రజాసేవ చేసిన రెడ్డిగారికి వారే సాటి. ప్రతి పని భగవదర్పితమని చేయుట వారి ప్రతిభావిశేషము. ఎన్నిపను లున్నా, క్రొత్త విషయాలు తెలుసుకొనుటవలన ఒక నూతనశక్తి నిస్తుంది వారికి. ఒక్క మాటలో చెప్పాలంటే వారు ఆంధ్రప్రదేశ్‌కు నేడు విజయసారథి !

భగవంతు డన్నివేళల వీరిని రక్షించుగాత ! ప్రజాసేవ చేయుటకు సర్వశక్తుల నిచ్చుగాత :





CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# మంగళాక్షతలు

పి. యశోదా రెడ్డి

చిన్నయ్యకు షష్టిపూర్తియట
అన్నయ్యలకు నిలిచినచోట కాలు నిలువదట
చిన్నయ్యలు బొంగరాలై సుళ్ళుపోతున్నారట
ఊరూరా వేడుకలట—ఇంటింటా పండుగలట
తలుపుతట్టి సంబరం
నిలువెల్లా నవ్వులతో నన్ను లేపవచ్చింది.
అలంకరించు సింగారముల—సవరించు సిగసిరి మల్లెదండ
జాగుసేయకు—వేళ మించనీకు మన్నది.

ఈ చిన్న దెవరమ్మా! పండుగమ్మా! అన్నాను.
తెలియదటే నీవు?—తెలుగుబిడ్డ వాడు!
తెగువ మించిన చేవ—తగవు మించని మాట
గలగలాపారె గోదారి జతవాడు—భగభగా మండె సూరీని సరివాడు
అయితే ఏం?
రాజదండం పట్టినవాడు—రాచరికం నడిపేవాడు
అయిదుకోట్ల ఆంధ్రులకే తలమంత్రి ఐనవాడు.
కావచ్చు
ఇందిర మెచ్చినవాడు—విజయేందిర వలచినవాడు
కాపువాడు—కళలకు కాపైనవాడు
కడుపుబాధ తెలిసినవాడు—కర్షకులకు కన్నాకు పీడు

మంచిదే!
నిక్కులవాడట—బలు టెక్కుల పోవువాడట
అయినా
బావనయ్యల సిగ పూచెండంట—పంతులయ్యల కనుపాప జోడంట
నిరుపేదలు కొల్చిన కోర్కెల గాదెలంట—పూజరులు నిల్పిన పర్వాల దొంతియంట
కులమత భేదాలు విడిచినతావంట—మనసూ మమతలు పెంచిన నెలవంట
కపటానికి కంటకభూమి—స్నేహానికి ప్రాణమైనసామి
ఉత్సాహంపు పందిళ్లకు పచ్చని తీవియ—మంచి మల్లియలకు వైశాఖవేళ

అయితే—అతడు
మ్రిపేరింటివాడు—మా సావిత్రక్కకు మగడైనవాడు
నాకు బావయ్య వరుసవాడు
వత్తును పదా! ఈ ఉత్సవమునకు
నా బిడ్డతోడుగా మావారి గూడి
మేలిచిత్తరపు మురువు—పలుకు ముత్తెపుజల్లు కురియ
మంగళసేసలు చెట్టి—నిండు శోభనములు పండింప.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# చెన్నారెడ్డిగారితో మా వారు...

ఉమాదేవి

పూజ్యులు డాక్టర్ ఎమ్. చెన్నారెడ్డిగారితో నా భర్తకు ఉన్న సంబంధం, బాంధవ్యం చిరస్మరణీయమైనవి. మూడు దశాబ్దాల కాలంలో వీరిద్దరి మధ్య అద్వైత స్వరూపం ధరించిన అపూర్వ సాన్నిహిత్యం ఏర్పడింది. ఈ బాంధవ్యం దైనందిన రాజకీయాలకు అతీతమైనది. నా భర్తదృష్టిలో సుగుణసంపద అంతా మూర్తీభవించిన విశిష్టవ్యక్తి చెన్నారెడ్డిగారు. పూవుతో తావికి ఉన్నటువంటి సన్నిహిత సంబంధం చెన్నారెడ్డిగారితో మావారికి ఏర్పడడం వాస్తవంగా ఆయన భాగ్యవిశేషమే, పూర్వజన్మ సుకృతమే.

## భాగ్య విశేషం

మా కుటుంబానికి, విశేషించి మా నాయనగారు పరకాంతం గోపాలరెడ్డిగారికి చెన్నారెడ్డిగారూ, మావారూ కొత్త కాదు. వీరి పరిచయం, బంధుత్వం ఎన్నో సంవత్సరాలది. చెన్నారెడ్డిగారు నిర్వహించిన ప్రజాహిత, రాజకీయ జీవితసమరంలో విధేయుడయిన ఒక సైనికుడుగా విద్యార్థిదశనుంచే నా భర్త గడిపిన ఘట్టాలను ఎంతో ఆసక్తితో గమనించే అవకాశం నాకు బాల్యంనుంచే లభించింది. వీ రిద్దరిమధ్య చిగురించి, ముప్ఫయి సంవత్సరాల వ్యవధిలో వేయి దళాలతో విప్పారి, వికసించిన సాన్నిహిత్యం వాస్తవంగా ఎవరయినా మహాకవి మధుర కావ్యానికి కమనీయ ఇతివృత్తంగా ఉపకరిస్తుంది. ఈ ఇతివృత్తపు మొదటి దశలో నేను కేవలం సాక్షిని మాత్రమే; రెండవ దశలో నేను గూడ, నా భర్త ప్రక్కన సహధర్మచారిణిగా ఒక భాగస్వామిని. ఇది నా భాగ్య విశేషం.

## ఆరాధనీయులు

మా వివాహానికి వచ్చేసి, నన్నూ, వెంకట్రామారెడ్డిని చెన్నారెడ్డిగారు, వారి సతీమణి సావిత్రమ్మగారు ఆశీర్వదించినారు. నా భర్తకు చెన్నారెడ్డిగారు ఎంతో ఆరాధనీయులని అప్పటినుంచే నేను గమనించ గల్గినాను. సీతా స్వయంవర వేదికమీద నిలచిన నీలమేఘశ్యాముడు రాముడు అక్కడి సభికులలో ఒక్కొక్కరికి ఒక్కొక్క గుణంతో భాసించినాడు. రాజులకు ఆయన మహారాజుగా, వీరులకు ఆయన వీరాగ్రగణ్యుడుగా, పుణ్యచరితులకు ఆయన పుణ్యపురుషుడుగా తేజరిల్లినాడు. చెన్నారెడ్డిగారు గూడ ఒక్కొక్కరికి ఒక గుణ విశేషంతో కన్పించవచ్చు. కాని, మావారి దృష్టిలో మాత్రం డాక్టర్ చెన్నారెడ్డిగారు సకల సద్గుణాలు మూర్తీభవించిన నాయకుడు. వెంకట్రామారెడ్డి అర్థాంగిగా నా వైవాహిక జీవితం ప్రారంభమయిన తరువాత చెన్నారెడ్డిగారి బహుముఖ ప్రజాసేవా జీవితంతో క్రమంగా నాకు గూడ పరిచయం ఏర్పడ సాగింది. మా వారికి చెన్నారెడ్డిగారు ఇంతగా ఆరాధనీయులు కావడంలో వింత లేదని ఈ పరిచయంవల్ల నేను తెలుసుకున్నాను.

## మావారి ఆరవప్రాణం

చెన్నారెడ్డిగారే తన జీవిత సర్వస్వం అన్నంతగా ఆయనతో మావారు పెంచి పోషించుకున్న సాన్నిహిత్యం నాలోగూడ కొన్ని సందర్భాలలో స్వల్పమైన అసూయను కల్గించిందంటే అతిశయోక్తిగా ధ్వనించవచ్చు. అయినా, ఇతరులలో అసూయను కల్గించినంత సన్నిహిత సంబంధం వా రిద్దరిది. అది అమలిన సంబంధం. నిష్కామయోగిగా డాక్టర్ చెన్నారెడ్డి గారు మావారిపట్ల వాత్సల్యాన్ని ప్రదర్శించేవారు; స్నిగ్ధ హృదయంతో మావారు తన అవ్యాజ అనురాగాన్ని, అకళంకభక్తి ప్రపత్తులను అపారంగా చెన్నారెడ్డిగారి మీద వర్షించేవారు. వీరు అవిరళ రాజకీయ కార్యతత్పరులు. ప్రజాసేవా ధురంధరు లయిన చెన్నారెడ్డిగారి శుశ్రూషలోనే కమ్ముడు వెంకట్రామారెడ్డి తన కాలాన్నంతా అహర్నిశలు వినియోగిస్తుండేవారు. భర్త



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

తన అమూల్యమయిన సమయంలో కొంతయినా కొంతభాగాన్నయినా తనకూ, పిల్లలకూ ప్రసాదించాలని గృహిణి కోరడం సహజమే. నేను ఇదే కోరికతో పలు సందర్భాలలో మావారిమీద చిరుకోపాన్ని ప్రదర్శించడం జరిగేది. "చెన్నారెడ్డిగారే మీకు ఆరవ ప్రాణం" అని అప్పుడప్పుడు నేను ఆయనతో అన్న మాటలలో ఇప్పుడు నాకు కేవలం అమాయకత్వం, కొద్దిపాటి స్వార్థం మాత్రమే కన్పిస్తున్నవి.

చెన్నారెడ్డిగారి తార్నాకా గృహం మావారి దృష్టిలో ఒక ఆలయం వంటిది. ఆ ఆలయాన్ని, హైదరాబాద్‌లో ఉన్నప్పుడు, బహుశః ఆయన సందర్శించని రోజు లేదు. నా భర్త ప్రతిరోజూ చెన్నారెడ్డిగారి ఇంటికి వెళ్ళుతుండేవారు. వారి గృహంలోనే ఆయనకు కావలసిన ఉత్తేజం అంతా లభిస్తుండేది. ఎవరయినా మావారు ఎక్కడున్నారని అడిగితే నేను వెంటనే "కేరాఫ్ తార్నాకా" లేక "కేరాఫ్ డాక్టర్ చెన్నారెడ్డి" అక్కడ చూడండి అని సమాధానం ఇవ్వడం జరిగేది. ఎవరికయినా ఆయన సాధారణంగా ఎప్పుడూ తార్నాకాలోనే కన్పించేవారు.

## అమృతం, హాలాహలం

చెన్నారెడ్డిగారితో మేము గడిపిన రోజులు చిరస్మరణీయమైనవి. ఆ అనుభవాలన్నిటిని వివరించినట్లయితే ఒక గ్రంథం అవుతుంది. ఆనందంలో, విచారంలో అన్నిటా చెన్నారెడ్డిగారితో కలిసి అమృతాన్నీ, హాలాహలాన్నీ సమంగా పాలు పంచుకున్నాం. రజాకార్ దురాగతాలు రగుల్కొంటున్న రోజులలో చెన్నారెడ్డిగారు విజయవాడ, తదితర ప్రాంతాలలో, హైదరాబాద్ స్వాతంత్ర్య ఉద్యమానికి సారథ్యం వహిస్తున్నప్పుడు విద్యార్థిగా ఉన్న వెంకట్రామారెడ్డి ఆయనను ఒక సిపాయివలె అనుసరించినాడు. రాజ్యపాల్‌గా చెన్నారెడ్డిగారు ఉత్తరప్రదేశ్‌కు అధిపత్యం వహిస్తున్నప్పుడు మావారి శరీరం హైదరాబాద్‌లో ఉన్నా, హృదయం లక్నోలో లగ్నమయింది. చెన్నారెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సేవ చేసే భాగ్యం, ఆనందించే అవకాశం మావారికి లభించలేదు.

## అసిధారావ్రతం

అధికార రాజకీయాలలో ప్రజ్ఞా పాటవాలను ప్రదర్శించడం ఒక ఎత్తు. ఇందులో సాటిలేని మేటి డాక్టర్ చెన్నారెడ్డిగారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా, ప్రజా సమస్యల పరిష్కారం కోసం, అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను నిర్వహించడం, వాటికి సమర్థవంతమైన, వివేకవంతమయిన నాయకత్వం వహించడం మరొక ఎత్తు. ప్రజా ఉద్యమ నిర్వహణం అసిధారావ్రతం. ఈ వ్రతాన్ని అమోఘంగా నిర్వహించిన మహా నాయకుడు డాక్టర్ చెన్నారెడ్డి. ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించడంలో ఆయనకు ఆయనయే సాటి. ఇందుకు సజీవ నిదర్శనం ప్రత్యేక తెలంగాణ ఉద్యమం. ఇంగ్లీషు, తెలుగు, ఉర్దూ మూడు భాషలలో గంగాప్రవాహ తుల్యమైన వక్తృత్వ పాటవం చెన్నారెడ్డిగారి శక్తి మంతమైన ఆయుధం. ఈ ఆయుధాన్ని వారు ప్రజాసేవ కోసమే వినియోగిస్తున్నారు. తెలంగాణ ఉద్యమం చెన్నారెడ్డిగారితో మావారి సంబంధాన్ని మరింత సన్నిహితం కావించింది. మేడ్చల్ పంచాయతీసమితి అధ్యక్షుడుగా వెంకట్రామారెడ్డి కావించిన కృషికి ప్రధానమైన ప్రేరణ, ప్రోత్సాహం, ఉత్తేజం చెన్నారెడ్డిగారివే. తెలంగాణ ఉద్యమ కాలంలో, 1968 లో, చెన్నారెడ్డి గారి ఆశీర్వాద బలంతో హైదరాబాద్ స్థానిక సంస్థల నియోజక వర్గం నుంచి ఆంధ్రప్రదేశ్ శాసనమండలికి మావారు ప్రప్రథమంగా ఎన్నికయినారు. ఆ తరువాత చెన్నారెడ్డిగారి ఆశీర్వాదంతోనే మావారికి మంత్రిపదవి లభించింది. వెంకట్రామారెడ్డి రాజకీయ జీవితానికి శ్రీకారం చుట్టిన చెన్నారెడ్డిగారు ఆయనకు కొండంత అండగా నిలిచి అడుగడుగునా ఆశీర్వదించినారు. చెన్నారెడ్డిగారి ఆశీస్సులు, అండదండలు, మార్గదర్శకత్వం ఇప్పటికీ మా కుటుంబానికి అపరిమితంగా లభిస్తున్నవి.

## రామభక్తుడు

అవకాశవాదం, అవిధేయత విశ్వవ్యాప్తం అవుతున్న రోజుల్లో కూడ చెన్నారెడ్డిగారితో సాన్నిహిత్యాన్ని కోల్పోకుండా మావారు రామభక్తుడివలె కొనసాగడం కొందరికి ఆశ్చర్యం కలిగించడంలో వింతలేదు. నా భర్త దృష్టిలో చెన్నారెడ్డి మేరు సమానుడు. చెన్నారెడ్డిగారుంటే మావారికి కొండంత ధైర్యం. ఘోరమయిన వ్యాధితో బాధపడుతున్న అతి క్లిష్ట సమయంలో మావారికి చెన్నారెడ్డిగారు, వారి సతీమణి శ్రీమతి సావిత్రిదేవిగారు తండ్రిగా, తల్లిగా, దైవస్వరూపులుగా

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

కల్పించినారు. కష్టకాలంలో తల్లి, తండ్రి, ఆత్మీయులు ప్రక్కనే ఉండాలని హృదయం ఆరాటపడుతుంది. దావానలం వంటి వ్యాధితో కృంగిపోతున్న మావారి హృదయం చెన్నారెడ్డిగారి చల్లని ఆప్యాయతస్పర్శ కోసం తహతహ లాడింది. ఢిల్లీలోని ఒక ఆసుపత్రిలో మావారికి నాలుగు గంటలపాటు తీవ్రమయిన శస్త్రచికిత్స జరిగింది. లక్నో నుంచి ప్రత్యేకంగా వచ్చిన చెన్నారెడ్డిగారు చికిత్స జరుగుతున్న గదిలో, ఆసుపత్రి దుస్తులతో నాలుగు గంటలపాటు మావారి ప్రక్కనే ఉన్నారు. శస్త్రచికిత్స జరిగిన తరువాత వారం రోజులు డాక్టర్ చెన్నారెడ్డిగారు, వారి సతీమణి కూడ ఢిల్లీలోనే ఉండి రాత్రింబవళ్ళు మావారి ఆరోగ్య పరిస్థితిని పరామర్శించినారు. ఇది ఎన్నడూ మరువలేని ఘట్టం. మరణశయ్యమీద మావారు మృత్యువుతో పోరాడుతూ, చైతన్యరహితంగా ఉండి చెన్నారెడ్డిగారి చివరి దర్శనం కోసం వేయి కళ్ళతో ఎదురుచూచిన విషాద సంఘటన నా కళ్ళముందు మెదులుతున్నది. చెన్నారెడ్డిగారు వచ్చి కనిపించేవరకు మావారు చివరిశ్వాస విడువలేదు.

మావారిని ఆసుపత్రిలో పరామర్శించడానికి వచ్చిన ప్రతిసారి డాక్టర్ చెన్నారెడ్డిగారి సతీమణి శ్రీమతి సావిత్రీదేవి గారు గంగాజలాన్ని, దేవాలయ ప్రసాదాన్ని తీసుకవచ్చి ఇచ్చేవారు. సావిత్రీదేవిగారి సానుభూతి, కరుణ, సహృదయం, ప్రేమాభిమానాలు ఆపదలో ఉన్న మాకు ఎంతో మనోనిబ్బరాన్ని, ధైర్యాన్ని కల్గిస్తుండేవి. డాక్టరు చెన్నారెడ్డిగారు ఉత్తర ప్రదేశ్‌లో గవర్నర్‌గా ఉన్నప్పుడే అలహాబాదువద్ద పవిత్ర త్రివేణీ సంగమంలో, బనారస్‌లో నా భర్త అస్థికలు నిమజ్జనం చేయడం జరిగింది. చెన్నారెడ్డిగారూ వారి సతీమణీ స్వయంగా వచ్చి ఎంతో శ్రద్ధాసక్తులతో ఈ నిమజ్జన కార్యక్రమం పూర్తి కావించారు. నా భర్త స్వర్గీయుడయిన తరువాత ఈ ప్రపంచం, ఈ జీవితం నాకు చీకటిమయంగా కన్పించి అంతులేని శోకాన్ని కల్గించింది. చీకటి జీవితంలో డాక్టర్ చెన్నారెడ్డి పుణ్య దంపతులే నాకు వెలుగుకిరణాలు. ఆ పుణ్యదంపతులే ఆలంబనంగా నేను ఆత్మశక్తిని పొంది జీవితయాత్ర కొనసాగించ గలుగుతున్నాను.

డాక్టర్ చెన్నారెడ్డిగారు గవర్నర్‌గా ఉన్నప్పుడే 1977 జనవరిలో అలహాబాద్‌లో కుంభమేళ ఉత్సవం బ్రహ్మాండంగా జరిగింది. దేశం నలుమూలల నుంచి వచ్చిన లక్షలాది ప్రజలు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. డేరాలతో నిర్మించిన వేలాది గుడారాలలో లక్షలాది ప్రజలకు చక్కని సౌకర్యాలు ఏర్పాటు చేసినారు. ఈ ఉత్సవం ఏర్పాట్లకు డాక్టర్ చెన్నారెడ్డిగారే స్వయంగా, సమర్థవంతంగా నేతృత్వం వహించినారు. డాక్టరు చెన్నారెడ్డిగారి రాజభవన్ కుంభమేళా ప్రాంతానికి తరలి వచ్చినట్లనిపించింది. శ్రీ రెడ్డిగారు, శృంగేరి శంకరాచార్యులవారితో కలిసి గంగానదిలో స్నానం చేసినారు. పవిత్ర కుంభమేళ సందర్భంలో వారిద్దరితోపాటు స్నానాది, పూజాది కార్యక్రమాలలో పాల్గొనే భాగ్యం మాకు కలిగింది. ఈ పవిత్ర స్మృతులు జీవితంలో ఎన్నడూ మరువలేనివి.

లౌకిక రాజకీయ వ్యవహారాలలో తలమునక లవుతున్నప్పటికి ఆధ్యాత్మిక చింతనలో ప్రతినిత్యం నిమగ్నం కావడం చెన్నారెడ్డిగారి వ్యక్తిత్వంలోని విశేషం. చెన్నారెడ్డిగారు ఆత్మబల సంపన్నులు కావడానికి బహుశః వారి దైవభక్తి ప్రధాన కారణం. చెన్నారెడ్డిగారిని ఆదర్శమూర్తిగా భావించి గౌరవించిన మావారు గూడ దైవభక్తులు. హైదరాబాద్ సమీపంలోని కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయ దివ్యక్షేత్రాన్ని పునరుద్ధరించడంలో, అభివృద్ధి పరచడంలో వెంకట్రామారెడ్డి శ్రద్ధాసక్తులతో జరిపిన కృషికి చెన్నారెడ్డిగారి ప్రోత్సాహం ఎంతో లభించింది. కీసరగుట్ట క్షేత్రాన్ని అభివృద్ధిపరచడానికి ముఖ్యమంత్రి పదవి స్వీకరించిన తరువాత డాక్టర్ చెన్నారెడ్డిగారు ఒక సంఘాన్ని ఏర్పాటు చేసినారు. 1978 సం. నవంబరు 16వ తేదీన శ్రీ రెడ్డిగారే పునరుద్ధరణ కార్యక్రమానికి శంకుస్థాపన చేసినారు. ఈ దైవకార్యం మావారి ఆత్మకు ఎంతో తృప్తిని కల్గిస్తుంది.

నా భర్త స్వర్గీయ వెంకట్రామారెడ్డికి, ఆయన సహధర్మచారిణిగా నాకూ పరమపూజనీయులయిన చెన్నారెడ్డి గారు షష్టిపూర్తి చేసుకోవడం అమితానందం కల్గించే చరిత్రాత్మక సంఘటన. ఈ మహత్తరవేళ నుంచి ఇనుమడించిన శక్తి సామర్థ్యాలతో ఈ రాష్ట్రప్రజలకు, ఈ దేశ ప్రజలకు మార్గదర్శకత్వం వహించి చెన్నారెడ్డిగారు జాతీయ, అంతర్జాతీయ యశస్సును గడించగలరని దృఢంగా ఆశిస్తున్నాను. చెన్నారెడ్డిగారికి, వారి సతీమణికి భగవంతుడు ఆయురారోగ్యాలను ప్రసాదించవలెనని ఈ షష్టిపూర్తి శుభ సందర్భాన ప్రార్థిస్తున్నాను.

CSR Memorial Foundation

www.CSRMemorialFoundation.org

# హృదయాంజలి

ఎస్. టి. జ్ఞానానందకవి

నైజాము కాలిక్రింద నలిగిపోయిన
తెలగాణమునకు మేల్పిలుపు నిచ్చి
విజ్ఞానకాంతులొ విద్యార్థులకు నెల్ల
తమితోడ నాయకత్వము వహించి
ప్రజలలో చైతన్య భావాలు రగిలింప
ధైర్యమ్ముతో ప్రబోధనము సలిపి
నిస్స్వార్థపథములో నిరతమ్ము పయనించు
త్యాగమూర్తుల సన్నిధాన మెఱిగి
ఉజ్జ్వలంబైన యుత్సాహ మొలుక నెడద
తెలుగు మాగాణి తెలగాణ వెలుగులకును
పాటుపడిన "చెన్నారెడ్డి" భాగ్యశాలి
కగుత మీ షష్టినా డనంతాభ్యుదయము.

ధీరత్వమ్మున తెల్గుదేశమును దిగ్దేశాలు కొండాడగా
సారథ్యమ్ము వహించి మేల్మి పథకాల్ స్థాపించి పేర్గన్న చె
న్నారెడ్డీంద్రుని నాశ్రయించెడిని యానందోజ్జ్వలాధిక్య సం
భారశ్రీ లవి ముఖ్యమంత్రి కళలై వర్ధిల్లు ధీశాలికిన్.

ఖలమయి నెప్డు "మఱ్ఱి" కులహేళికి గల్గుత నిగ్గు జగ్గులౌ
కలుములు తొల్లి రెడ్డి జనకాంతుల కీర్తి మహాంధ్ర జాతికిన్
విలువగు శాశ్వతంబయిన నిర్మల ధర్మ సమైక్యభావనా
విలసన మీ మహీతలము భేషన, మఱ్ఱికులైకనాథుచే.

ఘనమంతేనియు జంకెరుంగని ఘనుం డీ ముఖ్యమంత్రీంద్రు డిం
పెసలారన్ విజయాభిషేకములతో నెల్లప్పు డారోగ్యపుం
బసతో జీవనముం బొనర్చెడిని యానందావ విశ్వమ్ములో
ససమానం బగు కీర్తి గాంచుచును షష్ట్యబ్దోత్సవశ్రేష్ఠుడై.

అఱువది వత్సరాల వయసైన తెలుంగుల ముఖ్యమంత్రి కిం
కఱువది వత్సరా లగుత మాంధ్రుల భాగ్యము లెల్ల పండి దాం
తరలుగ మందహాసములు తాండవమాడునుగాక యీ మహాం
ధ్రధరకు "మఱ్ఱి" వంశజుని దక్షత గల్గిన పాలనాధృతిన్.

ఎట్టిదైన నమ్మినట్టి లక్ష్యము నెర
వేరు వరకు పట్టు విడువనట్టి
మహితచరితుడైన "మఱ్ఱి చెన్నారెడ్డి"
వసుధ వైభవాల బ్రతుకుగాక!


CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# డాక్టర్ చెన్నారెడ్డి–తెలుగు భాషా సంస్కృతులు

**దేవులపల్లి రామానుజరావు**

---

డాక్టర్ చెన్నారెడ్డిగారి షష్టిపూర్తి ఉత్సవాలు ఆయనకు నాలుగు దశాబ్దాలకు పైగా కార్యక్షేత్రమైన హైదరాబాదు నగరంలో మిత్రులూ, అభిమానులూ కలిసి శోభాయమానంగా జరుపుతున్నారంటే, నాకు ఆనందమూ, ఆశ్చర్యమూ రెండూ కలిగినవి. ఆనందానికి కారణము షష్టిపూర్తి ఉత్సవాలు పెద్ద యెత్తున వైభవోపేతంగా జరుగడమే. ఆశ్చర్యానికి కారణము అప్పుడే ఆయనకు అరువై యేండ్లు నిండినవా అన్న ప్రశ్న— నిజానికి యీనాడు కూడా ఆయనను చూస్తున్నప్పుడు నా దృష్టిలో ఆయన యువకుడుగానే కనిపిస్తారు. నాలుగు దశాబ్దాల క్రింద నేను మొట్టమొదటిసారిగా ఆయనను చూచినప్పుడు, ఆయనలో నాకు కనిపించిన ఉత్సాహోద్రేకాలు, ఎటువంటి క్లిష్ట పరిస్థితులనైనా ఎదుర్కొనడానికి జంకని సాహసము, చొరవ, అందులోనుండి బయట పడుటకు కావలసిన చాకచక్యము, చతురత యీనాడూ ఆయనలో కనిపిస్తున్నవి. ఆయనలో యెక్కడా ముదిమి ఛాయ కనిపించడము లేదు.

నలుబదై సంవత్సరాల క్రిందట హైదరాబాదు నగరంలో మొట్టమొదటిసారి ఆయనను చూడడము తటస్థించింది. బహుశః అప్పుడు ఆయన వైద్య కళాశాలలో యింకనూ విద్యార్థిగా ఉండేవారు. విద్యార్థి దశలోనే ఆయనకు రాజకీయరంగంలో ఆసక్తి, అభిరుచి ఉండేవి. వాస్తవానికి ఆనాటి రాజకీయాలు వేరు; యీనాటి రాజకీయాలు వేరు. ఈ రెండు తరగతుల రాజకీయాలలో ఆయన ఆరితేరిన యోధుడు. అప్పటి కింకా భారతదేశానికి స్వాతంత్ర్యము రాలేదు; హైదరాబాదుపై పోలీసు చర్య జరుగలేదు. ప్రజాస్వామ్యం అవతరించలేదు; దేశ ప్రగతికి కావలసిన ఆర్థిక, సామాజికవిధానాలు రూపొందలేదు.

ఆనాటి ఆంధ్రమహాసభ సమావేశాలలో నేను డా. చెన్నారెడ్డిగారిని చూస్తూ ఉండేవాడిని. సాంస్కృతిక ఉద్యమంగా ప్రారంభమైన ఆనాటి ఆంధ్రోద్యమము క్రమక్రమంగా నిజాం నిరంకుశ పాలననుండి ప్రజల విముక్తికొరకు పోరాడిన జాతీయోద్యమంగా మారి, తరువాత స్టేట్ కాంగ్రెసు ఉద్యమంగా రూపొందింది. ఈ జాతీయోద్యమములోని అన్ని దశలలో డా. చెన్నారెడ్డిగారు ప్రముఖమైన పాత్ర నిర్వహించినారు. ఆంధ్రోద్యమంతోపాటు, గ్రంథాలయోద్యమము ఆనాడు తెలంగాణా రాష్ట్రములోని ప్రజలను మేలుకొలిపినది. ప్రచ్ఛన్న రాజకీయోద్యమమైన గ్రంథాలయోద్యమంతోపాటు యితర సాంస్కృతికోద్యమాలు కూడ కొనసాగినవి. ఈ ఉద్యమాలన్నీ జాతీయోద్యమాలు; స్వాతంత్ర్య పోరాటాన్ని బలపరచేవి కూడ. ఈ ఉద్యమాలన్నిటితోను డా. చెన్నారెడ్డిగారికి ప్రత్యక్ష పరోక్ష సంబంధాలు ఉండినవి. ఈ ఉద్యమాల వ్యాప్తితో ఆయన వ్యక్తిత్వము వికసించినది. విద్యార్థిగా, రాజకీయ నాయకుడుగా, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న యోధుడుగా, పార్లమెంటు సభ్యుడుగా, రాష్ట్రమంత్రిగా, కేంద్రమంత్రిగా, గవర్నర్‌గా, ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఆయన వ్యక్తిత్వము బహుముఖమైనది.

### సాంస్కృతిక రంగంతో గాఢమైన సంబంధం

సాంస్కృతిక రంగంతో ఆయనకు మొదటినుండి గాఢమైన సంబంధము ఉండేది. గొలిగూడలోని "బాలసరస్వతి గ్రంథాలయాని"కి ఆయన కొంతకాలం కార్యదర్శిగా ఉండేవారు. ఈ గ్రంథాలయాన్ని 1967–68వ సంవత్సరంలో నగర గ్రంథాలయ సంస్థ శాఖగా అప్పుడు ఆ సంస్థ అధ్యక్షునిగా నేను స్వీకరించడం జరిగింది. అప్పుడు ఆర్థికమంత్రిగా ఉండిన డా. చెన్నారెడ్డిగారు యీ స్వీకార ఉత్సవానికి ఆధ్వర్యము వహించిన సంగతి ఆయనకు బాగుగా జ్ఞప్తి ఉండవచ్చును. శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయం అభివృద్ధితోకూడ ఆయనకు దగ్గరి సంబంధము ఉన్నదన్న సత్యం హైదరాబాదీయు లందరికీ తెలిసినదే.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

ఇదే విధంగా డా. చెన్నారెడ్డిగారికి పత్రికలతోనూ, పత్రికల నిర్వహణతోనూ, సన్నిహిత సంబంధము ఉన్నది. పోలీసు చర్యకు పూర్వము, పోలీసు చర్యకు తరువాత "హైదరాబాదు" అనే వారపత్రికను ఆయన కొంతకాలం జయప్రదంగా నిర్వహించినారు. ఆనాడు ఆ వారపత్రికను చదివిన పాఠకులకు అందులోని వ్యాఖ్యలు, సంపాదకీయాలు సుపరిచితాలు. వీని వెనుక చెన్నారెడ్డిగారి విశిష్ట వ్యక్తిత్వము తొంగిచూస్తుండేది. పోలీసు చర్య తరువాత మంత్రిగా డా. చెన్నారెడ్డిగారు పని చేసినప్పుడు వారి సలహాతోను, సహకారంతోను, రైతులకు కావలసిన విజ్ఞానాన్ని అందజేసే పత్రిక వెలువడుతుండేది. బహుశః ఆ రోజులలోనే, అనుకుంటాను, తెలుగులో చౌక ధరలకు ప్రజలకు కావలసిన విజ్ఞానాన్ని అందించవలెననే సంకల్పంతో బర్కత్‌పురాలోని ఆయన నివాస గృహంలో జరిగిన కొన్ని సమావేశాలలో యీ వ్యాసకర్త కూడా పాల్గొనడం జరిగింది. ఈ విధంగా ఆయన యెప్పుడు, యే పదవిలో ఉన్నా, యే పోరాటాన్ని నడుపుతున్నా సాంస్కృతిక రంగంతో సంబంధాలు కలిగి ఉన్నారు.

చెన్నారెడ్డిగారికి సన్నిహితులైనవారిలో రాజకీయాలవారేకాక, సాంస్కృతిక రంగాలవారుకూడ ఉన్నారు. చెన్నారెడ్డిగారివలన సహాయం పొందినవారిలో సాహిత్య, సాంస్కృతిక రంగాలకు చెందినవారు ఉన్నారు. గ్రంథ ప్రచురణాది కార్యక్రమాలను ప్రోత్సహించి ఆయన విద్వాంసులకూ, రచయితలకూ తోడ్పడినారు. ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా ఉన్నప్పుడు అక్కడ కొన్ని విశ్వవిద్యాలయాలచేత తెలుగు కవులను, పండితులను ఆహ్వానింపజేసి డాక్టరేట్ సన్మానాలు చేయించినారు. ఈ విధంగా హిందీ ప్రాంతీయులకు తెలుగు విద్వాంసులను, రచయితలను పరిచయం చేయించినారు. అంతేకాక, అనేక సాహిత్య సాంస్కృతిక సంస్థలతో సంబంధము కలిగి వాని అభివృద్ధికి ఆయన తోడ్పడినారు. శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనంగారు సంపాదకుడుగా యేర్పడిన సంగ్రహ ఆంధ్ర విజ్ఞానకోశ సమితికి డా. చెన్నారెడ్డిగారు అధ్యక్షుడుగా అనేక సంవత్సరాలు ఉండినారు. ఈ సంగ్రహ విజ్ఞాన కోశ సమితి పని విజయవంతంగా ముగిసినది. వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థలకు మరికొన్నింటికి కూడ చెన్నారెడ్డిగారి సహాయ సహకారాలు లభించినవి. భవిష్యత్తులో యింకనూ యిటువంటి సహాయ సహకారాలు ఇతోధికంగా లభించగలవని ప్రస్తుతం ఆయన అలంకరిస్తున్న గొప్ప పదవి ఆశాజనకమైన సూచనలు చేస్తున్నది. ఆంధ్ర సాహితీ సంస్కృతుల సర్వతోముఖమైన సమగ్రమైన వికాసానికి చెన్నారెడ్డిగారు భవిష్యత్తులో సంపూర్ణంగా తోడ్పడగలరని అస్మదాదుల అభిలాష. ఈ అభిలాష సత్వర భవిష్యత్తులో ఆచరణ రూపం దాల్చగలదని విశ్వాసం.

## వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే శైలి

చెన్నారెడ్డిగారు వేదికల మీద మాట్లాడుతున్నప్పుడు ఆయన ఉపయోగించే శబ్దజాలము, ఒక ప్రత్యేకమైన శైలి, ఆయన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంటవి. ఆయన నిసర్గ గుణాలైన ఉత్సాహం, ఉద్రేకం, సాహసం, కార్యదక్షత, ఆయన ఉపయోగించే పదజాలంలో మనం స్పష్టంగా చూడవచ్చును. ఇటీవల ఒకానొక సభలో కవీ పండితుడూ అయిన ఒక మిత్రునితో మాట్లాడటం తటస్థించింది. ఆ మిత్రుడు చిరకాలంనుండి వామపక్షాలకు చెందిన రాజకీయవాది కూడ. తెలుగును పరిపాలన భాషగా చేయవలెననీ, తెలుగు భాషలో యెటువంటి అభిప్రాయాలనైన వ్యక్తము చేయవచ్చుననీ, మేము చర్చిస్తుండగా మధ్యలో ఆయన "డా. చెన్నారెడ్డిగారు వేదికలమీద చేసే ఉపన్యాసాలను వింటుంటే తెలుగు భాషకు ఎంతటి శక్తి ఉన్నదో తెలియగలదు" అని వ్యాఖ్యానించారు. 'Style is the man' అన్న సూక్తి సుప్రసిద్ధం. తెలుగు భాషా సాహిత్యాలలో ఆయనకు తగినంత పరిచయం ఉన్నట్లు డా. చెన్నారెడ్డిగారి ఉపన్యాసాలు రుజువు చేస్తున్నవి. ఒక్కమాటలో చెప్పవలెనంటే, ఆయన తెలుగు శైలిలో ఆయన వ్యక్తిత్వాన్ని మనము చూడవచ్చును.

ఈ షష్టిపూర్తి శుభ సందర్భంలో ఆయనకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఆయన మరొక అరువై సంవత్సరాలు సంపూర్ణ ఆరోగ్యంతో జీవించి దేశానికి, ప్రజలకు, సాహిత్యానికి, సంస్కృతికి సర్వవిధాల తోడ్పడి వాని సర్వతోముఖాభివృద్ధికి కారణభూతులు కాగలరని ఆశిస్తున్నాను.

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# డాక్టర్ చెన్నారెడ్డిగారు: భక్తి సంస్కృతి సంప్రదాయములు

దివాకర్ల వేంకటావధాని

---

సంస్కృతి సంప్రదాయములు సర్వ జాతికిని సంబంధించినవి. వానిని పోషించి పెంపొందింపవలసిన బాధ్యత దేశ ప్రజ లందరిపై నుండును. ప్రజల ఆదరాభిమానానుసరణముచే వానికి జీవగఱ్ఱ. పండితులు, పాలకులు, విజ్ఞానవేత్తలు, వర్తకులు, మతాధిపతులు, రాజనీతిజ్ఞులు, అధికారులు—వారువీ రననేల, సర్వ ప్రజలును వాని ప్రగతి ప్రచారములకు తోడ్పడుచుందురు. సాధారణముగా నీ విషయమున నుత్తముల ఆచార ప్రవర్తన లన్యుల కాదర్శప్రాయములుగా నుండును. "యద్య దాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరోజనః" అను గీతావాక్య మిందుకు ప్రమాణము. భారత దేశమున పూర్వపు మహారాజులు రాజకీయోన్నతికివలెనే సంస్కృతి సంప్రదాయ సంవర్ధనమునకును పాటుపడి యుండిరి. వారి పోషణమే వేదశాస్త్రము లింతవరకును చెక్కుచెదరక నిల్చియుండుటకు కారణము. జనకాదులు రాజనీతిజ్ఞులుగా నెంత ప్రముఖులో సంస్కృతి సంప్రదాయ పరిపోషకులుగా కూడ నంత ప్రసిద్ధులు. అంబరీషుని భక్తి ప్రపత్తు లాతని రాజకీయ పరిజ్ఞానమును మరుగు పుచ్చినవి. మన ముఖ్యమంత్రి, ప్రియతమ నాయకులు, డా. చెన్నారెడ్డిగారియందు దేశభక్తి, రాజకీయ పరిజ్ఞానము, కార్య దక్షత మున్నగు లౌకిక గుణములతోపాటు భక్తిప్రపత్తులు, సంప్రదాయాభిమానము, భారతీయ సంస్కృతి సంరక్షణ పరాయణత మొదలైన ఆధ్యాత్మిక గుణములు కూడ జతపడి యుండుట యొక విశేషము. వారెంత రాజకీయజ్ఞులో అంత భక్తిసంపన్నులు; ఎంత సంప్రదాయాభిమానులో అంత సంస్కృతి పరిపోషకులు.

మానవు లాచరించు కార్యములు విజయవంతములగుటకు దైవ పౌరుషములు రెండును సమకూడవలయును. వానిలో నేది లోపించినను కార్యము సాఫల్యము పొందనేరదు. ఈ విషయమును పురాణములు కృషి వ్యాపారమును నిదర్శనముగా చెప్పుచుండును. కర్షకుడు పొలము దున్నును, రాలురప్పలు తీసివేయును, నేల చదును చేయును, విత్తనములు చల్లును. కాని, సకాలమున వర్షము పడనిచో నతని శ్రమ యంతయు వ్యర్థమగును. వర్షపాతము దైవకార్యము. వర్షము కావలసినంత పడును. కర్షకు డలసుడై కర్తవ్యమును మాని కూర్చున్నచో వర్షము పడినందుకు తగిన ఫల మాతడు పొందజాలడు. కర్షక వ్యాపారము పౌరుషము. దైవ పౌరుషములు రెండింటిని సమానముగా నారాధించు జనుడు సర్వకార్యములందును విజయమును పొందజాలును. శ్రీ డాక్టరుగారు దైవమును కాని పౌరుషమును కాని విడువక సర్వకార్యములను సమగ్రముగా సాధింపగల ప్రజ్ఞాశాలురు.

"సాత్వస్మిన్ పరమప్రేమరూపా" అని భక్తికి పెద్దలిచ్చిన నిర్వచనము. భగవన్నిష్ఠమైన అచంచల ప్రేమతో కూడిన చిత్తవృత్తికే భక్తి యని పేరు. శ్రీ డాక్టరుగారి హృదయము మట్టి భక్తికి నిదానము. వారు శివుని కాని కేశవుని కాని శక్తిని కాని "తను హృద్భాషల సఖ్యముతో" నారాధింతురు. శివశక్తులకు భేదము లేదు. "న శివేన వినా దేవీ, దేవ్యాచ వినా శివః నైతయో రంతరం నాస్తి చంద్ర చంద్రికయో రివ" అను శ్లోకము ఇందుకు తార్కాణము. అట్లే శివ కేశవులకును నామరూపములందే కాని తత్త్వమునందు భేదము లేదు. "ఏకం స ద్విప్రా బహుధా వదంతి" అని ఋగ్వేదము గొంతెత్తి చెప్పుచున్నది. ఈ సత్యమును గ్రహించినవారు శ్రీ డాక్టరుగారు. వారు శ్రీశైల మల్లికార్జున స్వామిని, తిరుమల శ్రీ వేంకటేశ్వరుని, శ్రీ భ్రమరాంబికాదేవిని, శ్రీ మంగతాయారును, యాదగిరి శ్రీ లక్ష్మీ నృసింహస్వామిని సమాన భక్తితో నారాధింతురు. పై నామములు నుదాహరణమునకు మాత్రమే చెప్పితిని. వారే దైవతమునైన చిత్తశుద్ధితో పూజించి అనుగ్రహమును



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

కాంక్షించుచురు. శ్రీశైలమునందును, యాదగిరి యందును వారి నెందు రెండు పర్యాయములు స్వయముగా చూచి వారి భక్తి ప్రపత్తుల కెంతయో సంతసించి యుంటిని. వారి యింట శ్రీదేవి—ఈమెనే చండి, లలిత, రాజరాజేశ్వరి, త్రిపురసుందరి అను నామములతో సేవ్యనుచుందురు—నిత్య పూజార్చనలు జరుగుచుండునని వింటిని. అపారమైన పూర్వసుకృతము చేసిన హృదయమున భక్తిభావము అంకురించును. శ్రీ డాక్టరుగారి హృదయము భక్తి భావతరంగములకు సముద్రము. మహాత్ముడు గాంధీజీ రాజకీయములలో వలెనే భక్తి భావమున కూడ నగ్రగణ్యుడు. ఆయన జిహ్వపై నిత్యము రామనామము తాండవించుచుండెను. మానవులు లౌకికకార్య నిమగ్నులై యుండియు మహాభక్తులై యుండవచ్చును. భక్తికిని భావాంతరములకును వైరుధ్యము లేదు. శ్రీ డాక్టరుగా రన్యకార్యములపైనే క్షేత్రములకు గాని ఆశ్రమ స్థలములకు గాని, అరిగినప్పుడు ఆ క్షేత్రము లందలి దైవతములను దర్శించి పూజించకుండ రారు. భారత దేశమున బదరీనారాయణము నుండి కన్యాకుమారి వరకును వారు దర్శించని క్షేత్రములు కాని దైవతములు కాని యుండవని నా విశ్వాసము. "న మే భక్తః ప్రణశ్యతి" అని భగవానుని అనుగ్రహ వాక్యము. ఆ అనుగ్రహము శ్రీ డాక్టరుగారి యెడల పుష్కలముగా కలదు. కారణము వారి హృదయమునం దాదాల్యనిష్ఠమై యున్న నిర్మలభక్తి.

## దేశభక్తి, దైవభక్తి

రాజకీయవేత్తలలో దేశభక్తి దైవభక్తులు సమభాగములుగా నుండువా రరుదుగా కానిపింతురు. అట్టి వారిలో శ్రీ డాక్టరుగా రొకరు. రంగారెడ్డి జిల్లాకు చెందిన మార్పల్లి గ్రామమున వారు శ్రీ సంగమేశ్వర స్వామి దేవాలయ పునర్నిర్మాణమునకు పూనుకొని యందు సుమారు మూడు గంటలసేపు మహాన్యాసపూర్వకముగా రుద్రాభిషేకము కావించి యుండిరి. ఆ ఆలయము వారి చేతనే నిర్మింపబడినది. అందు శ్రీ కంచి కామకోటి శంకరాచార్యులవారు శివలింగమును ప్రతిష్ఠించి యుండిరి. శ్రీ డాక్టరుగా రాలయ పునర్నిర్మాణ సందర్భమున శివపార్వతుల కల్యాణము నత్యంత వైభవముతో జరిపించి, తరువాత సాంస్కృతిక కార్యక్రమములో పాల్గొన్న కళాకారుల నుదారముగా సత్కరించి యుండిరి. వా రుత్తర ప్రదేశ రాష్ట్ర పాలకులుగా నున్న తరి వారణాసి యందలి విశ్వేశ్వరుని, బదరి యందలి నారాయణుని భక్తిపూర్వకముగా నారాధించి యుండిరి. లౌకికాధ్యాత్మిక రంగముల రెండింట సమానాదరాభిమానములు చూపుట శ్రీ డాక్టరుగారి యందలి విశిష్టత.

శ్రీ డాక్టరుగారికి జ్యోతిషమునందును ఆగమశాస్త్రమునందును గాఢమైన అభినివేశము గలదు. జ్యోతిష జాతక ఫలాదుల విషయమున వారు కూలంకషమైన పరిజ్ఞానముతో పండితుల చర్చలందు పాల్గొందురు. శ్రీ డాక్టరుగారు ముఖ్యమంత్రిగా ఏకగ్రీవముగా ఎన్నుకొనబడినప్పుడు వృషభలగ్నమున ప్రమాణస్వీకారము జరిగియుండెను. ఈ లగ్నము మంత్రివర్గము సుస్థిరముగా సాగుటకు తోడ్పడునని జ్యోతిశ్శాస్త్రజ్ఞుల అభిప్రాయము. ఆగమశాస్త్రము దేవాలయ నిర్మాణ విగ్రహ ప్రతిష్ఠాదికములను గూర్చి చెప్పును. శ్రీ డాక్టరుగారికీ శాస్త్రముతో సువిశదమైన పరిచయము కలదు. ఒక దేవాలయమున విగ్రహప్రతిష్ఠ జరుగుచుండగా వారు సతీసమేతముగా వచ్చి జలాధివాస ధాన్యాధివాసములు జరిగినవా లేదా యని ప్రశ్నించుట నే నెరుగుదును. ఆగమశాస్త్ర పండితులకు తప్ప నా సంప్రదాయము తెలియదు.

పదేండ్ల క్రింద శ్రీశైల మహాక్షేత్రమున నవరాత్రి సందర్భమున హైదరాబాదు నందలి శ్రీ విద్యా సేవా సమితి వారు శత సహస్ర చండీయాగమును యథాశాస్త్రముగా నిర్వహించి యుండిరి. ఆ సందర్భమున శ్రీ డాక్టరుగారు యాదృచ్ఛికముగా శ్రీ భ్రమరాంబా మల్లికార్జునుల సేవించుటకై యరుదెంచి యాగము జరుగుచున్నదని విని అనుచరులతో దానిని దర్శించుటకు వచ్చియుండిరి. అందు నూటయేబది మంది ఋత్విజులు సర్వపూజాపారాయణములను గావించి యుండిరి. శ్రీ డాక్టరుగారు వచ్చిన దినమున పూర్ణాహుతి జరుగుచుండెను. ఆ కార్యక్రమము పూర్తి అగుటకు రెండు మూడు గంటల కాలము పట్టెను. శ్రీ డాక్టరుగారు పూర్ణాహుతి కార్యక్రమము పూర్తియగు వరకు నచ్చట భక్తితో కూర్చుండి చివర తీర్థ ప్రసాదములు స్వీకరించి యరిగి యుండిరి. ఇది వారి యాధ్యాత్మిక ప్రవృత్తికిని, దైవభక్తికిని, యజ్ఞయాగాది కర్మ కలాపములందలి ప్రీతికిని తార్కాణము.

## సంస్కృతిరక్షణపరాయణత

భారతదేశమున ననేక మతము లున్నవి. హైదరాబాదు నగరమున ద్వైతాద్వైత విశిష్టాద్వైత పీఠములైన త్రైమత



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

మహమ్మదీయాది సర్వమతములకును చెందిన ప్రజ లున్నారు. ఆ మతములకు సంబంధించిన దేవాలయములు, మఠములు, మసీదులు, మందిరములు (Churches) అనేకము లున్నవి. అప్పట వారియా పర్వదినములలో ఉత్సవాదులు జరుగు చుండును. అప్పటికి మఠాధిపతులు, ప్రవక్తలు, మతాధికారులు తరచుగా నరుదెంచుచుందురు. అట్టి సందర్భములం దాయా మతములవా రాహ్వానించినప్పుడు శ్రీ డాక్టరుగా రెన్నిపను లున్నను అప్పటి కరిగి సర్వమత సామరస్యమును గూర్చియు, దైవభక్తిని గూర్చియు నుపన్యసించి వారికి ప్రోత్సాహము కల్గించుచుందురు. అద్వైత మతస్థాపకులైన శ్రీ శంకరాచార్యుల వారు భారతదేశమున నలుమూలలందును మఠములను స్థాపించి యుండిరి. వానిలో శృంగేరి, కంచి, పూరి, ద్వారక, బదరి మున్నగుచోట్ల గల మఠములు సుప్రసిద్ధము లైనవి. అవిగాక పుష్పగిరి, గుంటూరు మొదలైన ప్రదేశములందు కూడ శంకర మఠము లున్నవి. ఇవిగాక పలుచోట్ల మహనీయులచే స్థాపితములై నిర్వహింపబడుచున్న ఆశ్రమము లనేకము లున్నవి. శ్రీ డాక్టరుగారు వాని నన్నిటిని దర్శించి ఆయా మఠాధిపతుల ఆశీర్వచనముల నంది వచ్చుచుందురు. వా రేమతమునకు సంబంధించిన వారైనను జంట నగరముల కరుదెంచి నప్పుడు శ్రీ డాక్టరుగారు వారి దర్శనము తప్పక చేసికొందురు. కంచి కామకోటి పీఠాధిపతుల సమక్షమునను, ఇతర పీఠాధిపతుల రాక సందర్భమునను వా రొసంగిన యుపన్యాసములు వారి మతాసక్తికిని, సంస్కృతి పరిరక్షణపరాయణతకును గురుభక్తికిని తార్కాణములు.

భారతీయ సంస్కృతి సంపదకు మూలకందములు వేదములు. స్మృతిశాస్త్ర పురాణాదు లన్నియు వేదార్థోప బృంహణార్థమై వ్రాయబడినట్టివే. ఆంధ్రదేశముననే కాక భారతదేశమం దంతటను వేదశాస్త్రాదుల నభ్యసించువారి సంఖ్య క్రమముగా సన్నగిల్లిపోవుచున్నది. అందు కందు నిష్ణాతులైన వారికి సరియైన పోషణము లేకపోవుటయే కారణము. శ్రీ డాక్టరుగారు వేదశాస్త్ర పండితుల పోషణమునకై వారికి గౌరవభృతి నేర్పరచుటకై పూనుటయే కాక వేదశాస్త్రాదులను, అన్యములైన మత గ్రంథములను అర్థతాత్పర్యములతో ముద్రించుట కొక బృహత్ప్రణాళికను సూచించియున్నారు. అది యింక కొలది దినములలోనే కార్యరూపము పొందనున్నది. అందువలన సనాతన మత గ్రంథము లన్నియు జిజ్ఞాసువుల కందుబాటులో నుండుటయు, వాని నెల్లరును పఠించి మతతత్త్వము నెరుంగుటయును సంభవించును. ఈ కార్యక్రమము ప్రజలలో మత ధర్మాసక్తినే గాక నీతినియమ ప్రవృత్తిని కూడ పెంపొందించు ననుటకు సందేహము లేదు. ఈవిధముగా శ్రీ డాక్టరుగారు భారతీయ సంస్కృతి సంవర్ధనమున కొనరించుచున్న దోహదము ప్రశంసాపాత్రమైనది. వేదములు ధర్మమూలములు. "ధర్మో రక్షతి రక్షితః."

శ్రీ డాక్టరుగారు ఉత్తరప్రదేశ రాష్ట్రపాలకులుగా నుండినప్పుడు వేదశాస్త్రములయు భారతీయ ధర్మ సంస్కృతుల యొక్కయు పరిరక్షణకై శ్రీ ఆనందమాయి ప్రేరణమున నొక గొప్ప కార్యక్రమమును తలపెట్టియుండిరి. నైమిశారణ్యమున నొక ఆశ్రమమును స్థాపించి వేదశాస్త్రములందు నిష్ణాతులైన మహాపండితుల నన్ని ప్రాంతముల నుండి యచ్చటి కాహ్వానించి వారిచే వేద శాస్త్రాదులను పరిష్కరింపజేసి ఆర్షధర్మమును ప్రచారము నేయించుట యందలి ప్రధానోద్దేశము. ఆ సందర్భమున హైదరాబాదులో శ్రీ కాశీదాసుగా రొక సమావేశము నేర్పాటుచేసి యుండిరి. శ్రీ డాక్టరుగా రందు సతీ సమేతముగా పాల్గొనియుండిరి. ఆనాడు వారు కావించిన మహోపన్యాసము చిరస్మరణీయమై వారికి సనాతన ధర్మోద్ధరణమున గల ఉత్కంఠతను వేయివిధముల సూచించుచున్నది.

## సంప్రదాయ సమాదరణము

శ్రీ డాక్టరుగారి కనూచానములైన భారతీయ సంప్రదాయములయెడ గల యాసక్తి అనన్య సాధారణమైనది. వా రాంధ్రప్రదేశ ముఖ్యమంత్రి పదవి నధిష్ఠించిన పిమ్మట కాళయుక్తి సంవత్సరాది వచ్చినది. శ్రీ డాక్టరుగారు జన్మించిన సంవత్సరము కూడ కాళయుక్తియే. వారికి షష్ట్యబ్దిపూర్తియైన పిమ్మట వచ్చిన మొదటి సంవత్సరాది యది. ఆనాటి సాయంకాలము గ్రీనులాండ్సులో సంవత్సరాది సభ జరిగినది. ఆ సభకు మంత్రులు, అధికారులు, అనధికారులు, పెద్దలు పలువు రరుదెంచిరి. ఆ కార్యక్రమమున పంచాంగశ్రవణము, వైదికాశీర్వచనము, కవిసమ్మేళనము ముఖ్యాంశములు. పంచాంగ శ్రవణము సుమారు నలుబదియైదు నిమిషములు జరిగినది. పిమ్మట వైదికాశీర్వచనము; అనంతర మాశీఃపూర్వక పద్య పఠనముతో కూడిన కవిసమ్మేళనము. శ్రీ డాక్టరుగారు సుమారు మూడు గంటలసేపు సతీసమేతముగా కార్యక్రమ



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

మంతయు పూర్తియగునంతవరకు కూర్చుండి వేదపండితులయు కవులయు నాశీస్సులను పొందియుండిరి. ఇది యంతయు వారికి సంప్రదాయమునందు గల అభిమానమును సూచించును. సంవత్సరాదినాడు పంచాంగశ్రవణము చేయుట భారతీయ సంప్రదాయము కదా! ఆనాటి సభ సంస్కృతి సంప్రదాయ సనాతన ధర్మ సౌరభ సంభరితమై కన్నులపండువుగను వీనుల విందుగను ఉండెను.

శ్రీ చెన్నారెడ్డిగారు మేధాసంపన్నులు, కార్యాచరణ దక్షులు, దేశ దైవభక్తి సంపన్నులు, రాజకీయవేత్తలు, సనాతన ధర్మసంస్కృతి సంప్రదాయ సంస్కారాభిమాన సంపన్నులు. వారు పలు రంగములందు అనేక పదవుల నధిష్ఠించిరి. అనేక ఘనకార్యము లాచరించిరి. దేశమాత పుత్రరత్నములలో నగ్రగణ్యు లను ప్రశస్తి గాంచిరి. దైవకృపచే నిప్పుడు షష్ట్యబ్ది పూర్తి మహోత్సవమును జరుపుకొనుచున్నారు. వారు దేశమునకును, రాష్ట్రమునకును, ధర్మమునకును, సంస్కృతి సంప్రదాయములకును, చేయవలసిన సేవ యెంతో యున్నది. సర్వజగన్నాథుడైన పరమేశ్వరుడు వారి కాయురారోగ్యైశ్వర్యములను సమకూర్చి వారిచే వితోధికములైన మహాకార్యములను చేయించుగాక!





CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org



డా. ఎం. చెన్నారెడ్డిగారి మేనమామ, ఆంధ్ర ప్రదేశ్ మాజీ ఉపముఖ్యమంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డిగారు



శ్రీ పి. శ్రీనివాసరెడ్డిగారు

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org



లక్నో రాజ్‌భవన్‌లో మనుమలు కృష్ణ, ఆదిత్యలతో

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org



నాట్యకళ అభ్యసించడానికి ముందు పూజాసమయంలో మనుమరాలు రేఖాశిని ఆశీర్వదిస్తున్నప్పుడు



"గురువందనం"



తొలిపాఠం.

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# గంగా గోదావరీ సంగమం

సి. నారాయణరెడ్డి

కవిత కాదు కాదిది, తెల్ల
కాగితంలాంటి వాస్తవికత.
ఆ మధ్య జరిగిన ఒక ఘటన
అక్షరాలుగా పొదిగిన శం రచన.

స్వరిస్తున్నది ఒక గళం ధీరంగా
శిరమూపుతున్నది సదస్సు ఉదారంగా
"ఎన్నాళ్ళు కీర్తిస్తారు మీరు
గంగా యమునల సంగమాన్ని
ఎప్పుడైనా తలచుకున్నారా
గోదావరినీ కృష్ణవేణినీ.

కలపండి ఆ గోదావరిని
గంగాభవానితో.
పలకండి విభిన్నభారతిని
పరమైక్యవాణితో."

అది—మీరట్ యూనివర్సిటీలో
ఉదయించిన అపూర్వఘట్టం.
అందుకుంటున్నాను నే నప్పుడు
అవనతాత్మతో డి. లిట్ పట్టం.

ఇంతకూ ఆ స్వర మెవరిది ?
చెప్పనా ? మన చెన్నారెడ్డిది.
ఒళ్లంతా విద్యుదావేశం
వెల్లివిరిసే జలపాతానిది.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# శిఖరిణీ ప్రణతి

ఉత్పల సత్యనారాయణాచార్య

అహో చెన్నారెడ్డీ ! సకలజన మాన్య ప్రతినిధీ !
మహాంధ్రాఖ్య క్ష్మాభరణ విలసన్నాయక మణీ !
సుహృద్భావ ప్రాజ్యచ్ఛవి సహృదయ శ్లాఘ్య సుమతీ !
మహానందం బొప్పన్ మనుము మరి నూఱేండ్లు జగతిన్.

స్వరాష్ట్రోద్యోగాలం గలుగు సమమానత్వపు స్థితిన్
దురన్యాయం బంధం దలచి తొలగింపం దలచితే
చిరాయుర్భాగ్యంబున్ గనుము సకలామోదనవహో
ధురీణాశీర్వాదస్తుతిఁ బడసి చెన్నాఖ్య సచివా !

పటిష్ఠంబౌ శ్రీమత్తిరుమల పరంధామ కరుణా
కటాక్షం బెంతేనిం బడయువలె నీ వెల్ల సిరులన్
జటాలార్ద్రచ్ఛాయాపటల ఫలశాఖావళులతో
వటక్ష్మాజం బట్లే వఱలవలె నీ మంత్రి కొలమున్.





CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# దక్షిణోత్తరాల సౌజన్య సేతువు

**కప్పగంతుల లక్ష్మణశాస్త్రి**

"ఒక ధర్మము, ఒక వర్తన
ఒక భావన, ఒక్క మతము, ఒక్క జనంబై
ఒక సంప్రదాయము, మొక్కటై
సకలంబగు భారతంబు, సంస్కృతి యొకటే."

ఈ భావము ఏ కొద్దిమందిలో ఉండును. డా. చెన్నారెడ్డిగారు ఈ కోవకు చెందినవారు. ఆయన నూతనముగా రాజకీయములలో ప్రవేశించిన నాటినుండి ఆయనను నే నెరుగుదును. ఆయన ప్రజల శారీరక రోగములకు మాత్రమే చికిత్స చేయలేదు. దేశమునకు, రాష్ట్రమునకు పట్టిన పారతంత్ర్య రోగమునకు గూడ చిన్న చిన్న చికిత్సలు చేయుచు, చివరకు నిజాం రాజ్యపు నిరంకుశ పరిపాలన రోగమునకు జనుల పారతంత్ర్య రోగమునకు బానిస తనపు రోగమునకు పూర్తిగా శస్త్ర చికిత్స చేయువరకు నిరంతరము కృషి చేయుచుండిరి. 1948 సెప్టెంబరులో రాష్ట్ర ప్రజలకు పూర్తి స్వాతంత్ర్యము సిద్ధించిన తరువాత ఆయన శాంతముగా విశ్రమించినారు. రాజ్యమునందు రజాకార్ల దురంతములును, ఇత్తెహాదుల్ ముసల్మీన్ వంటి సంస్థల పూర్తిగా నిర్మూలించు వరకు డాక్టరుగారు విశ్రమించలేదు. చివరకు సైనిక చర్య జరుగుట—రాజ్యమునందు శాంతి స్థాపన జరుగుట కన్నుల పండువుగా చూచి శాంతించిరి.

ఆ తరువాత, హైదరాబాదు రాజ్యములో సైనిక ప్రభుత్వ స్థాపన జరిగెను. కాంగ్రెసు నాయకులుగా నున్న డాక్టరుగారు, కీ. శే. బూర్గుల రామకృష్ణారావుగారు, కీ. శే. కొండా వెంకటరంగారెడ్డిగారు కలిసి జీపులో జనగామ వద్ద నున్నన్న పేటలో జరిగిన ఒక సాహిత్య సమావేశములో పాల్గొనుటకు పోయిరి. వారితో నేను గూడ అక్కడ సాహిత్యోపన్యాసము చేయుటకు ఆ జీపులో వారితో పోయినాను. అప్పుడు దారిలో పంటకళ్ళాల బండ్లు బారుగా పోవుచుండెను. సైనిక ప్రభుత్వ కాలమునందు ఇతర ప్రాంతముల నుండి పోలీసులను తెచ్చి, యిక్కడి జిల్లాలలో వారిని ప్రభుత్వము నియమించి యుండెను. అప్పు డాపోలీసులు దారిలో ఆ కళ్ళాల బండ్లను ఆపి ఒక్కొక్క పోలీసు జవాను పద్దెనిమిది కట్టలు చొప్పున బండ్లవారు అరచుచున్నప్పటికిని లెక్కచేయక బండ్ల నుండి లాగి తీసుకొనుచుండిరి.

ఆ సమయమునందు, మా జీపు అక్కడికి పోయెను. అందులోని నాయకులను బండ్లవారు గుర్తుపట్టి "దొర! చూడండి, గొర్లు తినే రజాకారులు పోయి, గొడ్లు తినే వాళ్ళు వచ్చినరు" అని యేడ్చుచు నాయకులకు మొరపెట్టుకొనిరి. అప్పుడు డాక్టరుగారు జీపులో నుండి యొగిరి దూకి, ఆ పోలీసులను గద్దించి భయపెట్టి వారిని ఆ దుష్కృత్యము నుండి ఆపిరి. పోలీసులు గూడ, ఈ నాయకులను చూడకున్నను, వీరి పేర్లు వినినవారు కాబట్టి, వీరి పేర్లు వినగానే భయపడి వీరి కాళ్ళపైబడి క్షమింపుడని వేడుకొనిరి. అప్పుడు ఆ బండ్లవారిని ఆ కష్టము నుండి కాపాడిన గౌరవము డాక్టరు గారికి దక్కినది. మా జీపు ఆ స్థలమునకు పోయినతోడనే పోలీసులు జీపువద్దకు వచ్చి "అయ్యా! చూడండి, వీరిని రజాకార్లు ఏమి చేసినను, ఊరుకున్నారు గాని, మేము రెండు కళ్ళాలు తీసికొనగానే, ఈవిధముగా మమ్ము తిట్టుచు ఏడ్చుచున్నారు. వీరు అన్నవారికే అణగియుందురు" అని యనిరి. ఆపైన డాక్టరుగారు వారిని కోపించి బండ్లవారికి న్యాయము చేసిరి. రామకృష్ణారావు, రంగారెడ్డిగార్లు డాక్టరుగారి చాతుర్యమును ప్రశంసించిరి.

డాక్టరుగారికి సంస్కృత విద్యపై మిక్కిలి ప్రేమ. వారు కేంద్ర ప్రభుత్వమునందు ఉక్కు మంత్రిగా నున్నప్పుడు నేను ఢిల్లీకి పోయి వారిని దర్శించి యిక్కడ సంస్కృత పాఠశాలలకు కేంద్రం ఇచ్చు గ్రాంటు చాలా



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

లాభముగా సుమారు రూ. 40,000 లు ఆగిపోయి ఉండిన దానిని ఇప్పించుమని కోరగానే, కాదనక, తమకు సాధ్యమైనంతలో సహాయము గట్టిగా చేసినట్టి అమృతహృదయులు వారిది. తాము న్యాయమని తలచిన పనిని గట్టిగా చేసి, దానిని నెరవేర్చుటలో వారికి వారే సాటి.

ఉత్తరప్రదేశ్‌లో డాక్టరుగారు గవర్నరు (యూనివర్సిటీస్ ఛాన్సలర్) విశ్వవిద్యాలయముల కులపతిగా నున్నప్పుడు వారే కాక, ఆంధ్రులే కాక దక్షిణ భారతీయు లెందరికో గౌరవ బిరుదములను అక్కడి పలు యూనివర్సిటీల నుండి యిప్పించి సత్కరించినారు. శ్రీ వానమామలై వరదాచార్యులకు కాశీ సంస్కృత విశ్వవిద్యాలయములో 'విద్యావాచస్పతి' (డి. లిట్.) గౌరవోపాధిని 17–2–76 నాడు ఇప్పించినారు. శ్రీమతి యశోదారెడ్డికి, డా. దాశరథి కృష్ణమాచార్యులకు ఆగ్రా విశ్వవిద్యాలయములో డి. లిట్. ఉపాధిని 26–2–76 తేదీన ఇప్పించినారు. డా. బోయి భీమన్నకు, కాశీ విద్యాపీఠమునందు (గాంధిజీ కాశీలో స్థాపించినది) డి. లిట్. ఉపాధిని ఇప్పించినారు. డా. సి. నారాయణరెడ్డికి మీరట్ విశ్వవిద్యాలయములో డి. లిట్. గౌరవోపాధిని 24–2–1976 న తేదీన ఇప్పించినారు. అనాడే కొందరు కర్ణాటక పండితులకు గూడ గౌరవ డి. లిట్. ఉపాధిని ఇప్పించినారు. కర్ణాటకములో సుప్రసిద్ధ రచయిత శ్రీ శివరామకారంతుకు డి. లిట్. ఉపాధిని ఇప్పించిరి. ఇలాగే, శ్రీ బేంద్రే అను కర్ణాటక విద్వాంసునికిని మరికొందరు కర్ణాటక విద్వాంసులకును, మీరట్ యూనివర్సిటీలో పరోక్షముగా (వారు కాన్వొకేషన్‌కు హాజరు కాలేకపోయినను) గౌరవ డి. లిట్. ఉపాధిని ఇప్పించినారు. శ్రీ రామమూర్తి 'రేణు' (హైదరాబాద్ ఆకాశవాణి హిందీ శాఖాధికారి) గారికి రోహిల్‌ఖండ్ విశ్వవిద్యాలయములో గౌరవ డి. లిట్. ఉపాధిని ఇప్పించినారు.

ఈవిధముగా డాక్టర్‌గారు దక్షిణ భారత విద్వాంసులను ఉత్తర భారతీయ విశ్వవిద్యాలయములలో గౌరవపట్టప్రదానములు చేయించి సత్కరించినారు. వీరందరు డాక్టర్ చెన్నారెడ్డిగారిని మనసార స్మరింతురు, మనస్సులోనే వారికి కృతజ్ఞతలు హృదయపూర్వకముగా తెలుపుకొనుచుందురు. ఉత్తరప్రదేశ్‌లో నివాసముగా నున్న ఆంధ్రు లందరికి డాక్టర్‌గారు పెద్దదిక్కుగా నుండిన విషయము నాకు తెలియును. ఆంధ్రులకే కాక, దక్షిణ భారతీయులైన పండితులు ఆంధ్ర, కర్ణాటక తమిళులు అక్కడ స్థిరపడిన వారికి, అడిగినదే తడవుగ, ఎంతో సహాయము, ఎన్ని రంగములలోనో సహాయము చేసిరి. ఎన్ని అడ్డంకులు, ఆక్షేపణలు వచ్చినప్పటికిని హిమాలయమువలె గట్టిగా నిలిచి, తాము న్యాయమని తలచిన కార్యమును చేయు దీక్ష డాక్టర్ గారిలో ఎక్కువగా నున్నట్లు ప్రత్యక్షముగా నేను తెలుసుకొనినాను.

## ఉత్తర భారతములో డాక్టరుగారి విద్యాసేవ

బనారస్ హిందూ విశ్వవిద్యాలయములో తెలుగు శాఖ ఉన్నది గాని, దానికి ఆచార్య పీఠము లేదు. తెలుగు రీడర్‌గా డా. బయ్యా సూర్యనారాయణగారు ఉన్నారు. అది కేంద్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయము. దానితో డాక్టరుగారికి ప్రమేయము లేకున్నను, అక్కడ తెలుగుకు ఆచార్య పీఠమును ఏర్పరచుటకు వారు కృషి సలిపి తెలుగుకు ఆచార్య పీఠము స్థాపింపబడుటకు దోహదకారు లైనారు.

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వము పక్షమున వారి సంస్కృత విద్యాపీఠము (సంస్కృత అకాడమి) స్థాపించుటకు డాక్టర్‌గారు కారకులైనారు. అక్కడి 'హర్దోయి' జిల్లాలోని 'సహావర్'లో సంస్కృత కళాశాలకు ఎంతో సహాయము చేసినారు. ఇట్లే అక్కడి సంస్కృత–హిందీ–ఉర్దూ సాహిత్య సంస్థల కెన్నింటికో వీరు ప్రేమచేత సహాయము చేసిన దృష్టాంతములు నాకు తెలియును.

కాశీలోని సంస్కృత విశ్వవిద్యాలయమునకు కూడ డాక్టర్‌గారు కులపతి (ఛాన్సలర్) కాబట్టి దాని యభివృద్ధికిని, దాని ప్రాచీన గ్రంథాలయాభివృద్ధికిని ఎంతయో దోహదము కల్పించిరి. కాశీలో నున్న సంస్కృత ప్రచార కార్యాలయము (సార్వభౌమ సంస్కృత ప్రచార సంస్థ) ను డాక్టర్‌గారు దర్శించి, అక్కడ దాని సంచాలకుడైన పండిత శ్రీ వాసుదేవ ద్వివేది శాస్త్రిచేత సన్మానించబడి ఆ సంస్థ యభివృద్ధికి సహాయము చేసిరి.

బనారస్ హిందూ విశ్వవిద్యాలయములో డా. వాసుదేవశరణ్ అనువారు సంస్కృత ప్రాచార్యుడు (ప్రొఫెసరు)గా నుండిరి. ఇప్పుడు వారు కీర్తిశేషు లైనారు. వారు అఖిలభారత సంస్కృత విద్వాంసులలో అగ్రశ్రేణికి చెందినవారు. వారి


CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

తమ్ముడు శ్రీ కృష్ణమురారి అగ్రవాల్ అనువారు ఇప్పుడు లక్నోలో నున్నారు. ఆయన తన అన్నగారి సంస్మరణార్థము ప్రతి యేడు పండితులతో ఉపన్యాసములు చేయించుచు, వారిని సత్కరించుచుందురు. 1976వ సంవత్సరములో ఆ సమావేశమును ప్రారంభించుటకు గవర్నర్ డాక్టర్ చెన్నారెడ్డిగారిని వారు ఆహ్వానించినారు. డాక్టర్‌గారు దానికి ప్రారంభోపన్యాసము ఆంగ్ల భాషలో చేసినారు. ఆ యుపన్యాసమును శ్రీ కృష్ణమురారి అగ్రవాల్‌గారు టేప్ రికార్డు చేసి తమ దగ్గర ఉంచుకున్నారు. ఆ ప్రారంభోపన్యాసము ఎంతయో పాండిత్య పరిపూర్ణముగాను, అనేక తత్త్వశాస్త్రీయ విషయ సంకలితముగాను, వివిధ సాహిత్య శాఖా పరిశోభితముగాను నుండెను. అరగంటకు పైగా ఆ యుపన్యాసము వినుటలో నిమగ్నుడనై డాక్టరుగారి వివిధ విషయ పరిజ్ఞానమునకు బ్రహ్మానంద మందితిని. వారిని ప్రశంసించుచు నేను ఒక ఉత్తరము గూడా వారికి వ్రాసితిని. ఆ యుపన్యాసము అంత ఉత్కృష్టమైనది కనుకనే, శ్రీ కృష్ణమురారి అగ్రవాల్ ఆ రికార్డును ఆ సంస్థలో భద్రముగా రక్షించుచు, అక్కడికి పోవు విద్వాంసులకు దానిని వినిపించుచు, వారితోపాటు అగ్రవాల్‌గారు కూడ ఆనందించుచుందురు.

డాక్టరుగారు లక్నోలోని అఖిలభారత సంస్కృత సాహిత్య పరిషత్తు, అయోధ్య, గోరఖ్‌పూర్, దేవరియా, భాట్‌పార్‌రానీ మొదలైన అనేక నగరములలోని విద్యాసంస్థలకు ఎంతయో దోహదకారిగ ఉత్తరప్రదేశ్‌లో నుండిరి. ఇప్పు డక్కడి అనేక విద్యావంతులు వారిని వారి విద్యాభిమానమును వేనోళ్ల కొనియాడుచుండుట నే నెరుగుదును. 'భాట్‌పార్‌రానీ' యందలి మదనమోహన మాలవీయ శిక్షా సంస్థానమునకు డాక్టరుగారు సహాయము చేసినట్లు దాని యధిపతి శేషచంద్ర మిశ్రగారు నాకు చెప్పినారు.

## డాక్టరుగారి సాంస్కృతిక సేవలు

ఉత్తర ప్రదేశ్‌లో డాక్టర్ చెన్నారెడ్డిగారు దర్శించని పుణ్యక్షేత్రములు లేవనవచ్చును. వారు కేదార, బదరీ, కాశీ, అయోధ్య మొదలైన క్షేత్రములకు యాత్రలు సకుటుంబముగా సలిపి ఆదేవతలకు పూజలుచేసి పుణ్యము సంపాదించినారు. అక్కడి దేవాలయముల పరిపాలన అవ్యవస్థితముగా నున్నందున వాటిని క్రమబద్ధము చేసి, దక్షిణ భారత దేవాలయముల సమాన స్థాయికి తేదలచినారు. దేవాలయాల ఆదాయమును, ఇక్కడివలె సార్థకము చేయుటకు అక్కడి ప్రభుత్వము ఎండోమెంటు శాఖ అంతగా పనిచేయనందున డాక్టరుగారు దేవాలయముల పరిపాలనాదక్షుడు, ఆంధ్రప్రదేశ్‌లో రిటైరైన ఎండోమెంటు కమీషనర్ శ్రీ కొండపల్లి వాసుదేవరావును హైదరాబాదు నుండి తోడ్కొనిపోయి, ఉత్తర ప్రదేశ్ ఎండోమెంటు శాఖకు కమీషనర్‌గా నియమించిరి. శ్రీ రావుగారు లక్నోలో సుమారు ఆరు నెలలు ఆ పదవిలో ఉండి అక్కడి దేవాలయాల పరిపాలనమును క్రమబద్ధము చేయుచుండిరి. వారి పదవికి కొన్ని రాజకీయ ప్రతిబంధకములు ఏర్పడినందుచేత వారు దానిని విడిచి వచ్చినట్లు నేను వినియున్నాను.

లక్నో సమీపములోని నైమిశారణ్యమునందు, ఆనందమయీ మాత అను యోగినిగారి సహకారముతో డాక్టరుగారు ఒక ఆధ్యాత్మిక సంస్థను నెలకొల్పిరి. అది యిప్పటికిని విరాజిల్లుచున్నది. ఆ ప్రాంతములోని సాధువులను, యోగులను వారు తరచు దర్శించుచు వారి ఆశీస్సులను పొందుచుండిరి. వారిలో ఆనందమయీ మాత—మౌనయోగి అను నొక ఆంధ్రయోగి మొదలైనవారు ఉన్నారు. ఆ యోగులను కొందరిని నేను గూడ దర్శించినాను.

అన్నిటికన్న ఆశ్చర్యము నాకు కలిగించిన సంఘటన యేమనగా, అలహాబాదులో 1976 డిసెంబరు, 77 జనవరి మాసములలో త్రివేణీ సంగమములో గొప్ప కుంభమేళా జరిగినది. అటువంటి పుణ్యకాలము 140 సంవత్సరముల తరువాత ఆయేడు వచ్చినదట. ఎముకలు కొరుకు జనవరి చలిలో డాక్టరుగారు మకరసంక్రాంతి ప్రవేశము రాత్రి 12 గంటలకు జరిగినప్పుడు సకుటుంబముగా త్రివేణీ సంగమములో సంతోషముగా స్నానము చేసినారు. అలహాబాదులో ఇతరత్రా కన్న చలి చాల విపరీతముగా నుండును. అది చూచి అక్కడివారందరు చాలా ఆశ్చర్యపడినారు. అప్పుడు నేను అక్కడనే యుండి ఆ దృశ్యమును చూచితిని. ఇది డాక్టరుగారి ధర్మశ్రద్ధకు గీటురాయి వంటిది. వారికి గల హిందూ ధర్మాభిమానము, అనన్యాదృశము. ఇంకను ఇట్టివి యెన్నియో నాకు తెలిసినవి డాక్టర్‌గారి నిష్ఠాపూర్వక కార్యములు అక్కడ జరిగినవి. శృంగేరి శంకరాచార్యులవారు అలహాబాద్ కుంభమేళాకు, కాశీలో అన్నపూర్ణాదేవి మాతన విగ్రహము ప్రతిష్ఠాపనకు ఆ ప్రాంతము వచ్చినప్పుడు డాక్టర్‌గారు అత్యంతభక్తిశ్రద్ధలతో వారిని గౌరవించి సత్కరించుటను నేను అక్కడ ప్రత్యక్షముగా చూచితిని. దేవరియా జిల్లాలో సరయూ నదీతీరమునందు 'దేవర హాబాబా' అను నొక దిగంబర మహాయోగి ఉన్నారు. ఆ




CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

యోగీశ్వరులను డాక్టర్‌గారు పలుసార్లు దర్శించి, వారి యాశీస్సులను పొందుట నే నెరుగుదును. నేను ఆ బాబాగారిని 3–4 సార్లు దర్శించినాను. చివరిసారిగా ఆ మహాయోగిని నేను చూచినప్పుడు వారు "ఆప్‌కే ఆంధ్రకే చెన్నారెడ్డిజీ రాజ్యపాల్ బహుత్ యోగ్య హై, మహాభక్త్ హై, ఔర్ హిందూ ధర్మ్‌కే ప్రతీక్ హై" అని చాల ప్రశంసించినారు. ఈ కొద్ది సంఘటనలనే నే నెరిగినవి యుండగా, నాకు తెలియని అసంఖ్యాకములు, ఉత్తర ప్రదేశ్ పుణ్యభూమిలో డాక్టర్‌గారికి సంబంధము గలవి యున్నవని నేను నిశ్చయించుకొనినాను. డాక్టర్ చెన్నారెడ్డిగారు ముఖ్యమంత్రి పదవికి వచ్చిన తరువాత ఆంధ్రప్రదేశ్‌లో బదరీనాథస్వామి దేవాలయ నిర్మాణ సంఘమునకు అధ్యక్షులై, ఆ దేవాలయ నిర్మాణమునకు అమోఘమైన కృషిని దీక్షతో చేయుచున్నారు. దీనికిగాను ప్రభుత్వము నుండి రూ. 5 లక్షలు ఇప్పించినారు. తిరుపతి దేవస్థానమువారి పర్యవేక్షణములో బదరిక్షేత్రమునందు ఆ పని సాగుచున్నది. తిరుమల తిరుపతి దేవస్థానము నుండి గూడ ఆ పునర్నిర్మాణమునకు ధనము నిప్పించుటయే కాక, యిక్కడి శిల్పులను గూడ అక్కడికి పంపినారు. బదరీ దేవాలయము చాల పురాతనమైనది. డాక్టర్‌గారు ఉత్తర ప్రదేశ్ గవర్నరుగా ఆ గుడిని దర్శించినప్పుడే ఈ నిర్ణయము తీసుకొని యుండవచ్చును.

ఈవిధముగా డాక్టర్ మర్రి చెన్నారెడ్డిగారికి ఉత్తర దక్షిణ భారతముల సాహిత్య సాంస్కృతిక ఆధ్యాత్మిక సంస్థలతో సంబంధములు చాల యున్నవి. వారు ఆ ప్రదేశమునందు సకుటుంబసమేతముగా అన్ని రంగములలో వెలుగొందినా రనుటలో సంశయము లేదు.

డాక్టర్‌గారి వలన పరమపావన గంగా–గోదావరి నదుల పవిత్ర సంగమము, విద్యా సంస్కృతి ప్రవాహముల కలయికతో ఉత్తర ప్రదేశమునందు వారు అక్కడ రాజ్యపాల్ (గవర్నర్)గా నున్నప్పుడు జరిగినది. దీనివలన వారి పవిత్రనామము చిరస్థాయిగా అక్కడ నిలిచియుండు ననుటలో ఏమాత్రము సందేహము లేదు. చెన్నారెడ్డి అను వారి పేరు వాస్తవముగా సార్థకమై ('చెన్న' అనగా అందము) ఉత్తర దేశములో నిలిచియుండును.

చెన్నుగ చెన్నారెడ్డి ప్ర
సన్నంబగు పట్టి పేరు సార్థక మగుచున్
సన్నుతి నుత్తరదేశ ప
మున్నత పుణ్యస్థలిన్ మహాత్మ్యుల నయ్యెన్.





CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# త్రిలింగదేశ శ్రేయశ్శంకరుడు

పి. వి. ఆర్. శర్మ

దీక్షాదక్షునికి దైవానుగ్రహం తోడైతే అందరాని పదవులంటూ ఉండవు. ఈ సూక్తి డా. చెన్నారెడ్డిగారి పట్ల అక్షరాలా నిజం. రాష్ట్రంలోను, కేంద్రంలోను మంత్రిపదవులే గాక, ఉత్తరప్రదేశ్ గవర్నరు పదవిని నిర్వహించాక డా. మర్రి చెన్నారెడ్డిగారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారంటే ఇది అపూర్వం కాదా? మన రాష్ట్రంలో పూర్వ ముఖ్యమంత్రులెవరికీ ఈ భాగ్యం లభ్యలేదు. ఎవరికి ఏ భాగ్యం ఏనాడు లభ్యాలని ఆ విధాత నిర్ణయిస్తాడో ఆనాటికే అది ప్రాప్తిస్తుంది. ముఖ్యమంత్రి పదవిని బ్రహ్మపదార్థంతో పోల్చారు జగద్గురు శృంగేరి శంకరాచార్యులవారు. బ్రహ్మానుభూతి పొందినవారు ఇక కోరదగిన దేదీ ఉండజాలదు. ఏదైనా ఒక పదవి దైవానుగ్రహం, పెద్దల ఆశీర్వచనం, స్వయం కృషివల్ల ప్రాప్తించినపుడు ఈ తరంవారే గాక భావితరాల వారు ప్రస్తుతించదగిన పాత్ర నిర్వహించి చరిత్రకారులు సువర్ణాక్షరాలతో వ్రాయదగిన సామగ్రి అందించగల ఘనుడే ధన్యుడైన ముఖ్యమంత్రి కాగలడు. దైవానుగ్రహం, పెద్దల ఆశీర్వచనం, స్వయంకృషి గల ముఖ్యమంత్రులలో డా. చెన్నారెడ్డి అపూర్వవ్యక్తి అనడంలో అణుమాత్రం అతిశయోక్తి లేదు.

డా. చెన్నారెడ్డిని ఆవడి కాంగ్రెసు సభ అయ్యాక మద్రాసులో నేను కలిసినప్పుడు వారితో తొలి పరిచయం ఏర్పడినది. తరువాత ఆంధ్ర రాష్ట్రం ఏర్పడి, విశాలాంధ్రగా అది అవతరించి ప్రవర్ధిల్లుతున్న ఈనాటివరకు ఆ పరిచయం పరస్పర స్నేహంగా ప్రవర్ధమానమై ఒకరి నొకరు చక్కగా అర్థం చేసుకొని గౌరవించుకునే స్థితికి చేరినది. రాజకీయాలలో నేను సాక్షిమాత్రుణ్ణి. రాజకీయ నాయకుల జీవిత చరిత్రలు చూసినప్పుడు వారికి శాశ్వత మిత్రత్వం గాని, శాశ్వత శత్రుత్వం గాని ఉన్నట్లు కనిపించదు, నదులయొక్క గమనంలాగ—నదులు కొంత దూరం ప్రవహించి ద్వీపాలను సృష్టించి మళ్లీ కలుస్తూ ఉంటాయి—జాతి భవిష్యత్తు సంపత్సమృద్ధం కావడానికి భాషా రాష్ట్ర నిర్మాణం కావాలనే ఉద్యమానికి ఆంధ్ర నాయకులు అగ్రభాగాన నిలచి పోరాడారు. తెలుగుజాతి భవిష్యత్తు ఉజ్జ్వలమై అలనాటి వైభవాలను స్ఫురణకు తేవడానికి నిజాం పాలనలో ఉన్న తెలుగు మాట్లాడేవారు, కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లోని ఆంధ్రులు ఏకం కావాలని దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు గారు దాదాపు డెబ్బయి ఏళ్ల క్రితమే ఆంధ్ర పత్రిక ఉగాది సంచికలో సూచించారు. వారి సూక్తి యథార్థమై ఆయన ప్రవక్తగా రూఢి అయినది.

అయితే, నాయకులలోనే అభిప్రాయ భేదాలు ఉండటం సహజం. "భాషా రాష్ట్రాలు అంటే వాళ్ల భాషలు గల రాష్ట్రాలు వేరు గావాలి. అంతేగాని ఒక భాషకు ఒకే రాష్ట్రం ఉండాలి అని లేదు" అని డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు అంటూ వచ్చారు. సమైక్య రాష్ట్రంలో మంత్రిగానే కాక తెలంగాణా ప్రాంతానికి విడిగా రాష్ట్రం ఉంటే మంచిదని చిరకాలం అనుకుంటూ వస్తున్న డా. చెన్నారెడ్డి సమైక్య రాష్ట్రానికే ముఖ్యమంత్రి అవడం దైవనిర్ణయం. సమైక్య రాష్ట్ర పురోగతికి ఎట్టి శక్తులు అడ్డువచ్చినా సహించేది లేదని, సమైక్య రాష్ట్ర భాగ్యాభివృద్ధే తమ ధ్యేయమని పదేపదే ప్రకటించారు. విశాలమైన జాతి అభివృద్ధి భావాలు కలిగి, అమలు చెయ్యడానికి దక్షత కలిగిన డా. మర్రి చెన్నారెడ్డి హయాంలో ప్రజా సహకారంతో ఆంధ్రప్రదేశ్ అద్వితీయంగా నడుస్తుందనడంలో సందేహం లేదు. వాక్ శూరత్వమే గాక క్రియాశూరత్వం గల డా. చెన్నారెడ్డి ఎన్నోవిధాల రాష్ట్రాన్ని అపూర్వంగా అభివృద్ధిపథంలోకి తీసుకు వస్తున్నారు.

వారి హయాంలో బలహీన వర్గాల, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి జరగడమే గాక దుష్టశిక్షణ, శిష్టరక్షణ బాగా జరుగగలదని ప్రజలు ఆశిస్తున్నారు. ధర్మార్థ కామ మోక్ష సాధనకు వారి ప్రభుత్వం దోహదం చేసి వారి గురువులైన



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

శృంగేరి శారదా పీఠాధిపతులు జగద్గురు శ్రీమదభినవ విద్యాతీర్థ మహాస్వాములవారి ధర్మసందేశాన్ని—తెలుగు ప్రజల కీర్తి ప్రతిష్ఠలు వృద్ధిచెయ్యాలని—రాష్ట్రంలోనే గాక, బహుభాషా దురంధరులైన ముఖ్యమంత్రి దేశమంతా ప్రతిధ్వనింప చెయ్యడమే గాక తమ జీవితంలో అనుష్ఠించి తద్వారా ప్రజ లందరికీ మార్గదర్శకులు కాగలరని సంతుష్టుడనై నేను భావిస్తున్నాను. జీర్ణ దేవాలయాల ఉద్ధరణ గాక త్రిలింగాలైన శ్రీశైలం, కాళేశ్వరం, దాక్షారామం వంటి క్షేత్రాల ఉద్ధరణ సముజ్జ్వలంగా నడచి, దేవాలయాలలో అర్చన నైవేద్యాదులు సక్రమంగా జరిగిననాడు లోకకళ్యాణానికి సర్వజనుల సుఖానికి దోహదం కాగలదు. ధర్మ పరిపాలనకు, బహుజన శ్రేయస్సుకు వారు కాయకష్టులా కృషిచేసే ఆయురారోగ్యభాగ్యాలు, శక్తి యుక్తులు పరమేశ్వరుడు వారికి ఇచ్చి పూర్ణాయురారోగ్యం ఇమ్మని ఆ పరమాత్మని ప్రార్థిస్తున్నాను.





CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org


CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

రెడ్డి జనసంఘ కార్యదర్శిగా (1938)



శ్రీ అశోక మెహతా, స్వామి రామానందతీర్థ మొదలైనవారితో

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# ఉపహారము

గుంటూరు శేషేంద్రశర్మ

మేము పూలగుత్తులు వేలాడే వసంతఋతువులం కాము; పట్టి మనుష్యులం
దేశం మాకు గాయా లిచ్చినా మేం పువ్వు లిస్తున్నాం నీ షష్టిపూర్తి కోసం
ఆశాచంద్రికలు కురిసే వో చంద్రమా !
ఏం తెస్తావో ఇప్పుడు యోచించు మా అందరికోసం......
        అటు ఆ సౌధసీమల్లో దీపాలు వెలిగాయి ఉల్కాపాతాల జల్లుల్లా
        ఇటు మా కుటీర సీమల్లో ఆశ దీపాలు వెలిగించు
చీకట్లను పారద్రోలడానికి చేతులు ఖడ్గాల్లా ఎత్తు
చంద్రుడు నీ ఆకాశాల్లో వెండి కాలువలు పారిస్తాడు
        మాకోసం ప్రభాతగుచ్ఛాలు తుంచుకురావాలని స్వప్నించు
        నీ దిశలన్నీ అప్సరసలై కోటి కోటి సూర్యోదయాల్లో స్నానం చేస్తాయి.
నీ భూమిని గులాబీలు కరుణించాయి కనుకనే అవి అక్కడ పూస్తున్నాయి
మా జీవితాలమీద జులుంచేస్తున్న బంజర్లమీద పూలగుండాల్ని ప్రయోగించు
        తుఫానులు పుట్టించా యొకనాడు నీ బాహువులు
        తోటల్ని పుష్పించాలి ఈనాడు నీ స్నాయువులు
నాకు తెలుసు,
ఆశాజ్యోతుల్ని ఆర్పివెయ్యవు నీ చేతులు
మా భూముల్లో అస్తమించిన కోర్కెల నగరాలు త్రవ్వితీసి
సువర్ణశిఖరాలుగా మార్చు
        బ్రహ్మాండమైన నక్షత్రాలే నిశ్శబ్దంగా నడుస్తున్నాయి ఆకాశంలో
        మనం కూడా మన అడుగుల్ని రహాగుజారుల్లో గులాబీముద్దలుగా చేద్దాము.
పాటను పంజరంలో బంధించకు
పిచ్చి పాడాలి, చెట్టుకు పిట్ట కూర్చున్న గౌరవం దక్కాలి
        అమావాస్య కూడా నక్షత్రాలు కుప్పలు కుప్పలుగా పోసుకుని కూర్చుంటుంది.
        నీవు పూర్ణచంద్రుడివి—పండువెన్నెలలు కుమ్మరించు
చెట్టు కొక దేవతలా చేరాయి పక్షులు పాడుతూ
ఈ వసంతాన్ని కోల్పోకు ఎంతో గొప్ప ఋతువు
        నా స్వరాలన్నీ సమావేశం చేసి చెప్పుతున్నాను
        నా శబ్దాల హిరణ్యంతో మునుగు
        శతాబ్దాలు నీ గుమ్మంలో చాకిరీ చేస్తాయి
        నీ గుమ్మంలో బుల్బుళ్ళు పూస్తాయి
        నీ ఉదయాలు పళ్లబుట్టలై పరిమళిస్తాయి
మర్రిచెట్టు నీడల్లోనే మన దేశం జ్ఞానాన్ని పంచింది
పద ముందుకు ప్రజావళి పిలుస్తోంది
దేవు డిస్తాడు నీకు దీర్ఘాయుస్సు—



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# క్రొత్త పిలుపు

అరిపిరాల విశ్వం

చీకట్లు మేసి—వెలుతురుని గుండెల్లో దాచుకున్న మేఘం నా జాతి
అర్ధరాత్రి గుమ్మం ముందు—ఆశగా నిరీక్షిస్తోంది
కాలానికి నిర్వచనం కన్నీళ్లు కాని నవనవయుగంకోసం
కొత్త ఉదయాన్ని తెచ్చే సూర్యుడి కోసం.

ఇంద్రధనుస్సు తెగి నీళ్ల ముంగిట్లో పడిన చప్పుడు
చెట్ల ఆకుల సందుల్లో చిక్కుకుపోయిన వెలుతురుని
మనసుతీరా తాగుదా మనుకున్న దాహం—నీళ్ల దోసిలి
ఆకాశంవైపు అలాగే తిరిగి ఉంది మౌనప్రార్థనలాగా.

గూటిపిట్ట గొంతులో బందీ అయిన కొత్తపాటకి
ప్రాణం పోయాలి నీవు, పల్లవి కావాలి నీవు.
శిలాక్షరాల్లో—శిలావిగ్రహాల్లో—చెరిగిపోతున్న చరిత్రకి
క్రొత్త పిలుపు నివ్వాలి నీవు—క్రొత్తమలుపు నివ్వాలి నీవు.

ఊరుపు తప్ప తూరుపు లేని కొత్త యుగపు సూర్యుణ్ణి
గుడిలోని దేవునినుండి—గుడిసెలోని జీవుని వరకు సారథివై ఊరేగించు.
కలలు, కోర్కెలు, కన్నీళ్లు,జ్ఞాపకాలుగా గడిచిపోతున్న మనుగడకి
సమతా, మమతల సౌరభాన్ని సంతరించే స్వర్గకుసుమం కావాలి నీవు.

దేవుడిపై—మనిషిపై—పెంచుకున్న నమ్మకానికి కావాలి నీవు జయపతాక.
విలువలులేని జీవితాలకి—విలువల నిచ్చి
దోపిడీని శిలువపైకి ఎక్కించే, దుర్నిరీక్ష్య తేజశ్శలాక కావాలి నీవు.
గుప్పెడు ఆకాశాన్ని గుండెల్లో పట్టుకొని, విప్పలేని ఆశల్ని మనసు చీకట్లో దాచుకొని
కాలం ఒక సంకెలగా కదలిపోతున్న నా దేశానికి, తెరిపించు కొత్త యుగపు లోగిళ్లు
ఎడతెగక వెలిగే వెలుతురు కళ్లు, కడదాక నిలిచే స్వర్గపు నకళ్లు.

నీ వంశం పేరు 'మ[illegible]'—మహాబోధికి అన్వర్థనామం.
భిన్నులైన ప్రజాకోటి 'సిద్ధార్థ' మనఃస్థితిని—మరలించు ఆ మహాబోధివైపు.
చిరంతనానందపథానికి చివరి మజిలీలాగా—'వెన్నుడి' వై పూన్చు శాంతిరథాన్ని.

అరవైపైన జీవితం—ఆ దేవు డిచ్చిన వరం.
అప్పుడు వచ్చిన అధికారం మరీ మరీ దైవదత్తం.
నీ మనస్సు నిరంతర శివనామ నిరతం.
కావాలి నీ ఏలుబడి శివంకర సహితం.

చరిత్ర నిర్మించిన జీవితం నీది—ధరిత్రిని పండించిన ధన్యత కావాలి నేడు.
నీవూ, నేనూ నమ్మిన శివుడు, ఉంటాడు ఎప్పుడూ తోడు.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# తేజశ్శిఖరాలు

జె. బాపురెడ్డి

అరవై వసంతాలు
విరునవ్వులై విరిసిన
విచిత్ర జీవిత బృందావనంలో
విహరించే గోపాలుడు
గోదావరీ యమునా తీరాలలో
కల్యాణ వేణుగానలోలుడు
పసిబాలుడు
షష్టిపూర్తి చేసుకుంటున్నాడట
చూచివద్దాం రండి—

సిరిపుర సావిత్రి కన్న
శ్రీ చిన్నారి చెన్నారెడ్డికి
నమస్కృతితో ఆడుకొనే
అల్లారి పిల్లవానికి
అఖిలాంధ్ర నాయకుడైన
ఆనందవర్ధనునికి
అప్పుడే అరవై నిండాయంటే
ఆశ్చర్యంగా ఉంది కదా!

అదుగో!
అనంతత్వ తత్వ తారాపథంలోనికి
ఆరోహణా దారులు విసిరే
ఆయన నిర్నిద్ర
చకచ్చకిత పంచన్నయనాలలో
భారతి నిరవాశయాలు భాసిస్తున్నవి
భవిష్యత్తు గరుత్తులు ప్రసరిస్తున్నవి—
సూటిగా చూసే ఆ ముక్కుమీద
మొక్కవోని మేటి మేధాశక్తి
విద్యుద్విన్యాసం చేస్తుంటే
విద్విలాస శివతాండవం ఆడుతుంటే
పాలనా యంత్ర మత్తేభం
వేగాన్ని పుంజుకుంటున్నది
సోమరితనం శివశివా అంటూ
కిటికీ దూకి పారిపోతున్నది
తాబేలు కాబోలు అనుకున్న ప్రగతి
కుందేలులా ముందుకు సాగుతున్నది
కరుడుకట్టిన పేదల బ్రతుకుల్లో
గంగానదులు ప్రవహిస్తున్నవి—

శ్రీరామ రామ రామాక్షర
శ్రీకార ఓంకార స్వనాలు
ఆయన ఉచ్ఛ్వాస నిశ్వాసల్లో
ఉయ్యాల లూగుతున్నవి—
నరలోకపు పొదుల్లో నుంచి
సురలోకపు సందిళ్లపైకి
అలవోకగా తీగలు సాగుతున్నవి
ఆయన నిసర్గ భావనాలతలు—

అటు చూడండి
ఆయన అరచేతుల్లో ఆడుకునే
రజతాంచల రక్షాదండం
ఆర్త పీడిత జనవాటికి
అభయకోదండం వలె లేదా!
నేటికి, ఏనాటికి, ముమ్మాటికి
జలచర, భూచర, ఖేచర కోటికి
అది త్రివిక్రమ త్రికాలదండం కాదా!

ఎదుటివాని ఎంతటి విషమైనా విరిచి
అమృతంగా మార్చగలిగే
ఓషధుల్లాంటి ఆయన పెదవులపై
ఆకలికి అన్నం పెట్టే
అమ్మలాంటి అమాయిక దరహాసం
అవలోకించారా!

అరవై రంగుల సింగిణుల వెనుక
అనుభూతుల్ని నెమరువేసే
ఆయన బుద్ధాత్మక
శిరశ్శ్రితాచల తేజశ్శిఖరాలమీద
చల్లండి—అభినందన చందనపింజాలు
చల్లండి—అహం బ్రహ్మాస్మి అంటూ
అక్షరాక్షతల పుంజాలు.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# సమాజ వికాసజ్యోతి

ఎల్. మాలకొండయ్య

ప్రతి జన్మదినం ఒక మైలురాయి బ్రతుకు రహదారిలో
ప్రతి పుట్టినరోజు ఒక మెట్టు జీవిత సోపానంలో
మైలు మైలుకు ప్రజాసేవా చిత్రాన్ని చిత్రిస్తూ
అన్ని అడ్డులను గడ్డు సమస్యలను మెలుకువతో ఎదుర్కొని
మంచి పనులెన్నో సాధిస్తున్న నీకు మా అభినందనలు.
సమాజ వికాస ప్రణాళికల రూపొందించి
సామాన్య మానవుని బ్రతుకుబాటకు
మొట్టమొదటగా దివిటీ పట్టింది నీవే!
నీడలేనివారికి గూడు చూపిస్తూ
బ్రతకలేనివారికి బ్రతకుతెరువు చూపిస్తున్నావు.
చదువే మనిషి వికాసానికి మంచి మార్గమని
ఆరోగ్యమే ప్రజలకు మహాభాగ్య మని గుర్తించి
విద్యా వైద్య సౌకర్యాలు అనేకాలు కల్పిస్తున్నావు.
వ్యవసాయం పశుపోషణ దేశానికి వెన్నెముక అని
పరిశ్రమలు జాతికి పట్టుకొమ్మ అని గుర్తించి
భారతదేశ పటంలో ఆంధ్రప్రదేశ్‌కు
హృదయంలాంటి స్థానాన్ని కల్పించావు.
శరీరానికి అన్నం, బట్టలాగే
ఆత్మకు సాహిత్యం సంస్కృతి అవసర మని
వాటిని పోషించి ప్రోత్సాహం ఇస్తున్నావు.
సామాన్యుని బ్రతుకుబాటను సరిదిద్దాలని
ప్రతిదినం సతమతం అవుతున్న నీకు
ప్రజల సహకారం దేవుడి దీవెనలు
ఎల్లవేళల కొల్లలుగా చేకూరుగాక.
మీ ప్రజాసేవా కార్య కలాపం
సర్వవిధాలా సాఫల్యం చెందుగాక.
ఇలాంటి పుట్టినరోజు పండుగలు మరెన్నో
వైభవంగా జరుపుకోవాలని దైవాన్ని ప్రార్థిస్తున్నాం.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# డాక్టర్ చెన్నారెడ్డిగారి ఆలోచనాలోకం

జి. వి. సుబ్రహ్మణ్యం

వాస్తవజ్ఞానం కంటె భావుకత్వం ముఖ్య మంటాడు ఐన్‌స్టీన్. వాస్తవ జ్ఞానం భావుకతకు ముడిసరుకు లాంటిది. మొదటిది వివేకాన్ని కలిగిస్తే రెండవది దార్శనికతను ప్రసాదిస్తుంది. ప్రతిభావంతుడైన కవికీ, శాస్త్రవేత్తకూ, రాజకీయ వేత్తకూ సమంగా వర్తించే సత్య మిది. ఒక జాతి జీవనాన్ని సర్వతోముఖంగా తనలో ప్రతిబింబింప చేసుకొని గతంలోని మంచిని స్వీకరిస్తూ, వర్తమానాన్ని వివేకంతో విశ్లేషిస్తూ, భవిష్యత్తును రూపుకట్టించే దర్శనం చేసి, అభ్యుదయం కోసం అహరహం కృషిచేసి సాధించే సమర్థుడే నాయకుడు. డా. మర్రి చెన్నారెడ్డిగారు అట్టి నాయకులు.

**మూడు మెట్ల నిచ్చెన**

జీవితం పర్వేరుపై బండిలాగా సాగే అదృష్టవంతులు ఆలోచనాపరులూ, కార్యకర్తలూ, దార్శనికులూ కావటం కష్టం. సంఘర్షణలో నుండి విస్ఫులింగంలా వారి వ్యక్తిత్వం ఉజ్జ్వలరూపం దాలుస్తుంది. ఒక మహానాయకుని వ్యక్తిత్వంలో మూడడుగుల త్రివిక్రమత్వంలా మూడు దశలు పెనవేసుకొని ఉంటాయి. ఒకటి : భౌతికం; రెండు : బౌద్ధికం; మూడు : ఆధ్యాత్మికం. భౌతిక వ్యక్తిత్వం ప్రాపంచిక విషయాల పరిజ్ఞానాన్ని వాస్తవ దృక్పథంతో పదిలపరచుకోవటమే కాకుండా, సాంఘిక ఆర్థిక రాజకీయ నైతిక రంగాలలోని విభిన్న శక్తులను వివేచన చేసుకొని సమాజ శ్రేయోమార్గాన్ని సముచిత విధంగా తీర్చిదిద్దటానికి యత్నిస్తుంది. బౌద్ధిక వ్యక్తిత్వం భౌతిక వ్యక్తిత్వంలోని ప్రవృత్తిని తర్కసహంగా, శాస్త్రీయంగా, ఫలోన్ముఖంగా మలచుకోవటానికి తోడ్పడుతుంది. విభిన్న భౌతిక శక్తులకు వెనుకనున్న సైద్ధాంతిక సంఘర్షణలోని సమన్వయాన్ని గాని, సమాజ వ్యవస్థకు, పురోగతికి కావలసిన అభ్యుదయ పథాన్ని గాని విశ్లేషిస్తుంది. ఆధ్యాత్మిక వ్యక్తిత్వం జీవిత లక్ష్యాన్ని కూర్చిన వ్యక్తి విశ్వాసాలనూ, దార్శనికతనూ రూపు కట్టిస్తుంది. భౌతిక జీవితంలో సమాజంలోని అర్తిని తొలగించే ప్రవృత్తి ముఖ్యం; బౌద్ధిక జీవితంలో అసంతృప్తిని వారించే అభ్యుదయ దృక్పథం ప్రధానం; ఆధ్యాత్మిక జీవితంలో ఆదర్శ శిఖరాల నందుకొనే తాత్త్వికచింతనం గమ్యం. ఈ మూడింటిని ముడివేయ గలగటమే కష్టం. ముడివేసినా రాజకీయ జీవితంలో వాటిని సమన్వయించుకోవటం మరీ కష్టసాధ్యం. డా. మర్రి చెన్నారెడ్డిగారు అసాధ్యాలని అనుకొనే విషయాలను తమ జీవితంలో ప్రయుక్త సాధ్యాలుగా చేసి చూపించే ప్రజ్ఞావంతులు. అందువల్లనే దేశ భవిష్యద్దర్శనం చేసిన కొద్దిమంది సమకాలీన భారత నాయకుల్లో ఒకరుగా గౌరవ ప్రతిష్ఠలను సంపాదించుకో గలిగారు.

**గమ్యం తెలిసిన పురోగతి**

డా. మర్రి చెన్నారెడ్డిగారు బాల్యం నుంచీ భావస్వాతంత్ర్యాన్నీ, భావప్రకటన స్వాతంత్ర్యాన్నీ గౌరవించారు. ఆ రెండూ వ్యక్తివికాసానికీ, జాతిస్వేచ్ఛకూ మూలమంత్రాలని విశ్వసించారు. నిజాం నిరంకుశపాలనను ప్రతిఘటించే ఉద్యమంలో విద్యార్థి సంఘాల ద్వారా వారు రేకెత్తించిన చైతన్యంలో ఈ రెండూ కీలకస్వరాలను నిర్వహించాయి. సమకాలీన సమాజ, రాష్ట్ర, దేశ, ప్రపంచ పరిస్థితుల సమగ్రావగాహనకోసం యువకులకు విభిన్న సిద్ధాంతాలతో పరిచయం కలిగించారు. జాతిపిత గాంధీజీ చూపిన మార్గంతో వాటికి అన్వయం సాధించారు. ప్రతి యువకుడూ వక్తృత్వం ద్వారా భావప్రకటనలో పరిణతి పొందేటట్లు చూచారు. ఆలోచన, అభివ్యక్తి ఉద్యమశీలానికి రెండు నేత్రాల వంటివని నిరూపించారు. వారి ఆలోచన వాస్తవ జ్ఞానంలో నుంచి పుడుతుంది; వర్తమాన సమాజ శ్రేయోభిలాషతో వికసిస్తుంది; భారతీయ వ్యక్తిత్వంలో పరిమళిస్తుంది. హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమ నాయకులుగా అటు నిరంకుశ శక్తులుగాని, ఇటు సామ్యవాద విప్లవశక్తులు గాని ప్రజాపీడన ప్రవృత్తిని సాగించినప్పుడు సాహసోపేతంగా ఎదిరించారు; సిద్ధాంత సంఘర్షణలో సతమతమయ్యే ఉద్యమ శక్తులకు స్వాతంత్ర్య సముపార్జనమే సవ్యమైన మార్గమని సూచించారు; సత్యాగ్రహ సమర పథాన్ని చాటి చెప్పారు.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

పోలీసు చర్య తరువాత భారతస్వాతంత్ర్యం ఆర్థిక ప్రగతికి దోహదంగా పరిణమించేటట్లు ప్రజాశక్తిని ప్రబోధించారు. అఖిలాంధ్ర నిర్మాణ ప్రయత్నాల్లో కూడా ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాల పరిరక్షణ పథకాలను ఆయన విస్మరించలేదు. ఆర్థిక ప్రగతి హార్దిక సమైక్యతకు మూలసూత్రమని భావించారు. డా. రెడ్డిగారు గాంధేయ మార్గంలో సమసమాజ వ్యవస్థను సమర్థించారు. అభివృద్ధిచెందిన ప్రాంతాలతోపాటు ప్రధానంగా వెనుకబడిన ప్రాంతాలు స్వయంగా అభివృద్ధిచెందే ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. సమాజంలోని అన్ని వర్గాలలోను ఆర్థికమైన అసమానతలు కారణంగా ఒక వర్గంపై మరో వర్గం అజమాయిషీ చేసే వైఖరిని తీవ్రంగా ప్రతిఘటించారు; సర్వీసు విషయాల్లో సమాన సూత్రాల కోసం ముక్తకంఠంతో ఘోషించారు; ఆర్థిక అభ్యుదయాన్ని తెలుగుజాతి సమగ్రంగా సాధించాలని భావించారు; అవసర మొస్తే ఆర్థికాభ్యుదయానికి అవకాశం కలిగించే చిన్న రాష్ట్రాలను నిర్మించినా తప్పు లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ సమైక్యత ఆర్థికావకాశాల సమానత్వ ప్రాతిపదికపైన ఆధారపడి ఉందని తలంచారు. వేర్పాటు ఉద్యమం రాష్ట్ర సమైక్యతా భావంలోని అస్పష్టతలను తొలగించి మోహావహించినా ప్రబోధించాలన్న రెడ్డిగారి బౌద్ధిక వ్యక్తిత్వం సాధించిన పాఠం. దానివల్ల వాస్తవ స్థితుల అవగాహనయే కాకుండా రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి జరగాలన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృక్పథం కార్యరూపం దాల్చింది. భావసమైక్యతకు ఆర్థిక ప్రాతిపదికలను పునాదులుగా భావించే ప్రవృత్తి నేడు రాష్ట్ర ప్రణాళికలకు ప్రాణంగా నిలిచింది. ఈ దృక్పథానికి డా. రెడ్డిగారి రాష్ట్ర సర్వతోముఖ భౌతికాభ్యుదయ భవిష్యద్దర్శనమే ప్రధాన కారణ మనటం సత్యదూరం కాదు.

డా. చెన్నారెడ్డిగారు కేంద్ర మంత్రిగా, ఉత్తరప్రదేశ గవర్నరుగా పదవి బాధ్యతలు నిర్వహించినపుడు రాష్ట్ర సమైక్యతకు మూలకారణమైన ఆర్థిక అసమానతల నిర్మూలన విధానాన్ని భారత సమైక్యతకు కూడా వర్తింపచేశారు. ఒక ఉద్యమంలో బీజరూపంగా భాసించి ప్రాంతీయంగా కుదిరిన వారి దృక్పథం జాతీయ స్థాయిలో అన్వయించబడినప్పుడు దానిలోని విశ్వజనీనత వ్యక్తమైంది. ఆ విశ్వజనీనమైన దర్శన సామర్థ్యంతో మరల రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రజా ప్రాతినిధ్యాన్నీ, ప్రభుత్వ బాధ్యతలనూ స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్‌ను సమసమాజ నిర్మాణ దృక్పథంతో సమైక్య శక్తితో పురోగమింపజేసే రెడ్డిగారి ఆర్థిక దర్శనం ప్రజాజీవిత వికాసానికి ప్రాణప్రదంగా పరిఢవిల్లుతుందనటంలో అనుమానంలేదు. రెడ్డిగారి నాయకత్వం గమ్యం తెలిసిన పురోగతిని సూచిస్తుంది; మూలబలం ఉన్న మర్రిలా విస్తరిస్తుంది.

## కొత్త శకం మోసులెత్తింది

'ఒక కొత్త శకం మరలా మోసులెత్తింది; సరికొత్త అవకాశాల కొరకై ప్రజాప్రభుత్వంవైపు ఆశతో చూస్తున్న బలహీన వర్గాల కన్నుల్లో కొత్త కాంతులు మిలమిల లాడుతున్నాయి. యుగ యుగాల నుంచి బాధాసర్పదష్టులుగా ఉన్న ఆ బడుగు జీవుల జీవితాలు ఇప్పుడిప్పుడే మూర్ఛనుండి తేరుకొని కన్నులు తెరుస్తున్నాయి; తమ కాళ్లమీద నిలబడటానికి యత్నిస్తున్నాయి. కడచిన కొన్నేళ్లుగా సాధించిన ఈ ప్రగతిని ఎవ్వరూ కాదనలేరు. అయినా సాధించవలసింది ఎంతో ఉంది; సాధించాలన్న చైతన్యం వారిలో కనబడుతోంది; ఇదే కొత్త శకానికి నాందిలా వినిపిస్తోంది'—అన్నారు డా. చెన్నారెడ్డిగారు మెదక్‌జిల్లా మహాసభలో (8–5–1978). ఈ కొత్త శకానికి రాష్ట్ర స్థాయిలో రూపురేఖలు దిద్దే బాధ్యత ప్రజలు ఆయన కిచ్చారు. మహాత్మా గాంధీగారి కాలంలో ఈ సామాజిక సమస్య వర్ణ వ్యవస్థకు సంబంధించిందిగా మొదలై క్రమంగా వర్గ సమస్యగా గుర్తింపబడింది. ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మొదట పరిగణనకు వచ్చేది వర్ణం కంటే వర్గమే. బలహీన వర్గం ఆర్థికంగా బలాన్ని పుంజుకుంటే వర్గాల మధ్య భేదం మందగిస్తుంది. దానివల్ల వర్గ పోరాటంలో విద్వేషాలు తగ్గుతాయి. వర్గాల మధ్య వ్యక్తి గౌరవంతోపాటు సహజీవనభావం ఏర్పడుతుంది. ఇది శాంతి విప్లవ మార్గాన్ని కోరే భారత నాయకుల దృక్పథం. డా. చెన్నారెడ్డిగారు ఆ మార్గాన్ని ఆచరించి చూపిస్తున్నారు.

కష్టించి పనిచేసేవాడికి క్షుధ పట్టి దున్నే భూమి దక్కాలనీ, వృత్తివిద్యలతో బలహీన వర్గాలు స్వయంపోషకత్వం సాధించాలనీ, ప్రతి పల్లెటూరుకూ బస్సు సౌకర్యం ఉండాలనీ, వ్యవసాయంలో విద్యుత్తు రైతుకు శక్తిగా అందుబాటులో ఉండాలనీ, సాంకేతిక పరిజ్ఞానంతో యువకులు స్వయంనిర్మిత చిన్నతరహా పరిశ్రమలను నెలకొల్పుకోవాలనీ, తిండి, బట్ట, ఇల్లు, చదువూ ప్రతి పౌరుడికీ—ప్రత్యేకంగా బలహీన వర్గాలకు—అందాలని డా. రెడ్డిగారు సత్వర ప్రణాళికలను రూపొందించి అమలు జరుపుతున్నారు. 'కుంటిపాట్లు పడే కుక్క' వైఖరి వదలి 'పందెం గెలిచే గుర్రం' లాగా ప్రభుత్వ యంత్రాంగం బలహీన వర్గాభ్యుదయం కోసం పరుగులు తీయాలని రెడ్డిగారు భావిస్తున్నారు. ఆధునిక జీవితం ఎంత వేగవంత



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

మైండ్; దానితోపాటు ఆలోచనా, ఆచరణా కూడా అంత వేగవంతం కావాలని డా. రెడ్డిగారు ఎన్నోసార్లు వుద్ఘాటించారు. తత్క్షణ పరిష్కారమే సమస్యకు తరణోపాయం; ఆలోచనకూ, ఆచరణకూ అంతరాన్ని తగ్గించటమే ప్రజల విశ్వాసాన్ని పొందే ప్రభుత్వ ధర్మం—అంటారు డా. రెడ్డిగారు. ఆచరణగా రూపొందని ఆలోచన ఆనకట్టలేని నదీజలం వంటిది. డా. రెడ్డిగారి ఆలోచనలు సత్వర ఆచరణయోగ్యాలైన ప్రణాళికలుగా రూపొందటంవల్ల పైకి చూస్తే ఉప్పెనలాంటి ఉద్యమాల్లా ఉంటాయి; లోన చూస్తే కలకాలం దేశం సుఖపడగలిగే కట్టడాల్లా కనబడతాయి. కొత్త తరాన్ని దర్శించే వ్యక్తికే కొత్తగా ఆలోచించే శక్తి ఉంటుంది!

**మంచి డాక్టరు దొరికాడు**

'రాజునకుఁ బ్రజ శరీరము
రాజు ప్రజకు నాత్మ గాన రాజుం బ్రజయున్
రాజోత్తమ! యన్యోన్య ని
రాజితులై యుండవలయు రక్షార్హమునన్'

అని ఆంధ్ర మహాభారత శాంతిపర్వంలో భీష్ముడు ధర్మరాజుతో అంటాడు. అది సార్వకాలిక సత్యం. దీన్నే ప్రజాస్వామ్య వ్యవస్థకు వర్తింపజేస్తే అబ్రహాంలింకన్ దర్శనానికి దగ్గరగా నిలుస్తుంది. డా. రెడ్డిగారికి ప్రజాస్వామ్య వ్యవస్థమీద ప్రగాఢమైన విశ్వాసముంది. బాధ్యతాయుతమైన ప్రభుత్వ వ్యవస్థ స్వేచ్ఛాయుతమైన ఆలోచనమూ, భావాభివ్యక్తినీ మన్నించాలనీ, అలా కానినాడు అది వ్యక్తిపూజ పాలౌతుందనీ, పరిపాలనా యంత్రాంగానికి అది మోయలేని బరువౌతుందనీ (హైదరాబాదులో మే 20 వ తేదీన) డా. రెడ్డిగారు పేర్కొనటం గమనార్హం. ప్రజలూ—పోలీసులూ ఘర్షణ పడితే ఏ దిక్కరిలో రెడ్డిగారు ప్రజలవైపే మొగ్గు జూపేవారు. ప్రజలకు రక్ష నివ్వవలసింది ప్రభుత్వం—శరీరాన్ని రక్షించుకోవటం జీవుల ధర్మమైనట్లు; శరీరాన్ని అశ్రద్ధ చేస్తే అది అనారోగ్యంతో తిరుగుబాటు చేసి ఆత్మకే ఆదరువు లేకుండా చేసినట్లు—ప్రజలు ఆగ్రహిస్తే ప్రభుత్వాన్నే పడతోస్తారని రెడ్డిగారు హెచ్చరించారు. ప్రజాశక్తిని గుర్తించని ప్రభుత్వం శ్మశానం లాంటిది; తన అనుకూలమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోలేని ప్రజాశక్తి పాడుబడ్డ బావిలాంటిది. వీటిని డా. రెడ్డిగారు మన్నించరు. భీష్ముడు చెప్పినట్లు 'రక్షార్హమంతో' పరస్పరం పోషకాలుగా ఉండే ప్రభుత్వాన్నీ, ప్రజాశక్తినీ వారు సంభావించారు. అందువల్లనే—ప్రజలను చూసి ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రబోధిస్తుంటారు; ప్రభుత్వమంటే మీకంటే ప్రత్యేకంగా ఎక్కడో లేదని ప్రజలకు తెలియచెప్తుంటారు. ప్రజాసేవకు పదవి ప్రమాణం కాదనీ, పది కాలాలపాటు నిలిచే ప్రయోజనాన్ని సాధించటమే ధ్యేయమనీ డా. రెడ్డిగారు భారత మహిళామండలి మహాసభలో (15–4–1978) ఉద్బోధించారు. ఆరోగ్య మివ్వని ఔషధం కానీ, ఫలసాయం లేని వ్యవసాయంగానీ డాక్టరైన రైతుబిడ్డ శ్రీ చెన్నారెడ్డిగారు అంగీకరించరు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమైక్యతా శరీరానికి ఆత్మస్థైర్యుడుగా ఆత్మవిశ్వాసమున్న వైద్యుడు నిలిచాడు నేడు. జబ్బు రానే రాకూడదు; వచ్చినా తగిన మందు వాడగలడు; మందుకు లొంగకపోతే శస్త్రచికిత్స చేసి అయినా శరీరాన్ని రక్షించగలడు! 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనం.'

**ఆంధ్రుల కొక ఆచార్యపీఠం**

డా. రెడ్డిగారు రాష్ట్రాత్మనే కాదు భారతాత్మను కూడా దర్శించిన మహాత్ములు. వారి 'గంగా గోదావరి సంగమ' వినాదం భారతీయ జాతైక్యతా సూత్రానికి వ్యాఖ్యానం. రెడ్డిగారి వ్యక్తిత్వం యావద్భారత దేశమునే చిత్రకమున గీయబడిన సజీవ వర్ణచిత్రం. పరిచ్ఛిన్నమైన ప్రవృత్తితో పరిశీలిస్తే ఆ వ్యక్తిత్వంలోని పరిపూర్ణత ప్రత్యక్షం కాదు. అట్టివారు ముఖ్యమంత్రి కావటంవల్ల మన రాష్ట్రానికి దేశ రాజకీయాల్లో ఒక ఆచార్యపీఠం దక్కింది.

**ఆలోచనకు అంతశ్శక్తి శాస్త్రీయ దృక్పథం**

డా. రెడ్డిగారు చదివింది వైద్యశాస్త్రం; ఆచరిస్తోంది రాజనీతి శాస్త్రం. శాస్త్రం చదివిన ప్రతివారికీ శాస్త్రీయ దృక్పథం అలవడుతుందని చెప్పలేం. కాని, శాస్త్రీయ దృక్పథం ఏర్పడిన ఏ వ్యక్తికైనా బౌద్ధిక వ్యక్తిత్వం తర్కసహంగా భాసిస్తుంది. డా. చెన్నారెడ్డిగారు తమ ఆలోచనాపథాన్ని శాస్త్రీయ దృక్పథంతో మలచుకొనే మనీషులు. శాస్త్రం తత్త్వాన్వేషణ



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

దృష్టి కలిగించేది. అనంతకాలంనుంచీ శాస్త్రీయ ప్రయోగాలను వివిధ రంగాల్లో నిర్వహించిన వైజ్ఞానికులు తాము కనుగొన్న సత్యాలను లోకానికి వెల్లడించారు. శాస్త్రవేత్త ఏ కాలానికి చెందినా, ఏ ప్రాంతానికి చెందినా అతని ప్రయోగంమీద మరో శాస్త్రజ్ఞునికి ప్రమాణబుద్ధి ఉండాలి. దాన్ని పునఃపరిశీలించి లోపముంటే సరిదిద్దవచ్చు; అప్పుడయితే ఖండించవచ్చు. కాని, శాస్త్రీయ దృక్పథాన్ని వ్యాఘాతం అవన్ని చేయకూడదు. డా. రెడ్డిగారు అందువల్లనే ఆధునిక శాస్త్రాలమీద ఎంత గౌరవ ప్రపత్తులను ప్రకటిస్తారో ప్రాచీన భారతీయ శాస్త్రాలమీద కూడా అంత ప్రామాణిక బుద్ధిని ప్రదర్శిస్తారు. "**I always consider a scientific attitude is an open attitude**" అని యోగ సదస్సులో (2-6-1978) పేర్కొన్నారు. శాస్త్రీయ దృక్పథం శాస్త్రాలపట్లనే కాదు, రాజకీయాలు, నిత్యజీవన వివాదాలూ, సంస్కృతి సమాలోచనలూ, సృజనాత్మక ప్రవృత్తులూ మొదలైన వానిపట్ల కూడా అవసరమని డా. రెడ్డిగారు భావిస్తారు. రెడ్డిగారి ఆలోచనల్లోని అంతశ్శక్తి శాస్త్రీయ దృక్పథం.

**సాధన: బోధన**

నైతిక ప్రధాన గుణంగా సాగే రాజకీయాలకు సూటిదనం నిర్ణాయక సూత్రంగా పాటించారు రెడ్డిగారు. సూటిదనం స్నేహితుల నెందరిని దూరమస్తుందో శత్రువుల నందరిని సృష్టిస్తుంది. 'సత్యం మనోహారి చ దుర్లభం వచః' అన్నాడు కదా భారవి మహాకవి. సత్యం మనోహారిగా కంటే దోషహారిగా ఉండాలంటారు రెడ్డిగారు. వారి మిత్రులు అవసరం వస్తే ప్రాణాలు ఇవ్వటానికి సిద్ధపడతారు; వారే శత్రువులైతే ప్రాణాలు తీయటానికి ముందుకు వస్తారు. ప్రాణాలు తీయా లనుకున్న శత్రువులుకూడా రెడ్డిగారి మాటల్లోని సత్యాలకు కట్టుబడి చివరకు ప్రాణమిత్రులుగా పరివర్తనం చెందుతారు. ఇది వారి నిజాయితీలోని నిప్పులాంటి గుణం. దీన్ని అహంకారి తన ప్రయోజకత్వంగా చెప్పుకొని గర్విస్తాడు. కాని, డాక్టర్ రెడ్డిగారు దీన్ని తమ జాతకచక్ర ప్రభావానికి ఆరోపించి తమ వినమ్రతను ప్రకటించుకుంటారు. అట్లని రెడ్డిగారు జాతకాన్ని లెక్కించుకుంటూ జీవితాన్ని మలచుకున్నా రనటానికి వీల్లేదు. పురుషకారానికి దైవానుకూల్యం సంసిద్ధి హేతువన్న విశ్వాసంతో ముందుకు నడుస్తారు వారు. జ్యోతిషంమీద నమ్మకంవల్ల ఎంత కాదన్నా ఒక మేలు వారికి చేకూరింది. శత్రు మిత్రభావం వ్యక్తినిష్ఠం కాదనీ, కాలప్రభావమనీ, జయాపజయాలు కాలచక్రగమన స్వరూపాలనీ తెలిసి ఉన్నా అసూయాద్వేషాల కతీతంగా తాను ఎదిగి అహంకార విరహితంగా కార్యసాధనం సాగించే సాహసం వారికి జ్యోతిశ్శాస్త్ర దృక్పథం అలవరించింది. శాస్త్రాన్ని నమ్మిన రెడ్డిగారు శత్రువులు మిత్రులుగా మారినప్పుడు వారిని క్షమించ గలిగారు; మిత్రులు శత్రువులైతే మందహాసంతో మన్నించ గలిగారు. శాస్త్రం వారి జీవితంలో సాధన; ఆచరణలో బోధన.

**సీమలు లేని చెలిమికొలను**

డా. చెన్నారెడ్డిగారు గొప్ప స్నేహశీలి. మాట పట్టింపులు వచ్చినా మానవతను మరచిపోని మనిషి. ఒకనాడు నేను వారింటికి వెళ్లాను. అప్పుడు వారు రాష్ట్ర మంత్రిగా ఉన్నారు. వారిని కలిసి మాట్లాడాలని అనుకుంటే వారి కార్యదర్శిగారు 'మంత్రిగారి ఆరోగ్యం అంత బాగా లేదు; విశ్రాంతి తీసుకుంటున్నారు' అని చెప్పారు. అంతలో చెన్నారెడ్డి గారు గదిలోనుంచి వరండాలోకి వచ్చారు. వారికి బాగా జలుబుభారం చేసి ఉంది; ఆవిరిపట్టిన జిందాతిలిస్మాత్ మందు రాసుకొన్న వాసన కొడుతోంది; అలసటగా ఉన్నారు. అయినా ఒక మిత్రుని ఇంట్లో వివాహానికి వెళ్లటానికి కారు సిద్ధం చేయమన్నారు. ప్రక్కన ఉన్న ఒక మిత్రుడు—'మీకూ వారికీ రాకపోకలు ఆగి చాల రోజులయిందిగా' అని నవ్వుతూ వ్యాఖ్యానించారు. డాక్టరుగారు చిరునవ్వుతో ఆలోచనను రంగరిస్తూ ఇలా అన్నారు—'అభిప్రాయభేదా లున్నాయని ఆహ్వానించటం మానారా? పిలిచిన పేరంటానికి పోవటంలో తప్పు లేదు. శుభకార్యం జరుగుతోంది; ఇది మరో శుభ పరిణామానికి నాంది కావచ్చుకదా! నా ఆరోగ్యం కారణంగా వారి ఆహ్వానాన్ని మన్నించకపోతే మనసులు కలిసే అవకాశాన్ని నేనే అడ్డగించిన వాణ్ణవుతాను. నాకు జలుబుభారంగా ఉన్నమాట నిజమే. పెండ్లికి పోయివస్తే నా భారం నేను దింపుకుంటాను' అంటూ కారెక్కి వెళ్లారు. రెడ్డిగారి దృష్టిలో స్నేహ మొక మహాజ్యోతి. అది కొడిగట్టే తరుణంలో తమంతట తామే స్నేహాన్ని దానిలో నింపుతారు. రెడ్డిగారి హృదయం సీమలులేని చెలిమికొలను.

**సెక్యులరిజం—స్పిరిట్యుయలిజం**

'భారతదేశం భౌతికకాయమైతే అందులోని ఆత్మచైతన్యం హిందూ ధర్మం'' అన్నారు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ. డా. రెడ్డిగారు నెహ్రూ సూక్తిని భౌతికాధ్యాత్మిక ప్రవృత్తులకు పొందికైనదిగా సంభావిస్తారు. తరచుగా ఈ



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

సూక్తిని తమ ఉపన్యాసాల్లో ఉదాహరిస్తుంటారు. హిందూ ధర్మాన్ని మత మనటం పొరపాటని, అది ఒక జీవిత విధానమని, సర్వమానవ సౌభ్రాతృత్వానికీ, సహన సౌజన్యాలకూ, విశ్వప్రేమకూ అది మారుపేరని రెడ్డిగారు వ్యాఖ్యానిస్తారు. యుగ యుగాలనుండి ఎన్నో మతాలూ, సంస్కృతులూ భారతావనిలో ప్రవేశించాయి; హిందూధర్మం వాటిని సమాదరించింది; వాటిలోని మంచిని తాను కొంత తీసుకొన్నది; తన మంచిని కొంత వాటికి పంచిపెట్టింది. హిందూధర్మం మతమైతే సంకుచిత మనస్తత్వాన్ని ప్రేరేపించేది; విశ్వాన్నంతా తనలో ఇముడ్చుకోగల విశాలహృదయం దాని కున్నది కాబట్టే ఎన్ని మత సంస్కృతులనైనా తనలో నదుల్లా కలుపుకొని సముద్రంలా తన లావణ్యాన్ని నిలుపుకో గలిగింది. సహనం, సౌజన్యం ఈ ధర్మరథానికి రెండు చక్రాలు. ఈ సంస్కృతిలో నుంచే గాంధీజీ సత్యాగ్రహ శిల్పాన్ని రాట్నం నుండి దారంలా లాగి స్వాతంత్ర్య సముపార్జనకు సాధనంగా సృష్టించారు. భగవద్గీతను ఒడిలో ధరించి బ్రిటిష్ సామ్రాజ్య శక్తినుండి భారత విముక్తిని సౌమ్యంగా సాధించారు. ఇది ప్రపంచ చరిత్రలో అపూర్వమైన అంశం. మతాతీతమైన ఒక ఆధ్యాత్మిక శక్తిని భౌతిక జీవనానికి పునాదులుగా నిలిపే ధర్మచైతన్యం హిందూయిజం. స్వామి దర్శించిన భారతాత్మ కూడా ఇటువంటిదనే రెడ్డిగారి నిశ్చయం.

భారత రాజ్యాంగంలోని 'సెక్యులరిజం' ను గూర్చి అభిప్రాయభేదా లున్నాయి. మత ప్రమేయంలేని లౌకిక రాజ్య వ్యవస్థలో మతానికి చోటు లేదని కొందరు వ్యాఖ్యానించటం పొరపాటని రెడ్డిగా రంటారు. మతమంటే హిందూధర్మ దర్శనం లోని సర్వమత సహనరూపమైన సౌజన్యశీలం. దీన్ని మతంగా చెప్పిన దానికంటె ఆధ్యాత్మిక భావం—లేక—స్పిరిచ్యువలిజం అనటం మేలంటారు. సెక్యులరిజమంటే నిజానికి స్పిరిచ్యువలిజమే అని రెడ్డిగారు సమన్వయిస్తారు. అలా అన్వయించటం భారతీయ సంప్రదాయానికి మాత్రమే సాధ్యమని సగర్వంగా చెప్పుకోవచ్చు నని వక్కాణిస్తారు. ఒక జాతి ఆలోచన దాని మౌలిక ధర్మాన్ని బట్టి ఏర్పడుతుంది. ఆ ధర్మాన్ని విస్మరిస్తే ఆ ఆలోచన నేల విడిచిన సా మవుతుందంటా రాయన. నిజం!

భారతీయ ఆధ్యాత్మిక భావాలను వ్యాప్తి చేయటానికి డా. రెడ్డిగారు వేదాలనూ, ఉపనిషత్తులనూ, రామాయణ మహా భారతాలనూ, భగవద్గీత మొదలైన ఆధ్యాత్మిక గ్రంథాలనూ అందరికీ తెలిసే తెలుగులో, ఇంగ్లీషులో, ప్రాంతీయ భాషల్లో తర్జుమా చేయించి విరివిగా పంచిపెట్టాలనీ, ఇటువంటి ప్రణాళికలకు దేవాదాయ ధర్మాదాయ నిధులను ఉపయోగించాలనీ వారు భావించారు. ఈ పని చేస్తే రెడ్డిగారు ఇతర మతస్థులను హిందూమతంలోకి మార్చటానికి యత్నిస్తున్నారని కొందరు ఆధునికులు భావించవచ్చు. కాని, అది పొరపాటు. హిందూధర్మం మతం కాదు; అది ఆధ్యాత్మిక జీవన విధానం. అందువల్ల, రెడ్డిగారు మనిషిని మార్చుకోమంటోంది మతాన్ని కాదు; మనిషి ఇరుకు సందుల్లో నుండి అనంత విశ్వంవైపు పయనించా లని ప్రబోధిస్తున్నారు.

## ప్రాథమిక విద్యాభ్యుదయ సంస్థ

జాతికి ఇటువంటి సంస్కారం అలవడాలంటే విద్యావిధానంలో దానికి తగిన బీజాలు ప్రాథమిక దశలోనే పడాలి. ఆపైన విశ్వవిద్యాలయాల వరకూ వ్యాపించాలి. అందువల్ల డా. రెడ్డిగారు లౌకిక విజ్ఞానంతోపాటు ఆధ్యాత్మిక నైతిక ధర్మాలను విద్యార్థుల కందించగలిగే విద్యాప్రణాళికను రూపొందించాలని ప్రయత్నం చేస్తున్నారు. దాదాపు 600 ఆదర్శ పాఠశాలలను రాష్ట్రంలో స్థాపించాలని కంకణం కట్టుకున్నారు. "ప్రాథమిక విద్యాభ్యుదయ సంస్థ" వారి విద్యాదర్శంలో నుంచి ఆవిర్భవించిన ఆదర్శ విద్యాపీఠం. భగవాన్ శ్రీ సత్య సాయిబాబావారి బృందావనం (బెంగుళూరు)లో శిక్షణ పొందిన అధ్యాపకులతో ఆ సంస్థ కొక ఆదరణయోగ్యమైన రూపకల్పన చేయాలని భావిస్తున్నారు. లౌకికాభ్యుదయమే పరమ గమ్య మనుకుంటే మనిషి నైతికంగా దిగజారిపోతాడు; ఆధ్యాత్మికంగా దివాలా తీస్తాడు. నేటి ప్రపంచం ఆత్మను కోల్పోయి వెదుక్కుంటోంది. అది భారత దేశంలో దొరకవచ్చుననే ఆశతో ఉన్నది. ఆధ్యాత్మిక తత్త్వం విద్యలో, వర్తనంలో వెలుగొందిన నాడు భారతదేశం ప్రపంచానికి మరలా మార్గం చూపించగలదని డా. రెడ్డిగారి దృఢవిశ్వాసం.

## మనిషిలోని వెలుగే దైవం

'యద్య ద్విభూతిమ త్సత్త్వం శ్రీమదూర్జిత మేవ వా
తత్త దేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశ సంభవమ్.'



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

(ఎక్కడ ఏ ప్రాణిలో ఏ విభూతి కనిపించినా, శోభ కనిపించినా, శక్తి కనిపించినా అదంతా నా తేజస్సు యొక్క అంశం లోంచే ఉద్భవించిందని తెలుసుకో)— అనే గీతాకారుని వాక్యం ప్రతిభను దైవానికి ప్రతిరూపంగా భావించే ప్రవృత్తిని రెడ్డిగారిలో రేకెత్తించింది. కింకరుని నుండి శంకరుని దాకా రెడ్డిగారు వ్యక్తిలోని వెలుగును చూచి గౌరవిస్తారు. కార్యకర్తలూ, కళాకారులూ, కర్షక కార్మికులూ, కవి పండితులూ, మహానాయకులూ, మతగురువులూ—అందరూ ఏదో కొంత విశేషంగా దైవాంశతో వెలుగొందేవారనే విశ్వాసం వారికి ఉంది. 'సహస్ర శీర్ష పురుషః' అంటే సమాజ విరాణ్మూర్తి అనే దృక్పథం వారిది. ఆదర్శపురుషులనూ, ఆధ్యాత్మికశక్తియుక్తులనూ అవతారపురుషులని భావించే సంప్రదాయం ఈ దేశంలో ఉంది. దాన్ని రెడ్డిగారు అంగీకరించినా—అది మూఢభక్తికి మూలకందమై జాతిని నిర్వీర్యం చేయకూడదనీ, కార్యాచరణకు తోడ్పడి ఉత్తమాదర్శాలకు ఊపిరి పోయాలనీ భావిస్తారు. 'రాముని జీవితం అందించే సందేశం నీ జీవితాన్ని ఉత్తేజితం చేస్తుంటే అతన్ని అవతారపురుషు డంటే వచ్చే తప్పేమిటి? ప్రగతికి అతని భావన ప్రాణం పోస్తున్నది కదా!' అని అంటారు రెడ్డిగారు. అలాగే ఆదిశంకరుల అద్వైతం ఆత్మజ్ఞానంతోపాటు భారతీయ సమైక్యతా భావనకు బలాన్నిస్తుందని రెడ్డిగారు విశ్వసిస్తారు. 'మానవ సేవయే మాధవ సేవ' అన్న గాంధీగారి సూక్తిలోని అర్థాన్ని ఆచరణలో పెట్టవలసి వస్తే మానవునిలో మాధవుణ్ణి చూడగలిగే సంస్కారం జాతికి రావలసి ఉంది. మనిషిని దేవునిగా భావించి సమభావాన్నీ, ప్రేమ భావాన్నీ పెంచుకొనే పద్ధతిలో భౌతికాతీతమైన ఆధ్యాత్మిక తత్త్వం ఉంది. దాన్ని రెడ్డిగారు ఎప్పుడూ విస్మరించరు. అందువల్లనే వారి భావనలో మనిషిలోని వెలుగే దైవం; అది అన్ని మతాల సారం!

## హరిహరాద్వైతం

డా. మర్రి చెన్నారెడ్డిగారు శివభక్తులు; వారి సతీమణి శ్రీమతి సావిత్రీదేవిగారు కృష్ణభక్తురాలు; తెలుగు నేల ఎంత విచిత్రమైనదంటే—హరనామ ముచ్చరిస్తే హరి ప్రత్యక్ష మౌతాడని పోతన్న చమత్కరించాడు. 'రావే ఈశ్వర! కావవే వరద సంరక్షింపు భద్రాత్మకా!' అని మొరపెడితే వైకుంఠనాథుడు ప్రత్యక్షమై గజేంద్రుణ్ణి రక్షించాడు ఆంధ్ర మహాభాగవతంలో. అట్టి తెలుగువారి హరిహరాద్వైతాన్ని ఈ దంపతులు తమ భక్తి మార్గాల్లో సాధించుకొన్నారు.

శ్రీమతి సావిత్రీదేవిగారు శ్రీ కృష్ణదేవుణ్ణి డా. చెన్నారెడ్డిగారిలో దర్శిస్తారు. అది భర్తగారి శివారాధన తత్పరతకు విరుద్ధం కాదు. ఈశ్వరునిలోని ఐశ్వర్యాన్ని తనలో ఇముడ్చుకొని లీలావతార మెత్తినవాడు శ్రీకృష్ణుడు. రామునికి శ్రీకృష్ణుని కున్నంత భోగం లేదు, ఐశ్వర్యస్ఫూర్తి లేదు. శివునికి శ్రీకృష్ణుని రూపవైభవం లేదు. రూప గుణైశ్వర్యాలతో రాగభోగాలతో నిరంతరానంద చిన్మయ లీలా విలాసాలతో అటు రాజనీతిలోనూ—ఇటు ధర్మనీతిలోనూ ఆచార్యత్వాన్ని నిర్వహించి ఒక యుగ పురుషుడుగా నిలిచిన శ్రీకృష్ణుడు చెన్నారెడ్డిగారి కన్నాకుగా నుండాలనీ, ఆ దైవశక్తులు తన భర్తయందు ప్రకాశించాలనీ ఆ తల్లి భావన. ఎన్ని ఉన్నా అన్నిటికీ ఆదిమూలం ఐశ్వర్యం. అది—భౌతిక అధిభౌతిక ఆధ్యాత్మిక స్థితుల్లో ఈశ్వర భావాన్ని ప్రసాదిస్తుంది. దాన్ని తనకోసం, తన సమాజం కోసం సాధించాలని డా. చెన్నారెడ్డిగారి భావన.

భక్తిగల భార్య పురుషునికి పరోక్ష శక్తి; శక్తియుక్తుడైన పురుషుడు పరమార్థంలో పరమేశ్వరుడు; విశ్వశ్రేయస్సు వారి జీవిత లక్ష్యం.

షష్టిపూర్త్యుత్సవ సందర్భంలో చెన్నారెడ్డి దంపతులకు నరనారీ రూపమైన సమాజమే అర్ధనారీశ్వర స్వరూపంగా ప్రత్యక్షమై ప్రసన్నాశీఃకుసుమమాలల నందించి చిరకాలం సంఘసేవా భాగ్యాన్ని ప్రసాదించాలని ఆశిస్తున్నాను.

ఇతి శమ్.





CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# చెన్నమర్రి

ఉందేల మాలకొండారెడ్డి

సాగుతున్న ఊడలతో
చల్లనైన నీడలతో
చెన్నారెడి మర్రి
చెన్నారెడ్డి మర్రి.

నిజాందొరను కలచి గెలిచి
నిలిచిన ఈ పెద్ద మర్రి
పిట్ట పిట్ట జగడాలకు
బెదురుకోమనె ఎంత వెర్రి !

ఈ మర్రికి జన్మనిచ్చె
పోతుగడ్డ తెలంగాణ,
దీని శాఖ లెదిగి నిలిచె
విశ్వభారతమ్ములోన.

పినాకినీ కృష్ణా గౌతముల నీళ్ళ
అనారతం పీల్చుకొనే దీని వ్రేళ్ళ
ఫలియించని ప్రజారాజ్య
సంస్థాపనకే కుదుళ్ళు.

కంటికి నలుసంత దీని విత్తనం
మంటిని మింటిని కలిపే పెత్తనం
ఈనాటికి అరువదేండ్లు ఈ మర్రికి
ఇంకా పయి కెదుగుతోంది ముమ్మాటికి.

కరకుదనం ఒడలినిండ
కలిగిన ప్రతికాండం
యావదాంధ్రదేశానికి
జీవౌషధభాండం.

ఐదుకోట్ల తెలుగులపై
అమరిన ఏకచ్ఛత్రం
ఝంఝానిల ఘాతులకే
చలింపలే దేమాత్రం.

తెలుగు పౌరుష జ్వాలగ
వెలిగే ప్రతి చిగురాకు
లేమిడి రక్కసి పీదికి
లేచిన పచ్చల బాకు.

దీని వివిధశాఖ లెక్క
గూండ్లు కట్టె పక్షులు
దీని ప్రాపుతో ఢీకొని
తోకముడిచె ప్రతిపక్షులు.

పేదలు సంపన్నులన్న
భేద మెన్నక వలదు వలదు
నిఖిలప్రజలకీ వృక్షము
నీడ నిచ్చి ప్రోవగలదు.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# వటవృక్షం

కొలకలూరి ఇనాక్

కాలం అరవై ఏళ్ళనాడు
కళ్ళు కద్దుకొన్న మర్రి విత్తనం
ఇవాళ మహా వటవృక్షం.

కాలం గుండె పీల్చిన గాలి
వటవృక్షం తల నిమిరింది.
విశ్వరహస్యం వినిపించింది.

ఇంత పెద్ద వటవృక్షం
ఇప్పుడీ ప్రాంతంలో లేదు.
ఉత్తుత్తి పిల్లగాలుల కల్లాడని
ఉండుండి పడే పిడుగుల కదరని
ఉడతూపులకు బెదరని
ఒట్టొట్టి మోతలకు చెదరని
వటవృక్షం నిటలాక్షం.

తెల్లారినా నిద్ర లేవని పిల్లల పిట్టల్ని
లేపి బడికి పంపుతుంది.
సోమరిగా కొమ్మల్ని రెమ్మల్ని గిల్లితే
అదిలించి తోవ చూపుతుంది.

చలిగాలి చివరలు కొరికి
పొగమంచు మసకలు తుడిచి
ఆకుల పందిట్లోని
వెన్నెల మరకలు చెరిపి
ఆరేసిన మమతల దుప్పటిలా వటవృక్షం.

నింగి నేలమీదికి వదిలిన
తాజావార్తా పత్రికలా
అవని గగనానికి పంపిన
ఆకాశవాణి వార్తలా
వటవృక్షం అక్షర విక్షేపం.

ఆర్తుల దోసిళ్ళలో కాయల కెంపులు
ముంగిళ్ళలో ఆకుల పచ్చలు
అండ చేరితే కొండంత నీడ
కోటంత మేడ.

సామాన్యుల ఉత్సాహం ఎరువుగా
ఆశలు ఆకాంక్షలు ఆకారంగా
చైతన్యం శక్తిగా
నిలిచి, వెలసి, విరిసింది అసామాన్య
వటవృక్షం.

కాలం ఏటి నీటిలో
తెరచాప ఎత్తిన పడవ వటవృక్షం.
కాలం ఎడారి గమనంలో
గమ్యం చేర్చే ఒంటె వటవృక్షం.

ఈ వటవృక్షం
నింగికున్న వెన్నెలవెల
నేలకున్న కమ్మని కల

పిలిస్తే పలుకుతుంది
పురవీథిలో నిలుస్తుంది
అవసరమై చెంత కెళితే
ఆదరంగా పిలుస్తుంది.

అనాటిదా ఈనాటిదా
ఏనాటిది మర్రిచెట్టు !
అవని అంతవయస్సు
ఆంధ్ర అంత మనస్సు !!


CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# మనసులోని మాటలు

**భవనం వెంకట్రామా రెడ్డి**

తెలుగు కుటుంబంలో జన్మించారు. వివిధభాషా సంస్కృతులకు మేలు కలయిక అయిన వాతావరణంలో పెరిగి ఆధునిక భారతీయ మూర్తిమత్వాన్ని సంతరించుకొన్నారు. వైద్యవృత్తిని అభిలషించి పట్టభద్రులైనా, తమ ప్రవృత్తి ప్రేరణతో ప్రజాసేవాపరాయణులు అయ్యారు. ఇలాంటి విలక్షణతలు కలసి రూపొందిన విశిష్టమైన వ్యక్తిత్వం మన ముఖ్యమంత్రి డా. మర్రి చెన్నారెడ్డిగారిది.

మొదటిసారిగా డా. రెడ్డిగారిని నేను చూసింది 1948 లో. నిజాం రాష్ట్ర ప్రజల విముక్తి పోరాటంలో పెద విహారం చేసిన డా. మర్రి చెన్నారెడ్డిగారిని కలుసుకొని వారి పట్టుదలనూ, ఐక్యబుద్ధినీ, సన్నిహితంగా గ్రహించే అవకాశం నాకూ లభించింది. ప్రాంతీయ విద్యార్థి కాంగ్రెసులో వ్యవస్థాపక కార్యదర్శిగా పనిచేసే రోజులలో (1948) వారు విజయవాడ వచ్చారు. నాటి సాంఘిక రాజకీయ ఉద్యమాలూ, నాటి సమస్యలూ, పరిష్కార మార్గాలూ మొదలగువాటిని గురించి వారికి అలవడ్డ విస్పష్టమైన అవగాహన; కార్యకర్తల మధ్య కార్యకర్తగా, నాయకుల మధ్య నాయకులుగా మెలగ నేర్చిన వారి మెళకువ; జన్మతః అలవడ్డ ఉద్యమ సాహసం; ముఖ్యంగా కార్యకర్తలకు మిత్రులుగా కనిపిస్తూ ప్రోత్సహించే తీరూ చూసినప్పుడు తెలుగు ప్రజలకు కాబోయే మహానాయకుల్లో వారిలో నేను ఆనాడే చూడగలిగాను.

డా. రెడ్డిగారికి ఆ రోజుల్లో అతి సన్నిహితంగా ఉండే అవకాశం నాకు కలుగకపోయినా, వారి లక్ష్యాలూ, కార్యదక్షతా, ప్రజాసేవా రంగంలో వారు చూపే పట్టుదలలూ లోలోపల ప్రశంసాపూర్వకంగా జ్ఞాపకం ఉంచుకొన్నవాణ్ణి కాబట్టే వారికి షష్టిపూర్తి ఉత్సవాలు జరిగే ఈ శుభతరుణంలో కొన్ని సంగతులు మననచేస్తున్నాను.

తెలుగు ప్రజల కంతా ఒక సమైక్య రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరించిన తరువాత (1956) డా. రెడ్డిగారితో నా పరిచయం పెరిగింది. అలా పెరిగిన మా పరస్పర పరిచయంతో వారిపైన అనన్యమైన గౌరవం కలిగిన అనుయాయుడుగా నాకు వారిపట్ల విధేయత, వారికి నాపై వాత్సల్యం పెరుగుతూ వచ్చినవి. నేటి మంత్రిమండలిలో వారి మార్గదర్శకత్వంలో నేను ప్రజాసేవ చేసే అవకాశం కూడ లభింపచేసినారు.

డా. రెడ్డిగారు నన్ను ఆకర్షించిన తీరులో ముఖ్యమైంది ఒకటి: ప్రజల ఉద్యమంలో నాయకు లెందరో బయలుదేరుతుంటారు. యువతరంలో ఉన్నవారిని తమ నాయకత్వం కోసం బాగానే వాడుకొంటారు ఆ నాయకులంతా. యువకార్యకర్తలను గౌరవించడం కొందరు నామోషీగా భావిస్తారు. కొందరైతే తమ అవసరం తీరిన తర్వాత యువకార్యకర్తలను మరిచేపోతారు. ఇలాంటివి మామూలే కదా! కాని, పరిచితులైన కార్యకర్తలను ఎన్నడూ మరచిపోని వ్యక్తిత్వం డా. చెన్నారెడ్డిగారిది. ఆశ్చర్య మేమంటే—తమకు పరిచితులైన కార్యకర్తలు ఎంత చిన్నవారైనా పేర్లతో సహా వారిని జ్ఞాపకం పెట్టుకోవడం ఒక విశేషం. ఏ ప్రాంతానికి వెళ్ళినా ఆ ప్రాంతపు కార్యకర్తలను చప్పున జ్ఞాపకం తెచ్చుకొని, పిలిచి యోగక్షేమాలు అడగడం, వాళ్ళతో ఎన్నాళ్ళనుండి పరిచయముందో ఆ పక్కవారికి చెబుతూ ప్రోత్సహించడం, వారు ఏ రాజకీయ పక్షంలో ఉన్నా, ఏ కోవలో ఉన్నా అవన్నీ పట్టించుకోకుండా వారిని ఆప్తులవలె ఆదరిస్తూ, వారితో కులాసా కబుర్లు చేయడం డా. చెన్నారెడ్డిగారిలో ఉన్న గొప్ప లక్షణాలలో ముఖ్యమైనది. ఉద్యమ కార్యకర్తలకు పార్టీలో స్థానం కల్పించే ప్రయత్నం ఏ నాయకుడైనా అంతో ఇంతో చేసే పనే. డా. రెడ్డిగారు కార్యకర్తలకు తమ హృదయంలో కూడ స్థానం కల్పిస్తారు. ఇలాంటి విశేషాలెన్నో మనస్సులో మెదులుతున్నాయి నాకు ఈ శుభతరుణంలో.

స్థానిక పరిపాలన శాఖకు మంత్రి హోదాలో ఉన్నప్పుడు వా రొకసారి వినుకొండకు వచ్చారు. మంత్రుల పర్యటనల్లో ఏదో ప్రారంభోత్సవం, దేనికో శంకుస్థాపన ఏర్పాటు చేసుకోవడం అయినా స్థానిక ప్రజల సంతృప్తి కదా! డా. రెడ్డిగారిని ఆనాడు ఒక రోడ్డుకు ప్రారంభోత్సవం చేయుమన్నారు వినుకొండ తాలూకాలోని శవ్వూరు పంచాయతీ సమితి వారు. సంప్రదాయ ప్రకారం 'రిబ్బన్' కత్తిరించబోయి, కాస్త ఆగారు రెడ్డిగారు. అందరూ విచిత్రంగా చూడసాగారు. "మట్టిమీద వేసిన ఈ రోడ్డు కంటె—క్రింద కనిపించే ఆ వొంక సౌకర్యంగా కనిపిస్తున్నదే, ఈ 'రిబ్బన్' ఆ వొంకవద్ద



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

కత్తిరించి దానికి ప్రారంభోత్సవం చేస్తే మేలవుతుంది" అన్నారు. ఆ మాటలు విని ఆనాడు ఎవరేమనుకొన్నా డా. రెడ్డిగారు అనుకొంటున్నదీ, అంటున్నదీ అశ్రద్ధగా నడిచే ఉద్యోగులవల్లా, కంట్రాక్టర్లవల్లా నాటికీ నేటికీ ఒకటే. ప్రజలకు సదుపాయాలు కల్పించవలసినవారు స్వార్థంతో సొంత ఉపాయాలు చూసుకోవడం హాస్యాస్పదమే కాదు, అపాయకరం అంటారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే వారిని ఎవరినైనా వారు మందలించడంలో వెనుకాడరు. ప్రజాశ్రేయస్సు దృష్ట్యా వారు చేస్తున్న ప్రకటనలు, హెచ్చరికలు, కొన్నిచోట్ల కొందరికి అప్రియంగా తోచవచ్చు. కానీ, వాస్తవానికి జరిగిన పొరపాట్లు మళ్ళీ జరగకుండా చూడమని వారు అలా హెచ్చరిస్తుంటారు. హితవాదుల మాటతీరు ఇలాగే ఉంటుంది. హితంగా చెప్పే మాట కాస్త కటువుగా కూడా తోచవచ్చు. హితం చెబుతున్నప్పుడు అందరికీ మనోహరంగా చెప్పడం ఎంతవారికైనా అసాధ్యమే మరి. డా. రెడ్డిగారు అలా చెప్పారని అనుకోవడం అటుంచి, ఆ చెప్పిన దానివెంట సక్రమంగా నడవగలగాలనే ప్రజల ప్రగతికి తోడ్పడటమే మన కర్తవ్యం.

ఏది నిర్వహణలో—ఎవరితోనైనా— తను తన సొంత వ్యక్తిత్వం కాపాడుకోవడానికి డా. రెడ్డిగారు చెప్పే మాటలు మార్గదర్శక సూత్రాలవలె పనిచేస్తుంటాయనే సంగతి వారి సన్నిహితులందరికీ తెలిసిందే.

కేంద్రంలో ఉక్కు పరిశ్రమల శాఖకు మంత్రిగా ఉన్నప్పుడు మరోసారి విమర్శలకు గురయ్యారు. 'అగ్నిగుండాల' లో రాగి గనులకు కల్పించిన రక్షణభద్రతలు తలుచుకొంటే—డా. రెడ్డిగారి పుణ్యమా అని అంత మంచిపని జరిగింది అని చెప్పడానికి సాహసిస్తున్నాను. లేకుంటే అక్కడ ఆనాడు ఉండే పరిశ్రమ అంతా ఉత్తర హిందూస్థానానికి ముఖ్యంగా ఖేత్రికి తరలించడం జరిగి ఉండేది. ఇంతేకాదు, ఆనాడు అక్కడ ఉక్కు పరిశ్రమ నిపుణులను రెడ్డిగారు ప్రశ్నించిన తీరు తలుచుకొంటే ఆశ్చర్యం వేస్తుంది. తాను నేర్చింది వైద్య విద్య. అయినా ఉక్కు పరిశ్రమ లోతుపాతులు, కిటుకులూ అంత సూక్ష్మంగా ఆకళింపుచేసుకొని, **Geological and metallurgical details** లో ఆ నిపుణులను అంత అద్భుతంగా ప్రశ్నించిన వారి విషయపరిజ్ఞానమూ, పరిపాలనా దక్షతా నన్ను ఈనాటికీ సంభ్రమపరిచేసే మంచి జ్ఞాపకంగా మిగిలింది. తాను ఏ శాఖలోకి మారినా, ఏ బాధ్యత స్వీకరించినా, ఆ పని కొత్తదే అయినా, ఆ కొత్తను చటుక్కున గ్రహించగలిగే ప్రజ్ఞ రెడ్డిగారిది.

అటువంటి వ్యక్తుల శక్తి సామర్థ్యాలు చూసి, అవి తమకు లేనందుకు లోలోపల అసూయ పడేవారు కొందరు—ఏ రంగంలో నైనా—ఉంటారు. తమ అసూయతో బయటపడకుండా పోటీదార్లకు హాని తలపెట్టే మనస్తత్వాలు సరే. నేటి ప్రజాస్వామ్య రాజకీయ రంగంలో నేను మామూలు కార్యకర్తగానే ఉండి, డా. రెడ్డిగారి ప్రత్యర్థుల ప్రవర్తనను కూడా చూస్తూ వస్తున్నాను. డా. రెడ్డిగారిపై రహస్య కుట్రలు పన్నడమే కాదు, వారికి బహిరంగంగా అపకారం చేయ సాహసించే వారు కొందరు. అపకారం చేసినవారు కొందరు. తనకు అపకారం చేసిన ప్రత్యర్థుల విషయంలో కూడా, వారి సామర్థ్యాన్ని గుర్తించి గౌరవించిన రెడ్డిగారి ఘనతను ఏమనాలో! 'అపకారికి ఉపకారం' అందామా? వారి క్షమాగుణం అందామా? లేదా వారిలో ఏదో దివ్యాంశతో కూడిన రాజనీతిజ్ఞత ఉంది అని భావించాలా? ఇలాంటి వాటి సమన్వయంతో ఏర్పడ్డ రాజనీతి మనీషిత్వం అనవచ్చు రెడ్డిగారిది.

రెడ్డిగారిలో అప్పుడప్పుడు హఠాత్తుగా తళుక్కున మెరిసే ఆలోచనలు పరిపాలనారంగంలో కత్తిమెరుపులవలె భాసిస్తుంటాయి. తమతో పోటీకి దిగి సంక్షోభం సృష్టించిన శ్రీ వందేమాతరం రామచంద్రరావుగారిని 'అధికార భాషా సంఘం' అధ్యక్షులుగా నియమించడం చూసినవారు రెడ్డిగారి రాజనీతిజ్ఞతకు, పరిపాలనా వైశిష్ట్యంతో కూడిన నిర్ణయాలకు ఆశ్చర్యపడనివారు ఉండరు.

రాజకీయ పార్టీలో సభ్యత్వం ముక్కుతాడు వంటిది. తమ నాయకుని ఆజ్ఞ సుగ్రీవాజ్ఞ. అంతే. కానీ, డా. రెడ్డిగారి నాయకత్వంలో—నేను స్వయంగా, ప్రత్యక్షంగా భావిస్తున్నది చెబుతున్నాను—మంత్రిమండలి సమావేశాల్లో గానీ, లెజిస్లేచర్ పార్టీ సమావేశాల్లోగానీ సభ్యులు తమ అభిప్రాయాలు బాహాటంగా ప్రకటించవచ్చు; చర్చించవచ్చు, అభిప్రాయభేదాలు కూడా చూపవచ్చు. ఇంతేకాదు, ప్రతిపక్ష సభ్యులు కూడా ముఖ్యమంత్రి హోదాలో ఉన్న రెడ్డిగారితో ఏ విషయమైనా సావకాశంగా చర్చించవచ్చు. ప్రజా సంక్షేమం దృష్ట్యా వారు ఎప్పుడైనా రావచ్చు, ఏదైనా సూచించవచ్చు. అలాంటి వన్నీ చిరునవ్వుతో స్వీకరించే మహాత్మ ప్రజాస్వామ్య నాయకత్వం వారిది.

ఇలా పార్టీగతమైన విషయాల్లోనే కాదు, వ్యక్తిగత విషయాల్లో కూడా డా. రెడ్డిగారు చూపే మానవీయమైన మాన్యత తలుచుకొన్నప్పుడు నన్ను పులకింప చేస్తుంది: గత సంవత్సరం (నవంబరు 22 వ తేది) నా కుమారుని శస్త్రచికిత్స



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

జరుగుతున్న విషాద స్మృతి; ఢిల్లీ నుంచి అప్పుడప్పుడే వచ్చిన రెడ్డిగారు—ఆ శస్త్రచికిత్స జరిగే చోటుకి—హుటాహుటిని వచ్చారు. నాకు ధైర్యం చెబుతూ ఉండడమే కాకుండా మూడు గంటల ముప్పై నిమిషాలసేపు అక్కడ జరిగిన శస్త్రచికిత్సలో డాక్టర్లలో ఒక డాక్టరుగా వస్త్రాలు ముసుగులు వేసుకొని సహకరించడం, తన అనుచరుడనైన నన్ను అంత ఆత్మీయతతో అభిమానించడం నా జీవితంలో మరువరాని సంగతి.

రెడ్డిగారిలో దివ్యాంశ ఉందని పైన ఒకచోట అన్నందుకు అతిశయోక్తిగా భావించేవారు ఉంటారేమో! రెడ్డిగారికి దైవభక్తి అన్నా, దివ్యజ్ఞానదర్శన మన్నా పుట్టుకతో వచ్చిన భావనా విశేషంగా చూస్తున్నాను. హైదరాబాదులో శ్రీ శృంగేరి శంకరాచార్యులకు షష్టిపూర్తి ఉత్సవం జరిగితే ఆ సభకు రెడ్డిగారే అధ్యక్షులు. వారి ఉపన్యాసానికి విజ్ఞులంతా ఎంతో ముగ్ధులయ్యారు. ఇలాంటి విశేషాలు ఎన్నైనా చెప్పవచ్చు.

తెలుగు ప్రజల ఆర్థిక ప్రగతితోపాటు, తెలుగుభాష అన్నా, సంస్కృతి అన్నా, ఆత్మీయత అన్నా, రెడ్డిగారికి మొదటినుంచీ ఎనలేని ప్రత్యేకాభిమానం. ఉత్తరప్రదేశ్‌కు గవర్నరుగా ఉన్న రోజుల్లో జరిగిన విశేషం ఒక్కటి: ఉత్తర దేశ నాయకులను ఉద్దేశించి పలుకుతూ "మీరు 'గంగ' అంటారు, మేమూ అంటాం. మీరు 'యమున' అంటారు, మేమూ అంటాం. మీరు 'గోదావరి' అనరేం? 'కృష్ణ' పేరెత్తరెందుకు?" అని అడిగేవారు. ఇలా సమగ్రంగా మాట్లాడి అఖిల భారత సమైక్య భావాన్ని ప్రోత్సహించడం డా. రెడ్డిగారు నేర్చిన ప్రత్యేక విద్య. ఆంధ్రప్రదేశ్‌లోని భాషా-సాహిత్య నిపుణులను కొందరికి ఉత్తరప్రదేశ్ విశ్వవిద్యాలయాల్లో గౌరవ సన్మానాలు జరిపించారు డా. రెడ్డి.

విద్యాభివృద్ధి పథకాల్లో వారు చూపిస్తున్న శ్రద్ధ, ఆసక్తి, అంకితభావం వారి విద్యా పాండిత్యాన్ని గురించి చెప్పడం సముచితంగా భావిస్తున్నాను: విద్యా విషయకమైన చర్చలు మేము చేస్తున్నప్పుడు "ఇచ్చునది విద్య" అన్న ప్రాచీన సూక్తానికి ఆధునిక వ్యాఖ్యలు చేస్తున్నట్లు ఉంటాయి రెడ్డిగారి పలుకులు. మూడు దశాబ్దాలు దాటిన ఈ ప్రజాస్వామ్య విధానాలలో పెద్ద కొండలో పెద్ద పెద్ద మనుష్యులే చేరారు. పిల్లల చదువుల సంగతి పట్టించుకోవడానికి ఆ పెద్దలకు అంతగా తీరిక లేకపోయింది. ఈ లోటును బాగా గుర్తించిన మన ముఖ్యమంత్రిగారు 'అభ్యుదయ-ప్రాథమిక-విద్యాసంస్థ' నెలకొల్పారు. విద్యారంగంలో విప్లవమనదగ్గ ఈ మార్పు కేవలం ఆంధ్రప్రదేశ్ వరకు మాత్రమే పరిమితం కాదు. అఖిలభారత బాలబాలికలందరికీ సర్వసామాన్యంగా అందుబాటులోకి తెచ్చే ప్రగతిశీలమైన విద్యావిధానం ఇది. ఎంత వ్యయమైనా సరే ప్రాథమిక స్థాయిలో ఆదర్శ పాఠశాలలు స్థాపించే పట్టుదలతో ఉన్నారు రెడ్డిగారు. పిల్లల విద్యాభ్యాసంలో అవలక్షణాలు, అనుమానాలు, తొలగించే ఈ పథకం ప్రకారం ఏర్పడే పాఠ్యప్రణాళిక సరికొత్తది. జాతీయ జీవనాభ్యుదయ రేఖలు ప్రాథమిక దశలోనే వికసింప ప్రకాశింపజేసేటట్లు కాబట్టి నవీన భావ పరిమళాలు, ప్రయోజనకరమైన బోధనలు, భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను వికాసమిచ్చే యోగాభ్యాసాలూ, సామాజిక శీలం వగైరా విద్యార్థులకు చిన్నతనంలోనే లభించేటట్లు రూపొందుతున్నది ఆదర్శ పాఠశాలల పాఠ్య ప్రణాళిక. అభ్యుదయ విద్యాబోధనయే తమ దీక్షగా, దీపంగా, లక్షించే సుశిక్షితులైన ఉపాధ్యాయులు కూడా ఈ పథకంవల్ల లభిస్తారు.

విశ్వవిద్యాలయ స్థాయిలో కూడా ప్రయోజనకరమైన మార్పులు ఆశిస్తున్నారు డా. రెడ్డిగారు. అభ్యసించే విషయం **(Subject)** ఒకటే అయినా, దాని పాఠ్యప్రణాళిక ఒక్కొక్క విశ్వవిద్యాలయంలో ఒక్కొక్క తీరులో ఉంది. దీనివల్ల ఒక విశ్వవిద్యాలయ విద్యార్థి మరో విశ్వవిద్యాలయానికి వెళ్లి అవే పాఠ్యాంశాలు అక్కడ చదివే అవకాశం ఇప్పుడు లేదు. అది కల్పించవలసి ఉంది. విశ్వవిద్యాలయ అధ్యాపకులు కూడా ఉద్యోగరీత్యా ఒక సంస్థనుంచి మరో సంస్థకు మారే వీలు ఉండాలి. పరీక్షా విధానం మారాలి. ఆధునిక ప్రయోజనాలకు సానుకూలమయ్యే పరిశోధనలు జరగాలి. తెలుగులో విద్యాబోధన ఇంకా ప్రగతి సాధించాలి. డా. రెడ్డిగారి నాయకత్వంలో ఇలాంటి అభ్యుదయం సాధించే అవకాశం పుష్కలంగా ఉంది.

ఉర్దూ భాషకు ఉన్న స్థానం ఉన్నదే. ఆ స్థాయి కాపాడాలి అంటారు శ్రీ రెడ్డిగారు. తెలుగు ప్రాధాన్యం తెలుగుకు లభించాలి. రాష్ట్రమంత్రులూ, శాసన సభ్యులూ అంతా తెలుగులో మాట్లాడినప్పుడే ప్రజలకు దగ్గరగా రాగలుగుతారు—అని వారు అసెంబ్లీ సమావేశాల్లో చెబుతూ ఉంటారు. అలా ఆచరించా లని హెచ్చరిస్తుంటారు.

తెలుగుభాష ఆధునిక విజ్ఞానదాయినిగా రూపొందాలని, తెలుగు వారలు అన్ని రంగాల్లోనూ అభ్యుదయం సాధించాలని ప్రతిరంగాన్నిగా ఆ సామర్థ్యాన్ని ధారపోస్తున్న డా. మర్రి చెన్నారెడ్డి గారు మరో అరవై యేళ్లు ఇలాగే ప్రజల ప్రతినిధిగా, నాయకులుగా ఉండాలని మనసారా కోరుతూ భగవంతుని ప్రార్థిస్తున్నాను.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# అఖండ చైతన్య గోదావరి

బి. యస్. రెడ్డి

ప్రకృతి కోపించినా
ప్రభాకరుడు మండు టెండలు చెరిగినా
గంటల తరబడి నీకోసం నిరీక్షించే
అసంఖ్యాక పేద ప్రజల
ప్రేమానురాగములకు
నీ హృదయము ద్రవించి
ఆ జనావళి ఋణము తీర్చుకొనుటకు
యీ జన్మ చాలదు మరొక జన్మ నిమ్మని
వేడుకొంటివట ఏడుకొండలవాడిని
ధన్యము నీ జీవితము మర్రి చెన్నయ్యా.

గత అరువదేండ్ల జీవిత సంగ్రామమున
నీ లక్ష్యాన్ని సాధించడానికి
లక్ష్యపెట్టలేదు లక్షల అడ్డంకులు వచ్చినా
సమస్యల కొండల్ని పిండిచేసి
సంకటముల వనమ్ము లెన్నో వమ్ముచేసి
అగణిత ప్రజాకోటి జీవిత క్షేత్రాలలో
ఆనందం పండించాలని
అహర్నిశం పోరాటం సల్పే
అఖండ చైతన్య గోదావరి నీవు
అచంచల దృఢసంకల్పంతో
ప్రవహించే కృష్ణాఝరి నీవు.

నిద్రాహారాలను లెక్కచేయక
నిరంతరం చేసిన సేవాతపస్సులో
ఆర్జించావు మరోజన్మ
పునర్జన్మ కాదిది నీకు
మహోజ్జ్వల నవజీవితానికి
మరో మజిలీ ఇది.
ఆ కాళయుక్తిలో పుట్టి
యీ కాళయుక్తికి అరువదేండ్లు నింపుకొని
సరికొత్త జీవితం సంతరించుకొనే
యీ శుభసమయాన
ఆంధ్రదేశానికి ముఖ్యమంత్రి నీవు.
ఐదుకోట్ల ఆంధ్రుల ఆశాజ్యోతి నీవు.

నీ ప్రేమపూరిత సంభాషణా కౌశల్యముతో
నీ చిరునవ్వుల చమత్కార చాతుర్యముతో
శత్రుశక్తిని జయించి
మిత్రశక్తిని క్రోడీకరించి
దేశంలో సిరిసంపదలు వెల్లివిరియ
ప్రజాహిత కార్యము లెన్నో చేసి
పేదవారి పెన్నిధిగా పేరుగాంచి
చరిత్రలో చెరిగిపోని ముద్రలు వేయగల
ప్రజానాయకుడవు నీవు
అశేషప్రజానీకాన్ని
ప్రగతిపథంలో నడిపించగల
ప్రజ్ఞాసింధు నీవు.

సకల సంబరములతో
షష్టిపూర్తి జరుపుకునే
మంగళప్రద ముహూర్తమున
అర్థిస్తున్నాను ఆ దేవుణ్ణి
ఆయురారోగ్యాలు ఇమ్మని నీకు
ప్రార్థిస్తున్నాను ప్రసాదించమని
సమైక్య ప్రజాశక్తి వజ్రాయుధాన్ని నీకు.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org




హైదరాబాదు మొట్టమొదటి ప్రజాప్రభుత్వంలో ఆయన సహచరులతో (మార్చి 6, 1952)

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org



శ్రీమతి విజయలక్ష్మి పండిట్, డా. రాధాకృష్ణన్, శ్రీ షేక్ అబ్దుల్లా ప్రభృతులతో



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org



మంత్రిగా గవర్నర్ భీమ్‌సేన్ సచార్ పదవీ ప్రమాణ స్వీకారం చేయిస్తున్నప్పుడు (1962)



గవర్నర్ శారదా ముఖర్జీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం
చేయిస్తున్నప్పుడు (మార్చి 6, 1978)

# స్నేహానికి మరోపేరు చెన్నారెడ్డి

అక్కినేని నాగేశ్వరరావు

'సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్' అన్నా రొక కవి. స్నేహానికి మరో పేరు డాక్టరు చెన్నారెడ్డిగారు— అంటాను నేను.

ఎప్పుడో ఇరవై అయిదు సంవత్సరాల క్రిందట కలుసుకున్నాము మేము. వృత్తి వ్యాపకాల రీత్యా వేరువేరు కోవలకు చెందిన మేము గమ్మత్తుగా కలుసుకుని, ఆకర్షింపబడ్డాము. నిజంగా యిది పూర్వజన్మ బంధమేమో. కలుసుకున్న మా పరిచయం స్నేహంగా రూపొంది, ఆత్మీయతగా పెరిగిపోయింది. ఈ రెండున్నర దశాబ్దాల కాలంలో మేము ఒకళ్ల నొకళ్లం ఎంతగానో అర్థం చేసుకున్నాము.

అది 1953వ సంవత్సరం. బందరులో ఆంధ్ర నాటక కళాపరిషత్తు సభల సందర్భంలో శ్రీ కాజా వెంకట్రామయ్యగారు, శ్రీ పుయ్యూరు కుమార రాజాగారు మాకు పరిచయం కల్గించారు. అదే మొట్టమొదటిసారిగా డాక్టరు చెన్నారెడ్డిగారిని కలుసుకోవటం. అప్పుడు సాగిన మా సంభాషణలలో—వారికి లలితకళలమీద, ముఖ్యంగా సినిమాల మీద ఎంతో సదభిప్రాయం ఉందనీ, వారు తరచు తెలుగు చిత్రాలు చూస్తారనీ నేను తెలుసుకున్నాను. అంతకు మించి, వారి రాజకీయ జీవితం, ప్రజా నాయకత్వం గురించి నా కేమీ తెలియదు.

ఆ తర్వాత సంవత్సరం, హైదరాబాద్‌లో నాటక కళాపరిషత్తుకు నేను వచ్చినప్పుడు శ్రీ చెన్నారెడ్డిగారి గృహంలోనే, వారి అతిథిగా ఉన్నాను. వా రప్పుడు హైదరాబాద్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. వారింట్లో ఉన్న ఆ స్వల్పకాలంలోనే డాక్టరుగారి అతిథి సత్కారాలతోబాటు, శ్రీమతి సావిత్రి చెన్నారెడ్డిగారు, వారి పిల్లలయొక్క ఆదరాభిమానాలు పొందగల్గాను. ఎంతో మానసిక సంస్కారమున్న ఆ కుటుంబ సభ్యులంతా కళాకారుల యెడల చూపే గౌరవ ప్రేమాభిమానాలు నన్నెంతగానో ఆకట్టుకున్నాయి.

ఆ తర్వాత చెన్నారెడ్డిగారు మద్రాసు రావటం, మా యింట్లో ఆతిథ్యం స్వీకరించటం, వారి కుటుంబం, నా కుటుంబం ఎంతో సన్నిహితులు కావటం జరిగింది. ఈ రాకపోకలలో కలుసుకున్నప్పుడల్లా, డాక్టరు చెన్నారెడ్డిగారు తమ సంభాషణలలో, చిత్రపరిశ్రమపై తమకు గల సదభిప్రాయాన్ని, కళాకారులపై గల గౌరవభావాన్ని వెలిబుచ్చుతూ ఉండేవారు. కళాకారులంటే, ముఖ్యంగా సినిమా నటీనటులు అంటే చాలా చులకనగా చూసే రోజులవి. వాళ్లంతా పిచ్చిపిచ్చి ఊహలతో ఉంటూ, వాళ్లు చెడటమే కాక యితరులను కూడా చెడగొడ్తారని భయపడి సినిమావార్ని వెలివేసే రోజులవి. డాక్టరుగారికి చిత్రజగత్తుపై సదభిప్రాయ ముండటమే కాక, కళాకారుల్ని అభిమానించి గౌరవించేవారు. 'నేను కళాకారుల్ని అభిమానిస్తాను. వీరిలోని కళను గుర్తించి గౌరవిస్తున్నాను' అంటూ రాజకీయంగా చెప్పకుండా, హృదయంతో చెప్పిన ధైర్యశాలి శ్రీ చెన్నారెడ్డిగారు. చిన్నా పెద్దా, మగ ఆడ అనే భేదం లేకుండా వారిలోని కళా చైతన్యాన్ని గౌరవించి మెచ్చుకునే కళా హృదయం డాక్టరుగారిది. తన శత్రువులో కూడా, నటనా సామర్థ్యం, కళాహృదయం ఉంటే, నిష్పక్షపాతంతో మెచ్చుకునే సహృదయులు చెన్నారెడ్డిగారు. "కళాకారుడిలో దైవాంశ కాస్త కూస్త ఉంటుందయ్యా, వివిధ పాత్రల్లో జీవిస్తూ విభిన్న తత్వాలు, అభిరుచులు గల ప్రజానీకాన్ని స్పందింపజేయ గల్గుతున్నారంటే—ఈ కళాకారుల గొప్పతనాన్ని మెచ్చుకోవాలి" అనే రసహృదయులు డాక్టరుగారు.

నే నెప్పుడూ రాజకీయాలను గురించి వారితో చర్చించనూ లేదు. నా కందులో ప్రవేశమూ లేదు. చెన్నారెడ్డిగారి లోని 'మానవత'కు సదా జోహార్లర్పిస్తాను. ఆయన నిజమైన మానవతావాది. 'మనిషి'. తన మాటల్లో, చేతల్లో, మిత్రత్వం



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

ప్రదర్శించే తీరులో, ఎదుటి వ్యక్తిని గౌరవించే విధానంలో, అసాధారణమైన వ్యక్తిత్వాన్ని ప్రదర్శించాడు. ఆత్మీయులను నిలువెల్లా నింపుకునే మహనీయుడు చెన్నారెడ్డి.

సెంటిమెంటు—స్నేహం—ఆప్యాయత అనే పదాలకు నిజమైన అర్థం, విలువ ఆయనదగ్గరే చూడగలం. స్నేహితుడు అంటే ఆయనే.

## కళా హృదయుడు

రాజకీయాల్లో సమర్థుడైన నాయకుడే కావచ్చు—పరిపాలనలో ఘనుడే కావచ్చు—తెలుగు దేశాన్నే కాక యావద్భారత దేశ భవిష్యత్తును తీర్చిదిద్దగల మహనీయుడు కావచ్చు—ఆధ్యాత్మిక చింతనలో మహాభక్తుడని అన్నివర్గాలవారి కీర్తింపబడవచ్చు—కాని ఎందర్నో ఆకర్షించిన ఈ సద్గుణాలు మాత్రమే కారణం కాదు, నన్నాయనవద్దకాకర్షించిన గుణాలు. కానేకాదు. కళాహృదయము, సంస్కారము, స్నేహశీలత నిలువెల్లా నింపుకున్న చెన్నారెడ్డిగారి ముందు, నేను ముగ్ధుణ్ణయి, శిరస్సు వంచుతాను. ఆయనను గౌరవించి, ఆయనకు సన్నిహితం చేసిన గుణాలు అవే.

డాక్టరుగారి కంటే చిన్నవాణ్ణి. ఆయన పదేండ్లకు పైగా పెద్దవారు. జీవిత ప్రయాణంలో ఎంత ముందినో చూశాను. వృత్తిరీత్యా నటుణ్ణే అయినా, నిజజీవితంలో కూడా ఎంతో నటించాను. 'అట్లా నటించకపోతే, నువ్వు బ్రతకలేవు ఈ సమాజంలో' అంది ఈ లౌకిక ప్రపంచం. చాలామందితో స్నేహం చేశాను. స్నేహానికి అర్థం తెలుసుకుంటూ ఎన్నో సంవత్సరాలు గడిపాను. కొందర్ని గొప్ప స్నేహితులనుకుని పొంగిపోయాను. కొందరివల్ల ఎదురు దెబ్బలు తిని క్రుంగిపోయాను. స్నేహమంటే ఇదేనా—ఇంతేనా అని బాధతో, ఆవేదనతో క్రుంగిన నా మనస్సుకు ఒక మెరుపుతీగలా—స్నేహమనేది మధురమైనదనీ, మైత్రి అనే రెండక్షరాలకు ఎంతో విలువ ఉందనీ—అది పరమార్థమైన మధురభావన అనీ—నేను తెలుసుకునేలాగ చేసి, నిరూపించి, నన్ను ధన్యుణ్ణి చేసిన మహావ్యక్తి డాక్టరు చెన్నారెడ్డిగారు.

అనేకమంది స్నేహితుండని ఎదుట అంటారు. వెనక ఏం మాట్లాడతారో తెలీదు. ఈ లౌకిక ప్రపంచంలో తెలుసుకోవటం కష్టం కూడాను. నేను హైదరాబాద్ తరలి వచ్చినప్పుడు—తెలుగు చిత్రపరిశ్రమ కేదో ఘోరమైన ద్రోహం చేసినట్టు చాలామంది నాపై దుమ్మెత్తి పోశారు. రెండు దశాబ్దాలకు పైగా ఈ సినిమా వ్యవసాయంలో నాతోపాటు సహకరించి నన్ను బాగా అర్థం చేసుకున్న సినిమా కులంలో చాలామంది నాపై అభాండాలు రుద్ది నా పరోక్షంలో ఏమేమో అని, నన్ను మానసిక వ్యథకు గురిచేస్తూ ఉన్న సమయంలో—ఏవిధంగానూ సినిమా పరిశ్రమకు చెందని ఈ రాజకీయ నాయకుడు ఎలుగెత్తి సభాముఖంగా—"అయ్యా—నాగేశ్వరరావు లేని సమయంలో ఇంతమంది ఆయనపై ఈ దుష్ప్రచారం సాగించారు. ఈ దుమారం లేవదీశారు. ఇది దురన్యాయం" అంటూ ఆక్రోశించి, ఆవేదన వ్యక్తంచేస్తూ ఆ బాధను సభలో ప్రకటించి—తన గంభీర కంఠాన్ని దిశల ప్రతిధ్వనింపజేసిన వ్యక్తి డాక్టరు చెన్నారెడ్డిగారు ఒక్కరే. ఇదే స్నేహానికి, మానవత్వానికి గీటురాయి. బహుశా ఆయనకు తెలియందికి పోవచ్చు. నన్ను నిలువెల్లా కదిలించివేసిన ఈ స్నేహశీలత—ఈ ఔన్నత్యం, ఆ నాయకునకు మరింత దగ్గర చేసింది.

తాను స్నేహితుడిగా భావించే వ్యక్తిని ఎవరు లేపున్నా సరే, సహించని వ్యక్తిత్వం డాక్టరుగారిది. రాజకీయాల్లో రౌద్రం ప్రదర్శించి అందరికీ సింహస్వప్నంగా వెలిగినయి ఈ వ్యక్తి 'స్నేహం' అనే రెండక్షరాల సూత్రానికి బద్ధుడైపోయి, తన మిత్రులకు గొడుగు పడ్తాడు. వాళ్లకు తానే కవచమై దూషణభూషణ తిరస్కారాలను భరిస్తాడు. తనను ఉపయోగించుకుని, తనలోని ఈ మహనీయ గుణాన్ని పొగిడే బదులు, వెన్నుపోటు పొడిచే వ్యక్తుల్ని కూడా క్షమించే ఈ సహృదయత గల మనిషిని చూసి గర్వపడ్తా, కాస్త బాధ కూడా పడుతూ ఉంటాను. కాని, ఎవరమూ ఏమీ చెయ్యలేము. సూర్యుడి తీక్షణతను, చంద్రుడి చల్లదనాన్ని, చెన్నారెడ్డి స్నేహభావాన్ని ఎవరు అడ్డుపెట్టగలరు; ఎవరు కాదనగలరు?

ఆయన కనే రాజకీయ కలలకు రూపకల్పన చేసి దేశాన్ని అభ్యుదయ మార్గంలో నడపటానికి కావలసిన పదవి అధికారం ఆయనకు లభించాలి అని సదా కోరుకునేవాణ్ణి. ఏ పదవులూ లేని రోజుల్లో తరచు ఆయన్ని కలుసుకునే నేను, ఈనాడాయన అధికారంలోకి రాగానే, తన ఊహల కొత్త రూపం కల్పించే ఆయన ప్రణాళికలు, పరిపాలనా, దూరంగా ఉండే



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

చూస్తూ, ఆనందపడి పోతున్నాను. ఆయనను కలుసుకుని ముక్తసరిగా మాట్లాడి, ఎక్కువ కాలం ఆయన పాలనా విధానానికి వినియోగపడేలా చేస్తే డాక్టరుగారు రాష్ట్రానికి ఎంతో మేలు చేయగలరు అని నా నమ్మకం. కాని, ఎంతసేపు ఆయనతో మాట్లాడితే అంత ప్రయోజనమని అపోహపడటం మానవ సహజం. ఆయినా వృత్తివల్ల వైద్యులు గాబట్టి—ఎవరెట్లా వున్నా వ్యాధి గ్రహించి మందు చేయగలరు చెన్నారెడ్డిగారు. కొంత మొక్కుబడిగా తెలుసుకుని ఖచ్చితంగా చెప్తారు—అవసరమైతే ఆపరేషనూ చేస్తారు. రోగికి మంచిదే; రోగమూ కుదురుతుంది.

'సహాయం చేస్తాను' అని చెప్పటంలా, చెయ్యలేమోనని ఎదుటివాళ్ళ అనుమానపడేలాగేసి, సహాయంచేసే స్వభావం చెన్నారెడ్డిగారిది. లక్ష్యం, యోగ్యత వున్న విషయాల్లో.

## ప్రేమవున్న చోటే కోపం

డాక్టరుగారు, తన క్రింది ఉద్యోగుల్ని కోప్పడతారు, తిడతారు అని కొందరు అంటూంటే విన్న నాకు చాలా ఆశ్చర్యమే కలిగింది. ఒకప్పుడు, నేను ప్రారంభిద్దామనుకున్న టెక్స్‌టైల్ మిల్లు సందర్భంగా నేను వారి కొక ఉత్తరం వ్రాశాను. నేను, ప్రభుత్వోద్యోగుల్ని విమర్శిస్తూ, వాళ్ళు చాలా తాత్సారం చేస్తున్నారంటూ ఫిర్యాదు చేశాను. నాకు చెన్నారెడ్డి గారి నుంచి జవాబు వచ్చింది. అది ఎంత ఘాటుగా ఉందంటే, మా ఇద్దరి స్నేహం చెడిపోతుందో ఏమోనంత భయం నాకు కల్గింది. తన ఉద్యోగుల్ని వెనకేసుకుని సమర్థిస్తూ వ్రాశారు చెన్నారెడ్డిగారు. తన తాబేదార్ల పై, డిపార్ట్‌మెంట్ సెక్రటరీ పై ఈగను కూడ వాలనివ్వరు ఆయన. మరి ఆయన అందర్నీ కోప్పడట మేమిటో నా కర్థంకాలేదు. నేను వెళ్ళి వార్ని కలుసుకున్నప్పుడు, వా రన్నారు—"నా భావావేశానికి, నా ఆశయాల్ని అనుసరించాలని పడే ఆరాటం, వేగం, వాటిని వెంటవెంటనే వీళ్ళు, ఫాలో అవలేక పోతున్నారనే బాధ తప్పితే—ఉద్యోగుల మీద నా కేమైనా పగ ఉంటుందా చెప్పండి. ప్రజలకు బాధ్యులం. వాళ్ళు నిరుత్సాహ పడిపోతున్నారు. వీళ్ళు జారిపోతున్నారు. అట్టి ప్రజాహితానికి మనం ఎంత శీఘ్రంగా మేలుచేస్తే అంత మంచిది. అందువల్ల మందలిస్తాను. ఏం? తండ్రి బిడ్డల్ని కోప్పడకూడదా? నా ఇంట్లో నా పిల్లలు తప్పుచేస్తే మందలించనా? అంతమాత్రంచేత వాళ్ళమీద నాకు ప్రేమాభిమానాలు లేనట్టేనా? నా వాళ్ళని ఇతరు లేమైనా అంటే నే నెట్లా ఊరుకోగలను? చిన్న తప్పులకు కోప్పడి సరిదిద్దాలి. పెద్దవి, సరిదిద్దుకునే అవకాశంలేని తప్పులైతే, ఏం చెయ్యగలం? నిర్వికారంగా నవ్వుకొని సరిపెట్టుకోవాలి"—ఇదీ డాక్టరుగారి ఉవాచ. ఇహ నేనే మనుకోవాలి? ఆయన ఎంత గంభీరమైన హృదయం ఉన్న వ్యక్తో నాకు అర్థమైంది. ప్రేమ ఉన్న చోటే కోపం ఉంటుంది. పెట్టే మనిషికే తిట్టే హక్కుంటుంది. తన భావాలు, తన అభిప్రాయాలు, అంకూ గొంకూ లేకుండా నిర్భయంగా చెప్పగల ధైర్యశాలి డాక్టరు. ఏ కోశానా పిరికితనం లేదు. ఆత్మవంచన లేదు. ఎదుటివాళ్ళు ఏమైనా అనుకుంటారేమోనని, మనస్సులోనే మథనపడే రీతువు కా దాయన. తన కోపానికి ఎదుటివాళ్ళు విపరీతార్థాలు చెప్పినా కూడా చలించని ధైర్యశాలి. నిజమడిగితే, నేనా ధైర్యాన్నే మెచ్చుకుంటాను. లోపల స్వయంపాకం, పిరికితనానిక్కూ—పైకి కనపడే కోపంలోని నిష్కల్మషమే నేను హర్షించేది. శత్రువు నిరాయుధుడైతే కత్తి చేతికిచ్చి యుద్ధానికి రమ్మనే చెన్నారెడ్డిగారి స్వభావం నాకు భలే ఇష్టం. ఈ విషయంలో మా స్వభావాలు ఒక్కటే. డాక్టరుగారిది చాలా చురుకైన మనస్సు. ప్రతి విషయం సూక్ష్మంగా పరిశీలిస్తారు. అందుకే పరిపాలనా యంత్రాంగంలో ఫైల్సు కాస్త మెల్లిగా పరుగెడతాయి. ఆశ్రితపక్షపాతి అనే బిరుదుంది ఆయనకు. ఏంచేస్తాం? ఆ నవ్వు—ఆ దయ—ఆ స్నేహశీలత మరి ఆయన కా అపవాదు తెచ్చిపెట్టాయి. ఇతరులు ఆ మంచితనాన్ని దుర్వినియోగం చేసుకోకుండా ఉండాలేగాని, ఆయన మంచితనానికి అపఖ్యాతి లేకుండా ఉండాలే గాని—ఆయనంతట ఆయనగా నిర్దాక్షిణ్యం ప్రదర్శించలేడు. నాకు బాగా తెలుసు. ఎవళ్ళని పొట్టమీద కొట్టడు. కాని, విషసర్పముల్ని గాని, సాటి మానవుల కాళ్ళకింద గోతులు తవ్వే విషపు మనుష్యుల్ని గాని మళ్ళీ లేవకుండా కొడ్తాడు. నిజమైన యోధుడు. వృత్తిలో ఘటికుడైన "డాక్టరు చెన్నారెడ్డి"—రాజకీయాల్లో ప్రతిభను ప్రదర్శించే "నాయకుడు చెన్నారెడ్డి"—మధ్య మధ్య కోపం అభినయించి "యాక్టరు చెన్నారెడ్డి" అవ్వాలను కుంటాడు. కాని, ప్రయోజనం ఉండదు. ఆ కోపం వెనక ఉన్న కరుణ, జాలి, దయ, ప్రేమ, పైకి ఉబికి వచ్చేస్తాయి. నా కనిపిస్తుంది, ఈయన తెలుగువారి నాయకుడా? కాదు; యావద్భారత భాగ్యవిధాత కావాలి. రెండేళ్ల తర్వాత ఈ మాటల్లోని అర్థం అందరికీ తెలుస్తుంది.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

దేశంలో పంటలు, పరిశ్రమలు, వృద్ధిచెందాలనీ, వెనుకబడిన జాతుల కభ్యుదయ జీవితం కల్పించాలనీ, సమాజాన్ని పీడించే అనేక సమస్యలు పరిష్కరింపబడాలనీ, సాంస్కృతికంగా రాష్ట్రం పురోగమించాలని చెన్నారెడ్డిగారు, నిరంతరం పడే తపన చూస్తే ఆయన కారణజన్ముడు అనిపించి తీరుతుంది.

### చలనచిత్ర పరిశ్రమకు మిత్రుడు

చిత్రపరిశ్రమను భాగ్య నగరానికి తరలించాలని, గతంలో ఎందరో ప్రయత్నించారు. ఇక్కడ ఉండి పిలిచారు. కాని, చెన్నారెడ్డిగారు మద్రాసు వెళ్లి అందర్నీ కలుసుకొని, వారందరి భయానుమానాలు పోగొట్టి, "ఏమేం కావాలో చెప్పండి. చేస్తాం" అన్నారు. పరిశ్రమ అంతా ఒక్క త్రాటిమీద నిలబడింది. కమిటీలు—చర్చలు—రాకపోకలు—ప్రణాళికలు—నిజంగా మూడు నెలల్లో ఎంతో సాధించారు.

తెలుగు చిత్ర పరిశ్రమ మరొక రెండేళ్లలో తెలుగు గడ్డపై స్థిరత్వం సంపాదించుకునేలాగ చేసిన ఘనత డాక్టరుగారికే దక్కుతుంది. రెండుకోట్ల డెబ్బయ్ అయిదు లక్షలు పరిశ్రమాభివృద్ధికి కేటాయించబడటం—రాష్ట్రంలో కావలసిన స్టూడియోలు—ఔట్‌డోర్ యూనిట్‌లు—ల్యాబ్‌లు, రికార్డింగ్ థియేటర్లు—వసతి సౌకర్యాలు ఇత్యాది అన్నింటికీ బుగ్గాల పంజారు ఏర్పాట్లు జరిగిపోతున్నాయంటే—ఈ ప్రణాళికకు సంపూర్ణత కలిగించిన చెన్నారెడ్డిగారి పేరు చలనచిత్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుంది. డాక్టరుగార్ని గురించి వ్రాసేటప్పుడు మరొక విషయం అప్రస్తుతం కాదు. ఆంధ్ర తెలంగాణా వేర్పాటు వివాదాల సమయంలో ఆనాటి దురదృష్ట రాజకీయ వాతావరణంలో నేను వార్ని కలుసుకోవటం జరిగింది. ఆయన నాయకత్వం కోరినవారంతా తీసుకున్న నిర్ణయాలకు ఆయన తలొగ్గవలసి వచ్చింది తప్ప, చెన్నారెడ్డిగారు ఎప్పుడూ సమైక్యతావాది అనేనా విశ్వాసం. గతాన్ని స్మరించ నక్కర్లేదు. అది పీడకలలాగ మరిచిపోవాలి. కాని, ఆ సమయంలో చాలా సన్నిహితంగా ఉండి, కళ్లారా చూచి చెవులారా విన్న అనేక సందర్భాలను పురస్కరించుకొని నేను ఘంటాపథంగా చెప్పేది ఒక్కటే. ఇటు తెలంగాణా, అటు ఆంధ్రా, ఆపైన రాయలసీమ—ఈ మూడు ఏకమై యుండి, త్రిలింగ క్షేత్రమై యావదాంధ్రులు సమైక్యతతో ఒక్కటిగా నిలిచి యావద్భారతానికి ఆదర్శంగా ఉండే తెలుగువారుగా కీర్తి గడించాలని కోరే వ్యక్తి డాక్టరు చెన్నారెడ్డి. కాని, విడిపోవటాలు, విడబాటులు కాంక్షించే వ్యక్తి మాత్రం కానేకాదు. రాజకీయాల్లో చతురత, మానవతా హృదయం ఈ రెండూ ఒక్కచోటసమపాళ్లలో మిళిత మవటం అరుదు. దీనికి తోడు కార్యదీక్ష, ఉత్తమాశయాలు కలిస్తే ఇక చెప్పాలా ? అందుకే ఆయన పూర్ణపురుషుడు అంటాను.

ఈ కళాహృదయుడు—ఈ మహా నాయకుడు ఈనాడు అరవై సంవత్సరాలు నిండి, షష్టిపూర్తి కళ్యాణం జరుపుకుంటున్నారు. ఇది ఎంత మనోజ్ఞ దృశ్యమో! ఎంత మధురమైన ఘట్టమో!! వారి సతీమణి శ్రీమతి సావిత్రిగారు "కార్యేషు దాసీ" అన్న శ్లోకాన్ని తూ. చా. తప్పకుండా జీవితంలో అన్వయించ చేసుకున్న సాధ్వి. నలభై సంవత్సరాలకు పూర్వం జరిగిన వీరి వివాహ మహోత్సవం చూసే అదృష్టం అవకాశం లేకపోయినా, నేటి షష్టిపూర్తి కళ్యాణ మహోత్సవం తిలకించే మహద్భాగ్యం కలిగిందని ఆనందించే వాళ్లల్లో నే నొకణ్ణి.

ఈ శుభసమయంలో ఏమనగలను ? ఆశీర్వదించడానికా వయస్సులో చిన్నవాణ్ణి. దైవ ప్రార్థనలకు అలవాటులేని మనిషిని. మంచి మనసుకు మనసిచ్చే మనిషిగా మనసారా వాంఛిస్తున్నాను!

శ్రీ చెన్నారెడ్డిగారు, అనేక సంవత్సరాలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలనీ, దేశానికీ, ప్రజలకూ వారెంతో సేవ చేయాలనీ, వారి గృహ మెప్పుడూ నిత్యకల్యాణం పచ్చతోరణంగా కళకళలాడుతూ; యావత్ కుటుంబం ఆనందంగా ఉండాలనీ కోరుకుంటూ, నేటి నవదంపతులైన సావిత్రి చెన్నారెడ్డిగార్లకు, మా మునలి దంపతులం శుభాభినందనలు తెల్పుతున్నాను.

"మరొక జన్మ ఉంటే—
డాక్టరు చెన్నారెడ్డి—లేదా
అటువంటి ఉత్తముడే
నాకు ఆ జన్మలో కూడ,
స్నేహితుడుగా లభించాలి"—

అని ఆకాంక్షిస్తున్నాను. మనసారా కోరుకుంటున్నాను.


CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# ఆదర్శ ప్రజా ప్రతినిధి

ఎన్. టి. రామారావు

'జగ మెరిగిన బ్రాహ్మణునకు జంధ్య మేల ?' అన్నట్లు
శ్రీ చెన్నారెడ్డిగారి విషయం ప్రస్తుతించడం, ప్రస్తావించడం
అతిశయోక్తిగానే ఉండవచ్చు—కాని మనిషిలోని మంచిని గుర్తించడం;
ఆ మంచితనాన్ని గౌరవించడం జాతి చైతన్యానికి నిదర్శనం—
జాతి మనుగడకే అది అవసరం.
డాక్టరు చెన్నారెడ్డిగారు
దీక్ష, దక్షత, కార్యశూరతకు ప్రతిరూపం—
పట్టుదలకు ప్రజాభిమానానికి సజీవ స్వరూపం—
సంఘ పురోగమనానికి ఆవేశం—
ఆధునిక అభ్యుదయానికి మార్గదర్శకత్వం—

ఆనాడు,

మన దేశంపైకి ముంచెత్తుకు వచ్చిన ముష్కరుల దండయాత్ర
ప్రతిఘటన నిధికోసం నా చలనచిత్ర పరిశ్రమ
సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా నిధిని సేకరించ బూనినపుడు
మా కళాయాత్ర దిగ్విజయం కావాలని నిండు మనస్సుతో ఆశీర్వదించి,
వెన్నుతట్టిన ఆదర్శ ప్రజా ప్రతినిధి.

ఈనాడు,

ముంచెత్తి వచ్చిన పెనుతుఫాను భయంకర విజృంభణలో
హతాశులై, గతాసువులై, నిరాశ్రయులై, శోకాంధకార తిమిరంలో
దారి తెన్ను తెలియని సోదర బాధితుల సంక్షేమనిధికి
మరోసారి పరిశ్రమలోనివారము
నడుంకట్టి జోలెపట్టి యాచన యాత్రకు సాగినపుడు
మా కృషికి అండగా నిలిచి, కొండంత బలమిచ్చి, నిండుగా
మా జోలె నిండు విధంగా మమ్ము ముందుకు నడిపిన
శ్రీ రెడ్డిగారి ఆదర్శ సేవానిరతికి నా జోహార్లు.
ఇంతటి మహనీయుని నాయకత్వంలో మన రాష్ట్రం
అన్ని రంగాలలోనూ సర్వతోముఖంగా
ఎనలేని పురోభివృద్ధిని, ప్రయోజనాన్ని సాధించగల దనడం నిర్వివాదాంశం.
ఇది మా ఆశ—అదే మా అభిలాష—
ఇటువంటి సర్వోత్తమ జాతిరత్నం
పరిపూర్ణ ఆయురారోగ్యవంతులై, సర్వేశ్వర కరుణాకటాక్ష లబ్ధులై,
తమ ఆదర్శ సేవానిరతితో తెలుగుతల్లిని పునీతను చేయగలగాలని నా కోరిక !
ఈ షష్ఠిపూర్తి శుభసమయంలో ఇదే వారికి నా శుభాకాంక్ష !!



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# కృతార్థుడు

రావెళ్ళ వేంకటరామారావు

అరువదియేండ్లు పైకొన్నా అమితోత్సాహాన మిన్న
ప్రజల మేలు కోరుటలో పరవశుడై పోవున్న
చెరిగిపోని తరిగిపోని పరిశ్రమకు గీటురాయి
తనకు తానె ఉద్యమాల జనతావటవృక్షమాయె.

వైరమునకు బెదిరిపోడు, వాస్తవమును వదలలేడు
వేదనపడువారి గోడు ఆదరమున దీర్చుతోడు
దారి డొంక లేని గ్రామ దారిద్ర్యము పారద్రోల
ధ్వజమెత్తిన కర్మశీలి ధార్మికతా మర్మవేది !

గిరిజన హరిజన శ్రామిక పరిజనులకు అండదండ
బలహీనులు అల్పసంఖ్య గలవారికి పెద్ద నీడ !
తెలుగు నుడుల వెలుగు జిలుగు తెలుగు జనుల కలిమి బలము
వెలుగునింప దిశలలోన వేవిధాల యత్నించును.

తత్త్వసార మథనంలో తలదూర్చిన సనాతనుడు
ఆశయ పరిపాలనలో అడుగిడిన అధునాతనుడు
ఇతడు ధైర్యమున సింధువు, ఇతడు జనుల కగు బంధువు
ఇతడు జ్ఞానమయ చక్షువు, ఇతడు చెలిమి కగు విక్షువు.

ఇతడే మన సచివాగ్రణి ! ఇతడే మన నాయకమణి !
ఇతడే మన చెన్నారెడ్డి ! ఇతని షష్టిపూర్తి నేడు
ఇతని కృతమె సత్కృతమై ఈ భువిలో వెల్గుగాత !
ప్రజానుపరిపాలనలో పదింబదిగ నిలుచుగాత !
జన్మ సార్థకత నందగ జనులసేవ చేయుగాత !
శతవత్సరపర్యంతము సంతసమున బ్రతుకుగాత !

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# సమష్టిమూర్తి

**బోయి భీమన్న**

---

సత్త్వమందు మర్రి, సాహిత్య సౌందర్య
మాధవమున గున్నమావి చెన్న,
మాన్య ముఖ్యమంత్రి మా మర్రి చెన్నయ్య
మహిమశాలి, జాలి, మహితశీలి!

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా. మర్రి చెన్నారెడ్డిగారి సమగ్ర వ్యక్తిత్వాన్ని ఈ ఒక్క పద్యంలోను ఇమిడ్చిపెట్టా ననుకొన్నాను—1978 ఏప్రిల్ 8 వ తేది ఆదివారం సాయంత్రం, ముఖ్యమంత్రిగారి అధికార నివాసం గ్రీన్‌లాండ్సులో, వారు జరిపిన కాళయుక్తి ఉగాది వసంతోత్సవంలో కావ్యగానం చేస్తూ.

అయితే—అంతటి బహుముఖ ప్రజ్ఞావంతులైన మహావ్యక్తిని ఒక్క పద్యంలో ఇమడ్చడం సాధ్యమేనా?

సాధ్యమే. విశ్వమంతా చిన్న విత్తనంలో ఇమిడివుంది. అణువులో మహా విశ్వశక్తి అంతర్యామిగా ఉంది. ఒక్క ప్రణవాక్షరంలో పరబ్రహ్మమే ఒదిగి ఉంది. ఎంతటి భావమైనా ఒక్క గీతలో చూపవచ్చు— సాహిత్యపరంగా కానీ, రేఖాచిత్ర పరంగా కానీ, వేదాంత పరంగా కానీ.

డా. చెన్నారెడ్డిగారు ఎవరు?

ఆయన నాకు హితుడే కాని సన్నిహితుడు కాదు. ఆయన నాపట్ల సుముఖుడు, సుమనస్కుడు, శుభాకాంక్షి. ఆయనపట్ల నేను ప్రసన్నమైన ప్రశంసాభావం కలవాణ్ణి. రాజకీయ రంగంలో, ప్రజా నాయకత్వంలో ఆయనకు ఎదురులేని, ఎడతెగని పురోగమనం, లక్ష్యశుద్ధి, కార్యసిద్ధి లభించాలని కోరుకునేవాణ్ణి.

ప్రజల మధ్య, మందిలో ఒక మనిషిగా నిలబడి, ఒక సామాన్యుడు ఆత్మభావంతో, ప్రశంసాదృక్కులతో ఎవరికేసి చూస్తాడో అతడే నిజమైన ప్రజానాయకుడు. రాజకీయ రంగంలో నే నొక సామాన్యుణ్ణి. చెన్నారెడ్డిగారిని నేను చూచే దృష్టికోణం అట్టిది.

బిగువులోన మర్రి, తెగువలోన ఉరుము,
మధువులోన గున్నమావిచెన్న,
భక్తి, యుక్తి, శక్తి ఒత్తుకొల్లవు నీవ!
తెలుగు నేల కెల్ల వెలుగు నీవ!

ఇదీ—నేను తొలిసారి చెన్నారెడ్డిగారిని చూచినప్పుడు నా భావంలో తోచిన దృశ్యం.

## నాలుగు అంతస్తుల వికాసం

నా సాహితీ భావ పథంలో ఏ మానవుడైనా సరే, ముఖ్యంగా నాయకుడైనవాడు, పురోగమించవలసిన పథం ఒకటి ఉంది. నాలుగు అంతస్తులలో వికసించా లతడు. ఒకటి ఆందోళనకారుడు; రెండు సంగ్రామసింహుడు; మూడు విజయసిద్ధుడు, నాలుగు నిర్మాణకర్త.

ఈ నాలుగు దశలనూ **Agitator, Fighter, Conqueror, Consolidator** అనవచ్చు— ఇంగ్లీషులో.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

ఈ నలుగురిదీ నలుగురు నాయకులు. ఈ నలుగురు నాయకులూ కనిపిస్తారు నాకు ఒక్క చెన్నారెడ్డిగారిలోనే. ఒక్కొక్క అంతస్తులో, ఒక్కొక్క కార్యరంగంలో ఒక్కొక్క మహానాయకుడాయన.

అజిటేటరు, ఫైటరు న్యాయమునకు,
కాంకరరు ప్రజా హృదయ లోకమున కెల్ల,
జాతి వైభవమ్మునకు కన్సాలిడేటు,
అలవి యౌనె చెన్నారెడ్డి నభినుతింప!

ప్రజలు పడుతున్న కష్టాలను, ఎదుర్కొంటున్న అన్యాయాలను చూచి భరించలేక, వారికి న్యాయం చేకూర్చడానికి, కొన్ని కొన్ని హక్కులను సాధించడానికి ఆందోళన తప్పనిసరి అవుతుంది. పోరాటం జరపవలసి వస్తుంది. ఈ రెండూ జరిపి విజయం సాధించిన విజయుడు చెన్నారెడ్డి. మొదట అజిటేటరు, తర్వాత ఫైటరు.

పోరాటంలో విజయం సాధించిన తర్వాతనే ఆయన ఉత్తరప్రదేశ్ రాజ్యపాలకుడైనాడు. ఆంధ్రప్రదేశ ముఖ్యమంత్రి అయినాడు.

ఆందోళనా, పోరాటమూ, విజయమూ తర్వాత—జయించిన దానిని సమీకృత పరచుకోవాలి, స్థిరపరచుకోవాలి, గట్టిపరచుకోవాలి. అంటే కన్సాలిడేట్ చేసుకోవాలి. శాంతి భద్రతలను స్థిరపరచి, అభివృద్ధి సంక్షేమ విధాన కార్య ప్రణాళికలను రూపొందించి అమలుపరచడమే కన్సాలిడేషను. ఇప్పుడు డా. చెన్నారెడ్డిగారు ముఖ్యమంత్రిగా చేస్తున్న పనే అది.

## తెలుగు జాతికి ఏకైక నాయకుడు

ఈనాడు తెలుగు జాతికి ఏకైక నాయకుడు చెన్నారెడ్డిగారు. ఈ నాలుగు అంతస్తులలోనూ ఆయన ప్రదర్శించిన, ప్రదర్శిస్తూ వచ్చిన, ప్రదర్శిస్తూవున్న శక్తి, సామర్థ్యం, యుక్తి, యోధత్వం, వేగం, వైవిధ్యం అద్భుతావహ మైనట్టివి. అనన్యసాధ్యమైన కార్యశూరతను ప్రదర్శించి సమగ్ర నాయకుడుగా, హిమాలయోన్నతుడుగా పెరిగిన మహావ్యక్తి ఆయన.

కార్యశూరత, వేగము, క్రమపథమ్ము
సర్వజన సమప్రగతి ఇష్టార్థములుగ
పల్లె పల్లెను విశ్వరూపము ధరించి
వెన్న తినిపించు ప్రజకు మా చెన్నారెడ్డి!

1928 ప్రాంతంలో, తొమ్మిదేళ్ళ బాలుడుగా ఉన్నప్పుడు, యువజన వక్తృత్వ సమాజాన్ని స్థాపించిన క్షణమే ఆయన నాయకత్వ సోపాన పథంలో అడుగుపెట్టిన శుభముహూర్తం. ఆయన ప్రథమ ప్రసంగం "సత్యం" గురించి. ఆనాటి నుంచీ ఆయన ప్రగతి సత్యపథంలోనే ధర్మోద్యమాల ద్వారా. కారణజన్మ జీవలక్షణం ఇది.

"సత్యము"న పుట్టి, ధర్మ
దీక్షుడవై పెరిగి, మాతృదేశోద్ధతికై
నిత్యము పోరెడు ముఖ్య
మాత్యా! ఇదె, మర్రి చెన్న! మా నుతు లన్నా!

చెన్నారెడ్డిగారి జీవిత ప్రస్థానాన్ని గమనించినవారి కెవరికైనా సరే అర్థమవుతుంది—న్యాయ సత్య ధర్మాల కోసం తాను జరిపే ఆందోళనలలో, పోరాటాలలో ఆయన ఎంతటి కష్టనష్టాలకూ, వైర విరోధాలకూ కూడ జంకడని; వెనకడుగు వెయ్యడని. తనను ఏ వర్గ ప్రజలు ఎంత ఘోరంగా అపార్థం చేసుకున్నా లక్ష్యం చెయ్యడని. లక్ష్యపథం నుంచి వైదొలగడని.

అంతటి స్థితప్రజ్ఞుడు చెన్నారెడ్డిగారు.

అందుకు ఒక ఉదాహరణగా—పదేళ్ళకితం ఆయన నిర్వహించిన ప్రత్యేక తెలంగాణా ఆందోళననే పేర్కొనవచ్చు.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

ఆ కాలంలో చెన్నారెడ్డిగారు ఎంత అపార్థం చేసుకోబడ్డారో అంత విజ్ఞతను ప్రదర్శించారు. అందుకే— ఆధునిక యుగంలో ధీరశాంతనాయకుడు ఎవరైనా ఉన్నారా అంటే— "ఉన్నారు. అతడు డా. మర్రి చెన్నారెడ్డి" అని ఎలుగెత్తి చాటుతాను నేను.

ఎన్నో ఒడిదుడుకుల నుంచి, అగ్నిపరీక్షల నుంచి, నిరంకుశ ప్రభువుల క్రూరకృత్యాల నుంచి, రజాకార్ల దౌర్జన్య హింసాకాండ నుంచి, పరభాషా ప్రాబల్యం నుంచి, ఎలాగో బ్రతికి బైటపడ్డ తెలంగాణా ప్రజా హృదయాన్ని ఒడిలో పెట్టుకొని లాలించి సేద దీర్చవలసిన బాధ్యత మాజీ ఆంధ్ర (రాష్ట్రం) మీద ఉంది.

మాజీ ఆంధ్ర తన బాధ్యతను నిర్వహించడం లేదని, పైగా ఆంగ్ల భాషా ప్రాభవంతో అవమానింపబడుతున్నదని అనుమానించిన తెలంగాణా ఆందోళనం కాకేం చేస్తుంది ?

నిజానికి ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పుడు రెండు విషయాలు ప్రధానంగా జరిగి ఉండవలసింది. ఒకటి—తెలంగాణా ప్రాంతానికి చెందిన ఒకరు ముఖ్యమంత్రి కావలసింది. దానివల్ల అప్పుడప్పుడే దారికి వస్తున్న, మానుపడుతున్న హైదరాబాదు వేడివేడి సమస్యలు పూర్తి పరిష్కారం పొంది ఉండేవి.

రెండు—1956 నవంబరు నుంచే తెలుగును అధికార భాషగా ప్రకటించవలసింది.

అంతవరకు తెలంగాణా అధికార భాష ఉరుదూ. ఆంధ్ర ప్రాంత అధికార భాష ఇంగ్లీషు. ఇంగ్లీషును హఠాత్తుగా అధికార భాష చెయ్యడంతో, ఉరుదూ బ్యూరోక్రసీకి ఇబ్బంది అయింది. పోనీ—ఇంగ్లీషు బ్యూరోక్రసీ విజ్ఞతతో, ఉదారంగా వ్యవహరించిందా అంటే—అదీ లేదు!

ఇటు ఉరుదూ, అటు ఇంగ్లీషూ కూడ ప్రజల భాషలు కావు.

ప్రజల భాష తెలుగు.

ప్రాంతీయమైన యాసలు ఎన్నైనా ఉండవచ్చు. జిల్లా జిల్లాకు, తాలూకా తాలూకాకు కూడ యాస మారవచ్చు. భాష మాత్రం ఒక్కటే. అందువల్ల తెలుగును అధికార భాషగా ప్రకటించి ఉండవలసింది. భాషా ప్రాతిపదికపై ఏర్పడ్డ రాష్ట్రం కాబట్టి, అందుకు ఏవిధమైన ప్రతిబంధకమూ ఉండేది కాదు.

ఇక్కడొక ముఖ్య విషయం గమనించవలసి ఉంది. హిందీ అని ఈనాడు పిలువబడుతున్న భాష ఒక్క భాష కాదు. వ్రజ, మాగధ మొదలైన చాల భాషల కలయిక అది. ఒక భాష మరొక భాషవారికి కర్థంకాని విచిత్ర సమ్మేళనం అది. తెలుగు అలా కాదు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు, అనంతపురం నుంచి ఆదిలాబాదు వరకు తెలుగు ఒకటే భాష. రకరకాల యాసలు, మాండలిక పద పర్యాయాలు ఉండవచ్చు.

తెలంగాణా వ్యక్తి ముఖ్యమంత్రి కావడం, తెలుగు అధికార భాషగా ప్రకటించబడడం—ఈ రెండూ జరగక పోవడంవల్లనే తెలంగాణా ప్రాంతం ఆందోళన పడింది. అయితే—దానివల్ల అవాంఛిత దుర్ఘటన ఏదీ జరగలేదంటే, అందుకు కారణం చెన్నారెడ్డిగారి మహత్తర సమయజ్ఞతే; మహిమాన్విత నాయకత్వమే.

ఆనాడు అఖిలాంధ్రను సాధించడానికి కృషిచేసిన నాయకు లెవరైనా కావచ్చు. ఎంతటివారైనా కావచ్చు. ఈనాడు మొత్తం తెలుగు నేల ఆంధ్రప్రదేశ్‌గా సమైక్య వైభవోపేతమై సర్వైశ్వర్య సమగ్రమై ముందుకు పోతున్నదంటే—అందుకు మూలబ్రహ్మ—ఒక్క చెన్నారెడ్డిగారే !

సామ్యవాద మంచు, సంప్రదాయ మ్మంచు,
స్పర్థ పెంచువారు స్వార్థపరులు;
సోషలిజము వేద సూక్తం లేదొకో ?
అసలు జరిపి చూపుమన్న చెన్న !



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

ఏదైనా ఒక ఊరు బాగుపడాలంటే, ఆ ఊరికి గవర్నరుగారిని తీసుకు వెళ్ళాలని వచ్చేది పూర్వం.

ప్రజల, గ్రామాల కష్టసుఖాలతో సమైక్యం చెందిన చెన్నారెడ్డిగారు ఈ సత్యం తెలిసినవారు కావడంవల్ల, ప్రతి పల్లెనూ బస్సుతో కలుపుతామనే నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ బస్సు కాకపోతే ప్రైవేటు బస్సు. ఏదో ఒక బస్సు ప్రతి గ్రామాన్నీ తట్టి పోవలసిందే. అదెంత చిన్న గ్రామమైనా సరే. ఈ ఒక్క నిర్ణయమూ చాలదా గ్రామాభ్యుదయానికి ?

బస్సుతోపాటు రోడ్డు. రోడ్డుతోపాటు ఆధునిక సౌకర్యాలన్నీ.

ఆధునిక మానవ జీవితం పట్టణ గ్రామ సమస్యలతో బహుముఖంగా వికసించడానికి ఒకే ఒక బీజ మంత్రం ఆ నిర్ణయం.

కార్మికుల హక్కులే కాదు, కార్మికుల కుటుంబ సంక్షేమం కూడా ట్రేడ్ యూనియన్ల కార్యక్షేత్రంలోనే అన్న ప్రకటన, దళిత వర్గ బాలలకు విద్యా ప్రదానంతోపాటు ఆ బాలల తల్లిదండ్రులకు ఆర్థికప్రోత్సాహం కలిగించవలసి ఉంటుందన్న ఉద్బోధ వంటి ఎన్నో చెన్నారెడ్డిగారి మౌలిక యోచనా సరళిని వ్యక్తీకరిస్తున్నవి.

వృక్ష వర్గమ్మునకు వటవృక్ష మట్లు
మంత్రి వర్గమ్మునకు ముఖ్యమంత్రి నీవు,
నీడ నిమ్ము పీడిత జనావళులకు
ఆశ్రయము నిమ్ము ఆశా విహంగతతికి.

**తెల్లఖద్దరు నల్లనయ్య**

ఆంధ్రప్రదేశ్ ఏర్పడి మేం హైదరాబాదుకు వచ్చిన కొత్తరోజు లవి. భాగ్యనగరం నా కిచ్చిన స్వాగతం అమృత లబ్ధమైనట్టిది. అది నిజంగా నా భాగ్యం.

వాణియె తీరవాణి, భవానియె రాయలసీమ, శ్రీ తెలం
గాణము ; పూర్ణరాజ్య రమగా ముగురమ్మలమూర్తి దాల్చి, గీ
ర్వాణ పథమ్ములన్ కదలి వచ్చితి, నేలుకొనంగదే ఇకన్ !
ప్రాణము లౌను మా తెలుగు ప్రాలు జగత్స్థితి కాత్మలై తగన్ !

అని పాడుకొంటూ నేను గడిపిన ఆ కొత్త రోజులు నిజంగా శరత్కేదార వికసన్నవహృదయాలు.

ఆ రోజుల్లో ఏదో ఒక సాయంకాలం—

అది భాగ్యనగరంలోనే ఎక్కడో ఏదో ఒక సభ. నేను ఆడియన్సులో కూర్చుని ఉన్నాను. వేదిక మీదకు రావలసిందిగా మైకు రెండోసారి ఆహ్వానించినా, నేను కదల్లేదు.

“నేను వేదికమీద ప్రశాంతంగా ఉండలేను. కనీసం మాట్లాడలేను. నే నెందుకులెండి” అన్నాను—ఇబ్బందిగా.

“ఆ మాట అక్కడికి వెళ్ళి చెప్పుకోండి. మీ గురించి తెలియని వారెవరున్నారు ! వెళ్ళండి పిలుస్తున్నారు” అన్నాడు నా పక్కన కూర్చొనివున్న ఒక వ్యక్తి. అనడమే కాదు, బలవంతంగా నన్ను లేవగొట్టాడు.

ఈయ నెవరా నా ప్రాణానికి అనుకొంటూ వేదికమీదకు వెళ్ళాను నేను.

నన్ను ఆడియన్సు నుంచి వేదిక మీదకు నెట్టి, పైగా చిరునవ్వులు చిలకరిస్తున్న ఆ తెల్ల ఖద్దరు నల్లనయ్య ఎవరు ?

“అదేమండీ ! చెన్నారెడ్డినే ఎరుగరా ?” అన్నారు నా చెవిలో లక్ష్మీకాంతశాస్త్రిగారు జాలిగా !

చెన్నారెడ్డిగారిని ఎరుక్కపోవడ మేమిటి ? అంతవరకు చూడలే దంతే !

నేను మద్రాసులో ఉన్నప్పుడు, నైజాం రాజ్యంలో విమోచనోద్యమం ముమ్మరంగా సాగుతున్న ఆ రోజుల్లో, నాకు తెలిసిన కొద్దిమంది తెలంగాణా నాయకుల పేర్లలో చెన్నారెడ్డిగారి పేరొకటి. ఆనాడు నా ప్రశంసాపాత్రులందరిలోను దూరం నుంచే మారుమ్రోగిన పేరునామాలలో అదొకటి.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

ఆయనే అంటున్నమాట! ఎంతటి మధురానుభూతి!

అంతటి వీరుడు, స్వాతంత్ర్యయోధుడు, ఇంతటి సౌమ్యుడా! అవును. ధీరోదాత్తులైన వీర నాయకులంతా సౌమ్య మందరులే కదా!

నన్ను అడియన్ను నుంచి, సామాన్య జనస్థానం నుంచి, నాకు తెలియకుండానే, మూడుసార్లు నెట్టారు పైకి చెన్నారెడ్డిగారు.

రెండోసారి ఆవిధంగా నెట్టింది—భాగ్యనగరం నుంచి వారణాసికి.

1976 లో కాశీకి పిల్చి, నాకు కాశీ విద్యాపీఠంవారి గౌరవ డాక్టరేటును ఇప్పించా రాయన. ఛాన్సలరు హోదాలో తామే ఆ డిగ్రీని స్వహస్తాలతో అందజేశారు నాకు. ఇందుకు సంబంధించిన వివరాలను శ్రీమతి హైమవతి వ్రాసిన "పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న" అనే గ్రంథంలో చూడవచ్చు. (విద్యావిలాస సర్గ—212, 213, 214 ప్రకరణాలు.)

**కాశీ మిఠాయి**

ఆ సాయంకాలం కాన్వొకేషను తర్వాత జరిగిన ఉపాహార విందులో, నన్ను గమనిస్తూవున్న ఛాన్సలరు చెన్నారెడ్డిగారు తమవద్ద గల స్వీట్సు ప్లేటు తీసుకొని నా ప్లేటులో వేస్తూ అన్నారు "ఇవి ప్రత్యేకం కాశీ స్వీట్సు. కాశీలో తప్ప మరెక్కడా దొరకవు. వదలిపెట్టకండి" అని.

అట్టి చెన్నారెడ్డిగారి సౌజన్యానికి, సౌహార్దానికి ఆ మహదాత్మీయతకు కృతజ్ఞత తెలపాలంటే ఎంతటి మహాకవి కైతే మాత్రం తగుమాట లేముంటై? అప్పుడే మౌనంగా మెదిలింది నా మనస్సులో ఈ పద్యం—

కాశిలోన తప్ప కాశీ మిఠాయీలు
ఇతరచోట్ల దొరక వెంతకైన,
బహుజనాభివృద్ధి పథకాల విరిదోట
మాకు నీ చరిత్ర మర్రి చెన్న!

నాకు తెలియకుండానే నాకు చెన్నారెడ్డిగారు సమకూర్చిన గౌరవం అది. స్వచ్ఛమైన ప్రజానాయక లక్షణం ఇది. తన ప్రజలలో ప్రతి వ్యక్తి గుణశీల ప్రవర్తనలను, ప్రతిభా వ్యుత్పత్తులను, శక్తి సామర్థ్యాలను వాటి నుంచి వెద్దలను ఎప్పటి కప్పుడు కనిపెట్టి చూసుకొంటూ వుండే జీవలక్షణం.

గుణగ్రహణపారీణత, సమయజ్ఞత, కార్యశూరత—ఈ మూడు లక్షణాలూ త్రినేత్రాలై ఉన్నవాడే సిసలైన ప్రజానాయకుడు. అట్టి నాయకుడు చెన్నారెడ్డిగారు. పర్వారు పల్లభాయి పటేలు తర్వాత, మళ్లీ అంతటి నాయకుడు.

1956 ప్రాంతం తర్వాత, ఈ ఇరవై ఏళ్లుగా మళ్లీ మేం కలుసుకున్నది లేదు. రాజకీయ, సాంఘిక, సాహిత్య పరమైన ఏ సాన్నిహిత్యమూ లేదు. నా పేరు జ్ఞాపకం రావలసిన అవకాశం కాని, అవసరం కాని లేదు. మరి—దాశరథి, నారాయణరెడ్డి, వరదాచార్యులు, యశోదారెడ్డిగార్ల పేర్లతోపాటు చెన్నారెడ్డిగారికి నా పేరు ఎలా స్ఫురించింది? అది కాశీకే ఎందుకు అలాటుంది?

చెన్నారెడ్డిగారి నాయకత్వ శక్తి అంతటి సమ్యక్సమర్థమైనట్టిది. ఆయన మానవీయ దృష్టి అంతటి కులమత వర్గాతీత మైనట్టిది. ఆయన సంస్కరణాభిలాష అంతటి జాత్యైక్యనిష్ఠ మైనట్టిది.

మిత్ర శత్రుభావ మిసుమంతయును లేదు,
ప్రజ్ఞ ననుసరించి పదవు లొసగు,
పనియె దైవమందు ప్రవచించి పనిచేయు,
సత్యసిద్ధుఁ డాంధ్ర ముఖ్యమంత్రి!

మూడోసారి చెన్నారెడ్డిగారు నన్ను పైకి నెట్టింది 1978 లో—జనపదం నుంచి శాసనపరిషత్తుకు!



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

కాశీ విద్యాపీఠ గౌరవం సాహిత్యరంగంలో మకుటాయమానమైతే, ఈ శాసనపరిషత్సభ్యత్వం నాకు ఆర్థిక రాజకీయ రంగాలలో ధైర్య స్థైర్య శాక్తేయం!

నేను నా చిన్నప్పటినుంచీ కాంగ్రెసువాణ్ని. జాతిని జాగృతం చెయ్యడానికి నిరంతరం కృషి చేస్తున్నవాణ్ని. 1952 లో అసెంబ్లీకి కాంగ్రెసు అభ్యర్థిగా పోటీ చేసినవాణ్ని. న్యాయంగా చూస్తే 1946 లో సంవిధాన నిర్మాణసభకో, 1950 లో లోకసభకో పంపబడవలసినవాణ్ని. ఆ గౌరవాలు ఆ రెండు దఫాలూ కూడ రాజకీయాలలో కాని, కాంగ్రెస్‌తో కాని సంబంధం లేనివారికే వెళ్లాయి!

ఎవరు అధికార పదవిలో ఉంటే వారు తమ మనుష్యులనే ఎంపిక చేసుకోవడం రివాజు. అది లోక సహజం కూడ.

అయితే—చెన్నారెడ్డిగారు లోకోత్తర మహనీయమైన మనఃప్రవృత్తిని ప్రదర్శించింది, తమ కేమీ కాని నన్ను విధాన పరిషత్తుకు నామినేటు చేయించారంటే—అదెంత దివ్యం! వ్యవహారభేదం లేని, కేవలం మెరిట్‌ను మాత్రమే పరిగణనలోకి తీసుకొనే ఆయన మహితాత్మత ఎంత శ్రేయోభవ్యం!

చెన్నారెడ్డిగారు ఎక్కడ ఏ హోదాలో ఉన్నా, శతకాలం ప్రజల మనిషిగానే పనిచేస్తారు. బాహ్యంగానే కాదు, అంతరంగికంగా కూడ ఆప్తంగా ప్రజల గుండెల్లో ఇళ్ళు కట్టుకొని కాపుర ముంటారు. ఆ ఇళ్ళు గవర్నమెంటు కాలనీలు కావు. స్థిరనివాసాలు!

లౌకికంగా చెన్నారెడ్డిగారెంత నిర్మాణాత్మక ప్రణాళికాబద్ధ ప్రగతిరథసారథో, ఆధ్యాత్మికంగా అంత ద్వైతాద్వైత భక్తిజ్ఞాన జీవనస్రోతో గుణవారధి.

సామాన్య లౌకిక మతాలకు అతీతంగా పెరిగి, అతిలోక యోచనా దివ్య శిఖరం మీద నిలచి, విశ్వమానవు లందరికీ ఏకైక మతగ్రంథంగా భగవద్గీతను ప్రతిపాదిస్తున్న చెన్నారెడ్డి ఒక రాజకీయ నాయకుడో, ఒక ముఖ్యమంత్రో మాత్రమేనా? విశ్వ మానవతా మతప్రవక్త కాదా?

విశ్వమానవుండు, విశ్వేశ్వరాత్ముండు,
విశ్వమత కుటుంబి, విశ్వసముడు,
మధుర భక్తిరతుడు మర్రి చెన్నారెడ్డి
వ్యష్టిమూర్తి జన సమష్టిమూర్తి!



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# 'ప్రజాసేవే నాకు హద్దు'

రావూరు వెంకట సత్యనారాయణరావు

---

ఒక దేశం యొక్క సౌభాగ్యం, సంపద, ప్రశాంతత, ప్రజా జీవన సౌలభ్యం—ఇవన్నీ ఆ దేశంలోని నాయకులపైన ఆధారపడి ఉంటాయి. ప్రజాక్షేమాన్ని కాపాడి, వారిని ప్రగతిపథంలో నడిపించడమే నాయకుల కర్తవ్యం. దీనికోసం వారు తమ శక్తిని వినియోగించి, స్వార్థరహితులైన ప్రజలలో తలెత్తిన భావుకతను పరికించి సంతృప్తి చెందుతూ ఉంటారు. ఇలాటి కార్యక్రమాలు అన్నివైపుల నుంచి సక్రమంగా నడుపుకొంటూ వచ్చి సువ్యవస్థితంగా దేశాన్ని తీర్చిదిద్దటం నాయకులలో గల ముఖ్య శిల్పం.

మనది ప్రజాస్వామ్యం. ఇక్కడ ప్రజలే పాలకులు, పాలకులందరూ ప్రజలే. దేశపరిపాలన నిర్వహించడం కోసం కొందరు పదవులలో చేరడం తప్పదు. దానితోపాటు బాధ్యతలు కూడా పైన వేసుకోడం తప్పదు. పదవులలో ఉన్నా బయట ఉన్నా నాయకుల కర్తవ్యం ప్రజాసేవే!

కొన్ని జీవితాలు చిత్రంగా చిన్నతనంలోనే ప్రజాసేవకు అంకితమై పోతాయి. అవి అలాటి జీవితాలు. తప్పించుకొని మరో మార్గంలో నడవడానికి ఇష్టపడవు. ఇలా ఎందరెందరో మహానాయకులు తమ శక్తియుక్తుల్ని దేశమాత సేవలో వినియోగించి కృతకృత్యులు అవుతున్నారు.

ఒక దేశ చరిత్ర ఈ దృష్టితో ఆలోచించినప్పుడే నాయకుల సమష్టి చరిత్ర అవుతుంది. అందువల్ల నాయకులను మనం చరిత్రకారులుగా పేర్కొనవచ్చు.

### నిండు హృదయంతో ముందడుగు

ప్రస్తుతం మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న డా. చెన్నారెడ్డిగారు పేరెన్నికగన్న నాయకులు. ఎంతో చిన్నతనంలోనే మంత్రిపదవి అలంకరించినారు. అటుపిమ్మట రాష్ట్ర, కేంద్ర మంత్రి మండలులలో చేరి దేశానికి ఎంతో సేవ చేశారు. వారి పరిపాలనా పటిమకు నిదర్శనంగా వారికి రాష్ట్ర గవర్నరు పదవి కూడా లభ్యమయింది. ఎక్కడ ఏ పదవిలో ఉన్నా వారి మనసు ప్రజాసేవ వైపుకే మొగ్గుతూ ఉంటుంది. దేశమంటే ప్రజలే నన్న నిర్వచనాన్ని గుర్తించి నిండు హృదయంతో ముందడుగు వేసిన మేటి నాయకులు డా. రెడ్డిగారు. వీరి అభిమతాన్ని భగవంతుడు గుర్తించి దీవించినట్లుగా వీరికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవి లభించింది.

డా. రెడ్డిగారికి గ్రామాలపైన ఎంతో అభిమానం. కూలిపోతున్న పేద ప్రజానీకాన్ని నిలబెట్టడం కోసం వీరు చేస్తున్న కృషి ప్రశంసనీయం. గ్రామాలలో శాంతి సౌఖ్యాలు ఏర్పడినప్పుడే రాష్ట్రం సుసంపన్న మవుతుందని, సుభిక్షంగా తనరారుతుందని వీరి ఆకాంక్ష. అందువల్లనే గ్రామ అభివృద్ధి కార్యక్రమా లనేకం తలపెట్టారు; చేపట్టారు; నిర్వహిస్తున్నారు.

### పల్లెలకు నిరంతరం యాత్రలు

గ్రామాలు వెనుకబడి ఉండరాదు. ప్రజలలో ఎలాటి అసంతృప్తి తొంగిచూడరాదు. ప్రజలు ఆకలి దప్పులతో అల్లాడరాదు. విద్యావిధానంలో ముందడుగు వేయడానికి వెనుకాడరాదు. గ్రామాలు, పట్టణాలు, నగరాలతో రహదారుల ద్వారా సహవాసం కల్పించుకోడానికి ఆలస్యం కారాదు. ఇవన్నీ డా. రెడ్డిగారి ఆశయాలు. వీటి నిర్వహణలో నిర్నిద్రావకాశంగా కృషి



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

చేస్తున్నారు. పల్లెలకు నిరంతర యాత్రలు కొనసాగిస్తున్నారు. పేద గొప్పల తారతమ్యాలను సవరిస్తున్నారు. అన్యాయాలను సరిదిద్దుతున్నారు.

గ్రామాలకు వెలుగు నందియ్యడం కోసం, పొలాలకు జలాన్ని అందించి సస్యశ్యామలం చేయడం కోసం, ప్రజలకు స్వయంసమృద్ధి కల్పించి, ప్రశాంతచిత్తులను చేయడం కోసం రెడ్డిగారు చేస్తున్న కృషి అపారం. వీరి పరిపాలనలో అద్భుతమైన పరిణామాలు ఏర్పడవచ్చునని ఆబాలగోపాలం ఆశించడంలో ఆశ్చర్యంలేదు. ఈ కృషికి దోహదం చేసే విద్యుచ్ఛక్తిని గ్రామాలకు అందించే పథకాలు వడివడిగా కొనసాగుతున్నాయి. కొద్ది రోజుల్లోనే ఒక రైతు తన పొలంలో ఒక చిన్న పాకలో విద్యుద్దీప కాంతిలో పడక కుర్చీలో కూర్చుని యంత్రాలు బావి నుంచి తోడిపోసే నీరు పొలాలలోనికి ఎలా ప్రవహిస్తున్నదో చూసి ఆనందించే తరుణం లభించవచ్చు. రైతులు తమ ఇళ్లల్లో విద్యుచ్ఛక్తి సహాయంతో ఫ్యాన్‌లు, రేడియోలు, దీపాలు ఏర్పాటు చేసుకొని, నగరాన్ని మరిపించే వాతావరణంలో సౌలభ్యంతో వెలుగొందవచ్చు. అలాటి రైతు గృహాలను దర్శించడంకోసం రెడ్డిగారి హృదయం వేగిరపడుతోంది.

## ప్రజారాధకుడు

గ్రామస్థులకు అతి ముఖ్యమైన మంచినీటి సరఫరా విషయంలో కూడా డా. చెన్నారెడ్డిగారి ప్రభుత్వం గొప్ప కృషి చేస్తోంది. చాలా కోట్ల రుణ సహాయాలు ఇందుకుగాను కేటాయించి కార్యక్రమం ప్రారంభించారు. ఒక్క మెతుకు వెయ్యి క్రతువులతో సమాన మన్నారు పెద్దలు. అలాటి మాటలు ఎన్నివేలో నెరవేర్చబడటంలో ఎంతో పరమార్థముంది; ప్రజా శ్రేయస్సు ఉంది. తగినంత పంట, త్రాగటానికి మంచినీళ్లు, తలదాచుకోవడానికి ఇల్లు—ఈ మూడూ ముఖ్యం ప్రజలకు. పల్లెలలో సామాన్యంగా ఇళ్ల ఇబ్బంది ఉండదు. అక్కడికి అదనపు జనం వచ్చి తొక్కిడి కల్పించడం అరుదు. అందువల్ల ఆ సమస్యను అటుంచి పంటలు, మంచినీరు, అనే నిత్యావసరాల విషయంలో నిరంతర కృషి జరుగుతోంది. ఇది ఒక విధంగా పల్లెలలో ప్రజలకు నివాళు లందించడమే అవుతుంది. అటువంటి 'ప్రజారాధకుడు'గా మారిపోయారు చెన్నారెడ్డిగారు. అదే వారి ధ్యేయం. అదే వారికి గోచరించే న్యాయం!

## బయటి వెలుగు-లోవెలుగు

పల్లెలలో వెలుగు నింపే కార్యక్రమాలతోపాటు మన హృదయాలలో వెలుగు నింపి, వారి బ్రతుకులలో వెలుగు పండించే కార్యక్రమం కూడా అతి ముఖ్యమైంది. దీనికిగాను అమితమైన కృషి జరుగుతోంది. గ్రామాలలో విద్యాభివృద్ధి కార్యక్రమాలు సత్వరంగా విస్తరింప చేయడం కోసం, విజ్ఞానాన్ని వికసింపచడం కోసం, ఇదివరకటి విద్యా విధానాన్ని అమలు జరపడంతోపాటు కొత్తగా కొన్ని పాఠశాలలు నిర్మించి వీటిలో ప్రత్యేక పద్ధతులు సమకూర్చడం ముదావహం. బాలికల మనోవికాసంతోపాటు శారీరక పటిమను నెలకొల్పడం కోసం చిన్న తరగతులలో వ్యాయామ బోధన ప్రారంభించడం ప్రాచీన సంప్రదాయాన్ని పరిరక్షించడ మవుతుంది. ఇది ఎంతో మెచ్చుకోదగ్గ విషయం. క్రమంగా గురుకుల విద్యా ప్రమాణాలు అన్ని పాఠశాలల్లో నెలకొనగలవనే ఆకాంక్ష అందరిలో ఏర్పడుతోంది.

## పల్లెలకు బస్తీలు దూరం కావు

పల్లెవాసులకు బస్తీలపై అనేక విధాలుగా అనుబంధం ఏర్పడడం, ఒకప్పుడు అవసరాలు తలయెత్తడం సహజం. అంతేకాదు, బస్తీలలో నగరాలలో ఉండే సౌకర్యాలు, వినోదాలు వారిని ఆకర్షించడం కూడా న్యాయమే. వాటికోసమని విశాలంగా ఉంటూన్న పల్లెల్ని వదిలి, వసతిగల గృహాన్ని వసతులను విసర్జించి బస్తీలకు తరలిపోవడంలో చాలా హాని ఉంది. అది పల్లెల ప్రభావాన్నే తొలగిస్తుంది. అందువల్ల పల్లెలను అన్నివిధాలా మెరుగుపరిస్తే పైన చెప్పినలాంటి ఆకర్షణలూ ఆకాంక్షలూ తొలగిపోయే అవకాశం ఉంది. పోతే, బస్తీలకు తప్పనిసరిగా వెళ్లవలసిన పనులు కొన్ని ఉంటాయి. అలాటి వాటి కోసం వెళ్లి తిరిగి తమ ఇళ్లకు క్షేమంగా చేరుకోవాలంటే బస్సు సౌకర్యాలు విరివిగా ఉండాలి. 'బస్తీ దేంవుంది. ఇలా వెడతాం, అలా వస్తాం' అన్న భావన కలగాలంటే గ్రామ గ్రామానికీ బస్సు సౌకర్య ముండాలి. అప్పుడు బస్తీలు పల్లె ప్రజల్ని దూరం నుండి పలకరించినట్లుండదు; దగ్గర్లో ఉండి మనస్సు ఉగ్గినట్లుంటాయి. కనుక ఇలాటి బస్సు సౌకర్యాలు చాలా అవసరమని



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

గ్రహించి మన ముఖ్యమంత్రి 'ప్రతి ఊరికీ బస్సు సౌకర్యం' అనే పథకాన్ని అమలు జరుపుతున్నారు. కొద్ది కాలంలో ఈ కోరిక నెరవేరుతుంది.

### "నాకు స్వర్గం వద్దు....ప్రజాసేవే నాకు హద్దు"

ఇన్నివిధాలుగా డాక్టరు చెన్నారెడ్డిగారు గ్రామాల అభివృద్ధికి ప్రజల క్షేమానికి తోడ్పడుతున్నారు. అంతేకాదు, ప్రజాసేవలో ఆయన మునిగి ముచ్చటలు పడుతున్నారు. ముప్పొద్దులా వాటికోసం ఆలోచిస్తున్నారు. రాజధానిలో ప్రభుత్వ కార్యాలయాలలో కూర్చున్నా, ఎక్కడికి ప్రయాణం చేస్తున్నా, ఏ కాగితం మీద సంతకం చేస్తున్నా ఆయన మనస్సు ప్రజాసేవ మీదనే లగ్నమై ఉంటోంది. వారి సేవాపరతని ప్రస్ఫుటంగా వివరించాలనే భావంతోనే ఇటీవల ఆయనగారు ఒక గ్రామంలో ఉపన్యసిస్తూ—'నాకు స్వర్గ సౌఖ్యాలు అక్కరలేదు. జన్మరాహిత్యం కోరడంలేదు. మళ్లీ జన్మించి ప్రజాసేవ చెయ్యాలనే ఉంది' అని ఉద్ఘాటించారు.

ఈ వాక్యంలో చెన్నారెడ్డిగారి కున్న ప్రజాసేవపైన ఆసక్తి, అనురాగం, ఆదరణ విశద మవుతాయి. శ్రీ రెడ్డిగారి షష్టిపూర్తి సందర్భంగా వారి పవిత్ర సేవ ఉన్నతమైన కానుకగా అందుతుంది. ఆ సేవాభావంలో పుట్టిన హృదయాలన్నీ శ్రుతులుగా మేళవించి మధురగీతాలు వినిపిస్తున్నాం. శ్రీ రెడ్డిగారికి భగవంతుడు ఆయురారోగ్య భాగ్యాలు సమృద్ధిగా సంతరించి, వారి ప్రజాసేవాసక్తిని పరిరక్షించుగాక!





CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# అక్షరాక్షతలు

మల్లెమాల వేణుగోపాలరెడ్డి

పుట్టుకతో
అతడు సామాన్య వ్యక్తి
పట్టుదలతో
అత డసామాన్య వ్యక్తి
కట్టు బట్టలలో
అతనిదో చిన్న రూపం
కట్టుబాట్లలో
అత డా రాము చాపం

అతని మేధస్సు మేరువుకన్న మిన్న
అతని మనస్సు అప్పుడే తీసిన వెన్న
అతని వర్చస్సు బాలభానుని నిగ్గు
అతని వయస్సు షష్టిపూర్తికి వొగ్గు

బడుగుల పాలిటికి
బలిచక్రవర్తి వంటి రేడు
బలవత్ బలిచక్రవర్తులకు
బడుగు బ్రహ్మచారి వంటివాడు

అన్యాయాన్ని చూచి హసియించ డతడు
అధర్మాన్ని గని సహియించ డతడు
అక్రమానికి మనస్కరించ డతడు
అప్రియానికి నమస్కరించ డతడు

ఆ ప్రళయం గర్జిస్తే
ఆకసం సైతం భయమున గ్రాలు
ఆహసితం కురిసిస్తే
నిండు జాబిలి భువిపైని వ్రాలు

ఆ హృదయం వర్షిస్తే
రసార్ద్రతతో పన్నీరుగా మారు
ఆ వదనం వికసిస్తే
ప్రసన్నతతో చందనముగ మారు
ఆ నింగికి ఎదిగిన మర్రి విస్తరిస్తే
భువినిండా చల్లని నీడలు పారు
ఆ రెడ్డి చెమ్మసిరగ గద్దె నధిష్ఠిస్తే
శత్రువులు సైతం హితులు కాకపోరు.

అతణ్ణి ఎందరితో పోల్చినా ఒకటే
అతణ్ణి ఎవరితో పోల్చలేని దొకటే
అతడు ప్రలోభాలకు లొంగని ఘటం
అదే అతనిని ఇంతవానిని చేసిన పాఠం

వెయ్యేండ్లు పండాలి ఆయన కీర్తి
నూరేండ్లు నిండుగా ఉండాలి ఆయన మూర్తి
అరవై ఏండ్లు పండి పండుగైన ఈ సంబరం
మరపురాని ఆయన జీవితానికో వరం

ఈ అక్షరాక్షతల రంగుల హరివిల్లు
కోటి వెలుగుల ముత్యాలు తలపైని జల్లు.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org




ఉత్తర ప్రదేశ్ గవర్నర్‌గా పదవీ ప్రమాణ స్వీకారం చేస్తున్నప్పుడు

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org



ఉత్తరప్రదేశ్ విశ్వవిద్యాలయాల చాన్స్‌లర్‌గా

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org




శ్రీ కె. వి. అబ్రహాముకు స్వాగతం చెబుతూ

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org



శ్రీ దేవరాజ్ అర్సుతో



శ్రీ ఎం. జి. రామచంద్రన్‌తో

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# నా దృష్టిలో మన ముఖ్యమంత్రి

**ఆగిశం వీరప్ప**

> "ఎందు మనంబు—నవ్యనవనీత సమానము;
> పల్కు—దారుణాఖండల శస్త్రతుల్యము."...

మాట కటువుగా, వజ్రాయుధంలాగా ఉన్నా, మనస్సు మాత్రం నవనీతంలాగుంటుంది.

ఈ మాటను ఆదికవిగారు ఎవర్ని ఉద్దేశించి చెప్పినా, మన ముఖ్యమంత్రి—డాక్టర్ చెన్నారెడ్డిగారి పట్ల మాత్రం చక్కగా అన్వయిస్తుం దనుకొంటాను.

ఎక్కడ ఏ లోటుపాటు జరిగినా నిర్మొహమాటంగా, ముఖంమీదే ఖండిస్తారు; విమర్శిస్తారు. అంతే!... ఆ తర్వాత అప్పుడే నవనీతంలాగే కరిగిపోతారు.

ఇది ఒక నా దృష్టి మాత్రమే కాదు. వారితో సన్నిహితంగా ఉండే అదృష్టమున్న ప్రతి ఒక్కరి దృష్టి.

... ... ...

వారు నిండైన మనిషి. నిండుగా స్పందించే హృదయమున్న మనిషి. అందుకే ఆ ఆవేశం.

స్పందించే హృదయానికే ఆవేశం విలువ తెలుస్తుంది. ఆవేశం లేని హృదయం ఒక స్థాణువు మాత్రమే.

ఈ మాటలు అక్షరాలా మన ముఖ్యమంత్రిగారికి అనువర్తిస్తాయి.

... ... ...

ఎక్కడైనా, ఎవరైనా చక్కని నాయకునిగా నిలదొక్కుకోవాలంటే మూడు గుణాలు ముఖ్య మనుకొంటాను.

సమాజంలోని సమస్యలను, సమస్యలకు కారణమైన వాస్తవికతలను విశ్లేషించి, అర్థం చేసుకొనే మేధాసంపత్తి—దీన్నే ఇంగ్లీషులో ఇంటలెక్ట్ అంటారు—

సమస్యలకు సరైన పరిష్కారాల్ని దర్శించి, వాటిని సతార్కికంగా, ప్రభావవంతంగా ప్రజల హృదయాల్లో ప్రతిస్పందింపచేసే సృజనాత్మక ప్రతిభ—క్రియేటివ్ జీనియస్—

పరిష్కారాలను ఆచరణరూపంలో పెట్టగలిగే క్రియాశీలకమైన దక్షత అడ్మినిస్ట్రేటింగ్ కాంపిటెన్స్.

ఈ మూడు ఉన్నవారే నాయకులుగా నిలదొక్కుకోగలరు. చరిత్రలో మహానాయకులుగా నిలిచిపోగలరు.

ఈ మూడింటిలో ఏ ఒక్కటి ఉన్నా, చరితార్థు లౌతారు. మూడూ ఒక్కచోటే ఉండడం మహా అపురూపం.

మన ముఖ్యమంత్రిగారు ఈ మూడు గుణాలకూ మనోహర త్రివేణీ సంగమం.

ఇది అక్షరాలా యథార్థం.

ఆయన మేధావుల్లో మేధావి. ప్రతిభావంతుల్లో ప్రతిభావంతులు. కార్యశీలుర్లో కార్యశీలి.

ఆయన నిజంగా మహానాయకుడు. అందులో ఎత్తుపల్లాలతో, కష్టసుఖాలతో కూడుకొన్న ఆయన జీవితమే సాక్ష్యం.

ఇది కేవలం నా ఒక్కని దృష్టి మాత్రమే కాదు. ఆయన సన్నిహితుల దృష్టి మాత్రమే కాదు. ఆయన రాష్ట్రం దృష్టి మాత్రమే కాదు.

దేశం యావత్తు దృష్టి.

... ... ...



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

సృజనాత్మక ప్రతిభ అంటే గుర్తుకు వచ్చింది.

ఆయన కవి కాదు...కవిత్వం వ్రాయరు...కాని...మాట్లాడుతున్నప్పుడు...దార్శనికుడైన ఒక మహాకవి మాట్లాడుతున్నట్లుంటుంది...భావసమృద్ధి పదంపదంలోనూ చిందులు త్రొక్కుతుంటుంది...

ఆ సమయానికి...ఆలోచించుకోవడానికి వ్యవధి కూడా లేకుండా వేదిక నెక్కి ఉపన్యసించే ఆ క్షణానికి...ఎక్కడ్నుంచి వస్తుందో...అంతటి రమణీయమైన ఊహ, సందర్భానికి అందంగా ఇమిడిపోయే భావన, భావానికి పదునులుపెక్కే పదం—వింటున్నవాళ్ల మనస్సులు ఆనందంతో పరవశిస్తాయి; ఉద్రేకంలో ఉర్రూతలూగిపోతాయి.

వృత్తిరీత్యా దేహానికి డాక్టర్...పట్టం రీత్యా, ప్రవృత్తిరీత్యా సమాజానికి డాక్టర్...! మరి, అంత కమనీయమైన కవితాత్మ ఆయనలో ఎలా చొరబడిందో...

కవిత్వం వ్రాయకపోయినా ఆయన కవుల్లో కవి!

ఆయన మనస్సులో మెరిసి, రూపం దిద్దుకొని, సమాజంలో అవతరించిన ప్రతి ప్రణాళికా ఒక కావ్యమే!

... ... ...

ఇది రాజాజీగారి శతజయంత్యుత్సవ సంవత్సరం.

నా దృష్టిలో రాజాజీగారికి, మన డాక్టర్‌గారికి మధ్య ఒక గొప్ప పోలిక కనిపిస్తుంది.

రాజాజీ గవర్నర్ జనరల్‌గా ఉండి, తదనంతరం ముఖ్యమంత్రి బాధ్యతలు నెరవేర్చాడని కాదు—డాక్టర్‌జీ గవర్నర్‌గా ఉండి, తదనంతరం ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించాడనీ కాదు—

రాజాజీగారి లేఖిని వెంట ఆయన కావ్యాత్మ—భారతీయత—పరుగులు పెట్టింది. భారతీయ భావనకు మూలకందాలైన రామాయణ, భారతాల్ని రసమయంగా సృష్టించింది.

చెన్నారెడ్డిగారి ప్రసంగాల వెంట ఆయన భారతీయత, కావ్యాత్మ—పరుగులు పెడుతుంది. భారతీయ జీవనానికి, నేటి సంఘానికి మూలకందాలైన అనేక భావనలు రసమయంగా ఆవిష్కరిస్తుంది.

ఆయన వ్రాశారు. ఈయన ఉపన్యసిస్తున్నారు. అంతే తేడా!

ఎవరైనా పూనిక వేసుకొని, డాక్టర్ మర్రి చెన్నారెడ్డిగారు సమాజ సౌభాగ్యంపట్లా, భారతీయ మౌలిక భావనల పట్లా చేసిన ప్రసంగాల్ని ఏర్చి, కూర్చి పుస్తకరూపంలో ప్రకటిస్తే బావుణ్ణు.

ఇకముందైనా అలాటి శుభకార్యం జరుగుతుందని ఆశిస్తాను.

... ... ...

జీవితం ఒక పెద్ద ఉద్యమం. అనంతంలో మొదలై, అనంతంలోకి వెళ్లిపోయే ఉద్యమం. ఆ ఉద్యమ స్వరూప, స్వభావాల్ని అర్థం చేసుకొన్నవాడే తాత్త్వికుడు. అంతటి తాత్త్వికుడే ఇంకో ఉద్యమాన్ని నడపగలడు.

డాక్టర్‌జీ నిరంతర ఉద్యమశీలి. ఉద్యమంపట్ల తాత్త్విక అవగాహన కలిగిన ఉద్యమశీలి.

ఇప్పుడు ఆయన ప్రారంభించిన సరికొత్త ఉద్యమం—బలహీన వర్గాల అభ్యున్నతి! ఇది కూడా వారి మూలంగా విజయవంతమై, నేటి సమాజంలో ఆర్థికంగా, రాజకీయంగా, తాత్త్వికంగా అట్టడుగుల్లో పడివున్న బలహీన వర్గాల వారందరూ పురోగమించి, అభ్యున్నతి సాధిస్తారని ఖచ్చితంగా విశ్వసిస్తున్నాను.

... ... ...

ఎంతో ఉత్సాహంతో, చలాకీతనంతో, యువకుల్లో యువకులుగా తిరిగే డాక్టర్ సాహెబ్ గారికి అప్పుడే అరవయ్యేళ్లంటే ఆశ్చర్యం కలుగుతోంది.

ఈ ఒక్క షష్ఠ్యబ్దోత్సవమే కాదు—మరో అరవై వసంతాల షష్ఠ్యబ్దోత్సవాన్ని కూడా వారు ఘనంగా జరుపుకోవాలని మనసారా కాంక్షిస్తున్నాను. భగవంతుడు ఆ కోర్కెను నెరవేర్చాలని ప్రార్థిస్తున్నాను.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# బహుముఖ ప్రజ్ఞాశాలి

**ఎస్. జనార్ధనరెడ్డి**

---

మన దేశంలో ఈనాడు పరిపాలనా నిర్వహణ దక్షులైన రాజకీయవేత్తల కొరత తీవ్రంగా ఉన్నది. ఈ పరిస్థితుల్లో డా. ఎం. చెన్నారెడ్డి వంటి పరిపాలనాదక్షత గల ప్రముఖ రాజకీయవేత్త లభించడం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు గర్వకారణమైన విషయం. ఇప్పటికే దేశంలో ఉన్నత రాజకీయ నాయకులలో అగ్రగణ్యులుగా భాసిల్లుతున్న డా. రెడ్డి కేంద్రంలోను, రాష్ట్రంలోను మంత్రిగా అనుభవం సంపాదించినవారు. దేశంలోని అతి పెద్ద రాష్ట్రంలో గవర్నరుగా పనిచేశారు. అక్కడ రాష్ట్రపతి పాలన విధించిన సమయంలో రెండుసార్లు ప్రత్యక్షంగా పరిపాలనా వ్యవహారాలను నిర్వహించారు. ఈవిధంగా గడించిన 30 సంవత్సరాల రాజకీయ పరిపాలనా అనుభవాలతోను, దీక్షాదక్షతలతోను జాతి భవిష్యత్తును, రూపురేఖలను తీర్చిదిద్దడంలో ప్రముఖపాత్ర వహిస్తున్నారు. ఆయన రాజకీయ రంగంలో ఎంతటి సిద్ధహస్తులో క్లిష్టమైన పరిపాలనా వ్యవహారాలలో కూడా అంతటి దక్షులు. పక్షులు గాలిలో ఎగిరినంత సహజంగా ఆయన రాజకీయ రంగంలో పని చేస్తారు. చేపలు నీటిలో ఈదినంత సునాయాసంగా పరిపాలనా రంగంలో వ్యవహరిస్తారు. ఈ రెండు రంగాలలోని విషయాలు ఆయనకు కరతలామలకాలు.

ఆయన ఏ రూపంలోనూ మితవాది కాదు. ఆయనది ప్రతి పనికీ మీన మేషాలు లెక్కపెట్టే తత్వం కాదు. దాపరికంలేని మనిషి. క్రొత్తంటే భయంలేని వ్యక్తి. సాహసోపేతమైన మానసిక స్వభావం కలవారు. ప్రతి విషయంలోనూ పూర్వం ఏవిధంగా జరిగిందో ఋజువుల కోసం వెతకడం, అరడజను మంది సంతకాలు చేస్తేగాని తన సంతకం పెట్టక పోవడం వంటి అలవాట్లు ఆయనలో మచ్చుకైనా కనిపించవు. పరిపాలనాదక్షులంటే ప్రస్తుతం ఏవిధంగా మనం అర్థం చేసుకుంటున్నామో దానికి మించినవారు డా. చెన్నారెడ్డి. గొప్ప దూరదృష్టి, క్రాంతదర్శనం అభివృద్ధిదృక్పథం గల పరిపాలనావేత్తలకు ఆయన ఒరవడి అని చెప్పవచ్చు. కొత్త కొత్త మార్పులకు కారణభూతమైన నవోదయానికి అనుసంధాన కర్తగా ఆయన జీవితంలో రాణించినవారు. కారన్‌వాలిస్, కర్జన్, ఆర్థర్ కాటన్, మౌంట్‌బాటన్, రాజాజీ, సర్దార్ పటేల్ వంటి పరిపాలనా సంస్కర్తల కోవకు చెందినవారు డా. రెడ్డి అనడంలో అతిశయోక్తి లేదు. పెద్ద పెద్ద పేర్లు పేర్కొని వారితో చెన్నారెడ్డిగారిని పోల్చడం అతిశయోక్తిగా అనిపించవచ్చు కాని యిది యథార్థం. చారిత్రక వ్యక్తుల వైభవం మాట ఎలా ఉన్నా వాస్తవంగా జరుగుతున్న విషయాల ఆధారంగానే ఆయనకు ఆ తరగతిలో చేరే అర్హత లభించింది.

ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత, అంటే 1978 మార్చి 6వ తేదీ నుంచి డిసెంబరు వరకు జరిగిన 9 నెలల పరిపాలనను ఉదాహరణంగా తీసుకుందాం. ఏ ముఖ్యమంత్రి అయినా పదవి చేపట్టిన మొదటి సంవత్సరంలో అనేక రాజకీయ పరిస్థితులను ఎదుర్కోవలసి ఉంటుంది. డా. రెడ్డి అటువంటి పరిస్థితులను ఎదుర్కొంటూనే పరిపాలనా వ్యవహారాల మహాసముద్రంలో మునిగి దాని లోతులు కనుక్కున్నారు. ఈ స్వల్ప కాలంలోనే ఆయన ఎన్నో కొత్త విధానాలను, పరిపాలనా సంస్కరణలను ప్రవేశపెట్టారు. పాలనా యంత్రాంగానికి కొత్త స్ఫూర్తిని యిచ్చి పరిపాలనా నిర్వహణ వృత్తిగాగల ఉన్నతాధికార్లకు ఉత్తేజాన్ని కల్పించారు. జీర్ణావస్థలో ఉన్న అనేక సంస్థలకు కొత్త జీవం పోశారు. అనేక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. బలహీన వర్గాల సంక్షేమానికి, విముక్తికి అనేక దీర్ఘకాలిక పథకాలను ప్రవేశపెట్టారు. ప్రాథమిక సాంఘిక, విద్యా సంస్కరణలకు గట్టి పునాదులను వేశారు. సరిగ్గా పని జరగని అనేక రంగాలను గుర్తించి వాటిని క్షాళనం చేయడానికి చర్యలు తీసుకున్నారు. ఈవిధంగా ఇటీవలి కాలంలో ఏ రాజకీయవేత్త చేయని పనులెన్నిటినో ఆయన చొరవతో, ఉత్సాహంతో చేసి చూపించారు. కునికిపాట్లు పడుతున్న పరిపాలనా యంత్రాంగంలోని అంగాంగాన్ని పరిశీలించి చికిత్స చేసి పునరుజ్జీవింప చేశారు. ఈ కృషిలో శస్త్రచికిత్స చేయడానికి, దేహంలో ఒక అంగాన్ని తీసి కొత్త అంగాన్ని ప్రవేశపెట్టడానికి కూడ ఆయన వెనుకాడలేదు.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

## విధానాల సరళీకరణ

ఆయన పదవిని స్వీకరించిన వెంటనే పరిపాలనలోని లోటుపాట్లను సరిచేయడానికి ఉద్యమించారు. పాలనా విధానాలను సరళంచేసి అధికారాలను క్రిందివారికి బదిలీచేసే విషయాన్ని పరిశీలించేందుకు కార్యదర్శుల కమిటీని నియమించారు. మామూలు కమిటీల మాదిరిగా కాకుండా తన సహజసిద్ధమైన ఉత్సాహంతో చైతన్యస్ఫూర్తితో ఈ కమిటీని పనిచేయించి దాని నివేదికను స్వీకరించి దానిని ప్రభుత్వ ఉత్తర్వు రూపంలో (జి. ఒ.(పి) నం. 703 తేదీ 4–12–1978) జారీ చేశారు. 1976 లో జరిగిన ముఖ్యమంత్రులు, కార్యదర్శుల మహాసభ తర్వాత రూపొందించిన సమగ్రమైన పరిపాలనా సంస్కరణగా ఈ ఉత్తర్వును మనం భావించుకోవచ్చు. ఈ సంస్కరణ ద్వారా మంత్రివర్గం పని భారం బాగా తగ్గిపోయింది. పథకాల అమలులో ఉండే అనేక లోటుపాట్లను సవరించారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఆర్థిక అధికారాలను బదిలీ చేశారు. కార్యనిర్వాహక సంస్థలు, ఫీల్డు యూనిట్లకు స్వయంనిర్ణయాధికారం కల్పించడం జరిగింది. ఈవిధంగా గత 30 సంవత్సరాలుగా క్షేత్ర విభాగాల అధికారాలను తొలగించి సచివాలయంలో కేంద్రీకృతం చేస్తూ, తద్వారా ప్రభుత్వాన్ని ప్రజలనుంచి దూరంచేసి ఈ సంస్థల కార్యనిర్వాహణ ప్రజలకు అందుబాటులో లేకుండా చేసిన పద్ధతులను మార్చివేసి, అధికారాలను తిరిగి క్షేత్ర విభాగాలకు ఇవ్వడం జరిగింది.

## లక్ష్యాలు-ఆచరణ

డా. చెన్నారెడ్డి బహు ముఖ ప్రజ్ఞాశాలి. బుద్ధికుశలత, ఓరిమి గలవారు. ఒకేసారి కొలిమిలో వంద కత్తులు కాల్చి, ప్రతిదాని పదును సరిదిద్దగల నేర్పరి. ఆయన పదవిని స్వీకరించిన మొదటి వారంలోనే భూసంస్కరణ విషయాలను అవగాహన చేసుకున్నారు. ఇందులో పేద ప్రజలకు మోసం జరుగుతున్నదని గ్రహించారు. భూమి పట్టాల రూపంలో కాగితాలు ఇస్తున్నారు తప్ప అసలు భూమి మాత్రం వారికి స్వాధీనం కావడంలేదని గుర్తించారు. ఇది పేద ప్రజలను పట్టుకుని వేళాకోళం చేస్తున్నట్లున్నదని భావించి, వెంటనే భూమి స్వాధీన పక్షోత్సవం నిర్వహించారు. మంత్రివర్గ సభ్యులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా అధికారులు కార్యరంగంలో ప్రవేశించి, ఇంతవరకు పట్టా సర్టిఫికేట్లు మాత్రమే ఇచ్చిన నిరుపేదలకు 1,32,446 ఎకరాల భూమిని ఖచ్చితంగా స్వాధీనం చేశారు. లక్ష్యాలకూ ఆచరణకూ మధ్య ఉండే అంతరాలను తొలగించాలనే దృఢసంకల్పమే డా. రెడ్డి ఊహలో మెరుపులా మెరిసి, ఆయనను ఈ పనికి పురికొల్పింది. ఆయనది హామీలకు ఆచరణకు మధ్య గల అగాధాన్ని తొలగించాలనే తత్వం. తక్కువ హామీలు ఇస్తూ ఎక్కువ పని చేయాలనే దీక్ష కలవారు. వాగ్దానం చేసిన పనిని చేయలేని దుస్థితిలో ఏ రాజకీయ నాయకుడూ తలవంపులకు గురి కారాదని ఆయన భావం. ఏ విషయాన్ని అయినా సులభంగా నమ్మే తత్వంగల ఈ సమాజంలో రాజకీయాల్లో ఇది సరియైన విధానంగా భావించబడదేమో కాని, ఫలితాల సాధనే ముఖ్యమని భావించిన డా. రెడ్డి తన ఆదర్శాల, లక్ష్యాల విషయంలో రాజీపడే వ్యక్తి మాత్రం కాదు.

## కపటంలేని వ్యక్తి

డా. చెన్నారెడ్డిలో మోసం, కపటం మచ్చుకైనా లేదని ఆయనను కనీసం ఒక్కసారి కలుసుకున్నవారైనా గ్రహిస్తారు. ఇటువంటివి బలహీనతా లక్షణాలు. డా. రెడ్డి బలహీనుడు కాదు; మేరునగధీరుడు. పరిపాలకుడు కానిదే రాజకీయవేత్త కాలేడని ఆయన విశ్వాసం. రాజకీయవేత్తగాని, పరిపాలనా వ్యవహర్తగాని నిర్ణయం తీసుకోవడంలో కొంత కాలహరణం జరిగినా, ఒకసారి నిర్ణయాన్ని ప్రకటించిన తర్వాత దానిని అమలు జరపలేక పోవడం ఆయన గౌరవానికి భంగంగా ఉంటుంది. ఈ తత్వం, దృక్పథం ఉండడంవల్లనే ఆయన పరిపాలనా యంత్రాంగంలోని స్తబ్దతకు, పద్ధతులకు, విధానాలకు కొంత కలవరపడ్డారు. అసహనం వ్యక్తం చేస్తారు. ఆయన అధునాతన రోదసీ యుగ వేగంతో పనిచేసే వ్యక్తి. ఆలస్యం అంటే ఆయనకు అసహనం—''ఆలస్యా దమృతం విషం'' అన్నట్లు. అభివృద్ధి ఎంద్రువివంటిదైతే, ఎద్దుబండితో పోల్చదగిన అధికారవర్గ యంత్రాంగంతో అందుకోలేము గదా! అందువల్లనే ఈ ఎద్దుబండి యంత్రాంగాన్ని ఒక రోదసీ నౌకగా మార్చాలని ఆయన తాపత్రయపడతాడు. దీనికి అవసరమైన పరిజ్ఞానం, దృఢసంకల్పం ఆయనకు ఉన్నాయి. ఆయన చేయలేకపోతే ఆ పని మరెవ్వరూ చేయలేరు. ఎటువంటి అలసట, చికాకు లేకుండా రోజుకు 20 గంటలు ఏకదీక్షతో ఆయన పని చేస్తారు. ఆయన పట్టుదల జ్ఞాపకశక్తి చూసి, తాపీగా పనిచేసే అధికారులు గజగజ వణుకుతారు. అందుకే, వారికి


CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

ఆయన వేయి చేతుల్తో వేయి కొరడాలు పట్టుకున్న కార్తవీర్యార్జునుడుగా కనిపిస్తారు. తాను నిర్ణయించిన లక్ష్యాలవైపు తమను పరుగులు తీయిస్తున్న అశ్వారోహకుడైన వీరుడుగా ఆయన వారికి కనిపిస్తారు. ఆర్థిక అభివృద్ధి, పేదల సంక్షేమం, సంతోషంతో ప్రజాసేవ చేయాలనే లక్ష్యాల సాధనకూ వారు ఆయన నేతృత్వంలో ఉరుకులు, పరుగులు పెడుతుంటారు.

పాలనా యంత్రాంగం మొత్తం ఒక నిష్క్రియత్వం ఆవరించి ఉన్నదనీ, దానివల్ల ముఖ్యమంత్రి ఇతర మంత్రులూ అధికారుల విధానాల పద్ధతుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి, ప్రజలకు ఎటువంటి వాగ్దానాలు చేయలేని నిస్సహాయ స్థితిలో ఉంటున్నారనీ, వాగ్దానాలు చేసినా అవి నెరవేర్చగలుగుతామనే విశ్వాసంలేని పరిస్థితిలో ఉన్నారనీ డా. రెడ్డి ప్రారంభంలోనే తెలుసుకున్నారు. వెంటనే పరిస్థితులను చక్కదిద్దడానికి పూనుకున్నారు. తన ఉత్తర్వులను, ప్రజలకు తాను చేసిన వాగ్దానాలను తక్షణం యథాతథంగా అమలు జరపాలని వ్రాతమూలకంగా ఆయన ఆదేశాలు జారీ చేశారు. వాటిని "చెన్నారెడ్డి సూత్రాలు" గా ఒక పత్రిక వ్యాఖ్యానించింది. నియమాలకు విరుద్ధంగా వ్యవహరించడానికి ఇవి ఉద్దేశించబడలేదనీ, దానికి మారుగా చెదును నివారించి రాజకీయ అధికారానికీ, పౌరుల అవసరాలకు అనుగుణంగా పాలనా యంత్రాంగాన్ని రూపొందించి, తద్వారా రాజకీయ అధికారం పాలనా యంత్రాంగం దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ప్రజాస్వామ్యం, రాజ్యాంగం దెబ్బ తినకుండా ఉండేందుకు ఈ చర్యలు ఉద్దేశించబడినాయనే విషయాన్ని ఆ పత్రిక గుర్తించలేదు. తన కార్యనిర్వాహణ దక్షతతో, ప్రజలకు చేసిన వాగ్దానాలను రాజకీయనేతలు నిలబెట్టుకోడానికి అడ్డు పడుతూ, అదృశ్యంగా ఉండే సంకెళ్లను అతి త్వరలోనే ఆయన తెలుసుకోగలిగారు. అంతేకాదు, మంత్రులు ఫైళ్లమీద చేసిన ఉత్తరువులను, ప్రత్యేక కేసులలో కోర్టులు ఇచ్చిన తీర్పులను నిర్వర్తించుటలో జరిగే జాప్యాలను లేకుండా చేశారు. అప్రతిహతంగా రాజకీయ అధికార రథచక్రాలకు తెలివిగా బద్ధకస్తులైన వారు వేసే అడ్డుపుల్లలుగా కాకుండ నియమాలు,నిబంధనలు మొదలైనవి ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు చేసిన ఆజ్ఞలు చురుకుగా కొనసాగడానికి దోహదకారులైనవి. దీనివలన రాజ్యాంగరీత్యా, ప్రజాస్వామ్యంలో ప్రజానాయకులు నిర్వర్తించవలసిన బాధ్యతలు నెరవేరడానికి వీలు కలిగింది. అధికారులవల్ల జరిగే జాప్యాన్ని, స్తబ్దతనూ శాసనసభలో మంత్రులు సమర్థించుకోవలసిన అవసరం మరి లేకుండా పోయింది. శాసనసభకు మంత్రులు బాధ్యులనే మాటకు దీనితో అసలైన అర్థం వచ్చింది.

ప్రజల విజ్ఞప్తులు అన్నిటికీ ముట్టినట్లు రసీదులు పంపాలనీ, వాటిమీద ఏవిధమైన చర్య తీసుకుంటున్నారో, అది ఏ దశలో ఉన్నదో ఎప్పటికప్పుడు తెలియపరుస్తూ ఉండాలని ఆయన ఉత్తర్వు జారీచేశారు. స్వరాజ్యం వచ్చిన తర్వాత మన రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఎవరి అధికారం కొనసాగుతున్నదో ప్రజలకు ఇప్పుడు తెలిసింది.

## వ్యవహార నిర్వాహకుడే కాదు, పరిపాలనాశాస్త్రవేత్త

డాక్టర్ రెడ్డి నియమ నిబంధనలతోనో, కేవలం వ్యవహార జ్ఞానంతోనో పరిపాలన సాగించే సాధారణ పరిపాలకుడు మాత్రమే కాదు. నానాటికి పెరిగిపోతున్న లక్ష్యాలు, ప్రజల ఆశయాల సందర్భంగా పరిపాలనా యంత్రాంగం అభివృద్ధి చెందుతున్న దశలో అనుసరించవలసిన పరిపాలనా వ్యవహారాల శాస్త్రానికి సంబంధించిన పద్ధతులను గురించి ఆయనకు నిశితమైన దృష్టి ఉంది. అటువంటి పరిపాలనా యంత్రాంగానికి ఉండవలసిన కీలకమైన ప్రాథమిక విషయాలను గురించి ఆయనకు స్పష్టంగా తెలుసు.

క్రమబద్ధంగా అనుసరించడానికి తగ్గట్టుగా ఆయన అమలులోకి తెచ్చిన విధానాలలో అతి ముఖ్యమైనవి :

1. విధి నిర్వహణ, అధికారం, బాధ్యత, జవాబుదారి విషయాల్లో వికేంద్రీకరణ.
2. అధికారాల విషయంలోను, నిర్వహణలోను, నిర్ణయం తీసుకోవడంలోను జాప్యాన్ని తగ్గించవలసిన అవసరం.
3. వ్యక్తులు నిర్వహించవలసిన పాత్రలతోనేగాని వ్యక్తులతో సంబంధం లేకుండా పాలన యంత్రాంగం ఉండాలన్న ఆయన భావన.
4. వృద్ధి పొందుతున్న శక్తిమంతమైన పాలన యంత్రాంగం మార్పులతో నిత్యనూతనంగా ఉండాలనే భావన.
5. ప్రభుత్వోద్యోగుల పట్ల ఉదారమైన, ఉపయోగకరమైన వైఖరి.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

6. అన్నిటికంటే ముఖ్యమైనది. ప్రజల బాధలు తొలగించడానికి ప్రజల అవసరాలను తీర్చడానికి జవాబుదారీ వహించే పరిపాలనా యంత్రాంగం యొక్క ఆవశ్యకత.

### విధులు, బాధ్యతల వికేంద్రీకరణ

డాక్టర్ చెన్నారెడ్డి ప్రభుత్వం తీసుకొన్న ప్రథమ చర్యలలో ముఖ్యమైనది పంచాయత్, మున్సిపల్ ఎన్నికలలో వోటువేసే హక్కు యువతీ యువకులకు కలుగజేయడానికై వయఃపరిమితిని 21 నుండి 18కి తగ్గిస్తూ పంచాయతీ చట్టాన్ని, మున్సిపల్ చట్టాన్ని సవరించడం అనేది అందరికీ తెలిసిన విషయమే. పంచాయతీరాజ్య ప్రధాన కార్య నిర్వాహకులను నేరుగా ప్రజలే ఎన్నుకొనే ప్రజాస్వామిక విధానాన్ని కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

నిర్వహణ అధికారం, బాధ్యత, విధి నిర్వహణలో, జవాబుదారీని రాజధాని స్థాయినుండి ప్రాంతీయ అధికారులకు అప్పజెప్పే విధంగా యంత్రాంగాన్ని 'ప్రాంతీయం' చేయవలసిన అవసరం ఉందని డాక్టర్ చెన్నారెడ్డిగారు నొక్కి చెప్పున్నారు. అన్ని శాఖలలోను దీన్ని సాధించడానికి సంపూర్ణమైన పథకాన్ని రూపొందించడానికి కృషి జరుగుతున్నది.

### జాప్యాన్ని తగ్గించడం

సెక్రటేరియట్‌లోని అన్ని శాఖలలోనూ ఫైళ్ల విషయంలో "దశల తగ్గింపు" అమలు జరగాలని 1978 జులై 18, 19 తేదీలలో జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో నిర్ణయం జరిగింది. ఉత్తరువు జారీచేసే ముందు ఇద్దరి కన్నా ఎక్కువమంది గెజిటెడ్ అధికారులు ఏ కేసునూ చూడవలసిన అవసరం లేకుండా చేయాలని దీని భావం. దీనివల్ల అనేక స్థాయిలలో ఫైళ్ల ప్రయాణం చేయవలసిన అవసరం లేకుండా జాప్యాలు చాలావరకు తగ్గిపోతాయి.

### వివిధ వ్యక్తులు నిర్వహించే పాత్రలు-సంస్థా నిర్మాణం

కార్యనిర్వహణలో ఉన్నతాధికారులు చేయవలసిన పని అనే దాని విషయంలో డాక్టర్ చెన్నారెడ్డి పద్ధతిని చూచినట్లయితే ఇతర రాజకీయ నాయకుల తీరుకు అది చాలా భిన్నంగా ఉంటుంది. ఇతర రాజకీయ నాయకులు ఉద్యోగాలకు వారి అభిరుచులకు అనుగుణంగా వ్యక్తులను ఎన్నుకొంటూ ఉంటారు. అయితే, డాక్టర్ రెడ్డి పద్ధతిలో ఉద్యోగుల నియామకం, వ్యక్తిగతం కాదు. వారు నిర్వహించే పాత్రలకే ప్రాధాన్యం. ఒక వ్యక్తి నిర్వహించే పాత్ర, అందుకు అతను వహించే బాధ్యత, యంత్రాంగం యొక్క లక్ష్యం, ఇవి ముఖ్యంగాని వ్యక్తి కాదు ముఖ్యం-అన్న దానిపైన ఆధారపడే పద్ధతి రెడ్డిగారిది.

### ఒక నూతన భావన

బ్రిటిష్‌వారికి అనువుగా బ్రిటిష్ ఇండియా పరిపాలకులు అర్థరహితంగా ప్రవేశపెట్టిన కార్యాలయపు పని వేళలను ఉష్ణప్రాంతమైన మన దేశానికి మన రాష్ట్రానికి అనువుగా ఉండేటట్లు మార్చాలని డాక్టర్ చెన్నారెడ్డి ప్రతిపాదించిన విషయం ముఖ్యమైనది. ఇది చాలా ప్రాథమికమైన మార్పు. ప్రస్తుతం అనుసరిస్తున్న పని వేళల పద్ధతి తర్కానికి నిలిచేది కాదు. పని బాగా జరగడానికి పనికివచ్చేది కాదు. కేవలం ఒక అలవాటుగా చారిత్రకంగా సంక్రమించినదే. అయినప్పటికీ, డా. చెన్నారెడ్డి ప్రజాస్వామ్యవాది కావడంచేత ఈ విషయంమీద అందరితో చర్చించడానికి అంగీకరించారు. అదేవిధంగా సచివాలయం లోని కొన్ని శాఖలు హద్దు పద్దు లేకుండా పెరిగిపోతున్న విషయాన్ని గూర్చి ప్రభుత్వపు కార్యనిర్వహణకు చెందిన కాలం చెల్లిన పురాతన విధానాలలోని లోపాలను ఆయన తన సునిశితమైన పరిపాలనా అనుభవంచేత సులభంగా పసికట్టగలిగారు. శాఖల స్వరూపాన్ని, కార్యనిర్వహణ నిబంధనలను హేతుబద్ధంగా రూపొందించడానికి భారత పరిపాలనా సిబ్బంది కళాశాలకు చెందిన నిపుణుల సహాయంతో కార్యదర్శుల సంఘం యిప్పుడు ప్రయత్నం చేస్తోంది. ఆయన అప్పుడే విద్యాశాఖను విభజించారు. అదేవిధంగా లైసెన్సులు, భవననిర్మాణాలకు అనుమతులు మొదలైన వాటిని క్రమబద్ధం చేసే నియమ నిబంధనలను



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

సరళం చేయాలని కలెక్టర్ల సమావేశంలో నిర్ణయించారు. ప్రతి శాఖలోనూ మార్పుకోసం కృషి జరుగుతున్నది. పబ్లిక్ కార్పొరేషన్‌లలో కొన్ని స్థాయిలలో అర్థిక సేవను ప్రవేశపెట్టడానికి ఆయన ఉద్దేశించారు.

## కొత్త కవాటాలు

పరిపాలన విషయంలో కొత్త ఆలోచనలు, పద్ధతులు, ధోరణులు ప్రవేశపెట్టడానికి వీలుగా చంద్రశేఖర్ సంఘం నివేదిక ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగులకు విస్తృత ప్రాతిపదికపై శిక్షణ యివ్వాలని ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పరిపాలనా శిక్షణ సంస్థను అప్పుడే అందుకు ఆయత్తం చేశారు. అనేకమంది అధికారులను శిక్షణ నిమిత్తం దేశంలోని యితర ప్రాంతాలకూ, విదేశాలకూ పంపుతున్నారు. కొత్త విజ్ఞానంలోను, కొత్త దృక్పథంలోను, కొత్త సాంకేతిక పరిజ్ఞానంలోను డా. రెడ్డికి పరిపూర్ణ విశ్వాసం ఉంది.

## సిబ్బందిపట్ల ఔదార్యం

1976 లో గడువుకు ముందుగానే ఉద్యోగ విరమణ చేసిన లోయర్ డివిజన్ గుమాస్తా, దానికి సమాన స్థాయిలో గల ప్రభుత్వ ఉద్యోగులను తిరిగి సర్వీసులోకి తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేయడం డా. చెన్నారెడ్డి మానవతా దృక్పథానికీ, కారుణ్య స్వభావానికీ నిదర్శనం. మిగతా వారి విషయంలో న్యాయ, ధర్మ, దయా ప్రాతిపదికలపై ఉదారంగా సమీక్ష జరపాలని ఉత్తర్వు చేశారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమంతో ఆయనకు సన్నిహిత సంబంధం ఉంది. ఉదాహరణకు పదవ అఖిలభారత సివిల్ సర్వీసుల కుస్తీ పోటీలు ఆంధ్రప్రదేశ్‌లో జరగడానికి ఆయన చాల చొరవ తీసుకున్నారు. ఈ కార్యక్రమం ముగిసేవరకూ ఆయన ఎంతో శ్రద్ధ వహిస్తూ ప్రభుత్వ ఉద్యోగులలో క్రీడాసక్తిని పెంపొందించారు.

## ప్రజల ఫిర్యాదుల పరిష్కార పథకం

పరిపాలనా సంస్కరణలలో విశిష్టమైన ముందడుగుగా అభివర్ణించదగినది ఆయన స్వయంగా రూపొందించిన ప్రజల ఫిర్యాదుల పరిష్కార పథకం. దీనికి ప్రారంభ చర్యగా తనకుగానీ, నేరుగా ప్రభుత్వానికిగానీ అందజేసే మహజర్లను ఒకచోట పరిశీలించడానికి వీలుగా సచివాలయంలో ఒక ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇందువల్ల ప్రజలు తమ ఫిర్యాదుల పరిష్కారానికి ప్రభుత్వ శాఖల చుట్టూ తిరిగే శ్రమ తగ్గిపోతుంది.

జిల్లా స్థాయిలో ప్రజల ఫిర్యాదులను పరిశీలించే విషయాన్ని మొదట ఒక్కొక్క మంత్రి ఆధ్వర్యంలో జిల్లా సమీక్షా సంఘానికి అప్పగించారు. అయితే 1978 జులై 18, 19 తేదీలలో హైదరాబాదులో జరిగిన కలెక్టర్ల సమావేశంలో డా. రెడ్డి ఈ విషయంలో సమగ్రమైన పథకాన్ని, యంత్రాంగాన్ని రూపొందించారు. దానిని 1978 ఆగస్టు 16 వ తేదీన జి. వో. (పి) నెం. 511/ఎలక్ & ఓ ఎ/78 ఉత్తర్వు ద్వారా జారీ చేశారు. పౌరులకూ పరిపాలనా విభాగానికీ మధ్య ఉండే సంబంధాలలో యిదొక కొత్త మలుపు. ప్రాంతీయ స్థాయిలో ఫిర్యాదులు పరిష్కరించే విధానం యిది. రెవిన్యూ డివిజనల్ అధికారులను వారి అధికార పరిధిలోనికి వచ్చే ప్రాంతాల్లో ఏ శాఖకు సంబంధించిన ఫిర్యాదులనైనా పరిష్కరించే నిమిత్తం ప్రాంతీయ ఫిర్యాదుల పరిష్కార అధికారులుగా నియమించారు. ఆయా ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించే విషయంలో వారు ఫిర్యాదుదారులకు, ఆయా శాఖలకు మధ్య వారధిగా పని చేస్తారు. గ్రామ స్థాయిలో, అన్ని కార్యాలయాల్లోనూ ఈ కార్య నిర్వహణ అత్యంత పటిష్ఠవంతంగా అమలౌతుంది. ప్రభుత్వ స్థాయిలోగాని, గ్రామీణ స్థాయిలో గాని, ఏ కార్యాలయంలో నైనా గాని ఏ శాఖకు చెందినప్పటికీ ఒక ఫిర్యాదు నమోదైనట్లయితే చాలు—ఆవాదు పౌరునికి తన ఫిర్యాదు సత్వరం పరిష్కరింపబడేందుకు ఆ ప్రాంతంలోనే పనిచేస్తున్న ఫిర్యాదుల విభాగం ఉంది. జంట నగరాలలో పురపాలక సంస్థ కమీషనరు ఫిర్యాదుల అధికారిగా వ్యవహరిస్తారు. ఒంబుడ్స్‌మన్ విధానాన్ని అధిగమించే అత్యంత శ్లాఘనీయమైన విశిష్ట పథకం యిది.


CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

## శ్రద్ధ వహించవలసిన కీలకాంశాలు


కీలక విషయాలపట్ల శ్రద్ధ వహించడంలో డాక్టర్ రెడ్డికి ప్రతిభావంతమైన పరిజ్ఞానం ఉంది. ఇందువల్లనే, ఆయన ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన తక్షణమే విద్యావిధానం ద్వారా నైతిక పునరుజ్జీవనం సాధించాలని గుర్తించారు. ఆయన ప్రతిపాదించిన అభ్యుదయ ప్రాథమిక సంస్థ పథకం ద్వారా కేవలం విద్యావంతులను మాత్రమే కాకుండా సమాజంలో నైతిక ఆధ్యాత్మిక శక్తిని పునరుద్ధరించే విద్యావిధానానికి పునాది వేశారు. ఈవిధంగానే, బాలబాలికల్లో పూర్ణ వ్యక్తిత్వం వికసించవలసిన అవసరాన్ని ఆయన గుర్తించి, అన్ని జిల్లాల్లోను సకల సదుపాయాలతో బాలభవన్‌లను ఏర్పాటుచేసే పథకాన్ని రూపొందించారు.

గ్రామీణ అభివృద్ధి కోసం చేసే అన్ని కార్యక్రమాల్లోనూ రవాణా సౌకర్యాలు కల్పించడం అత్యంత ప్రాథమిక అవసరమని ఆయన గుర్తించారు. వెంటనే ఎన్నో అవరోధాలను అధిగమించి అన్ని గ్రామాలను బస్సురూట్లతో కలిపే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు. బలహీన వర్గాల సముద్ధరణ రంగంలో ఈ వర్గాలవారికి ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక పథకాలను రూపొందించడానికి ఒక చైతన్యవంతమైన అధికారి నాయకత్వంలో ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఆర్థికంగా వెనుకబడిన వారికోసం కూడా ఒక సమర్థుడైన అధికారి క్రింద ఒక సమగ్ర గ్రామీణ గృహనిర్మాణ పథకాన్ని రూపొందించే నిమిత్తం వేరొక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇందువలన ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించిన వారందరికీ ఇళ్లు కట్టి ఇవ్వడానికి హామీ ఏర్పడుతుంది.

ఏ విషయం కూడ ఆయన దృష్టి నుంచి తప్పించుకొని పోలేదు. ఏ విషయం ఆయన దృష్టిని ఆకర్షించకుండా ఉండలేదు. ఏ విషయమైన ఆయన స్మృతిపథంనుండి తొలగిపోలేదు. ఆయన పరిపాలనాదక్షతతో కూడిన కఠినతనం నుంచి కూడ ఎవరూ తప్పించుకోలేదు. పాలనా యంత్రాంగానికి లొంగిపోయి అది చెప్పినట్లు నడవడం కాక తానే దానిని నడిపే సమర్థుడైన అఖిలభారత స్థాయి రాజకీయ నాయకుడు మొట్టమొదటిసారిగా మన రాష్ట్రానికి నాయకత్వం వహిస్తున్నారు.

రాజకీయ రంగంలో ఎదుర్కొన్న అనేక సంఘటనలతోపాటు డా. చెన్నారెడ్డి చరిత్ర ఆయన సాధించిన పరిపాలనా నిర్వహణ విజయాలతో నిండివుంది. స్వాతంత్ర్యం పొందిన దేశంలో పరిపాలనా సామర్థ్యంలేని రాజకీయాలు అరాచకానికి దారితీస్తాయి. అదేవిధంగా సమర్థవంతమైన రాజకీయ నాయకత్వంలేని పరిపాలన నియంతృత్వానికి దారితీస్తుంది. అన్నివిధాలైన పరిపాలనాదక్షత, సమర్థవంతమైన రాజకీయ నాయకత్వ లక్షణాలు కలిగిన వ్యక్తి దొరికినప్పుడే నిజమైన స్వేచ్ఛ, ప్రగతి మనకు లభిస్తాయి. అందుకే డా. చెన్నారెడ్డి నాయకత్వంలో ప్రజలు స్వేచ్ఛను, ప్రగతిని పొందగలుగుతా రనడంలో సందేహంలేదు.

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org



యోగాధ్యానం చేస్తున్నప్పుడు

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org



ధ్యాన నిమగ్నులై వున్నప్పుడు

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org



ఉదయం ఉపాహారం తీసుకుంటున్నప్పుడు



సచివాలయంలో అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నప్పుడు



ప్రజా సందోహం మధ్య

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org



సతీమణితో, మనుమలతో విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు



అర్ధరాత్రి దాటినా ప్రజలపట్ల తమకున్న గురుతర బాధ్యతలు నెరవేరుస్తున్న సమయంలో
(ఛాయాచిత్రాలు: పేకేటి శివరాం)

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# చలనచిత్ర పరిశ్రమకు పరమాప్తుడు

డి. వి. యస్. రాజు

ఆంధ్రప్రదేశ్‌లో చలనచిత్ర పరిశ్రమాభివృద్ధికి సుస్థిరమైన పునాదులు వేసిన వారిలో అగ్రగణ్యులు గా. డాక్టర్ మర్రి చెన్నారెడ్డిగారు. పదిహేను సంవత్సరాల క్రితమే చిత్రసీమ పురోభివృద్ధికి ఎంతో దూరదృష్టితో ప్రణాళికలను రూపొందించి, సినిమా పరిశ్రమకు 'ఆప్తబంధువు' అని నిరూపించుకున్నారు. ఆ తరువాత ఏర్పడ్డ కొన్ని అవాంతరాలు కారణంగా వారు ఆశించిన విధంగా ఆ ప్రణాళికలు అమలు జరగలేదు. రాష్ట్రానికి దూరంగా—కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగానూ, ఉత్తరప్రదేశ్ గవర్నరుగానూ వారు బాధ్యతలను స్వీకరించడంతో వా రాశించిన ప్రగతి ఎంతగానో కుంటుపడింది.

అవాటికీ, ఇవాటికీ చిత్ర నిర్మాణం రెండింతలు పెరిగింది. ప్రస్తుతం ఏడాదికి వందకు పైగా తెలుగు చిత్రాలు నిర్మింపబడుతున్నప్పటికీ, స్వరాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ స్థిరంగా కాలూనలేక పోవడం అత్యంత విచారకరం. డాక్టర్ చెన్నారెడ్డిగారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టగానే ఈ దుస్థితిని నివారించడానికి నడుము కట్టారు. నిరాశామై ఉన్న వాతావరణాన్ని సరిదిద్దడానికి సముచితోత్సాహంతో పూనుకుని, చిత్రపరిశ్రమలోని వ్యక్తు లందరిలో నూతనోత్తేజాన్ని పురికొల్పారు. ఇంతకాలంగా—ప్రతి చిత్రానికి లక్షరూపాయల సబ్సిడీ పద్ధతి అమలులో ఉన్నప్పటికీ, ఆశించిన సత్ఫలితాలు చేకూరక పోవడంతో సబ్సిడీ పద్ధతిని రద్దు చేస్తానని హెచ్చరిస్తూ చలనచిత్ర పరిశ్రమకు ఒక 'షాక్ ట్రీట్‌మెంటు' ఇచ్చా రాయన. పరిశ్రమ పెద్ద లందరికీ వారి వారి బాధ్యతలను గుర్తు చేశారు. చిత్తశుద్ధితో, కార్యదీక్షతో శ్రీ చెన్నారెడ్డిగారు తలపెట్టిన ప్రయత్నం సఫలీకృతం కాగలదన్న దృఢవిశ్వాసం చిత్రపరిశ్రమలోని వారందరికీ కలుగజేశారు.

1978 జులై 3న డాక్టర్ చెన్నారెడ్డిగారు మద్రాసు విచ్చేసిన సందర్భంగా, తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఏకోన్ముఖంగా వారికి ఘనస్వాగతం పలికింది. చిత్రపరిశ్రమ సమస్యలను ఎంత కూలంకషంగా వారు అవగాహన చేసుకున్నదీ, వాటి సత్వర పరిష్కారానికి వారు ఏ మేరకు కృతనిశ్చయులై యున్నదీ గమనించిన మే మందరము వారి సునిశితబుద్ధికీ, సుదృఢ దీక్షకూ ఆశ్చర్యచకితుల మైనాము. పదిహేనేళ్ళుగా కాలదోషం పట్టిన సినిమా పరిశ్రమాభివృద్ధి ప్రణాళికలను కొన్ని నెలలలోగానే ఆచరణసాధ్యం చేసి తీరాలని అందరికీ ఆయన పిలుపు నిచ్చారు. ఆయన పిలుపు నందుకుని మేమంతా ఒక కమిటీగా ఏర్పడి, జులై 21, 22 తేదీలలో హైదరాబాదులో వివిధాంశాలపై వారితో చర్చలు జరిపాము. ఆ సందర్భంగా వా రెన్నో అమూల్యమైన సలహాలు మా కందించారు. ముఖ్యాంశాల పరిశీలనకై మూడు ఉపసంఘాలను ఏర్పాటుచేసి, పరిశ్రమాభివృద్ధికై తగు సూచనలను సత్వరంగా అందజేయమన్నారు. అందుకుగాను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు వివిధ శాఖల కార్యదర్శులను కూడా అప్పుడు సమావేశపరచి, అక్కడికక్కడే అన్ని విషయాలను చర్చించి, సముచిత నిర్ణయాలు తీసుకునే సదవకాశం కల్పించారు. ఉపసంఘాలు ఆగస్టు—సెప్టెంబరు నెలల్లో రెండుసార్లు సమావేశమైన తర్వాత, సెప్టెంబరులో తమ నివేదికలను సమర్పించాయి. 20 రోజుల లోగానే ఈ నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించి, ఆర్థిక వనరుల కోసం చేసిన ప్రతిపాదనలను అక్టోబరులోనే ముఖ్యమంత్రి శాసనసభలో ప్రకటించారు.

గతంలో ఏ ప్రభుత్వాధినేతా యింత విపులమైన నివేదికను ఇంత స్వల్పమైన వ్యవధిలో పరిశీలించి, దానిపై ఇంత సత్వరంగా నిర్ణయాలు తీసుకోవడం జరగలేదన్నది నిర్వివాదం. ఇది డాక్టర్ చెన్నారెడ్డిగారి అకుంఠిత కార్యదీక్షకు ఒక మచ్చుతునక.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

ప్రభుత్వ నిర్ణయాలను శాసనసభలో ప్రకటించటంతోపాటు, ఆ మరునాడే వివిధ శాఖాధికారులను సమావేశ పరచి చిత్ర పరిశ్రమకు చెందిన మా అందరి సమక్షంలో—నివేదికలో పొందుపరచిన వివిధాంశాలకు సంబంధించిన నిర్ణయాలను ప్రకటించారు. తత్ఫలితంగా—కలర్ లేబరేటరీలు, రికార్డింగు–డబ్బింగు థియేటర్లు, అవుట్‌డోర్ యూనిట్లు, ఎడిటింగ్ రూములు మున్నగు వివిధ వసతుల ఏర్పాటుకు అంకురార్పణ జరిగింది. చిత్ర నిర్మాతలకు, కళాకారులకు, సాంకేతిక నిపుణులకు తగు గృహవసతికిగాను 'ఫిలిం నగర్ హౌసింగ్ కో–ఆపరేటివ్ సొసైటీ' ఏర్పడి, వెంటనే పని ప్రారంభించే కార్యక్రమం చేపట్టబడింది.

1948 లో విద్యార్థిగా నేను విద్యార్థి కాంగ్రెసులో పనిచేస్తున్న రోజులలో, ఆనాటి ప్రముఖ యువ నాయకుడుగా శ్రీ చెన్నారెడ్డిగారు మమ్మల్ని ఎంతగానో ఉత్తేజ పరచేవారు. తీక్షణమైన మేధస్సు, అనుకున్నది నిర్భయంగా చెప్పటం, ఆచరణలో ముందడుగు, కార్యదీక్ష, పట్టుదల ఇవన్నీ ఆనాడే వారిలో ప్రస్ఫుటంగా ద్యోతకమయ్యేవి. మూడు దశాబ్దాల తర్వాత ఈనాడు కూడా ఆ సల్లక్షణాలను వారి కార్య పద్ధతిలో పోల్చుకుని నే నెంతో ఉత్తేజితుడ నయ్యాను.

**బహుముఖ ప్రజ్ఞాశాలి**

విశ్వసించిన వ్యక్తిని ఆదరించి గౌరవించడం, చిన్న పెద్ద అనే తారతమ్యాన్ని పాటించక అందరినీ సాదరంగా పలకరించడం వారి ప్రత్యేకత. అందుకే వారు బహు జనాదరణ పొంది ప్రజానాయకులుగా ప్రఖ్యాతి నార్జించారు. నేనూ, చిత్ర పరిశ్రమలోని నా మిత్రులూ గత ఐదారు మాసాలుగా—కనీసం నెల కొకసారైనా—వారిని కలుసుకుని పరిశ్రమ సమస్యలను చర్చిస్తున్నాం. ప్రతిసారీ ఎంతో సంతృప్తితోనూ, సమధికోత్సాహంతోనూ తిరిగి వస్తున్నాం.

ఆయన చాలా సూక్ష్మగ్రాహి. ఏ సమస్యనైనా ఇట్టే అవగాహన చేసుకో గల్గడమే గాక, దాని పరిష్కారం ఏ మేరకు సాధ్యమో వెంటనే తేల్చి చెప్పగలిగిన దిట్ట. సాధ్యపడే మేరకు నిర్ణయాలు తీసుకుని అమలుపరచటంలోను, సాధ్య పడని వాటికి ఇతర మార్గాలను సూచించి తోడ్పడటంలోను ఆయనకు ఆయనే సాటి.

బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రజానాయకుడూ, అకుంఠిత దీక్షాదక్షుడూ అయిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డిగారి షష్ట్యబ్ది పూర్తి మహోత్సవం ఈనాడు మనం జరుపుకోగల్గడం ఎంతైనా ముదావహం. ఆయన నూరు సంవత్సరాలు నిండుగా జీవించి ప్రజాసేవను కొనసాగించే విధంగానూ, వారి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ యావద్భారతంలో అగ్రగామి రాష్ట్రంగా అన్ని రంగాలలోనూ ముందంజవేసే విధంగానూ పరమేశ్వరుడు వారికి ఆయురారోగ్యైశ్వర్యాభివృద్ధిని కలిగించాలని ఈ శుభసందర్భంగా ఆకాంక్షిస్తున్నాను.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# దుర్బల వర్గాలకు అభయహస్తం

త్రిపురాన రాఘవదాసు

పేదవాడి గోడు ఈనాటిది కాదు. రాత పెట్టిన రోజే తరతరాలు సాగినట్టుగా, పేదరికం ఒక సంచితంగా పట్టి పీడిస్తున్న సామాజిక జాడ్యం. కొందరు 'మొత్తం మాసి పీటవేస్తూ' వచ్చినందునే సంఘానికి దాపురించిన దురవస్థ ఇది. ఆర్థికం అన్ని సమస్యలకు కీలకం అని తెలుసుకున్నప్పుడు సమాజంలోని బహుళ సంఖ్యాకులు దుర్బల వర్గాలుగా, అణగారిన జాతులుగా, అదేదో ఒక ప్రత్యేక 'తెగ' గా పడి ఉండడానికి కారణం అర్థమవుతుంది.

'పేదపేదల బిడ్డల పెంపు సొంపు
అడిగి, పేదసాదల యిడుము లెరిగి
అశన వాసోవిహీన దైన్యము నడంప
నభయ హస్తము......'

ఎవరు ప్రసాదిస్తే వారు నిజమైన ప్రజాసేవకులు, అన్నాడు ఏనాడో కవి మధునాపంతుల!

రెండువేల సంవత్సరాలు వెనక్కి వెళ్లి చూస్తే శూద్రక మహాకవి తన 'మృచ్ఛకటికం' నాటకంలో సామాజికులకు దారిద్ర్యబాధ ఒక మహాపాతక మని పేదరికంవల్ల మొత్తం సంఘానికి రాగల వినాశాన్ని వివరించాడు. దారిద్ర్యం ఉత్పత్తి కార్యక్రమాలకు ఎంత అటంకమో ఇలా చెప్పాడు :

'పేదతనంవల్ల మనిషి శక్తి సన్నగిల్లుతుంది. పేదతనంవల్ల సిగ్గుపడవలసి వస్తుంది. సిగ్గువల్ల తేజస్సు పోతుంది. తేజస్సులేని వారికి పరాభవం తప్పదు; పరాభవం వల్ల విచారం సంభవిస్తుంది; విచారంవల్ల దుఃఖం, దానివల్ల ఉన్న మతి కూడా పోతుంది. ఆపైన సర్వనాశనం. దారిద్ర్యం అన్ని అనర్థాలకూ మూలం!'

బహుశః అందుకేనేమో, పేదవాడి కోపం పెదవికి చేటని, పేదవాళ్ళే చూస్తే పేలాలు కూడా తుళ్లితుళ్లి పడతా యని ఒక వాదం సంఘంలో స్థిరపడి పోయింది. అందుకనే ఈ 'దరులూ, మరులూ' లేని సమాజం కోసం విశ్వకవి రవీంద్రుడూ పరితపించాడు. నిజమైన స్వాతంత్ర్యానికి అర్థాన్ని ఇలా వివరించాడు :

"ఎక్కడ క్షుద్రమైన సంకుచితమైన
దరులతో మరులతో ధరాతలం
వేరులు కొట్టుకొని ముక్కలు కాలేదో,
ఆ స్వేచ్ఛా స్వర్గసీమలోకి
దేవా! నడిపించు నా దేశాన్ని నడిపించు—
యుగయుగాల తలరాతల భారం నుంచి,
తరతరాల అవమానాల బరువునుంచి
విమోచనం కల్పించు దేవా!"

దేశంలో మనిషికీ మనిషికీ మధ్య మాయ పొరలు కప్పి అన్ని మమకారాలకు దూరంచేసిన ఈ 'అడ్డుగోడలను' తొలగించగల స్వేచ్ఛా భారతాన్ని ఊహించిన ద్రష్ట రవీంద్రుడు. ఈ దుష్టమైన 'గోడల' వల్లనే సంఘంలో ఒక వర్గం బలహీన వర్గాలుగా ముద్రపడి, పరాయి పాలనలో అనేక అవకాశాలకూ, అవసరాలకూ దూరం చేయబడ్డారు.

జాతీయ స్వాతంత్ర్య సమరం ఈ బలహీన వర్గాలకు క్రమంగా సాంఘిక, రాజకీయ రంగాలలో ప్రాధాన్యం కల్పించి, వారి సమస్యలను ప్రస్తావించి, సహమానవులుగా నిలబెట్టింది. స్వాతంత్ర్య సమరం కొంది సంవత్సరాలలో జయప్రదం కానున్న దశలో గాంధీజీ ఈ సత్యాన్ని మరికొంత వివరించాడు :



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

'భారతదేశ సమాజంలో జనించిన సంపదను చూసుకుని మోసపోకండి...ఆ సంపదకు మూలం నిరుపేద వర్గాలు పోస్తున్న రక్తం. నాకు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ స్వరూప స్వభావాలు బాగా తెలుసు. పై అంతస్తులో ఉన్నవాళ్ల (ధనవాన్ల) వత్తిళ్ల వల్లనే కింద నున్నవారు నలిగి నాశనమై పోతున్నారు. ఈ భారాన్ని తొలగించి పారేయాలి. (1944 జూన్ 29)

అంతేగాదు, ఇక ఒక్క ఏడాదిలో దేశానికి స్వాతంత్ర్యం వస్తుందనగా కూడా గాంధీజీ :

'ధనికులకూ, పేదవారికీ మధ్య తారతమ్యాలు దుర్భరంగా కడు దుస్తరంగా ఉన్నాయి. నిరుపేద గ్రామీణులను దోచుకుంటున్నవారు విదేశీ పాలకులే కారు, మన స్వదేశీ బాంధవులు కూడా. పేదరికం నరకం అధర్మంగా, అదొక శాశ్వత నైతిక న్యూనతగా అందరూ గుర్తించినట్టయితే, వ్యక్తులు సంపదను కూడబెట్టుకోవటాన్ని పరమ పాపంగా పరిగణించటానికి ఆచరిస్తే అసమానతలు ఉండవు. కరువు కాటకాలూ ఉండవు.'

('ఎథికల్ రెలిజియన్' : గాంధీ రచన)

సాంఘిక-ఆర్థిక జీవనంలో నిజమైన స్వాతంత్ర్యానికి అర్థాన్ని కూడా ఆయన వివరించారు :

'ఇతర ప్రపంచ దేశాలన్నీ అనుసరించదగిన విధంగా స్వతంత్ర భారత దేశం అంతటా ఆదర్శవంతమైన విధానాన్ని అనుసరించాలంటే, ఉద్యోగులు, డాక్టర్లు, లాయర్లు, ఉపాధ్యాయులు, వర్తకులు, తదితరులూ—అందరూ నిజాయితీతో చేసే రోజువారీపనికి సమాన వేతనాలు పొందాలి.

(హరిజన పత్రికలో వ్యాసం: 1947 మార్చి 16)

ఇవన్నీ 1929 నాటి కాంగ్రెస్ లాహోర్ ప్రతిజ్ఞకూ, 1931 నాటి కరాచీ కాంగ్రెస్ తీర్మానాలకూ పూర్తి అనుగుణంగా ఉన్న ఆదర్శాలు. ఈ రెండు మహాసభల తీర్మానాలు అర్థసత్యాలు కావు, పూర్ణ సత్యాలనే వెల్లడించాయి.

వెరసి వీటన్నింటి ఫలితం— స్వాతంత్ర్యం తరువాత బలహీన వర్గాల సముద్ధరణ కోసం కొన్ని ప్రత్యేక కార్యక్రమాల పట్ల శ్రద్ధ వహించడం. పాలనా యంత్రాంగం తలపెట్టి అమలులోకి తెస్తున్న వివిధ పథకాల ద్వారా బలహీన వర్గాలు ఏ మేరకు ప్రయోజనం పొందాయో మనం తెలుసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్* జనాభాలో 72 లక్షల మంది బలహీన వర్గాలకు చెందిన వారైనందున ఈ పథకాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గడిచిన మూడు దశాబ్దాలలో వివిధ రంగాలలో అభివృద్ధి సాధించిన మాట వాస్తవం కాని, ఈ అభివృద్ధి ఫలితాలు హెచ్చు భాగం సమాజంలోని ఏ బలహీన వర్గాలకు చేరాలని ఆశించామో ఆ వర్గాలకు అందలేదన్నది కూడా ఒక కఠిన సత్యంగానే ఉంది.

ఈ విషయాన్ని ధ్రువపరుస్తూ "ఆర్థిక-గణాంక శాఖ" తన తాజా సర్వేలో మరింత స్పష్టం చేసింది. 'ప్రగతి పథకాలు గ్రామాలలోని ధనిక వర్గాలకు తోడ్పడినంతగా అవి ఉద్దేశించిన బలహీన వర్గాలకు తోడ్పడలేదు.' (1977)

ఆచరణలో ఏర్పడుతున్న ఈ అంతరం సాంఘికంగా అశాంతికి, అరాచకానికి దోహదం చేస్తుంది. 'నోరు మూసుకుంటే మూగ' నా చెప్పుకున్నా భరించరానిది బలహీన వర్గాలు తుదకు 'నోరు తెరిస్తే రాగ' అని తమను అనుకున్నా సరే, నోళ్లు తెరిచారు! ప్రగతి పథకాలలో కాగితాలపై తమకు కేటాయించిన సొమ్మును న్యాయంగా ఆచరణలో ఖర్చుపెట్టి తమ అంతస్తును పెంచమంటున్నారు. అధికం పేరిట ఏనాటి అత్యాచారాలను సహించబోమంటున్నారు. మొదటిసారిగా చైతన్యవంతులు అయ్యారు. ఇది ప్రభుత్వ యంత్రాంగానికి, ప్రజలు ఎన్నుకున్న మంత్రివర్గానికి ఒక సవాలు. ఆ సవాలును అందుకొనే దిశలోనే, పది మాసాలనాడు డాక్టర్ చెన్నారెడ్డి నాయకత్వాన ఏర్పడిన నూతన మంత్రివర్గం ఈ సవాలు వెనకున్న తాత్పర్యాన్ని అర్థం చేసుకొన గలిగింది. బహుశః అందుకనే శ్రీ చెన్నారెడ్డి ఒక సందర్భంలో 'రాజకీయ ప్రజాస్వామ్యం, ఆర్థిక సమానత్వం, సాంఘిక న్యాయం పూర్తిగా శక్తి పుంజుకుంటున్న సమాజమే పటిష్ఠమైన సాంఘిక వ్యవస్థ అవుతుంది. ఇదే దృష్ట్యా మా నూతన ప్రభుత్వపు మౌలికమైన దృక్పథం' అని స్పష్టం చేశారు.

ఈ తత్త్వం ఆధారంగానే ఆయన బలహీన వర్గాలపై జరిగే దౌర్జన్యాలకు స్వస్తి చెప్పించాలని వ్యక్తిగత బాధ్యతను గుర్తించటమే, స్పష్టంచేస్తూ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలివ్వడమే గాక బలహీన వర్గాల సముద్ధరణకు శాశ్వతమైన పరిష్కారం ఏమిటో కూడా తొలిసారిగా స్పష్టం చేశారు. 'షెడ్యూల్డు కులాల, తెగల, తదితర బలహీన వర్గాలకు ఆర్థిక సౌష్ఠవం కల్పించడం ఒకటే శాశ్వతమైన పరిష్కారం; ఇందుకు త్వరితంగా ఆర్థిక పథకాలను అమలు జరపడం కీలకమైన

* స్టేట్ బ్యూరో ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

సమస్య' అన్నారు. జటిలమైన సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని, తక్షణ సమస్యలకు సత్వర పరిష్కారాన్ని ఈ మాటలు సూచిస్తున్నాయి.

4 కోట్ల 90 లక్షల మంది జనాభా ఉన్న రాష్ట్రంలో * 2 కోట్ల మందికి పైగా నేటికీ కటికదారిద్ర్యంలో, నిరక్షరాస్యతలో, అమాయకత్వంలో మగ్గుతున్నారు. ఈ వర్గాలలో హెచ్చు భాగం షెడ్యూల్డు కులాలు, తెగలూ, ఇతర వెనుకబడిన వర్గాలవారే. ప్రణాళికా విధానం చేపట్టిన తరువాతనే ప్రభుత్వాలు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలను, పద్ధతులను ప్రవేశపెట్టడం జరిగింది.

అయితే, ఈ పథకాలను అమలు పరచడంలో, వ్యవహారసరళిలో డాక్టర్ చెన్నారెడ్డిగారి ప్రభుత్వం కడచిన మార్చి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు వ్యక్తంచేసిన విశ్వాసానికి తగినట్లుగా కొన్ని కొత్త పుంతలు తొక్కుతోంది. ఈ ఏడాది బడ్జెట్ (1978–79) లో బలహీన వర్గాల సంక్షేమం నిమిత్తం రు. 35 కోట్లు కేటాయించడమే గాక, వివిధ సంస్థల నుంచి (ఇన్‌స్టిట్యూషనల్ ఫైనాన్స్) మరి రు. 23 కోట్ల మేరకు ద్రవ్యసహాయాన్ని కూడా రాబడుతోంది.

'ఎన్నికల్లో మా విజయానికి ప్రధాన కారకులయి, మమ్ముల్ను అధికారంలోకి విశ్వాసంతో పంపిన ప్రజలను, ముఖ్యంగా బలహీన వర్గాలనూ, వారి ప్రయోజనములనూ విస్మరించలేదు' అని శ్రీ చెన్నారెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత అనేక సందర్భాల్లో హామీ ఇచ్చారు. తమ బతుకుబాటలో మరింత మార్పునూ, ప్రగతినీ ఆశిస్తున్న బలహీన వర్గాలకు ఆయన ఇచ్చిన హామీలు, ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపులూ, తదనుగుణంగా పథకాల అమలూ సంతృప్తి కల్గించాయి. పాత పద్ధతులలో పనిచేసిన యంత్రాంగం, అధికారులూ అలసత్వం వహిస్తే సహించేది లేదని శ్రీ చెన్నారెడ్డి హెచ్చరికలు చేసిన దరిమిలా ఈ పథకాలను అమలు జరపడంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఈ హెచ్చరికలు వమ్ము కావనీ, కారాదనీ బలహీన వర్గాలు ఆశిస్తున్నాయి.

నిరుద్యోగం రాష్ట్రసమస్యే కాదు, దేశవ్యాప్తమైన సమస్యగా ఉంది; విద్యాధికులయిన నిరుద్యోగుల సమస్య మరింతగా ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితులలో నెల కింత అని 'నిరుద్యోగ భృతి' ఇవ్వడం ద్వారా సమస్య పరిష్కారం కాదని భావించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టు 15న కొత్త పథకాన్ని చేపట్టింది. దాని ప్రకారం విద్యాధికులైన నిరుద్యోగులకు ప్రయోజనకరమైన వృత్తులలో శిక్షణ గరపి, తద్వారా స్వయంపోషణకు అవకాశం కల్పించాలని నిర్ణయించింది. ఇందుకు ప్రథమంగా షెడ్యూల్డు కులాలు, తెగలూ, ఇతర బలహీన వర్గాలకు చెందిన విద్యాధికులయిన నిరుద్యోగులకు ఈ అవకాశం కల్పించింది.

1978 మార్చి నాటికి రాష్ట్రంలోని ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీలలో రిజిస్టర్ అయివున్న నిరుద్యోగుల సంఖ్య 8.4 లక్షలు. వీరిలో షెడ్యూల్డు కులాలకు చెందినవారు 89 వేలు, తెగలకు చెందినవారు 11 వేలు, ఇతర వెనుకబడిన వర్గాలకు చెందినవారు 1,97,000.

ఇది ఇలా ఉండగా మెట్రిక్యులేషన్, ఆపై అర్హతలుగల షెడ్యూల్డు కులాలవారు 23 వేల 300 మంది ఉన్నారు. ఇలాంటి అర్హతలు గల్గిన నిరుద్యోగులు షెడ్యూల్డు తెగలలో 1623, ఇతర వెనుకబడిన వర్గాలలో 89,807 మంది ఉన్నారని అంచనా. కాగా, కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరవాత మొత్తం 50 వేల మంది విద్యాధికులయిన నిరుద్యోగులకు ఉపాధి కల్పించగల పథకాలను అమలులోకి తెచ్చారు. వీరికి శిక్షణ పూర్తి అయిన ప్రభుత్వ, అర్ధప్రభుత్వ, ప్రయివేటు సంస్థలలో ఏదాయకీని ఉపాధి కల్పించే విధంగా ఈ పథకాలు రూపొందించారు. స్వయం ఉపాధి పథకాలు కూడా చేపట్టగల విధంగా శిక్షణావకాశాలు కల్పిస్తున్నారు. శిక్షణ కాలంలో స్టయిపెండ్లు ఇస్తారు. స్వయం ఉపాధి పథకాలకు ఆర్థిక సహాయం అందజేస్తారు. రు. 5 కోట్ల పెట్టుబడితో ప్రారంభించిన ఈ పథకాలు క్రమంగా సుమారు లక్ష మందికి ఉపాధి కల్పించ గలవని అంచనా వేశారు.

ప్రస్తుతం సిద్ధమైన ప్రత్యేక ఉపాధి పథకాల ప్రకారం, వాణిజ్యంలో పరిశ్రమలలోనే గాక, వేరుగా ప్రభుత్వ, ప్రయివేటు రంగాలలో కూడా వీరిని రిక్రూట్ చేసుకునేందుకు తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకు అనుగుణంగా

* ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఒపీనియన్—తాజా సర్వే.


CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, ప్రస్తుతం ఉన్న ఉపాధి అవకాశాలను మరింతగా పెంచేవిధంగా, అవసరమైన శిక్షణ ఏర్పాట్లతో పరిశ్రమలకు ప్రోత్సాహంగా ఉండేటట్లు పరిశ్రమల డైరెక్టరు, ఉపాధి కల్పన శాఖ డైరెక్టరు పథకాలను సిద్ధం చేశారు. అలాగే జిల్లాల స్థాయిలో ఆయా కలెక్టర్లు కూడా అభివృద్ధి పథకాల పరిధిలోనూ, పరిధికి వెలుపల కూడా ప్రస్తుతం ఉన్న ఉపాధి వనరులకు మించి అదనంగా ఉద్యోగాలు కల్పించగల వనరు లున్న కేంద్రాలను ఎంపిక చేసే బాధ్యత తీసుకుంటున్నారు. ఈ ప్రత్యేక పథకాలను రూపొందించడంలో, అమలు జరిపించడంలో దాదాపు అన్ని ప్రభుత్వ శాఖలూ ఎప్పటికంటే ఇప్పుడు ఎక్కువగా కదిలినట్లు కన్పిస్తుంది.

లఘు పరిశ్రమలను సర్వసాధారణంగా ఎదుర్కొనే ప్రధాన సమస్యలు—ముడిపదార్థాల సరఫరా, మార్కెటింగు సౌకర్యాలు లేకపోవడం. అందువల్ల ఈసారి చెన్నారెడ్డి ప్రభుత్వం చేసిన పని—ఈ ముడిపదార్థాలు లభిస్తే తప్ప ఉత్పత్తి, మార్కెట్టూ దెబ్బతినగల కీలకమైన వినాశ సంబంధమైన సరకుల ఉత్పత్తిని లఘు పరిశ్రమలకు కేటాయించకుండా జాగ్రత్త వహించడం; తద్వారా స్వయం ఉపాధికి తోడ్పడగల వ్యాపారం సాధించగల లఘుపరిశ్రమలను ప్రోత్సహించడం. సంప్రదాయక వృత్తుల వారిని ఆకర్షించగల విధంగా స్థానిక వనరులపైన మాత్రమే ఆధారపడగల లఘు పరిశ్రమలను ప్రోత్సహించడానికి కొత్త స్కీములు తలపెట్టారు. ఇందుకు అయ్యే మొత్తం ఖర్చు రు. 351 లక్షలు అని అంచనా. ఇందులో ప్రభుత్వం రు. 70.40 లక్షలు 'మార్జినల్' డబ్బుగా సిద్ధపరుస్తుంది. మిగిలిన 280.60 లక్షలనూ బ్యాంకులు సమకూరుస్తాయి. లఘుపరిశ్రమల అభివృద్ధిలో ఈసారి కేంద్రీకరణ—స్థానిక వనరులపైన ఆధారపడిన ఫైబర్ కార్పెట్లు, టెక్స్‌టైల్స్, కాఫీ గ్రైండింగు, ఉన్ని కంబళ్ళు, స్క్రీన్ ప్రింటింగ్, 'జనతా చీరలు' వగైరా ఉత్పత్తులపై ఉంటుంది.

మెకానిక్కులు, ఎయిర్ కండిషనింగ్, రిఫ్రిజిరేషన్, డీజెల్ మెకానిక్స్, సివిల్ ఇంజనీర్లు, డ్రాఫ్ట్స్‌మన్, ట్రేసర్లు, హయ్యర్ గ్రేడ్ స్టెనోగ్రాఫర్లు వంటి ప్రత్యేక నైపుణ్యంగల వృత్తిదారుల కొరత బలహీన వర్గాలలో ఉంది. ఈ కొరత తీర్చడానికి వీరికోసం కొత్తగా ఉపాధి కల్పన శాఖవారు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. దీనికి అయ్యే మొత్తం ఖర్చు రు. 8 లక్షలు కాగా, ఇందులో స్టయిపెండ్ల కోసం 4 లక్షలు ఖర్చు అవుతుంది. ఈ పథకం ప్రకారం 500 మంది మెకానిక్కులను టెక్నీషియన్లను తయారుచేసే ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఇవికాక 1978–79లో ప్రభుత్వం వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నిర్వహించే హాస్టళ్ళలో అదనంగా 8000 మందికి బోర్డింగు సదుపాయాలు కల్పించింది. ఒక్కొక్క హాస్టల్‌లో 50 మంది బోర్డర్లకు వసతి కల్పిస్తూ అదనంగా 11 కొత్త హాస్టళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది; జాలర్ల పిల్లల కోసం కొత్తగా 5 ఆశ్రమ పాఠశాలలను మంజూరు చేసింది.

ఈ కార్యక్రమాలకు స్కాలర్‌షిప్పులు, వెనుకబడిన వర్గాలకు మంజూరు చేసిన భూములలో సేద్యపు బావుల త్రవ్వడానికి రూపొందించిన కొత్త పథకాలకూ, వెనుకబడిన తరగతుల ద్రవ్య సహాయ సంస్థ ద్వారా ఆర్థికంగా రుణాలు అందించడానికి, అత్యాచారాలకు గురైన బలహీన వర్గాల వారికి ఆర్థిక లీగల్ సహాయం కోసం 1978–79లో కొత్త ప్రభుత్వం వార్షిక ప్రణాళికలో మొదట పెట్టుకున్న వ్యయ పరిమితిని (రు. 225 లక్షలు) సవరించి, రు. 355 లక్షలకు పెంచింది.

ఫలితంగా ప్రణాళికా పరిధిలో ఉన్న సహాయమే గాక, 1978–79లో వెనుకబడిన వర్గాల సంక్షేమ పథకాల కోసం ప్రణాళికేతర సహాయం కింద, ఆరు సూత్రాల పథకం కింద, కేంద్రం ప్రతిపాదించిన పథకాల కింద ఈ కింది మొత్తాలు ఖరారయినాయి :

| | | | |
|---|---|---|---|
| ప్రణాళికలో సహాయం | ... | రు. 355.00 | (లక్షలు) |
| ప్రణాళికేతర సహాయం | ... | రు. 290.97 | ,, |
| షట్సూత్ర పథకం సహాయం | ... | రు. 17.27 | ,, |
| కేంద్ర పథకాల కింద లభించే మొత్తం | ... | రు. 8.55 | " |
| | మొత్తం | రు. 671.79 | (లక్షలు) |



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

షెడ్యూల్డు కులాలు, తెగలు, ఇతర వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్పులను ఇంతవరకూ ఆరవ క్లాసు, ఆ పై క్లాసులకు మాత్రమే పరిమితం చేశారు. కాగా, కొత్త ప్రభుత్వం 1978–79 నుంచి స్కాలర్‌షిప్పులను ఐదవ క్లాసు విద్యార్థులకు కూడా వర్తింపజేసింది. ఇందుకు అదనంగా రు. 20 లక్షలు ఖర్చు అవుతున్నదని అంచనా. పోస్ట్–మెట్రిక్ విద్యార్థులకు ఇస్తున్న స్కాలర్‌షిప్పుల సంఖ్యను కూడా పెంచింది.

ఇది ఇలా ఉండగా, బలహీన వర్గాలకు దన్నుగా సంస్థాగత ద్రవ్య సహాయం అందించడంలో నూతన ప్రభుత్వం రాష్ట్రంలోని నాలుగు రకాల కార్పొరేషన్లను—షెడ్యూల్డు కులాల సహకార ద్రవ్య సంస్థ, వెనుకబడిన వర్గాల సహకార ద్రవ్య సంస్థ, మహిళా సహకార ద్రవ్య సంస్థ, ఆగ్రో–ఇండస్ట్రీస్ కార్పొరేషన్—హెచ్చుగా వినియోగంలోకి తెచ్చుకుంటోంది. ఖాదీ, గ్రామీణ పరిశ్రమలకు సంబంధించిన వివిధ పథకాల ద్వారా సుమారు 20,000 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు సాధించేందుకుగాను ఖాదీ బోర్డును కొత్త ప్రభుత్వం ప్రోత్సహించి రంగంలోకి దించింది.

అంతేకాదు; అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధుల కొరత ఉన్నందున, పలు ప్రఖ్యాత పథకాలను అమలు జరిపి తీరవలసిన బాధ్యత ఉన్నందున ముఖ్యమంత్రి శ్రీ చెన్నారెడ్డి రాష్ట్ర ఆర్థిక వనరులను పెంచేందుకు ఒక ప్రయోజనకరమైన నిర్ణయం చేశారు. రాష్ట్రంలోని దేవాలయ భూములను విక్రయించి తద్వారా లభించగల రు. 200 కోట్లనూ రాష్ట్ర ఆర్థిక, ప్రగతి, సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించాలని సంకల్పించడం—ఎటు తిరిగి "మానవుడే మాధవుడు" అని విశ్వసించగల వారందరూ హర్షించదగిన విషయం. ఇందువల్ల ఏటా రెండు కోట్ల వడ్డీ కూడా వస్తుంది. ఈ నిర్ణయం త్వరలో అమలులోకి రావాలని ప్రగతిని కోరే వారందరూ ఆశిస్తున్నారు. ఇక తిరుపతి దేవస్థానం వద్ద (ఇప్పటికి ఉత్తగా మూలుగుతున్న) డిపాజిట్లు రు. 30 కోట్లను కూడా ప్రణాళిక పరిధిలోకి రాని ప్రగతి పథకాలు అమలు జరపడానికి వినియోగించుకోవాలన్న ప్రతిపాదనను కూడా ఆచరణసాధ్యం చేసుకుంటే, నిధుల కొరత పేరిట సంక్షేమ పథకాలను వాయిదా వేసుకొని, అశాంతిని కొనితెచ్చుకొనే పని తప్పుతుందని భావిస్తున్నారు.

## భూసంస్కరణలు

కొత్త మంత్రివర్గం అధికారంలోకి వచ్చిన తర్వాత 1973 నాటి భూసంస్కరణల చట్టాన్ని అమలులోకి తెచ్చిన ఫలితంగా, 16 లక్షల 58 వేల 222 ఎకరాలు పేదసాదలకు పంపిణీకి వీలైన మిగులు భూమి తేలినట్లు లెక్కసరిగా అంచనా వేశారు. అయితే దురదృష్టవశాత్తూ ఈ మిగులు భూమిలో 11.96 లక్షల ఎకరాలు కోర్టుల దావాదేవీల్లో ఉండిపోయింది. అయితే, దావాదేవీల్లో ఉన్న భూమిని కూడా వాటి నుంచి తప్పించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఎలాంటి దావాదేవీలు లేకుండా ఉన్న భూమి 4.61 లక్షల ఎకరాలని తేల్చారు. తిరిగి ఇందులో పేదల స్వాధీనం చేసిన భూమి 2.95 లక్షల ఎకరాలనీ, మిగతా భూమిలో హెచ్చు భాగం వ్యవసాయ ప్రయోజనాల కోసం పంపిణీ చేయగా, 709 ఎకరాలను ఇళ్ల స్థలాలకు కేటాయించారని అంచనా. ఇందువల్ల లాభించిన పేదల సంఖ్య, 1,31,784 అని అంచనా. ఇది ఇలా ఉండగా భూమి స్వాధీన పక్షోత్సవాల సందర్భంగా (జూన్ 1978) 1,32,446 ఎకరాలను 73,847 మందికి సేద్యం కోసం స్వాధీనపరచగా, 4,837 ఎకరాలను ఇండ్ల స్థలాల నిమిత్తం 65,983 మందికి స్వాధీనపరచారని అంచనా.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటి నుంచి 1977–78 ఆఖరి వరకు రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన వర్గాల ఇళ్ల స్థలాలకోసం సేకరించిన మొత్తం భూమి 43,373 ఎకరాలు కాగా ఒక్క 1978 లోనే నూతన ప్రభుత్వం 17,301 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇళ్ల స్థలాల కింద పంచింది. గడచిన పది మాసాలలో నూతన ప్రభుత్వం చేసిన ప్రధాన నిర్ణయాలలో కొన్ని పంచాయతీరాజ్ సంస్థలకు, మునిసిపాలిటీలకు జరిగే ఎన్నికలలో ఓటర్ల ఓటింగ్ వయఃపరిమితిని 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించడం; మునిసిపల్ కౌన్సిళ్లకు ప్రత్యక్ష పద్ధతిలో ఛైర్మన్‌లను ఎన్నుకోవడం; జనాభా దామాషా పద్ధతిలో షెడ్యూల్డు కులాలకు, తెగలకు మునిసిపల్ కౌన్సిళ్లలో సీట్లు రిజర్వు చేయడం; స్థానిక బడ్జెట్లలో 15 శాతం నిధులను వెనుకబడిన వర్గాల సంక్షేమ కార్యక్రమాలకు విధిగా కేటాయించాలని ప్రస్తుతం మున్సిపాలిటీలకు మాత్రమే పరిమితమైన నిబంధనను రాష్ట్ర ప్రభుత్వ అన్ని శాఖలలో కూడా వర్తింపజేయడం.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

## గ్రామాలకు బస్సు సౌకర్యాలు

అక్టోబరు రెండవతేది జాతికి ఒక పర్వదినం. ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డా. చెన్నారెడ్డిగారి నాయకత్వంలో ఆ రోజున బాపూజీ సంస్మృతికి అంకితంగా ఒక నూతన కార్యక్రమాన్ని ప్రారంభించింది. అదే 'గ్రామ గ్రామానికీ బస్సు' సౌకర్యం. ఆ కార్యక్రమం ప్రారంభం అవడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కిచ్చిన ఒక వాగ్దానాన్ని ఆచరణలో పెట్టేందుకు పూనుకొన్నట్లే. ఈ కార్యక్రమం క్రింద మారుమూల వున్న అనేక గ్రామాలకు బస్సు సౌకర్యం లభిస్తుంది. దాదాపు 16 వేల గ్రామాలు ఇంతవరకూ ఏ రవాణా సౌకర్యం లేక జాతి జీవనగతి నుంచి దూరంగానే ఉండి పోయాయి. వనర్ల కొరతవల్ల కాని, వాటికన్ని బస్సులు లేవనే నెపంతోగాని, రహదార్లు లేవనే లోపంవల్ల గాని ఈ గ్రామాలు ఈవిధంగా జాతి జీవన సరళి నుండి దూరంగా ఇంకెంతో కాలం ఉండిపోవడానికి వీలులేదు. చెన్నారెడ్డిగారి నేతృత్వంలోని నూతన ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకొన్న ఆశలు నెరవేరుతున్నాయి. ప్రభుత్వం కాలయాపన లేకుండా కృషి చేయడానికి పూనుకొన్న దనేందుకు ఈ బస్సు సౌకర్యాల కార్యక్రమం ఒక మచ్చుతునక.

## గృహ నిర్మాణం

ఆరు సంవత్సరాలకు పూర్వమే రాష్ట్రప్రభుత్వం హరిజనులు, గిరిజనులు మరియు వెనుకబడిన వారి సౌకర్యం కోసం 57,470 ఇళ్లను నిర్మించేందుకు ఒక బృహత్ పథకాన్ని చేపట్టింది. జీవిత బీమా సంస్థ ఆర్థిక సహాయంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి పదికోట్ల రూపాయల పెట్టుబడి పెట్టడం జరిగింది. అనారోగ్యకరమైన వృత్తిలోని వర్గాల నిమిత్తం పదేండ్లకు పూర్వం చేపట్టిన మరో గృహ నిర్మాణ పథకం కూడా రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తూంది. ఈ కార్యక్రమాల క్రింద నిర్మించబడిన ఇళ్లు ప్రతి పంచాయితీ సమితులలోనూ ఎన్నుకొన్న కొన్ని గ్రామ పంచాయతీలలో నిర్మింపబడ్డాయి.

## కొన్ని సూచనలు

గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనేక చారిత్రిక, సాంఘిక కారణాలవల్ల ప్రభుత్వ అలసత్వం వల్ల ఏర్పడి పెంపొందిన అసమానతలు తీరు, ఆర్థిక వ్యత్యాసాలు ఒక్క కలం పోటుతో గాని, బడ్జెట్లలో చిన్న మొత్తాలలో కేటాయింపులవల్ల గాని తొలగజాలవు. ఇదే పరిస్థితి వెనుకబడిన వర్గాలకు కూడా వర్తిస్తుంది. వ్యవసాయం మన రాష్ట్ర, ఆర్థిక వ్యవస్థకు ప్రధానమైన ఆర్థిక వనరు. రాష్ట్ర ఆదాయంలో 46 శాతం వ్యవసాయంనుంచి వస్తుంది. ఈ రాబడికి కాయకష్టం ద్వారా ఉత్పత్తిలో ప్రత్యక్షంగా పాల్గొంటున్న కష్టజీవులయిన వ్యవసాయ కార్మికులు, రాష్ట్ర జనాభాలో జీవనం కోసం వ్యవసాయంపై ఆధారపడిన నూటికి 80 మంది ప్రజలలో హెచ్చు భాగం పేద—మధ్య తరగతి రైతాంగమూ బలహీన వర్గాలకు చెందినవారే. వీరి బాగోగులపైననే మన ఆదాయ వనరులు, తద్వారా ప్రగతి పథకాల జయాపజయాలు ఆధారపడి ఉంటాయని గుర్తించాలి.

బలహీన వర్గాలలో (పేద రైతాంగం, వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులు) ప్రతి కుటుంబానికి సగటున లభిస్తున్న సాలుసరి నికర ఆదాయం రు. 1100 కు మించి లేదు. అంటే తలకు రు. 275 లు మాత్రమే. అంటే రోజుకు 75 పైసలు. నేటి ధరలలో, రూపాయి విలువ పావలాకు పడిపోయిన దరిమిలా ఈ విలువ మరీ శూన్యం. ఫలితంగా ప్రతి కుటుంబానికి సగటున తేలిన రుణం మాత్రం 194–329 రూపాయల మధ్య ఉందని గణాంక శాఖ తాజా సర్వే వెల్లడిస్తోంది.

ప్రగతి పథకాలు ఒక ఎత్తు. వాటి ప్రయోజనం బలహీన వర్గాలకు చేరడం మరొక ఎత్తు. ఎగువనున్న మోతుబరి పంటకాపు చేన్లపు నీరును మధ్యలో గండికొట్టి తన పొలానికి మాత్రమే ఎక్కించుకుని దిగువనున్న రైతులకు అందకుండా చేయడం లాంటిదే—ఈ ప్రగతి పథకాల ప్రయోజనాలు కిందివర్గాలకు ఆశించినంత మేర దక్కకపోవడం. ఇది అన్ని రంగాలలోనూ అసలు జరుగుతోంది. ఉదాహరణకు: నేటికి మన రాష్ట్రంలోని నగరాలలో ప్రతి రెండవ వ్యక్తి నిరక్షరాస్యుడు కాగా, గ్రామాలలో ప్రతి ఐదుగురిలోనూ నలుగురు నిరక్షరాస్యులు.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

అలాగే, రాష్ట్రంలోని 11,000 గ్రామాలకు మంచినీటి సదుపాయం లేదని ఇటీవల ప్రపంచ బ్యాంకుకు సమర్పించిన తాజా నివేదికలో వెల్లడించారు. ఈ సమస్యను ప్రస్తావిస్తూ శ్రీ చెన్నారెడ్డి ఒక సందర్భంలో 'ఒక్కసారి వర్షాలు పడితే చాలు, మంచినీటి సమస్యను గురించి ఆలోచించడమే మనం మరచిపోతామన్న ఆలోచన సత్యదూరం కాదు' అని నిర్మొహమాటంగా చేసిన వ్యాఖ్యానం మన గ్రామసీమలు, బలహీన వర్గాల ప్రయోజనాలపట్ల ఇప్పటికీ మన నిర్లక్ష్య వైఖరిని గుర్తు చేస్తోంది. ఎందువల్లనంటే మంచినీటి సమస్య గ్రామ ప్రాంతాల్లో నివసించే ముఖ్యంగా డెల్టాయేతర ప్రాంతాల్లో నివసించే షెడ్యూల్డు కులాలు, తెగలకు జీవన్మరణ సమస్యగా ఉంది. దీనిపట్ల తక్షణం శ్రద్ధ వహించి, యుద్ధ ప్రాతిపదికపై నిర్ణయాలు అమలు జరిగేలా చూడవలసి ఉంది. ఇందుకోసం శ్రీ చెన్నారెడ్డి 1978 నవంబర్ 30 న ఒక బృహత్ పథకాన్ని ప్రతిపాదించారు. ప్రతి గ్రామానికి మంచినీరు సరఫరా నిమిత్తం రు. 750 కోట్లు, ప్రతి గ్రామానికీ పబ్లిక్ కక్కసు దొడ్ల నిర్మాణం కోసం రు. 250 కోట్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నదని, ఈ మొత్తం బృహత్తరమైన వ్యయంగా కన్పించినా ఇది ప్రజారోగ్య సమస్య కాబట్టి ప్రభుత్వం ప్రపంచ ఆహార సంస్థతోనూ, యునెస్కో సంస్థతోనూ ఇతర అంతర్జాతీయ సంస్థలతోనూ, తగిన నిధుల కోసం సంప్రతింపులు జరుపుతున్నదని ఆయన ప్రకటించారు.

వ్యవసాయాభివృద్ధి కోసం, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం బలహీన వర్గాల సంక్షేమం ప్రాతిపదికగా ప్రభుత్వం అందజేసే సంస్థాగత సహాయం పద్ధతులలో కూడా ఎన్నో మార్పులు రావలసి ఉంది. ఉదాహరణకు: విశాఖజిల్లాలో రంపచోడవరం బ్లాక్ మిగతా ప్రాంతాల కంటె బడుగు స్థితిలో ఉంది. కాగా, తూర్పుగోదావరి జిల్లాలోని రాయవరం బ్లాక్ అభివృద్ధి దశలో ఉంది. ఈ రెండు బ్లాకులలోనూ ఇటీవల కాలంలో పరిపూర్ణమైన సర్వే జరిపిన విశాఖపట్నం అగ్రో–ఎకనామిక్ రిసెర్చి కేంద్రంవారు తమ అనుభవాలను వివరిస్తూ 'ఈ రెండు చోట్ల బలహీన వర్గాల కంటే మధ్యరకం మోతుబరులూ, ధనిక రైతాంగమే ప్రగతి పథకాలవల్ల లాభించా'రని పేర్కొన్నారు. అంటే వ్యవసాయాభివృద్ధికి పాలనా యంత్రాంగం అనుసరించే వ్యూహం ద్రవ్య సహాయ పద్ధతులలో అసమస్థితివల్ల ఫలితాలు విరుద్ధంగా ఉంటున్నాయి. ఇందువల్ల ప్రభుత్వం రెండు విధాల నష్టపోతోంది. సంస్థాగత సహాయం వృథా అవుతోంది; ఆశించిన బలహీన వర్గాల సంక్షేమం మరింత దూరంగా జారిపోయినా కనీసం స్థిరపడడంలేదు.

ఇవన్నీ పరిష్కరించుకోవలసిన సమస్యలు. తక్షణ కార్యక్రమాలతోపాటు సంక్షేమ మార్గాన్ని మరింత సన్నిహితం చేసుకోవటానికి దీర్ఘకాలిక వ్యూహం కూడా అవసరం. అప్పుడే శ్రీ చెన్నారెడ్డి స్పష్టం చేసినట్లుగా 'బలహీన వర్గాల ఆర్థిక స్తోమతను పెంచి, పరిపుష్టం చేయడం, ఇందుకోసం ఆర్థిక పథకాలను తు. చ. తప్పకుండా అమలు జరపడం ఒక్కటే శాశ్వత పరిష్కార మార్గం.'

ఈ గుర్తింపు ప్రాతిపదికగా చెన్నారెడ్డి ప్రభుత్వం రానున్న సంవత్సరాలలో బలహీన వర్గాల సంక్షేమానికి మరింత పూచీ పడగలదని, మరిన్ని మంచి ఫలితాలు సాధించగలదని ఆశిద్దాం.





CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# కర్మవీరుడు

గులాం యాసీన్

నిండు హృదయంతో నీ షష్టిపూర్తి శుభవేళ
అభినందిస్తున్నాను.

రాజకీయరంగంలో మేరునగధీరుడవై
రాణ కెక్కిన నీ ప్రతిభను తలచి
నే నెంతో సంబరపడుతున్నాను.
నీకు అరువదులు అప్పుడే వచ్చాయా ? అని
ఆశ్చర్యపడుతున్నాను.

పదవిలో ఉన్నా లేకున్నా నీ ధ్యేయం ప్రజాసేవ
అందుకే ప్రజలందరూ నీచుట్టూ నిరంతరం
ఉంటారు.
'మా నాయకు'డని గౌరవిస్తారు.
అందుకే నీవు సిసలైన ప్రజలమనిషివి.
ప్రతిభతోపాటు త్యాగదీక్ష, విశాలభావాలు గల
వ్యక్తిత్వం నీది.

అభ్యసించింది వైద్యవిద్య.
ఆసక్తితో వరించింది రాజకీయవిద్య—
ప్రజాసేవదృష్టితో రాజకీయరంగాన్నే వరించిన
రైతుబిడ్డవు నీవు.
నమ్మిన అనుచరులకు ప్రాణమిచ్చే నేతవు
కుమ్ములాడే సాటి ప్రత్యర్థులను సైతం
తన ఔదార్య గుణంతో
ఆదరించే మానవతా సేతువు !!

అనన్య సామాన్యమైన ఆంధ్రపౌరుషచరిత
అమలిన సహజసుందర రైతుబిడ్డ ఘనత—
పల్లె మొదలు ఢిల్లీదాకా మారుమ్రోగిన
నీ పరిపాలనా దక్షత—
నిరూపిస్తుంటాయి నీ రాజకీయ
శేముషీధురంధరతను—

చిమ్మచీకటిని చూచి భయపడని ధీరుడవు
నిండువెలుగు వచ్చిందని పొంగి పడవు !
సర్వమత సామరస్య శాంతి సాధకుడవు—
సాహిత్యప్రియుడవు—సాహిత్య పోషకుడవు—
అచంచలప్రజాస్వామ్యవాదివి–మానవతకు పెన్నిధివి.
ఆంధ్రజాతి ప్రతినిధివి—

అమరజీవుని ఆత్మ వెలుగువై—
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివై—
ఆరుకోట్ల ఆంధ్ర ప్రజల శ్రేయాన్ని—
సమైక్యశక్తినీ ఎలుగెత్తి పాడుతున్న
ప్రగతి రతనాల వీణవు—

ఈ శుభసమయాన
నేను మనసారా ఆశిస్తున్నాను.
శరదాం శతవత్సరాలకు పైగా
ఆయురారోగ్యాలతో
సౌభాగ్యాలతో జీవిస్తూ
ప్రజాసేవకూ ధర్మనిర్వాహణ దీక్షకూ
అంకితమై—
రాబోవు తరాలకూ ఆంధ్ర పౌరుషకీర్తి
'చెన్నారెడ్డి దివ్యమూర్తి'—
ఆదర్శమై, అఖండమై వర్ధిల్లాలని
వేడుతున్నాను.
'దీర్ఘాయుష్మాన్ భవ' శ్రీ చెన్నారెడ్డీ—
ఈ శుభవేళ అందుకోవయ్యా
నా హృదయాంజలి !
ప్రేమతో అర్పించుకొంటున్నాను
షష్టిపూర్తి కవితాంజలి.

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# కళాపోషకుడు

ఎ. ఆర్. కృష్ణ

'నాటకం' ఎంతో ఇష్టం కనుకనే, మాలాంటి వాళ్ళం డాక్టర్ చెన్నారెడ్డిగారికి అతి సన్నిహితుల మయ్యాం. ఆయన పదవిలో ఉన్నా, లేకపోయినా మా నాటక 'సంబంధం' ఈ 25 సంవత్సరాలూ అలానే ఉంది.

శ్రీమతి కమలాదేవి చట్టోపాధ్యాయ, భారతీయ నాట్య సంఘాన్ని (Theatre Centre, INDIA) 1950 లో స్థాపించి, వివిధ రాష్ట్రాలలో శాఖలు పెంచి, నాటక కార్యక్రమాలు అభివృద్ధి చేయాలని, సంకల్పించినపుడు మాలాంటి కార్యకర్తలు, డాక్టర్ చెన్నారెడ్డి అధ్యక్షులుగా, **Theatre Centre, Hyderabad** ను 1953 లో ఏర్పరిచాం. ఆ సంస్థ 1957 నాటికి 'ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘం'గా మారి, విశాఖపట్నం, విజయవాడ, వరంగల్, అనంతపూర్, హైదరాబాద్ మండల నాట్య సంఘాలుగా ఏర్పడి విస్తృత మయింది. ఈ పెరుగుదల ప్రణాళికకు డాక్టర్‌గారు ముఖ్య కారకులు. నాట్య సంఘం ప్రధానంగా సేవా కేంద్రం, కార్యక్రమ సమన్వయ సంస్థ, **Service and Co-ordination** ఈ ప్రధాన సూత్రాలపైనే అనాటి నాట్య సంఘం ఈనాటి వరకు ప్రత్యేక 'నాటకోద్యమ' సంస్థగా కార్యక్రమాలు నిర్వహించింది.

డాక్టర్‌గారు సహజంగా రాజకీయ వ్యవహారాల్లో మునిగిన మనిషి. ఎన్నో ఒడుదుడుకులు రాజకీయాల్లో ఉన్నా, రాజకీయాలు వేరు, కళాత్మక అనుబంధం వేరుగా గ్రహించి, ప్రవర్తించిన మనిషి. 15 సంవత్సరాలు నాట్య సంఘం అధ్యక్షులుగా ఉన్నా, ఏనాడూ మా సంస్థను వారి రాజకీయ అభిప్రాయాలతో జోడించలేదు. వారి సొంత పెరుగుదలకు, ప్రచారానికి ఉపయోగించుకోలేదు. (మా నాట్య సంఘంలో చేరిన కొందరు వ్యక్తులు వారికోసం ఉపయోగించుకొని, సంఘాన్ని కూడా నాశనం చేసినవారున్నారు). డాక్టరుగారు మా సంస్థలో రాజకీయాల్ని ఖండించి చక్కచేశారు.

1959 లో సమన్వయ కార్యక్రమంగా **(Co-ordinated activity)** ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ, అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన సమితి, ఆంధ్ర నాటకకళా పరిషత్తూ లాంటి సంస్థల ఆదరంతో ఎగ్జిబిషన్ మైదానంలో 40 రోజులు నృత్య, సంగీత నాటకోత్సవాలను నిర్వహించి, ఆ సందర్భంగా చివరిరోజు బహుమతి ప్రదానోత్సవానికి అప్పటి ముఖ్యమంత్రి సంజీవరెడ్డిగార్ని ఆహ్వానించా లనుకున్నాం. అప్పట్లో డాక్టర్‌గార్కి, సంజీవరెడ్డిగార్కి వున్నగడ్డి వేస్తే భగ్గుమంటున్న సమయం. అయినా, తమ అభిప్రాయాలకు వ్యతిరేకమయినా, ఆనాడు ముఖ్యమంత్రి, మా అధ్యక్షులు ఒక వేదికమీద కలిశారు. గౌరవ మర్యాదలు సక్రమంగా జరిగాయి. ఆనాడు మేమేకాక, ప్రజలూ ఆ కలయికను మెచ్చుకున్నారు. ఆశ్చర్యంతో సంతోషించారు.

ఏ సంస్థ అయినా, కార్యక్రమా లుంటేనే సజీవంగా ఉంటుంది. నాట్య సంఘం పదేళ్ళ శ్రమించి, ఒకసారి ఆగిపోయింది. నాట్యసంఘం ఆ సమయంలో కిరాయి గదుల్లో తమ కార్యాలయం, నాట్య విద్యాలయ తరగతులు నడుపుతూ, ధనాభావంవల్ల ఆగిపోయింది. ఆ సమయంలో 'రవీంద్ర భారతి' అధ్యక్షులుగా ఉన్న డాక్టరుగారు, కష్టాలు గ్రహించిన వ్యక్తి గాబట్టి, నాట్య సంఘం, నాట్య విద్యాలయ కార్యక్రమాలకు 'రవీంద్ర భారతి'ని కార్యస్థానంగా ఏర్పరిచి, మళ్ళీ నాట్య సంఘాన్ని పునరుద్ధరించారు. 1963 ప్రాంతంలో నాట్య సంఘం 'రవీంద్ర భారతి' కార్యస్థానంగా సేవా, సమన్వయ కార్యక్రమాలే గాక, నాట్య విద్యాలయం రచయితల, నటీనటుల గోష్ఠులు, మండల, రాష్ట్ర నాటకోత్సవాలు, నాట్య రిపర్టరీ **(Repertory)** తరఫున మృచ్ఛకటికం, కన్యాశుల్కం, ప్రతాపరుద్రీయం లాంటి 10 నాటకాలతో, 'నెలవారి కార్యక్రమం' మొదలగు బహువిధమైన నాటకోద్యమ కార్యక్రమాలు 1973 వరకూ నిర్వహించ కల్గింది. 1973 లో రాష్ట్రపతి పాలన,



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

సమయంలో స్వార్థపరులైన నాటక విరోధుల ప్రాబల్యంతో నాట్య సంఘం 'రవీంద్ర భారతి' వదలి వెళ్ళిపోవడమే గాక ఇంత వరకూ ఆ దెబ్బను తట్టుకొని నిలవలేక పోయిందంటే, డాక్టరుగారు ఆ రోజున చేసిన సహాయం కేవలం పది ఏళ్ల పాటయినా నాట్య సంఘ కార్యక్రమాలకు దోహదం చేసింది. రాష్ట్ర నాటకోద్యమం పటిష్టమయింది. అంతర్జాతీయ నాటక రంగంతో, జాతీయ నాటకరంగంతో సంబంధముండి, ప్రత్యేక లక్ష్యాలతో కృషిచేసే నాట్య సంఘ ఉద్దేశ్యాలను అర్థం చేసుకుని, ప్రోత్సహించిన 'ముందు చూపుగల నాయకుడు' డాక్టరు చెన్నారెడ్డిగారు.

అందుకనే, నాట్య సంఘ కార్యకర్తలమైన మేము 1978 లో తిరిగి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన డాక్టర్‌గార్ని మార్చిలో మనసారా సన్మానించుకున్నాం. కష్టాలు చెప్పుకున్నాం. ఆర్ద్రహృదయంతో 'నాట్య సంఘ' పునరుద్ధరణకు డాక్టరుగారు ఆనాడు ఇచ్చిన ఉపన్యాసం నాటకకళ కోసం దినదినమూ శ్రమిస్తున్న కళాకారులకు, కార్యకర్తలకు తిరిగి జీవం పోసింది.

డాక్టరుగారు, తమ వ్యక్తిగత రాజకీయ అభిప్రాయాలు, కళాసంస్థల కార్యక్రమాలు విడివిడిగా చూసేవాళ్ళు, సంస్థ అభివృద్ధి కోసం, ఎప్పటికీ సలహా లిచ్చేవారు. తాను ఆర్థికమంత్రి అయినప్పుడు, ప్రభుత్వంనుండి అందే ఆర్థిక సహాయాన్ని దృష్టిలో పెట్టుకుని నాట్యసంఘ అధ్యక్షులుగా తప్పుకుని శ్రీ పి. వి. నరసింహారావుగారిని మాకు అప్పచెప్పారు. ఎప్పుడూ డాక్టర్‌గారు తమ ప్రభుత్వ పదవిని ఉపయోగించి నాట్య సంఘానికి 'ధన సేకరణ' మొదలగునవి చేయలేదు. కార్యక్రమాలు ముమ్మరంగా, క్రమంగా జరిగేటట్టు చూసి, ప్రజల్నించే వచ్చిన విరాళాలతో నాట్య సంఘం కార్యక్రమాలు నిర్వహించింది. వారి వివేకం, వివేచనాదృష్టి, నిష్పాక్షికత్వం ఈ సందర్భంగా మరువరానివి.

అంతేకాదు. నాట్య సంఘం వంటి కళాసంస్థల్లో, 'కళ కోసం' ప్రాణంబెట్టి పనిచేసే కార్యకర్తలైన పిచ్చి వాళ్ళుంటారని, వీరిని చూసి అసూయపడే స్వార్థపరులైన ఇంకోరకం పిచ్చివాళ్ళు కూడా ఉంటారని గ్రహించిన డాక్టర్‌గారు, క్షీర నీర న్యాయాన్ని దృష్టిలో పెట్టుకొని సంస్థ కుపయోగపడే 'పిచ్చివాళ్ళ'కి మిత్రుడుగా, నాయకుడుగా, క్షేమకారిగా సంస్థను నడిపారు. 1973 నుంచీ కార్యస్థానం లేక కార్యక్రమాలు కుంటుపడిన నాట్య సంఘం, ఆ సంస్థ పుట్టుక, పెరుగుదల తెలిసిన డాక్టర్‌గారి ప్రోత్సాహం కోసం, ఈనాడు కూడా ఎదురు చూస్తోంది. ఈ షష్టిపూర్తి ఉత్సవ సమయంలో "తెలుగు నాటకోద్యమ" స్వరూపమయిన నాట్య సంఘం, కార్యకర్తలు, డాక్టర్ చెన్నారెడ్డిగారు నూరు సంవత్సరాలు ఆయురారోగ్యైశ్వర్యాలతో వర్ధిల్లాలని కోరుతున్నారు.





CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org



మా ఆనంద మయితో

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org



డియోరియా బాబా ఆశీర్వదిస్తున్నప్పుడు....

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org



జగద్గురు శ్రీ శ్రీ శంకరాచార్య మహాసన్నిధానంవారితో



శ్రీ శ్రీ శృంగేరి శారదాపీఠం సన్నిధానంవారితో

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org



బాబా ఫరీద్ మస్తాన్ అవులియా మరియు బాబా ఖాదర్ వాలి



శ్రీ శ్రీ సత్యసాయి బాబాతో

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org



మంత్రాలయ పీఠాధిపతి శ్రీ శ్రీ సుజయీంద్ర తీర్థుల వారితో



స్వామి చిన్మయానందతో

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org



వారణాసి మౌన స్వామితో



డా. సాయి కుమార్‌తో

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org



మహా కుంభాభిషేక సందర్భంగా శృంగేరి జగద్గురు శ్రీశ్రీ శంకరాచార్యులవారితో
పవిత్ర గంగా స్నానం చేస్తున్నప్పుడు



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org



మాచర్లలో లింగ ప్రతిష్ఠ చేస్తున్నప్పుడు



ఋషీకేశ్‌లో ప్రార్థనలు జరుపుతున్నప్పుడు

# వేయి రేకులతో వికసించిన వ్యక్తిత్వ కుసుమం

యర్లపాటి వెంకటరావు

**'I am their leader, so I must follow them'**—అన్నాడట గ్లాడ్‌స్టన్. వినడానికి విచిత్రంగా ఉన్నా, నిజానికి ఇది మహోన్నతమైన నాయకత్వ లక్షణం. ఈ లక్షణం మూర్తీభవించిన నాయకుడు మన ముఖ్యమంత్రి డా. మర్రి చెన్నారెడ్డి.

తన మంత్రివర్గ సహచరుల అభిప్రాయాలకు ఎంతగా విలువ ఇచ్చి, వారి మాటను కూడా మన్నించగలగడం, అవసరమైనప్పుడు అనుచరుల సలహాను పాటించడ మనేవి ఉత్తమ నాయకత్వ విధానంలో అంతర్భాగాలే. ప్రజాస్వామిక విలువల పట్ల డా. చెన్నారెడ్డికి ఉన్న గౌరవమే ఈ సమన్వయ సద్గుణానికి, బహుశః కారణం కావచ్చు.

జీవితాన్ని, రాజకీయ నాయకత్వాన్ని ఒక పోరాటంగా భావించి, సంఘర్షణలోనే జీవించడం కొందరికే చేతనవు తుంది. నాటి ఆంధ్ర యువజన సమితి నుంచి, నేటి ఇందిరా కాంగ్రెస్ నిర్మాణం వరకు ఆయన నడిపిన పోరాటా లెన్నో, స్వీకరించిన గాయాలెన్నో, సాధించిన విజయాలెన్నో!

ఎనిమిది నెలల క్రితం ముఖ్యమంత్రి పదవి చేపట్టగానే, ఆయన ఇచ్చిన కానుక పన్నుకారు రైతాంగానికే. సమస్యలతో సతమతమయే రైతు సోదరుల పట్ల డా. చెన్నారెడ్డికి గల సానుభూతికీ, అభిమానానికీ తార్కాణం, రెండున్నర ఎకరాల లోపు మాగాణి, 5 ఎకరముల లోపు మెట్టభూమి ఉన్న రైతును శిస్తుల భారంనుంచి రక్షించడమే.

డా. చెన్నారెడ్డి ఎంతటి కాకలుతీరిన రాజకీయ నాయకుడో అంతటి అనుభవం పండిన వ్యవసాయవేత్త కూడా. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పల్లెలలో పర్యటించే సమయాలలో, ఆయన రైతులను పనిమాలా పలకరించి, కుశలప్రశ్నలు అడగడం, వారి సమస్యలు ఏమైనా ఉంటే, తక్షణ పరిష్కారానికి స్థానిక అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీచేయడం నేను స్వయంగా చూశాను. రైతు కుటుంబంలో పుట్టి పెరిగిన డా. చెన్నారెడ్డి రైతు బాంధవుడుగా మారడంలో ఆశ్చర్యమేమీ లేదు. వ్యవసాయమంటే ఏమిటో, ఫలసాయం కోసం రైతు ఎలా రెక్కలు ముక్కలు చేసు కుంటాడో ఆయనకు బాగా తెలుసు. ఆయన పాలనలో తెలుగు రైతుకు అందుకే ఇంత రక్షణ. పంట చేతికి వచ్చిన తరువాతే రైతులు శిస్తు చెల్లించే సదుపాయం కలిగించాలని కూడా ముఖ్యమంత్రి ఆలోచిస్తున్న విషయం నాకు తెలుసు. ఇది జరిగితే, అనువుకాని సమయాలలో, వేళకాని వేళల్లో, శిస్తు చెల్లించుమని పీకలమీద కూర్చునే అధికారుల భయం పోయి, రైతులు రవ్వంత గాలి పీల్చుకో గలుగుతారు. డా. చెన్నారెడ్డిగారి పేరు పదికాలాలపాటు చెప్పుకుంటారు.

ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్రంలో గ్రామ పురోభివృద్ధి మూడు పూలూ, ఆరు కాయలుగా సాగుతోంది. దేశ సౌభాగ్యానికి పల్లెపట్లే ఆయువుపట్లని గుర్తించిన జనహితైషి డా. చెన్నారెడ్డి.

అరవై యేళ్ల ఈ వయసులో కూడా అవిరామంగా పనిచేస్తూ, రాష్ట్ర వికాసానికి వివిధ ప్రణాళికలకు ఊపిరిపోస్తూ, శ్రమిస్తున్న మనిషి, రాజకీయ ఋషి డా. చెన్నారెడ్డి గుణగణాలను గురించి చెపితే పొగడ్తలా కనిపించవచ్చు. కానీ, రాజకీయ కార్యకలాపాల సంరంభం మధ్య పుట్టి, సాంఘిక సేవా తత్పరతతో పెరిగి, ప్రజల శ్రేయస్సుతో బ్రతుకును ముడిపెట్టుకుని, గాంధేయ నైతిక సూత్రాలతో జీవితాన్ని కట్టివేసుకున్న ఒక మహావ్యక్తిని గురించి మరొక విధంగా ఎలా వ్రాయగలను!

పూవుకు పరిమళం ఎలాగో, మనిషికి వ్యక్తిత్వం అలాగ! నైతిక పరిమళాలు వెదజల్లే వ్యక్తిత్వం ఉన్నవాడే జాతికి మహా నాయకుడు కాగలడు. అటువంటి మహనీయ వ్యక్తిత్వం రూపుదాల్చిన మన నాయకుడు, మార్గదర్శి డా. చెన్నారెడ్డి. వారి షష్టిపూర్తి మహోత్సవ సందర్భంలో, దివినుండి భువికి దిగిన మహాతేజోమూర్తిగా భావించి, వారికి నమస్కరిస్తున్నాను. ఆయన సారథ్యంలో రాష్ట్ర రథం, అభివృద్ధి పంథాలవెంట శరవేగంతో సాగిపోతుందని ఆశిస్తున్నాను.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# షడ్రత్నాలు

నీలా జంగయ్య

ఏమి చేసితి యర్వదేండ్లేమి మళ్ళీ .
చెన్నరెడ్డికి సన్మానమన్న లేఖఁ
గన్న నా మది యాశ్చర్య కలితమగుచు
కొంత చింతించె కాలపు వింతఁ దలచి.

జ్ఞానమందిర స్వామి విజ్ఞానమూర్తి
సుకృతవిత్తుఁడు సర్వాంధ్ర శుభయశస్వి
చెన్నరెడ్డికి సన్మాన మన్న సూక్తి
మదికి నానంద మిచ్చె చెన్నొదవ నంత.

నాకే మిచ్చెన! యని కా
నే కాదు మహేంద్రలోక ముఖ్యామాత్యుం
డే కాక భక్తుఁడని యా
లోకోన్నతి గాంచె కీర్తి దూత్యర్థంబై.

సూక్తిముత్యా లిచ్చి చూచివచ్చెద నన్న
సూక్తికి తన జిహ్వ చోటుగానియె
గుణ మిచ్చి మెచ్చించ కృతి కల్గినది కాని
గుణమణియై తానె కోరి వెలిగె

రవ్వంత ప్రేమిచ్చి ప్రస్తుతించ మటన్న
ప్రస్తుతికే సుప్రశస్తి గూర్చి
దబ్బిచ్చి తనకున్న దంబంబు గొల్తునా
అది కూడ తన నంటె యధికమయ్యె

ఇట్లు తలపోసి యే సాయ మితని కనుచు
నెంచి నా యిచ్చమేర రచించి 'జ్ఞాన
మందిరం' బిచ్చి సంతోష మందినాను
అర్వదేండ్లేడ నాతని కీర్త్యదేండ్లే.

పది పదులయేండ్లు చల్లగా పరిఢవిల్లి
దాతగా కీర్తి నందగాఁ దలతు చెన్న
రెడ్డివర్యుని యానందలీల లెన్ని
"ఆయురారోగ్య సౌభాగ్యము" ప్రకటింతు.

తెలుగునాడునాడి దివ్యాంధ్ర మందిర
వన విహారి! సర్వ భారతోర్వి
కీర్తిచంద్రుడు దాత దార్ఢి పొందని మేటి
చెన్నరెడ్డి ప్రజల మన్నన గనె.





CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# జోలెలు కావు-ఉద్యోగాలు

## విద్యావంతులైన నిరుద్యోగులకోసం ముఖ్యమంత్రి డా॥ ఎం. చెన్నారెడ్డి నవీన పథకం

**ఎస్. భాస్కరరావు**

---

మన దేశం ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యల్లో కల్లా విద్యావంతుల నిరుద్యోగుల సమస్య ఆర్థిక వ్యవస్థకే తీవ్రమైన సవాలుగా పరిణమించింది. ఇది ప్రగతికి అంతులేని ఆటంకం. డాక్టర్ ఎం. చెన్నారెడ్డిగారి చైతన్యవంతమైన, స్ఫూర్తిదాయకమైన నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ నూతన ప్రభుత్వం షెడ్యూలు కులాలకు, షెడ్యూలు జాతులకు, తదితర బలహీన వర్గాలకు చెందిన నిరుద్యోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ సమస్య పరిష్కారానికి అనేక నిర్దిష్ట చర్యలు చేపట్టింది.

నిరుద్యోగ సమస్య విస్తృతమైనదీ, అతి సంక్లిష్టమైనదీ అవడంతో విద్యావంతులైన నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించే ప్రతిపాదనను ప్రభుత్వం విడనాడాల్సి వచ్చింది. దీనికి మారుగా రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవంనాడు విద్యావంతులైన నిరుద్యోగులకు అనేక వృత్తుల్లో శిక్షణ గరిపేందుకు ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ పథకాన్ననుసరించి, మొదట్లో షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులకు చెందిన వారికీ, మెట్రిక్యులేషన్, ఆ పై అర్హతలు ఉన్న వెనుకబడిన తరగతుల్లోని హెచ్చు శాతం అభ్యర్థులకూ ప్రాధాన్యత ఇచ్చారు.

ఆంధ్రప్రదేశ్‌లో 1978 జులై మాసాంతం నాటికి వివిధ ఉద్యోగ ఉపాధి కేంద్రాలలోను సుమారు 9 లక్షల మంది అభ్యర్థులు నిరుద్యోగులుగా తమ పేర్లను నమోదు చేయించుకొన్నారు. వీరిలో మెట్రిక్యులేషన్, ఆపై విద్యార్హతలు గల అభ్యర్థులు 4,08,704 మంది ఉన్నారు. 97,984 మంది షెడ్యూలు కులాలకు చెందిన నిరుద్యోగులలో 31,000 మంది, 12,812 షెడ్యూలు జాతుల అభ్యర్థులలో 2,000 మంది; 1,68,724 వెనుకబడిన తరగతులకు చెందిన అభ్యర్థులలో 82,783 మంది అభ్యర్థులు మెట్రిక్యులేషన్, ఆ పై విద్యార్హతలు గలవారు. మొత్తం రాష్ట్రంలో షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులు, వెనుకబడిన తరగతులకు చెందిన 1,15,783 మంది నిరుపేద నిరుద్యోగు లున్నారు. సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన అభ్యర్థులను కూడా ఈ సంఖ్యలో చేర్చితే, బలహీన వర్గాల నిరుద్యోగుల సమస్య ఎంత బృహత్తరమైందో తెలియవస్తుంది.

ఈ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించే నిమిత్తం రూ. 2 కోట్లు ప్రణాళికలో కేటాయించి 1978 ఆగస్టు 15వ తేదీ నుండి ప్రత్యేక ఉపాధి శిక్షణా పథకానికి ప్రారంభోత్సవం చేశారు. దీని ననుసరించి పదమూడు కార్యక్రమాలను రూపొందించి, మంజూరు చేయబడి ప్రస్తుతం చురుకుగా అమలు జరుపబడుతున్నాయి. ప్రత్యేక ఉపాధి పథకం క్రింద అమలవుతున్న ఈ కార్యక్రమాల విషయంలో రూ. 2.18 కోట్లు వ్యయమౌతుంది. దీనికి తోడుగా, రు. 9.11 కోట్లు సంస్థాగత ఆర్థిక సహాయం, అభివృద్ధి రంగంలోని తదితర శాఖల నుండి రూ. 1.21 కోట్లు ఈ కార్యక్రమాలలో వెచ్చిస్తారు. ఈవిధంగా ఈ 13 కార్యక్రమాలకూ రూ. 12.89 కోట్లు మూలధనం చేకూర్చారు; ఈ కార్యక్రమాలవల్ల 15,000 మంది నిరుద్యోగులకు ఈ సంవత్సరంలో వస్తూత్పత్తి రంగాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

ఈ పదమూడు కార్యక్రమాలు రూపొందించడమే కాకుండా, ఉద్యోగ ఉపాధి కేంద్రాలలో నిరుద్యోగ అభ్యర్థుల నిమిత్తం ఒక నూతన పెట్టుబడి విభాగాన్ని సృష్టిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల సౌకర్యాల అభివృద్ధి సంస్థ, చేనేత, జవుళి పరిశ్రమల శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జవుళి పరిశ్రమాభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ చర్మకారి పరిశ్రమల అభివృద్ధి



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

సంస్థ, ఆంధ్రప్రదేశ్ చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ, పబ్లిక్ రంగానికి చెందిన హైదరాబాద్ ఆల్విన్‌మెటల్ వర్క్స్ సంస్థల సహకారంతో ఎక్కువ మందికి ఉద్యోగాలు లభించేలా, త్వరితగతిని శిక్షణ యిచ్చే రీతిగా, ఉద్యోగం లభించే ప్రతి అభ్యర్థిపై వీలైనంత తక్కువ పెట్టుబడి ధనంతో శిక్షణా కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. ఉప్పు తయారీ, నేత మిల్లులు, మరమగ్గాలు, చేనేత మగ్గాలు, చర్మకారి, చర్మకారికి సంబంధించిన వస్తూత్పత్తి, చేతి సాధన సామగ్రి, సాధారణ ఇంజనీరింగ్ సర్వీసులు, పాడి పరిశ్రమాభివృద్ధి రంగాలలో ప్రస్తుతం ఈ ఉద్యోగ ఉపాధి కార్యక్రమాలు అమలులో ఉన్నాయి.

### (అ) కొరతగల, గిరాకి అధికంగా వున్న వస్తూత్పత్తి రంగాలలో శిక్షణా కార్యక్రమాలు

విద్యావంతులైన నిరుద్యోగులకు సముచిత శిక్షణా, ఈ కార్యక్రమాలను అప్పగించే వివిధ సంస్థలను రాష్ట్ర స్థాయిలోను, ప్రాంతీయ స్థాయిలోను, జిల్లా స్థాయిలోను గుర్తిస్తారు. ఈ ప్రణాళికకు అనువుగా—రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషనింగ్ మెకానిక్స్, రేడియో టెలివిజన్ మెకానిక్స్, యంత్ర సాధనాలు, సివిల్ మెకానికల్ డ్రాఫ్ట్స్‌మన్, హయ్యర్ గ్రేడ్ స్టెనోగ్రఫీ, టైప్‌రైటింగ్, వెల్డర్లు, ఫిట్టర్లు, ఆటోమొబైల్—మెకానిక్స్ తదితర అంశాలకు చెందిన శిక్షణ కల్పించేందుకు బలహీన వర్గాల విద్యావంతులైన నిరుద్యోగులకు ఈ రీత్యా మూడు శిక్షణా పథకాలను రూపొందించి రాష్ట్రంలోని అనేక పాలిటెక్నిక్ కళాశాలల్లోను, ఐ. టి. ఐ. సంస్థలలోను అమలు చేస్తున్నారు. ఈ పథకాల ననుసరించి యింత వరకు, 1,272 మంది అభ్యర్థులను ఆయా సంస్థలలో చేర్చుకొన్నారు. ఈ శిక్షణా పథకాల కోసం రూ. 29 లక్షలు కేటాయించారు.

ఆయా జిల్లాల్లో వస్తూత్పత్తి రంగాల్లో ఉద్యోగాలు కల్పించేందుకూ, స్వయం ఉపాధి కల్పనా పథకాల అమలుకూ ప్రతి జిల్లాలో కలెక్టరుకు రు. 25 వేల నుండి రు. 60 వేల వరకూ ధనాన్ని కేటాయించారు. ఈ పథకం కోసం రు. 7.17 లక్షలను కేటాయించారు. శిక్షణ కాల వ్యవధిని, శిక్షణ తరహాను, శిక్షణ పొందే ప్రాంతాన్ని అనుసరించి ఈ అభ్యర్థు లందరికీ రు. 46 నుండి రు. 100 వరకూ స్టైఫెండులు ఇస్తున్నారు.

### (ఆ) శిక్షణ - స్వయం ఉపాధి కార్యక్రమాలు

పథకం రూపొందించడంలో మంచి నైపుణ్యం; సాంకేతిక సహాయం; ఆర్థిక సహాయం, మార్కెటింగ్ సౌకర్యాలతో శిక్షణ—స్వయం ఉపాధి పథకాల క్రింద 6 కార్యక్రమాలను రూపొందించారు. శిక్షణ గరపడం, ప్రోత్సాహకులకు ప్రోత్సాహం ఇవ్వడంపట్ల ఈ కార్యక్రమాలలో ప్రాధాన్యత నిస్తారు. సరైనవిధంగా పథకాలు తయారు చేయడంలోనూ, సాంకేతిక సహాయం అందించడంలోనూ, మార్కెటింగ్ సౌకర్యాలు కట్టుదిట్టం చేయడంలోనూ, ఆర్థిక సహాయం అందించి పారిశ్రామిక ప్రాథమిక అవసరాలను సమకూర్చడంలోను ఆయా శాఖాధిపతులు, ఆయా రంగాల అభివృద్ధి సంస్థలు పూర్తిగా అంకితమై సహకరిస్తున్నాయి. ఆయా అభ్యర్థులకు శిక్షణ నీయడంలోనూ, వస్తూత్పత్తి రంగాల్లో స్వయం ఉపాధి పథకాల కల్పనకూ నూతనంగా రూపొందించిన జిల్లా పారిశ్రామిక కేంద్రాలకు నిర్దిష్టమైన విధులు నప్పగించారు. ఈ ఆరు కార్యక్రమాలలోనూ స్వయం ఉపాధి పథకాలు—వ్యాపారం, చిన్న తరహా పరిశ్రమలు, పారిశ్రామిక సంబంధిత కేంద్రాలు, చిన్న పరిశ్రమలలో వస్తూత్పత్తి, చేనేత, మరమగ్గాలు, వ్యవసాయ సంబంధిత పనులు, పాడి పరిశ్రమాభివృద్ధి, కోళ్ల పెంపకం—రంగాలలో అమలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమా లన్నిటా 10,510 మంది అభ్యర్థులకు రు. 2 కోట్ల మూల ధనంతో శిక్షణ, మార్జిన్ ధనం, కల్పించి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. ఇదేవిధంగా వాణిజ్య బ్యాంకుల సహాయంతో రు. 536 లక్షల పెట్టుబడితో పథకాలు అమలులో ఉన్నాయి.

### (ఇ) శిక్షణ - ఉపాధి పథకాలు

రాష్ట్రంలో అనేక రంగాల్లో ప్రణాళికా పెట్టుబడులు, ప్రణాళికా ప్రాజెక్టులు త్వరితగతిని అభివృద్ధిపరచి రాష్ట్రంలోని అనేక సంస్థలలో, విద్యావంతులైన బలహీన వర్గాల అభ్యర్థులకు నూటిగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. రాష్ట్రంలోని అనేక సంస్థలలో, విద్యావంతులైన బలహీన వర్గాల అభ్యర్థులకు నూటిగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తు



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

న్నారు. వివిధ సర్వీసుల్లోనూ, ఉద్యోగావకాశాలున్న అనేక రంగాల్లోనూ ఈ అవకాశాలు మెరుగు పరిచేందుకు వీలున్నప్పటికీ; నిధుల కొరత వల్లనో, శిక్షణ పొందిన అభ్యర్థులు అందుబాటులో లేకనో అభివృద్ధి నిలిచిపోయిన రంగాలను గూర్చి నిర్దిష్టమైన పర్యవేక్షణ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి బోర్డు, ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఇటువంటి నాలుగు పథకాలను అమల్లోకి తెచ్చారు. ఆయా అభ్యర్థులకు, వారికి సంబంధించిన రంగాల్లో శిక్షణ కల్పించేందుకూ, గ్రాంటుల రూపంలోనూ, శిక్షణ పొందే అభ్యర్థులను ఆయా సంస్థలలో నియామకాలకు మార్జిన్ మనీ రూపంలోనూ యిచ్చేందుకూ నిధులను కల్పించారు. ఈ నాలుగు కార్యక్రమాలలోనూ 3176 మంది అభ్యర్థులకు రు. 26 లక్షల పెట్టుబడి కేటాయించి శిక్షణ జరుపుతున్నారు.

ప్రత్యేక ఉపాధి పథకం దేశంలోనే ప్రప్రథమంగా రూపొందించిన నవీన పథకం. ఇంతవరకు ఈ పథకంపట్ల అత్యుత్సాహపూరితమైన ఆసక్తి కనబడుతూంది; బలహీన వర్గాల వారి జీవితాలను మెరుగుపరిచేందుకు ఈ పథకంలో అనేక దశలను అధిగమించాల్సి ఉంది.

పటుతరమైన అనేక యితర విశిష్ట పథకాలవలెనే, ఈ నవీన పథకం వెనుక కూడా ముఖ్యమంత్రి డాక్టర్ ఎం. చెన్నారెడ్డిగారి ప్రగతి దీక్షాకంకణ హస్తం తేటతెల్లమౌతూనే ఉంటుంది; వారి ఈ విశిష్ట వ్యక్తిత్వానికి యిప్పటికీ, ఎప్పటికీ ఈ పథకాలు ప్రతీకలై నిలుస్తాయి.



# తరగని చెన్న

లక్ష్మీరమణ

బాలల కో భవనం కావాలని
బాలల అన్నయ్య అక్కయ్యలతో కలసి
ఆర్థిక మంత్రిగా నీ వున్నప్పుడే
అడిగాము నిన్ను !
బహుకొద్ది కాలములోనే
నెలకొల్పబడ్డది
బాలలకో భవనం
జవహర్ బాల్ భవన్ !
అందాల హైదరాబాదు తోటలో
అది నీ చలువే అన్నా !
ఉత్తర ప్రదేశ్ గవర్నరుగా
ఉన్నప్పుడు గౌరవించావు
మన తెలుగు కవులను, పండితులను
ఉత్తర దక్షిణ భారతాలకు
స్నేహబంధము వేసిన
చైతన్యవాహినివి నీవు.
ఉన్నత పదవులు నిర్వహించినా
ఉద్యమాల నడిపించినా
నీకు నీవే సాటి.
చెక్కుచెదరని పథము నీది
చెన్న తరగని జీవితము నీది.
సువిశాల తెలుగు దేశానికి
ముఖ్యమంత్రిగా
అశేష తెలుగు ప్రజలకు
ఆశారేఖగా
సాగిపోతున్న నీకు
సర్వేశ్వరుడు తోడు కావాలని
నీ షష్టిపూర్తి శుభసమయాన
కోరుకొంటున్నాను.

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# పద్య రత్న హారః

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

శ్రీమత్ శేషాద్రినాథః కలియుగ
కలిధ్వంసి విశ్వైకబంధుః
శ్రీమాన్ శ్రీశైలనాథః శశిధరముకుటః
మల్లికార్జునదేవః
శ్రీ కాళేశశ్చ సింహాచలపతిః
అఖిలా దేవతాః సర్వకాలమ్
రక్షంతాం ముఖ్యమంత్రీంద్ర మనిశం
అనవద్యైః 'చెన్నరెడ్డిం' యశోభిః.

నిష్ణాతః శాసనే యః నిరుపమ
ధిషణః కర్మఠే రాజ్యతంత్రే
నిర్నిద్రో దీన—హీన—శ్రమికజన
దివారాత్రసేవా ప్రయత్నే
పాశ్చాత్య—ప్రాచ్య విద్యాస్వనితర
సులభ ప్రజ్ఞయా భాసమానః
శ్రీమాన్ ధీమాన్ ఉదారః స జయతు
సతతం భారతే 'చెన్నరెడ్డిః.'

కావేరీ పుణ్య గంగావరి ముఖయు
తటాఽభోగదేశైక్య మిచ్ఛన్
విద్వద్బృందం తదీయం సమ సమిత
దృశాఽఽలోక్య సంభావయన్ సః
దేశే కావేర యామ్యే అతికుశలతయా
హ్యేకసూత్రే నిబధ్నన్
రారాజత్వాంధ్రదేశేఽనిశ
మనుకలయన్ ముఖ్యమంత్రీంద్రపీఠమ్.

పత్నీ పుత్రైశ్చ పౌత్రైః సతత
పరివృతైః బంధుమిత్రైః హితైశ్చ
రాజన్ ప్రశీక వృద్ధ్యై భరతభువి
తథా విశ్వవిశ్వే యశస్వీ
భ్రాజన్ ప్రద్రాజకీయోన్నత
విమలపదే దీపయన్ 'మఱ్ఱి' వంశమ్
'చెన్నారెడ్డీంద్ర!' జీయాః రవిరివ
జనహృత్పంకజ ముద్భాసయన్ త్వమ్.

వర్షే మాసాః శతం స్యుః, శతమథ
దివసాః మాసి, ఘస్రే శతం స్యుః
యామాః, యామే చ ఘంటాః శతమపి,
నిమిషాః స్యుః శతం ఘంటికాయామ్
ఇత్యేవం షష్టి—షష్ట్యబ్దహిత
సుఖశమ్యైః ఆయురారోగ్యభాగ్యైః
జీయాత్ ఆంధ్రప్రదేశే ప్రముఖ
సచివ భవ్యాసనే 'చెన్నరెడ్డిః'.

ఏధస్వ! పుత్రైః పౌత్రైశ్చ
వర్ధస్వ! జనసేవయా
చెన్నారెడ్డీంద్ర! విశ్వాఽఽన్ధ్ర
ముఖ్యమంత్రీంద్ర! సర్వదా.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# శుభాశంసనమ్

కే. రాజన్నశాస్త్రి

జయతా చ్చెన్నారెడ్డి
రాంధ్రప్రదేశస్య ముఖ్యమంత్ర్యర్హః
వినయవతో నయమహితో
జనహిత నిరతః సుకార్యదృఢదీక్షః.

అన్వర్థం తవ నామం
* 'వ'టోపపదతా విశాలహృదయార్య!
తపనమతప్తా దీనా
జనతా ఛాయార్థమాశ్రితా యత స్త్వామ్.

ఆంధ్రజన పుణ్యపాకో
జయతి చ యేన త్వమీదృశోఽక్రియత
'గార్నర్' పదాబ్ధికమఠీ
క్రియామహాణోఽరం విమోచ్య, తన్నేతా.

జనహితనిరతిరహోఽన్యా
ప్రతిభా తే చాపి సర్వతోదిక్కా
తత్తత్పద నిర్వ్యూఢా
విభిన్నరంగేషు కీర్తిరాత్తా యత్.

కృషక సంక్షేమకార్యే
దృఢదీక్షోఽసీతి ప్రథితవర ఏవ
భారత కృషక ప్రతినిధి
నేతృత్వే ప్రాప్త 'రోమ'నగరో యత్.


గమనాయానపక్షాన్తా
పల్లిజనతా హి తర్పితాఽత్యర్థమ్
పరికల్ప్య వాహయోగం
గ్రామ సముద్ధరణ ఆదిసోపానమ్.

న వినా నైతికభావో
న్నత్యా బాలేషు సాధితుం సుశకా
ప్రగతి ర్దేశస్యేతి చ
ప్రారబ్ధాఽఽదర్శ ప్రాథమిక విద్యా.

జనతాభ్యుదయే కర్మణి
శస్త్రా తే శ్రీప్రకారితా బుద్ధిః
వచన మాదేశకల్ప
మాత్మన ఆదిష్ట మధికృతే యచ్చ.

రాష్ట్రే శాంతిః స్థాప్యతే సర్వదిక్కా
దీనవ్రాత స్తర్ప్యతే భాగ్యహాదేః
నిగ్రాహ్యన్తే ద్రోహచింతాపరా యత్
కిం వాఽఽశాస్యం, దీర్ఘమాయుర్భవేత్తే.

*వట ఇతి "మఱ్ఱి" శబ్దస్య సంస్కృతీకరణమ్.





CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# ముఖ్యమంత్రిగారితో ముఖాముఖీ

**పి. యశోదా రెడ్డి**

గర్జించే సింహాన్ని మచ్చికచేసి నిలువరించి మాటల్లో దింపే దెవరు? ఎలా? భయంగానే ఉంది. అయినా సాహసించాను. ఫలితం మాత్రం విచిత్రంగా పరిణమించింది. వినుకలికీ, అనుభవానికీ ఇదేనేమో భేదం అనుకున్నాను. సంభాషణ ప్రారంభమైంది. నేను మాట్లాడుతున్నది ఆంధ్రప్రదేశ ముఖ్యమంత్రి డా. ఎం. చెన్నారెడ్డిగారితో అని ఎప్పుడో మర్చిపోయాను. సంభాషణ అంతా సుఖంగా, చమత్కారంగా సాగింది. అప్పు డెందుకో నాకు ప్రకాశం పంతులుగారు డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డిగార్ని గూర్చి: 'రెడ్డిగారు కూర్చుంటే వశిష్ఠులూ—లేస్తే విశ్వామిత్రులు' అని అనే మాటలు జ్ఞాపకాని కొచ్చాయి. నవ్వుకున్నాను.

నేను : డాక్టర్‌సాబ్! మీరు భావిజీవితంలో ఇంత గొప్ప వ్యక్తి కాగలుగుతా రని ఎవరైనా ఊహించారా?

ముఖ్యమంత్రి : దైవజ్ఞులు గురించి చెప్పలేదు. కాని, మా తాతగారు—అంటే మా తల్లి తండ్రిగారు—వారే శ్రీ కొండా రంగారెడ్డిగారి తండ్రిగారు—'వీడు నాకన్నా గొప్పవా డౌతాడు' అని అనేవారట.

నేను : తాతగారి కలలు పండించారు. అదృష్టవంతులు. కాని, చిన్నతనంలో విద్యార్థిగా మీరు చురుకైనవారా? కాక......

ముఖ్యమంత్రి : 'కాక', 'లేక' అనే ప్రశ్న ఏనాడూ లేదు. నేను తెలివైనవాణ్ణే. నా కింకా బాగా జ్ఞాపకం. హైదరాబాదులో ప్లేగు వ్యాధి వ్యాపిస్తే నేను మా సొంత ఊరు వెళ్లాను. అక్కడ మా నాన్న నేను ఇంగ్లీషు పాఠాలు మర్చిపోయానేమో అని 'ఇంగ్లీషు తెలిసిన పంతుల్ని ప్రశ్నించమంటూను ఉండు' అన్నారు. వారివెంట నడుస్తూ 'సాంబసదాశివ' పై మనస్సు లగ్నం చేసి మననం చేసుకుంటూ వెళ్లాను. తీరా ఆయన నన్ను పలుకరించి 'ఈ పిల్లవాడికి నాకన్నా బాగా ఇంగ్లీషు వచ్చు, నేనేం ప్రశ్నించగలను?' అని చెప్పి, 'ఆ పిల్లవాడు చాల తేజ్‌గా ఉన్నాడయ్యా' అని ఊళ్లో అందరితో అంటే మా నాన్న పొంగిపోయారు.

నేను : అయితే చిన్నప్పుడు కూడా మీ చదువు పల్లెటూళ్లో కాదా?

ముఖ్యమంత్రి : కాదు. నేను చిన్నప్పటినుండి హైదరాబాదు 'శ్రీ సదన్'లో ఉండే చదువుకున్నాను. ఇంకో విషయం, మొదట నేను ఆడపిల్లల బళ్లో చేరాను. డబుల్ ప్రమోషన్లు తెచ్చుకున్నాను.

నేను : అయితే అక్కడ మీ హైస్కూల్ చదువు ముగిసేవరకు మా ఆడపిల్లలకు ఫస్ట్ క్లాస్ ఫస్టు రాలేదన్నమాట.

ముఖ్యమంత్రి : ఆ స్కూల్లో నేను అంతవరకు ఉండి ఉంటే అట్లే జరిగి ఉండేదేమో! కాని మెథడిస్ట్ బాయిస్ హైస్కూలుకు మారిపోయాను కదా!

నేను : భగవంతుడు రక్షించాడు మా పిల్లలను. సరే! మీరు మెడికల్ డాక్టరు కదా? రాజకీయాల్లో ఎప్పుడు? ఎట్లా ప్రవేశించారు?

ముఖ్యమంత్రి : నాకు రాజకీయరంగ ప్రవేశమే మొదలు. తరువాతనే మెడిసిన్ చదివాను. నా జీవిక కోసం ఒకళ్లపై ఆధారపడి ఉండటం నాకు ఇష్టంలేదు. రాజకీయాల్లో ఉండి కూడ నా కాళ్లపై నేను నిలబడగలిగే ఆర్థిక స్తోమత కోసం ఎం. బి. బి. ఎస్., పూర్తిచేసి రెండు నర్సింగ్ హోంలు నడిపించాను.

నేను : అయితే? ఆ వృత్తి ద్వారా ప్రజాసేవ చేస్తూ, డబ్బు సంపాదిస్తూ ఘనతర సాధకంగా ఉండవచ్చు కదా? అంత మంచి ప్రాక్టీసును ఎందుకు వదిలినట్లు?

ముఖ్యమంత్రి : నా ప్రైమరీ ఇంటరెస్ట్ పాలిటిక్స్ అని ఇంతవరకే చెప్పాను. రానురాను రాజకీయ రంగంలో బాధ్యతలు పెరుగుతూ వచ్చాయి. అందుకే మెడికల్ ప్రాక్టీస్ మానుకున్నాను.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

నేను : సమర్థులు రెండు గుర్రాలపై స్వారీ చేయవచ్చును కదా ?

ముఖ్యమంత్రి : అదే నాకు ఇష్టంకాలేదు. నేను చేపట్టిన పని ఏదైనా సరే దానికి నేను సంపూర్ణంగా అంకితమై, ఆ పనిని పూర్తిగా నా అదుపులోకి తీసుకునే తత్వం నాది. పై పై అంచులు తాకే స్వభావం కాదు నాది.

నేను : ఈనాటివలె ఆనాడు, రాజకీయ రంగంలో ఆకర్షణ కేవలం పదవీవ్యామోహం కాదుగదా ? మరి ఆనాడు మీరు ఆ రంగంలో ప్రవేశించడానికి కారణం ?

ముఖ్యమంత్రి : చిన్నప్పటినుండి స్వాతంత్ర్యప్రియుణ్ని నేను. **'Fight for Freedom'** నాకు ఆకర్షణ. అందుకే రాజకీయాల్లో ప్రవేశించాను. పుట్టుకతోనే నాలో ఒక విధమైన సేవా భావమూ, నా వెంట కొందరిని కూడ గట్టుకుని నడిపించే గుణమూ రెండూ ప్రవేశించాయి. హైస్కూల్ విద్యార్థిగా ఉన్నప్పుడే **Y. M. D. A.** (యంగ్ మెన్ డిబేటింగ్ అసోసియేషన్) స్థాపించాను. పుస్తకాలు కొనుగోలుచేసి ఉన్నంతలో లైబ్రరీ నెలకొల్పాము. ఈ మా సంఘం తరఫున వక్తృత్వ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించాం. నాటకాలు వేశాం......

నేను : అమ్మో ! ఒక్క నిమిషం. నాటకాలు వేశాం అంటున్నారు... అయితే మీరు కూడా ?

ముఖ్యమంత్రి : అవునమ్మా ! నేను కూడ, అంటే నేనే స్వయంగా వేషం వేశాను. అదీ ఆడపిల్ల వేషం. వరకట్నంలో విమల పాత్ర వేసి అచ్చం ఆడపిల్లగా అందర్నీ మెప్పించాను.

నేను : అయ్యో ! ఫొటో ఉంటే బాగుండేదే !

ముఖ్యమంత్రి : అడుగుతారని తెలిస్తే ఉంచేవాణ్ణి.

నేను : ఆడపిల్ల అంటే జ్ఞాపకం వచ్చింది. చూడండి ! మీరు సావిత్రమ్మను కోరి చేసుకున్నారా ? ఆమే మీరు కావాలని పట్టు పట్టిందా ? ఎదురుతిరిగారా ? కాక పెద్దలే నిర్ణయించి మూడుముళ్ళు వేశారా ?

ముఖ్యమంత్రి : ఈ నాల్గూ కలిసి మా పెళ్ళయింది.

నేను : మీ జీవితంలో ఏ స్త్రీ ఐనా మిమ్మల్ని ప్రభావితం చేసిందా ?

ముఖ్యమంత్రి : ప్రతి స్త్రీతో నేను ప్రభావితుణ్నవుతాను. ఆమెలో ఒక శక్తిని చూస్తాను. అంటే : **She is a symbol of the grace of Sakti, the supreme goddess in her different capacities.**

నేను : అయ్యా ! డాక్టరుగారు ! ఇన్ని రంగాల్లో మీరు సాధించే విజయా లన్నిటికి పురుషకారమా ? అంటే మానవ ప్రయత్నమా ? కాక దైవానుగ్రహమా ? కారణం ?

ముఖ్యమంత్రి : కార్యసాధనకు రెండూ ముఖ్యమే అంటాను. కాని, ప్రత్యేకంగా నా విషయంలో మాత్రం నన్ను దైవమే నడుపుతుంది. ఆ నిర్ణయం ప్రకారమే నా మనస్సులో ఆలోచనలు పుట్టి కార్యక్రమం రూపుదాలుస్తుంది. మీ కవులకు బాగా తెలుసు, భక్త పోతన్న భాగవతంలో 'పలికెడిది భాగవతమట ! పలికించెడువాడు రామభద్రుండట' అన్నట్లు. దైవనిర్ణయానికి నేను కేవలం ఉపకరణం మాత్రమే.

నేను : క్షమించండి ! అంటే మీరు అంత భక్తిపారమ్యానికి చేరుకున్నారా ?

ముఖ్యమంత్రి : ఇప్పుడు నేను చెప్పింది నా గొప్పతనం గూర్చి కాదు. భక్తి **personal** విషయం. నేను పోలిక చూపింది జరుగుతున్న పరిణామాలను గూర్చి చెప్పటానికి మాత్రమే.

నేను : మీ జీవితంలో మానవాతీతమైన దైవశక్తితో మాత్రమే సమకూడగలిగిన కొన్ని సంఘటనలను పేర్కొంటారా ?

ముఖ్యమంత్రి : చెప్పవలసి వస్తే నా జీవితంలో ఆశక్తి ప్రభావం చూపని విశేషమంటూ లేదు. ఏదో ఉన్నట్టుండి నా మనస్సులో **intuitional** గా ఒక భావమో, ఒక కార్యక్రమ స్వరూపమో, ఒక నిర్ణయమో భాసిస్తుంది. అట్లా ఆ విశిష్టభావం నా మనస్సులో తొలిసారి మెరిసినప్పుడు దానికి రూపురేఖలు కూడా ఉండవు. ఆ విషయాన్ని గూర్చి అందరూ అసాధ్యం అనే భావిస్తారు. ఉదాహరణకు, ఒకసారి మేం ఢిల్లీ వెళ్ళాం. శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారు కూడా ఉన్నారు. పార్లమెంటు భవనం అంతా చూద్దామని మావాళ్ళన్నారు. 'సావిత్రీ చూడు ! నేను ఈ పార్లమెంట్ హౌస్‌లో ఒక హోదాతో ప్రవేశించి **speech** కూడ ఇవ్వబోతున్నాను. పదా' అన్నాను. కొన్ని సంవత్సరాల తరువాత ఆ మాట నిజం అయింది. అట్లే మేమంతా సంగం లక్ష్మీబాయమ్మతో కలిసి ఆగ్రా వెళ్ళాం. సమయం చిక్కక



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

తాజ్‌మహల్ చూడలేక పోయాం. ఇంకో రోజు ఉండి చూద్దామన్నారు. 'లేదు, నేను ఎన్నోసార్లు ఇకముందు అధికారికంగా ఆగ్రా రావలసి ఉంది. అప్పుడు చూద్దురుగానిలెండి' అన్నాను. అన్నట్టుగానే జరిగింది. అంతేకాదు; నేను యు. పి. గవర్నరుగా ఉన్నప్పుడు ఆగ్రా గెస్ట్ హౌస్ బెడ్‌రూం కిటికీలోంచే తాజ్‌మహల్ దృశ్యం చూచి ఆనందించే అవకాశం కలిగింది. అప్పట్లో నేను యు. పి. గవర్నరు పదవికి రాజీనామా చేసిన తరువాత 1977 నవంబరులో నేను ఇంకా ఏ పార్టీయా కూడా నిర్ణయించుకోలేదు. కాని, నా మనస్సులో మాత్రం నేను **Chief Minister** అవుతానని స్ఫురించింది. వెంటనే నేను **'I am going to be the Chief Minister'** అని చెప్పాను.

నేను : ఎవరితో అన్నారు ? ఈ మాటలు ?

ముఖ్యమంత్రి : **Why?** శ్రీ శృంగేరి శంకరాచార్యులవారి షష్ఠిపూర్తి వేడుకల సందర్భంలో శ్రీ చెట్టినాడు రాజావారి ఎదుట అన్నాను. తరువాత నేను వారికి **Courtesy call** ఇచ్చినప్పుడు **"How strange it is that you emphatically asserted that you are going to be the chief minister"** అని ఆశ్చర్యపోయారు. అంతే కాదు **I am the first leader to be invited to meet the press at Bashirbagh and I told them that I shall win 180 seats and I am going to form my government.**

నేను : అయ్యా ! నోచినవారి సొమ్ములవి. సరే, రాజకీయంగా మీకు ఈ ధైర్యం ఉంది, కాని, ఇదిగాక వేరే రంగంలో దైవానుగ్రహంతో కలిసి వచ్చిన విశేషాలేమిటి ?

ముఖ్యమంత్రి : ఎన్నో ఉన్నాయి. నా జీవితంలో అనుకోకుండా పిడుగులు పడినట్టుగా, నడుస్తున్న మార్గాన్ని వింధ్యం అడ్డినట్టుగా ఆటంకాలు వచ్చిపడ్డాయి. కాని, విచిత్రంగా వాటి అంతట అవే మంచు విడిపోయినట్టు తొలగిపోతాయి. ఏదైనా, ఎవరైనా నా కనుగప్పి చేయవలెనని ప్రయత్నిస్తే దైవికంగా ఆ చోటే నా దృష్టికి విషయం అవుతుంది. అందుకే, పోటుమికి భయపడి క్రుంగిపోను. అంతెందుకు? మొన్న ఎలక్షన్ సందర్భంలో మేమున్న కారు ప్రమాదంలో కుప్ప కూలింది. కాని, మేం మాత్రం సుఖంగా బ్రతికి బయటపడ్డాం. ఆ కారు స్వరూపం చూస్తే తెలిసేది దైవానుగ్రహం అంటే ఏమిటో!

నేను : అంత నమ్మకం ఉన్న మీరు నిజంగా ధన్యులు.

ముఖ్యమంత్రి : నా ధన్యతకు కారణం ఇంకొకటి చెప్తాను. మొన్న మద్రాసులో శ్రీశ్రీ జగద్గురు శృంగేరి శంకరాచార్యుల వారి షష్ఠిపూర్తి ఉత్సవ సందర్భంలో శ్రీ చెట్టినాడు రాజావారితో కూడ దిగ్గంతులైన పండితులు సభ తీర్చి ఉండగా నేను అధ్యక్ష పీఠాన్ని అలంకరించి, ఆ విద్వన్మండలి ఎదుట ఉపన్యాసం చేయడంతో సమానమైంది మరొకటి లేదేమో అని అనుకుంటాను.

నేను : మీకే కాదు, వినేవాళ్ళకు కూడా గర్వకారణం ఇది. సరే ! అయ్యా ! సి. ఎం. గారూ ! మీరు అధికారికంగా 'చెప్పు కోలము' చేతబట్టి మంత్రులను, ఉద్యోగులను, పార్టీ మనుష్యులను, ఎదుటి వారిని గడగడ లాడించడం కాకుండా మీరు పార్టీ సేవకులుగా, కార్యకర్తగా క్రమశిక్షణతో మెలగి నిర్వహించిన ఒక్క పని చెబుతారా ?

ముఖ్యమంత్రి : అంటే నాకు క్రమశిక్షణ లేదనేనా ? క్రమశిక్షణ లేకుండా ఒక్కసారే ముఖ్యమంత్రి కుర్చీ ఎక్కి కూర్చుని 'మన్‌మానీ' **administration** చలాయిస్తున్నానని అనుకుంటున్నారా ? ఆ రోజుల్లో రాష్ట్ర కాంగ్రెస్ అవతరణకు పూర్వం ఆంధ్ర మహాసభలకు అహూతులైన పెద్దలకు స్వాగతం చెప్పి, పిలుచుకొని వచ్చి విడిదిలల్లో ప్రవేశ పెట్టడమే కాక, ఇతర వాలంటీయర్లతో కలిసి వాళ్ళ సామాన్లు కూడా మోశాం, పడకలు ఏర్పాటు చేశాం. ఉత్సాహవంతుడైన యువ కార్యకర్తగా పల్లె పల్లె తిరిగి భయంకర వాతావరణంలో ఆకలి దప్పి మరచి శ్రమించాను. తలపై ఖాదీ బట్టల మోపు పెట్టుకొని ఒకరోజు, ఊరు అంతా తిరిగి 'అందరికన్నా ఎక్కువ అమ్మకంచేసే కాంపిటిషన్‌లో నెగ్గి ఫస్ట్ ప్రైజు అందుకున్నాను. నా పునాదులు ఇసుకలో లేవు. బాగా లోతుకు వెళ్లి సిమెంటు కాంక్రీటు చేసి నిలిపిన రాజకీయపు వారసత్వం నాది. సమర్థులైన నాయకుల కనుసన్నల అర్థం గ్రహించి అనుభవం సంపాదించుకున్నవాడే అడగలుగుతాడు, ఆడించగలుగుతాడు.

నేను : నా సాహసాన్ని మన్నించండి. మీ దృష్టిలో ఆదర్శనాయకు లెవరు ?



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

ముఖ్యమంత్రి : పంజరమున్న శరణార్థిగా ఉన్నాయి నీ ప్రశ్నలు. మహాత్మా గాంధీ, నేతాజీ, సర్దార్ పటేలు......

నేను : మీరు ఉద్యమాలను నడిపేటప్పుడు, పాల్గొనేప్పుడు పోలీసులున్నా, జైళ్లున్నా భయపడేవారా ?

ముఖ్యమంత్రి : భయంలేదు కాని, పట్టుబడి జైళ్లల్లో ఉండేకన్నా బయట ఉంటేనే ఎక్కువ మేలు పార్టీకి చేయవచ్చు. కీర్తికోసం నేను జైల్లోకి వెళ్లి కూర్చోలేదు. నిండు ఉద్యమంలో తలమునకలుగా దూకి, ప్రజానీకాన్ని ఉత్తేజ పరుస్తూ, ఒక యోధుడుగా పట్టుబడ్డాను. పోలీస్ యాక్షన్‌కు పూర్వం ఒక మీటింగ్ జరుగుతూ ఉంటే పోలీసు లొచ్చారు. నాపై వారెంటును చదివారు. ఏమైనా సరే ఈ మీటింగ్ అవటానికి వీల్లేదంటూ కార్యక్రమాన్ని సాగిస్తూనే జవాన్లను చూచి 'అబ్ ఏ హుకుం తామీల్ నహీ హోగా. ఔర్ తుమ్‌హారే సాహెబ్‌కు షాంమే పాంచ్ బజే ఆవ్ బోలో. హం భాగ్నేవాలే నహీ హై' అని చెప్పి పంపాను. అది వినినవారే ఆశ్చర్యపడ్డారు.

నేను : పోలీస్ చర్య తరువాత కేంద్రంలోని అగ్రనాయకులతో మీ కేమైనా సంబంధం ఉండేదా ?

ముఖ్యమంత్రి : పోలీస్ యాక్షన్ రోజుల్లో సర్దార్ పటేల్‌గారికి నేను చాల సన్నిహితుడ్నయ్యాను. పార్లమెంటులో రఫీ అహ్మద్ కిద్వాయీ, మౌలానా ఆజాదులతో సాన్నిహిత్యం బాగా పెరిగింది.

నేను : అయితే 'కిద్వాయీ కాటేజ్' వారి పేరుతో వెలిసిందన్నమాట.

ముఖ్యమంత్రి : అవును. నేను **Agriculture Minister** గా ఉన్నప్పుడు ఆ ప్రాంతం అంతా మురికి గుంటలతో, ముళ్ల కంపలతో, రాయీ రప్పలతో, పాడుబడి, బంజరుభూమిగా ఉండేది. ఆ భూమిని నేను సారవంతం చేసి, పూల మొక్కలు నాటి, రకరకాల క్రోటన్సు పెంచి, అందమైన పక్షుల నివాసానికి ఏర్పాట్లు కల్పించి, నిరుపయోగంగా పోయే నీటిని 'ఫవ్వారాలు' (**Fountains**) గా మలచాం. కిద్వాయీజీ అక్కడికి వచ్చినప్పుడు చాలా సంతోషించి 'అబ్ యహాఁ ఏక్ కాటేజ్ బన్వావో' అని సలహా ఇచ్చారు. వారి మాట ప్రకారమే ఆ సుందర పరిసరాల్లో ఈ కాటేజ్ నిర్మాణం చేసి దానికి కిద్వాయీ కాటేజి అని పేరుంచాం. రాజన్‌బాబుగారు (రాజేంద్ర ప్రసాద్‌గారు) దానికి స్వయంగా ప్రారంభోత్సవం చేశారు.

నేను : అయితే పనికిరాని ఊసర క్షేత్రాలు మీ చేతుల్లో నందనవనా లయ్యాయి అన్నమాట.

ముఖ్యమంత్రి : అన్నమాట కాదు ప్రొఫెసర్! అక్షరాలా నిజమైనమాట. ఆనాటి నుండి ఈనాటికీ సినిమా షూటింగులో అదే నందనవనం. అదే చైత్రరథం.

నేను : అయ్యా! నా అజ్ఞతను మన్నించాలి. మరొక్క విషయం. రాజేంద్ర నగర్ **Agriculture University** తో మీ కేమైనా సంబంధం ఉందా ?

ముఖ్యమంత్రి : నాకే ప్రత్యక్షంగా సంబంధం ఉంది. అప్పుడు నేను ఉస్మానియా యూనివర్సిటీ సిండికేట్ మెంబరుగా ఉంటున్న రోజులు. కొన్ని కారణాలవల్ల ఈ విశ్వవిద్యాలయ నిర్మాణానికి బలమైన ప్రతిఘటనమే వచ్చింది. అయినా, నేను అంతకన్న ఎక్కువ పట్టుదలతో పోరాడాను.

నేను : అంటే మీరు ఈ యూనివర్సిటీ నిర్మాణ ప్రథమ నిర్మాతలలో ఒకరన్నమాట.

ముఖ్యమంత్రి : మీ సాహిత్యవేత్తలు ఏ పేరు పెడ్తారో నాకు తెలియదు, కాని, జరిగిన విషయం మాత్రం ఇది. శ్రీ నీలం సంజీవరెడ్డిగారి క్యాబినెట్‌లో, శ్రీ బ్రహ్మానందరెడ్డిగారితో ఘర్షణ పడి కూడ **out side plan** గా వెళ్లి సర్వేపల్లి రాధాకృష్ణయ్యగారితో **Foundation** వేయించాం. అదే ఈనాడు మొత్తం ఇండియాలో **Biggest Research centre with largest number of training institutes** గా తయారైంది.

నేను : అయ్యా! ఇటు చూడండి!

ముఖ్యమంత్రి : నేను ఎటు చూచినా అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్తాను. నేను ఒక ప్రక్క టీ త్రాగుతూ, పోస్టు చేస్తూ, **telephone** మాట్లాడుతూ కూడ **P. A.** కు **notes dictate** చేయవలసి వస్తుంది. నేనెప్పుడూ **alert** గానే ఉంటాను. అవధానం ఒక్క మీ కవుల సొమ్మేంకాదు. మా రాజకీయ వేత్తలం కూడా అలవాటుపడి ఉంటాం.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

నేను : మీ శక్తులను శంకించే ధైర్యం నా కెక్కడిది ? మీ ప్రసన్నత కోసం అన్నాను. అంతే! మీరు కేంద్రంలో స్టీల్ మినిస్టరుగా ఉంటూ సాధించిన పనులు కాని, తీసుకున్న నిర్ణయాలు కాని పేర్కొనదగినవి ?

ముఖ్యమంత్రి : దక్షిణ ప్రాంతంలో మూడు చోట్ల మూడు **steel plants** పెట్టాలనే నిర్ణయం అప్పుడే తీసుకున్నాం.

నేను : **C. M.** గారూ ! మీరు అసెంబ్లీలో, పార్లమెంటులో అనేక హోదాలల్లో పని చేశారుకదా, మరి ! అప్పుడు మీరు మీ పక్షం నుండీ, ఇంకా, **opposition** వైపు నుండీ ప్రశ్న లొస్తే హర్షించేవారా ? కాక, గుడుగుడు గుంచం అంటూ కూర్చోబెట్టేవారా ?

ముఖ్యమంత్రి : **Questions** ఎప్పుడూ **welcome** చేసేవాణ్ణి, చేస్తాను. అంతేకాదు **Supplementary questions** ను **type** చేసి అందించేవాణ్ణి.

నేను : నిజమే. సమర్థులు ఎదుటివారి చేతికి కత్తిని ఇచ్చి పోరాడ్తారు కదా !

ముఖ్యమంత్రి : అవును ! బలహీనుడితో తలపడి ఏం లాభం ? అహంకారం ఉన్నచోటే విజృంభిస్తాను.

నేను : అయితే శత్రువు గతి చెడినప్పుడు కాక, బలియుడై ఉన్నప్పుడు ఎదుర్కొంటారా ?

ముఖ్యమంత్రి : మాటల గారడీ చేస్తే ఏం లాభం ? **opponents' weak points and times** వేరు, అసలు **Stature** వేరు.

నేను : ఈ విద్యలో నాకు ప్రవేశం లేదు !—అన్నిటికన్నా ఎక్కువగా మీరు ఏ కళను అభిమానించి ఓడిపోతారు ?

ముఖ్యమంత్రి : **Masses** కళకే ఓడిపోతాను.

నేను : **Masses** అన్నారు కాబట్టి, హరిజనోద్ధరణకు మీరేం చేశారు ?

ముఖ్యమంత్రి : మన హైందవ సంఘంలో ఈ అస్పృశ్యత ఒక శాపం వంటిది. దానివల్లనే ఈ అసమానతలు ప్రబలినవి. దీన్ని నేను ఒక కళంకంగా భావిస్తాను. వారిని ఆర్థికంగా, సాంఘికంగా సమానులను చేసే కార్యక్రమంలో నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది. ఈ విషయం నేను మాటల్తో పోనివ్వలేదు. పంచాయతీ సమితి అధ్యక్ష పదవులను వారి జనాభా నిష్పత్తిలో రిజర్వు చేయాలి అనే విషయం చట్టం ద్వారా గట్టిపరచాం. ఇదేకాక, జిల్లా పరిషత్తుల్లో కూడ ఒక స్థానం వీరికి ఏర్పాటు చేశాం.

నేను : మంచి ప్రారంభమేనండి. అయితే చిన్నతరహా రైతులకు మీ రేమైనా సహాయం అందిస్తున్నారా ?

ముఖ్యమంత్రి : అమ్మా ! పంతులమ్మగారూ ! నా ప్రజా జీవితమే రైతు ఉద్యమంతో ప్రారంభమైంది. దేశానికి వెన్నెముక వంటి రైతాంగాన్ని ఎవరూ మర్చిపోకూడదు. వారికి కావలసిన సహాయ్యం ప్రభుత్వం బ్యాంకుల ద్వారా చేస్తున్నది. ఈసారి మంత్రివర్గంలో '2½ ఎకరాల తరి, 5 ఎకరాల ఖుష్కీ, ఉన్న రైతులకు **Land Revenue** మాఫ్ చేయడం మొదటి నిర్ణయంగా తీసుకున్నాం.

నేను : అయితే మీరు **Teachers** ను గూర్చి ఆలోచించలేదా ?

ముఖ్యమంత్రి : ఏం ప్రశ్నమ్మా ! అది ? కాని **Teacher** అని **English** లో అనకు. అది నాకు ఇష్టంలేదు. మన సంప్రదాయానికి జతపడని మాట. ప్రతి **Teacher** గురువుగా, ఆరాధ్యుడుగా, పిల్లలకూ, దేశానికీ పూజనీయుడు కావాలని కోర్తాను.

నేను : సరే ! ఆ శుభవేళ త్వరగా వస్తే బాగుండు. విద్యార్థులను గూర్చి మీ అభిప్రాయం ?

ముఖ్యమంత్రి : విద్యార్థులు బ్రహ్మాండమైన శక్తి కలవారు. వారి చైతన్యాన్ని, శక్తిని సరియైన దృక్పథంతో అర్థం చేసుకుని ప్రోత్సహించి నిర్మాణాత్మకమైన దృష్టితో వారిని ముందుకు నడుపవలె. వారిలో విసుగూ, భయం తొలగించి తీర్చిదిద్దే బాధ్యత మీదే.

నేను : అయితే ఆంధ్రప్రదేశ ముఖ్యమంత్రిగా ఈ విద్యారంగంలో ఏవైనా మార్పులు ప్రవేశపెటారా ?

ముఖ్యమంత్రి : మన విద్యారంగం బాగుపడాలి అంటే ప్రాథమిక స్థితిలోనే మార్పు అవసరం. అందుకే ప్రాథమిక విద్యా సంస్థలను నెలకొల్పాం. ఇదొక **autonomous body**. ఏ గ్రామంలో పాఠశాల ఉందో అక్కడే ఈ విధానం **experiment** రూపంలో ప్రారంభం చేస్తారు. పిల్లలు ఉదయమే 6 గంటలకు బళ్ళో ప్రవేశించి ప్రార్థనతో ప్రారంభం చేస్తారు. తరువాత యోగాసనాలు, **mass drill** ఉంటుంది. పాలు తాగి ఇంటికిపోతారు. తరువాత



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

9 గం. నుండి 1 గంట వరకు పాఠాలు నేర్పుస్తారు. **Mid-day free meal** ఇస్తారు. భోజనం తరువాత 4 గం. వరకు చదువుకుంటారు. మళ్ళా పిల్లలు పాలు తాగుతారు. 4 గం. 30 ని. లకు **games** ఆడుకుని, **Cultural Programme** లో పాల్గొంటారు. సాయంకాలం 7 గం.లకు ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోతారు.

నేను : గురుకుల, శిశుమందిరాల పద్ధతిని ఆమోదిస్తున్నారా ?

ముఖ్యమంత్రి : అంతకంటే ఒక అడుగు ముందుకు పోతున్నాం. ప్రాచీన ఆధునాతన పద్ధతులను సమన్వయం చేసి నూతన విధానాన్ని రూపొందిస్తున్నాం. పసిపిల్లలకు పుస్తకాల మోత బరువు తగ్గిస్తున్నాం. పూర్వపు పెద్దబాలశిక్ష పద్ధతిలో పుస్తకాలు ప్రవేశ పెట్టబోతున్నాం. పిల్ల లందరికీ **Tip-Top** గా ఒకే **uniform** ఉంటుంది. పిల్లలు జాతి సొమ్ముగా భావిస్తే వారి అభివృద్ధికి అందరూ తోడ్పడాల్సిందే. దీనివల్ల గ్రామాలల్లో ఉన్న చదువుకున్న యువకులకు **Social service** చేసే అవకాశం కల్పిస్తున్నాం. ఎవరికి ఏది చేతనయితే ఆ రూపంలో వారు కార్యక్రమాలల్లో పాల్గొని, పర్యవేక్షణ చేసి, చదువు చెప్పి, సహకరించవచ్చు.

నేను : **Public Schools** సామాన్యులకు అందుబాటుల్లో లేవు కదా ? మరి, అవి అందరికీ ఎట్లా ఉపయోగిస్తాయి ?

ముఖ్యమంత్రి : నిజమే. స్థితి లేనంత మాత్రాన ఆదర్శాన్ని రూపుమాపితే ఏం ప్రయోజనం? అర్హత ఉన్నవారికి ప్రభుత్వం ఎప్పుడూ తోడ్పడుతూనే ఉంది. **Tribal Residential Schools** లో ఉన్న పిల్లలు కొందరు **toping the list.** మంచిని మనమే పోగొట్టుకోకుండా అన్ని పాఠశాలలు ఆ స్థాయిని అందుకునేందుకు కృషి చేస్తే మంచిదే కదా!

నేను : అయ్యా ! మీ కుటుంబంలో దైవభక్తి బాగా అల్లుకపోయింది కదా ! మరి మీరు దేవాలయాల విషయంలో తలపెట్టిన మేలేమిటి ?

ముఖ్యమంత్రి : ఎవ్వరూ పట్టించుకోక గుళ్లో ఉన్న దేవుడు రాయిగా మారినచోట తిరిగి ఆ రాతిలో దేవుడు ప్రత్యక్షం కావాలని నా కోరిక. అటువంటి మారుమూల ప్రాంతాలకు సౌకర్యం కల్పించాను. శ్రీ ఎ. పి. సుబ్బారెడ్డిగారు పవరు మినిస్ట్రుగా ఉన్నప్పుడు నేను వారిని ప్రత్యేకంగా కోరి 1. బాబానగర్, 2. శాంతి ఆశ్రమం, 3. మల్లేశ్వరం (పాముగుడికి) **electricity** ఇప్పించాను. ఇవి, పాపం, **politicians** ఎవ్వరూ పట్టించుకోని కోణాలు. ఈ మూడూ తెలంగాణా ప్రాంతంలోనివి కావుకదా ! అని శ్రీ సుబ్బారెడ్డిగారు విస్తుపోయారు.

నేను : ఈ మల్లేశ్వరం పాముగుడి అంటే నాకు సరిగా అర్థం కాలేదండీ !

ముఖ్యమంత్రి : ఇది శివాలయం. అన్ని శివాలయాల్లో ఉన్నట్లే ఇక్కడ శివలింగం ఉంది. కాని ఒక పాము రోజూ 10–11 గం. ప్రాంతంలో ఆలయం సమీపంలో ఉన్న కోనేరులో స్నానంచేసి వచ్చి ఆ లింగాన్ని చుట్టుకుని ఉంటుంది. అందుకే ఆ గుడిని పాము గుడి అని పిలుస్తారు. నేను వెళ్లి వచ్చిన తరువాత ఆ గుడికి ఈ సౌకర్యం కల్పించాను. రెండవసారి నేను వెళ్లినప్పుడు సరిగ్గా ఆ సమయానికి పాము లింగము నుండి చుట్ట విప్పుకుని బయలు దేరుతూ ఉంటే, అందరం స్నానాని కని అనుకున్నాం. కాని, పాపం నాగరాజు స్నానానికి వెళ్లక నావైపు పాకి నా తొడ ఎక్కి కూర్చున్నాడు.

నేను : మరి మీకు భయం కాలేదా ?

ముఖ్యమంత్రి : కాలేదు. ఇంతకుముందు ఒకసారి పర్యటనలో ఒక బాబా ఒక పెద్ద పామును తెచ్చి పూలమాల వేసినట్లుగా నా మెళ్లో వేశాడు. నేనూ నిశ్చలంగా స్వీకరించాను. అందుకే అప్పుడు నాకు భయం కాలేదు. కాని, ఏదో ఆత్మీయత గోచరించింది ఆ పాము చేష్టలో.

నేను : హిందూ ముస్లిం యూనిటీ గూర్చి మీ అభిప్రాయం ఏమిటి ?

ముఖ్యమంత్రి : హిందూ–ముస్లిం యూనిటీలో పూర్తిగా విశ్వాసం ఉంది నాకు. ఆ విషయానికి వస్తే అన్ని మతాలు నాకు సమానమే. నేను ఎన్నోసార్లు దర్గాలకు వెళ్లాను, గురుద్వారాలు చూశాను, ముర్షద్‌లతో కలిశాను. అన్ని మతాలను గౌరవించే స్వభావం నాది.

నేను : పోలీసు యాక్షన్ తరువాత మారిన పరిస్థితులల్లో వారిపట్ల మీరు అవలంబించిన విధానం ఏమిటి ?

ముఖ్యమంత్రి: మానవతాదృష్టితోనే అప్పటి సమస్యలు పరిష్కరించాను. లూటీలో వారు ఆస్తులు, డబ్బు పోగొట్టు



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

కున్నప్పుడు ఊరూరు వెళ్లి వారికి హోదాన్ని కలిగించి పోగొట్టుకున్న వస్తువులు సాధ్యమైనంతవరకు సంపాదించి తిరిగి ఎవరివి వారికి అప్పగించే కార్యక్రమం చేపట్టాను.

నేను : అందుకే మీరంటే ముస్లిం వర్గాలకు కూడ అభిమానమే ! మీ దృష్టిలో ప్రజాస్వామ్యం అంటే ఏమిటి ?

ముఖ్యమంత్రి : ప్రతిపక్షా అందర్నీ కలుపుకొని పోవటమే ప్రజాస్వామ్యం. అందరి అభిప్రాయాలను గౌరవించి, అందరి విశ్వాసాన్ని చూరగొని వెంట తీసుకొని పోవటమే ప్రజాస్వామ్యం.

నేను : నిర్వచనం చాల బాగుందండి. అయితే మీ దృష్టిలో ప్రతిపక్షాలంటే?

ముఖ్యమంత్రి : నా దృష్టిలో ప్రజాస్వామ్యాభివృద్ధికి ప్రతిపక్షాలు గీటురాళ్ల వంటివి. అందుకే గౌరవిస్తాను. మా గవర్నమెంటులో ప్రతిపక్ష నాయకులకు మంత్రిస్థాయి కల్పించాం. అంతేకాదు డెప్యూటీ స్పీకరు పదవి వారికి వదిలిపెట్టడం అనే సంప్రదాయాన్ని ప్రారంభించాము.

నేను : మీరు **office timings** మారుస్తూ వుంటున్నారు? దీనివల్ల ఏమిటి ? ఎవరికీ లాభం ?

ముఖ్యమంత్రి : లాభం ఉంది కనుకనే నేను ఆలోచించాను. **Best part of the mornings** పనికి **devote** చేస్తే ఆ పనిలో **briskness** వస్తుంది. చకచకా పనులు చురుగ్గా సాగిపోతాయి. అన్ని దేశాలల్లో ఈ పద్ధతి అమలులో ఉంది. కేవలం మన దేశం గూర్చి ఆలోచించినా సరే, **office** లో పనిచేసే ఉద్యోగికి ఆఫీసే కాక ఇల్లు కూడా ఉంది కదా ! రెండు గంటల తరువాత తన ఇంటిపనులు చూసుకోవచ్చు. వృత్తిలో మెరుగులు దిద్దుకోవచ్చు, పై చదువులు చదువుకోవచ్చు, భార్యా బిడ్డలతో సాయంకాలం హాయిగా గడువవచ్చు.

నేను : క్షమించాలి. అడ్డొస్తున్నాను. అంత ఉదయం బస్సుల సౌకర్యం ఉంటుందా ? ఇంట్లో టిఫిన్ తినలేరు. మధ్యాహ్నం భోజనానికి వేళ దాటుతుంది. ఉదయం టిఫిన్ మాట అట్లా ఉంచి పాలు సమయానికి అందక కనీసం కాఫీనీళ్లయినా దొరకవు. కష్టమే కదా ?

ముఖ్యమంత్రి : ఆలోచిస్తే ఏ విషయమైనా అట్లాగే ఉంటుంది. ఒకసారి మార్పు అమల్లోకి వస్తే అన్ని సౌకర్యాలు వాటంతట అవే వస్తాయి. ఈ సౌకర్యాలన్నీ కల్పించిన తరువాతనే **timings** లో మార్పు చేస్తామన్నది. వలసిన సౌకర్యాలు ఉద్యోగులకు కల్పించడానికి నా ప్రభుత్వం వెనక్కు పోదు. **Canteen** బస్సుల ఏర్పాటు పెద్ద విశేషం కాదు. **Between 1 & 2 o'clock Tea break** కూడా తీసుకోవచ్చు.

నేను : మీరు కల్పిస్తామన్న సౌకర్యాలు లోభనీయంగానే ఉన్నాయి. మరొక్క విషయం. మీరు మన ప్రాచీన గ్రంథాల పునరుద్ధరణ విషయంలో ఏదో ప్రణాళిక తలపెట్టినట్లున్నారు ?

ముఖ్యమంత్రి : వేదమూలమైంది మన సంస్కృతి అని పెద్ద లందరూ అంటున్నారు. అయినప్పుడు, మన భారతీయ సంస్కృతి జీవించాలి అంటే, మన వారసత్వం తరతరాలకు సంక్రమించాలి అంటే ముఖ్యంగా మన వేద వాఙ్మయం పురాణేతిహాసాలు వెలుగులోకి రావాలి అని తోచింది. అయితే, ఈ వేద విద్య అందరికీ అందుబాటులో లేదు. అందుకే అందరికీ, పోనీ, కావలసినవాళ్లకైనా సుబోధంగా ఉండేందుకొరకు ఈ వాఙ్మయం అంతా సాధ్యమైనంతవరకు సరళమైన తెలుగు భాషలో పరివర్తనం కావాలని ఒక పథకాన్ని తలపెట్టాం.

నేను : మీ ఆలోచన ఎంతో మేలుగా ఉంది. మీరు తలపెట్టే ఆ పని కార్యరూపం పొందినట్లే భావించవచ్చు. క్షమించాలి. ఇక విసిగించను. ఈ ఒక్క సందేహం తీర్చండి.

ముఖ్యమంత్రి : ఒకటి అంటూనే ప్రశ్నల వర్షం కురిపిస్తున్నావు.

నేను : లేదు, లేదు, అది మీ ఓపికకూ, మంచితనానికీ నిదర్శనం. ఇదొక్కటే ఒకటి. సాధారణంగా చెన్నారెడ్డిగారు అంటే 'రంగీన్ మనిషి' అనే భావం లోకంలో ఉంది. మీ రేమంటారు ?

ముఖ్యమంత్రి : ఏమంటాను ? అవు నంటాను. రంగీన్ కాకపోతే నా దృష్టిలో మనిషే కాదు. ప్రతి పనిలో నేను నేర్పు కోరుతాను. నేర్పుతో చేసే ప్రతి పనిలో అందం ఉంటుంది; అలంకరణం ఉంటుంది. ఆ సొగసును సహృదయంతో చూసి ఆనందిస్తాను. ఎప్పుడూ నా చుట్టూవున్నవాళ్లు ఏడుస్తూ, దీనంగా ఉంటే నాకు ఇష్టం ఉండదు. ఉత్సాహమే శక్తి, నా దృష్టిలో ఉత్సాహమే సౌందర్యం. అందుకే చురుకుదనం నన్నాకర్షిస్తుంది. డబ్బును దుబారా చేసే గుణం



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

నాకు రుచించదు. కాని, మరీ సన్యాసినైతే, ఇహలోకపు చింతను మానినట్లు నటన నాకు అసహ్యం. అందుకే, వ్యక్తిగతంగా నేను ఈమురో మని ఉండక అలంకరణను కోరుతాను. మనస్సుకు, శరీరానికి హాయిని ఇచ్చే కొన్ని సుఖాలు పెళ్లైనంతలో కల్పించుకుని అనుభవిస్తే తప్పులేదు. సందేహం తీరినట్లేకదా ? ఇక చాలా సమాధానాలు ?

నేను : చాలు, చాలు. నిజానికి ఇంత చనువుగా మాట్లాడుతూ, ఇంత సమయం నాకు ఇస్తారని నేను అనుకోలేదు. నమస్కారం. సెలవు.

నాతో మాట్లాడినంతసేపూ తిరుతీరు పనులతో శతావధానం చేసినట్లున్న ఆ జాగృతికి, ఆ చురుకుదనానికి, ఆ వేపకు, ఎదుటివారి మాటకు వెంటనే రిపార్టీ ఇవరే ఆ సమయస్ఫూర్తికి, ఆ ధైర్యానికి, ఆ సహృదయతకు, నిజంగా ఆశ్చర్యపోయాను.

ఆంధ్రప్రదేశ ముఖ్యమంత్రి డాక్టర్ ఎం. చెన్నారెడ్డిగారి షష్టిపూర్తి ఉత్సవ సందర్భంలో ఈ సంభాషణను ప్రచురించడానికి ఎంతో ఆనందిస్తున్నాను.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# అన్నయ్యా! చెన్నయ్యా!

తిరుమల శ్రీనివాసాచార్య

సిరిమల్లెం సిరిపురమున
విరిసిన చెన్నయ్యా!
వెలుగు సుగంధాలు చల్లు
తెలుగుల అన్నయ్యా!
మంటిని తోసేసుక పై
మింటిదాక దూసుకుంటు
ఎదుగుతొ నీ గుణ మన్నది
ఇంటిపేరె చెపుతున్నది.
పసితనాన మట్టికొరకు
పట్టిన నీ పిడికిటనే
చెడుతనాన్ని పిపికేసే
పిడుగుబలం విడిదిసేసె.
పాలను జ్వాలను సమంగ
పట్టుకొనగ చేసిన నీ
పదములందె తోచె నెన్నొ
పదవులందు చైతన్యం.
బడుల్లో చదివే తోటి
బుడుతలతో నీ వాడిన
క్షణమందే తెలిసె నీవు
సహజ సమర యోధుడ వని.
నిజానికి వ్యతిరేకయిన
నిజాం బూజుగుండె ఎదుట
'సివిలు సర్జ ను'గా గాక
సింహగర్జ నగా నిలిచి
ఘోషించిన సెక్కు సభల
భాషించిన వేళ తెలిసె
వీర తెలంగాణ కన్న
శూరుడ వని ధీరుడ వని.
తనువుకన్న అతిముఖ్యం
మనసును మర్మం గ్రహించి
మందులు త్యజించి నాయక
మణిగా భాసింపనెంచి
సింగంలా రాజకీయ
రంగంలో దూకినావు
భంగపడక బహు పదవీ
శృంగాలను ప్రాకినావు.

ఆంధ్రదేశ పరిధి దాటి
కేంద్ర మంత్రిపదవి సీటి
న ఏకైక తెలంగాణ
నాయక! జోహార్లు నీకు.
సిరిపురమ్మునుండి కదలి
కరిపురమును చేరిన నీ
ప్రతిభాసాహసమతులకు
పరిమితులున్నవె ఎన్నగ.
సంద్రంలా రౌద్రవీర
శైవంలా తరగెత్తుతు
నీవు కంఠమెత్త సభా
నిఖిలజనం శివాలెత్తు.
భాషలోన నీదు కంఠ
ఘోషలోన ఉన్నదిలే
నీటిని నిప్పుగ మార్చే
సాటిలేని మేటిగుణం.
పల్లెరు గాయల కంచెల
మల్లెలు పూయిస్తూనే
మరుభూముల సస్యశ్యా
మల సీమలు చేస్తూనే
ప్రతి రంగంలో బంగరు
ప్రగతిని పండించు కృషీ
వలుడ వనే ముఖ్యమంత్రి
పదవి నిన్ను వరించింది.
కండబలం గుండెబలం
రెండూ సమపాళ్లల్లో
కలిగిన రసికాగ్రణీ! నీ
వెలుగు పనులు సాగనీ.
అరువదేళ్లు మరో మారు
అరువదేళ్లు స్వచ్ఛంగా
ప్రతిఫలింప మాదు కలలు
బ్రతుకయ్యా పచ్చంగా
ఇంతకన్న మిన్న కవిగ
ఏమి కోరుకొందును నా
అంతరంగ గీత మిదీ
అన్నయ్యా! చెన్నయ్యా!



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# దీధితి

శారదా అశోకవర్ధన్

మాటేమో కరుకు
మనిషెంతో చురుకు
ఒడుపున్నది వలసినంత
దడుపులేదు ఇసుమంత
ఆవేశం అభినివేశం
అతని నేస్తాలు
ఆలోచన అన్వేషణ
అతని మార్గాలు !
వాద మేదైనా వాక్కుతో గెలిపించు
వాద మేదైనా ధ్యేయమును సాధించు
ప్రజల నాడి తెలిసి పాలించు భూపతి
జనుల నాకట్టుకొను సవ్యసాచి
రాజకీయాన్ని ఉగ్గుపాలతో రంగరించి, తాగి
జీర్ణించుకున్న రాజర్షి
ఎట్టి పరిస్థితిలోనూ చలించని
చెక్కుచెదరని ఉక్కుమనిషి
నిజాన్ని సమర్థించడం కోసం
నైజామునే ఎదురుకున్న నిర్భయుడు
తలచినది సాధించగల సమర్థుడు
అదృష్టదేవత అభిమానాన్ని సదా
చూరగొన్న అదృష్టవంతుడు
నమ్మినవారికి రక్షకు డతడు
కార్యశూరులకు దక్షత అతడు
ప్రగతి వెలుగుల దీధితి
ప్రజల నేలు కిరీటి
మరి ఎవ్వరో కా దతడు—
మర్రి చెన్నారెడ్డి
మన ముఖ్యమంత్రి.

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# ఆశీఃప్రాంజలి

భారతి

శ్రీశైల మల్లేశు సిగమల్లి జాబిల్లి చల్ల వెల్గులు మీకు సౌఖ్య మొసగు
పద్మావతీనాథ పరిఫుల్ల వదనాబ్జ కాంతిరేఖలు మీకు కలిమి నొసగు
దక్షవాటీ భీమ తరళ కృపాఝరీ శీలనములు మీకు కీర్తి నొసగు
కనకదుర్గాంబికా ఘనతర ప్రేమార్ద్ర వీక్షణమ్ములు మీకు విజయ మొసగు
వేద గాయత్రి మహిమ ప్రసాదనములు మీకు నాయురారోగ్య సమృద్ధి నొసగు
క్రమ 'మద్రి' వంశార్ణవ కౌముదీశ! సత్యవినుత వెన్నారెడ్డి సచివరేణ్య!

నీకున్ దీటగువాడు తెల్గు భువిలో నే డెందు లేడన్నచో
మాకున్ వింతగఁ దోచ దింతయును సామాన్య ప్రజా పాలనా
ధీ కౌశల్యము నీకు దక్కినది సందేహంబు లే దిందునన్
సాకల్యాంచిత శక్తి వైభవఖనీ! సత్కీర్తి భాస్వన్మణీ!

తెలుగు వసుంధరన్ బొడమి ధీ విభవంబున నాయకాళి యం
దలరితి వాక్క మేలిమణివై, తొలిమండియు రాజకీయ నే
త్రలఁ దలమానికంబవయి దక్షతఁ బొల్చిన రెడ్డిముఖ్య! నీ
విలసదమానవైభవము వేడ్క ఘటింపదె మాకు నెంతయున్.

శ్రీశైలేశ్వర పాదకంజ యుగళిన్ సేవింపుచున్ భక్తి నీ
దేశారాధన తత్పరత్వమున నెంతేఁ ప్రీతి సంధిల్లగన్
లేశంబైనను విశ్రమింపకయె యే లీలం గృషిం జేసి యీ
ప్రాశస్త్యంబు వహింపఁ జాలితివొ! సంభావింప చిత్రంబగున్.

ఆదిని రాజరాజ తుదియందు మహాత్ముడు కృష్ణ రాయలున్
ప్రోది యొనర్పగా నిఖిల భూషణ భూషిత నిర్మలాంగియై
మేదిని సత్కవిత్వ రస మేటి యశంబున బొల్చెఁ; దద్విధిన్
ప్రోది యొనర్పు సత్కవులఁ బోషణ సేయుచు నాంధ్ర భారతిన్.

అరువదియేండ్లు జీవన మహార్ణవ మీదిన మిత్రవర్య! నీ
సరసగుణంబు నెంచి యిటు సత్కవి పండిత బంధు మిత్రులున్
కర మనురక్తి గూర్చు—అభినందన సింధు తరంగమాలికా
స్ఫురదనురాగడోలిక ప్రఫుల్ల మనోహర లీల నూగుమా!

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# మంగళాశాసనములు

'విరించి'

---

శ్రీ చెన్నారెడ్డి వర్యా!
నీ చరితము, నీ చతురత, నీ సుగుణంబుల్
దాచిన దాగని కాంతులు
పూచిన పుష్పంబు షష్టిపూర్త్యుత్సవమున్.

ఏండ్లు పూండ్లైన వ్యాపించు, నింపు గొలుపు
మఱ్ఱి వృక్షంబు మాడ్కి నీ మంచితనము
ధర్మ కర్మైక పూతమై తనరవలయు
నరువదేండ్లింక నరువదై యలరవలయు.

సప్త సంతానములు పొంది షష్టిపూర్తి
ఉత్సవంబున కవిపండితోత్తములను
అర్హతానర్హతలు గని, ఆదరించి
సన్నుగా గొను మాశీస్సు చెన్నారెడ్డి!

భారతమాత గర్భమున భాస్కరుభంగి జనించి నీదివి
స్ఫార యశోవిలాసములు తారసిలంగ మెలంగుచుండి సం
స్కార మనీషివై నిలిచి, షష్టి శరత్తులు దాటె నింక బం
గారపు జీవికం గడుపగావలె సుశ్రీ కులావతంసమా!

ధనలక్ష్మి వరియించి కనకంబు గురిపించి, సంసార చక్రంబు సాకవలయు
ధాన్యలక్ష్మి వరించి దండిగా పండించి, నిండుగా గరిసెలు నింపవలయు
ఉద్యోగు లెప్పుడు సద్యోగమున నుండి, నీ కనుసన్నల నిలువవలయు
నాయకత్వ మెపుడు న్యాయంబుగా నుండి, జనరంజకముగాను మనగవలయు
సతియును, సుతులును సుగుణులై సతతముగను సర్వతోభద్ర మూర్తులై సాగవలయు
షష్టిపూర్త్యుత్సవోత్సాహ సమయమందు కవి'విరించి'హృదయసీమ కరిగి పొంగ.

శస్తముగ జేయు మంగళాశాసనములు
అందుకొను చెన్నారెడ్డి పసందుగాను
"అభ్యుదయమస్తు విజయోస్తు హర్షమస్తు
విభవమస్తు శోభోస్తు దిగ్విజయమస్తు."



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

వివిధ భావ భంగిమలలో డా॥ రెడ్డిగారు



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# పునర్జన్మ

కె. వి. ఆర్. ఎస్. పద్మనాభరాజు

---

ఆరోజు (డిసెంబరు 17, 1978) అఖిలాంధ్ర ప్రజలకూ మరపురాని రోజు.

మరువలేని రోజు !

త్రిలింగ దేశంలోని దేవాలయాల ప్రాంగణాలలో ఘంటారావాలు వినిపించాయి.

చర్చీల గంటలు మ్రోగాయి.

ఆరోజే మసీదుల్లో, చర్చీలలో, దేవాలయాలలో ప్రార్థనలు జరిగాయి.

ఆరోజే అఖిలాంధ్ర ప్రజల ప్రియతమ నాయకుడు డాక్టరు మర్రి చెన్నారెడ్డి పునర్జన్మ ఎత్తిన రోజు.

ఆరోజు హైదరాబాద్ నగరం ఇంకా పూర్తిగా నిద్ర లేవలేదు. బద్ధకంగా కళ్ళు తెరిచింది. మంచు పొరల చాటున ఉల్లిపొరలాంటి తెల్లటి నైలెక్స్ ఆచ్ఛాదనంలో నిద్రనుంచి బద్ధకంగా అప్పుడే కళ్ళు తెరిచిన అందమైన ప్రౌఢ యువతిలా ఉన్నది హైదరాబాద్ నగరం.

అయినా బేగంపేట విమానాశ్రయం జనంతో కలకలంగా ఉన్నది. మద్రాసు నుండి ఢిల్లీకి పోవలసిన బోయింగ్ విమానం సమయానికి వచ్చి, మంచు ముసుగు కప్పుకున్న నగరం కనిపించక తిరిగి మద్రాసు వెళ్ళిపోయింది.

ఆ విమానంలో ఉన్న మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ యం. జి. రామచంద్రన్, విద్యుత్ శాఖామంత్రి శ్రీ యస్. రామచంద్రన్ విసుగుతో ప్రయాణం విరమించుకొని విమానం దిగి వెళ్ళిపోయారు.

మన ముఖ్యమంత్రి డా. చెన్నారెడ్డిగారు కూడా "ఇంత ఆలస్యంగా వెళ్ళి ప్రయోజనం ఏమిటి?" అనుకొని ప్రయాణం విరమించుకోవా లనుకున్నారు. కాని, మళ్ళీ బయలుదేరారు. విమానం మూడు గంటలు ఆలస్యంగా బయలుదేరింది.

ముఖ్యమంత్రిగారికి వీడ్కోలు ఇవ్వడానికి అధికారులూ, అనధికారులూ ఎందరో విమానాశ్రయంలో ఉన్నారు. ముఖ్యమంత్రిగారితోపాటు ఆరోజు స్టేట్ చీఫ్ సెక్రెటరీ, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు కూడా ఢిల్లీ వెళ్లవలసి ఉన్నది.

ఒక్కొక్కరే వెళ్ళి విమానం ఎక్కుతున్నారు. బంధుమిత్రులు దూరంగా నిల్చుని చూస్తున్నారు. ముఖ్యమంత్రిగారు చీఫ్ సెక్రెటరీ, ఐ. జి. పి. లతో సహా వెళ్ళి విమానంలో ఆసీనులు అయ్యారు. ఉదయం ఏడున్నరకు బయలుదేరవలసిన బోయింగ్ 10–32 గంటలకు బయలుదేరింది.

* * * *

బోయింగ్ 737 విమానం తన ఒడిలో ముఖ్యమంత్రిగారితో సహా 126 మందిని నింపుకొని రన్‌వే మీద పరుగులుతీస్తూ ఉన్నది.

ఎయిర్ పోర్టులో ఉన్నవారు మొదలు దాని కనుచూపుమేరలో కన్పించినంతవరకు చూస్తూ నిల్చున్నారు. కనుచూపు మరుగైంది. విమానం రన్‌వే దాటింది.

కాని ఎగరదేం ?

కన్పించదేం ?

అందరి మనస్సుల్లో క్షణకాలం కుశంక తల ఎత్తింది.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

లేదు! లేదు! విమానానికి ఏమీ కాలేదు. ఏ ప్రమాదమూ లేదు. అనుకుంటూ తమ మనసులను తామే ఓదార్చుకుంటున్నారు. అంతా అరక్షణం. దూరంనుంచి పొగలు కన్పించాయి. దిక్కులు మార్మ్రోగాయి.

అందరూ యాంత్రికంగా పరుగులు తీశారు.

ఆ విమానంలో ఉన్నవారి విషయం— మూడు గంటలు ఆలస్యంగా బయలుదేరుతున్న విమానంలో ప్రయాణీకులు విసుగ్గా కూర్చుని ఉన్నారు. పత్రికలు కూడా చదవాలనిపించడంలేదు. అంతలో "బొంబాయి వెళ్ళవలసిన ప్యాసింజరు ఎవరు ?" అంటూ కమాండర్ జోసెఫ్ అడిగారు. అందరూ, అసలే విసుగ్గా ఉన్నారేమో, తాము ఎక్కింది బొంబాయి ప్లేనా లేక ఢిల్లీ ప్లేనా అన్న మీమాంసలో పడ్డారు కొందరు. వెంటనే ఒక వ్యక్తి లేచి నిల్చున్నారు. అందరూ అంత విసుగూ మర్చిపోయి ఘొల్లున నవ్వారు. అతన్ని దింపివేశారు.

ఒక ఎయిర్ హోస్టెస్ చెవులలో పెట్టుకొనే దూది ప్యాకెట్లూ, స్వీట్లూ పంచుతున్నది. మరో ఆమె విమానం నడిపేవారి పేర్లూ, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి చెబుతూ ఉన్నది. ఆలస్యానికి కారణం కూడా చెప్పింది. ఎగరావటి ఎప్పుడైనా అనుకోనప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి చెబుతూ ఉన్నది.

మరుక్షణంలో విమానానికి బ్రేకు వేశా రనుకున్నారు. మరో క్షణంలో బ్రహ్మాండం బద్దలైనంత శబ్దం. పదునుకు కట్టుకున్న బెల్టులు విప్పుకున్నారో! సీట్లు విరుగుతున్నాయో! నిప్పులూ, పొగలూ పయనమూ లోలో అయినట్టుగా అయింది. మంటలు. విమానం మృత్యుద్వారంగా మారింది.

విమానం ఎక్కడానికి అరగంట నిమిషాలు తీసుకున్న ప్రయాణీకులు మూడు నిమిషాల్లో కిందకు దూకేశారు. మృత్యుదేవత కబంధ హస్తాలనుంచి విలపిస్తుంటూ కమర్జెన్సీ ద్వారాలో బయటకు వచ్చారు.

ప్రజలు రేడియోల ముందు ఆతృతగా కూర్చుని వింటున్నారు. ముఖ్యమంత్రిగారితోపాటు విమానంలో ఉన్నవారంతా సురక్షితంగా ఉన్నారని తెలుసుకొని తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు.

రెక్కాడితే గాని డొక్కాడని శ్రమజీవుల బిడ్డలు గడ్డి కోసుకుంటూ ఆ ప్రాంతంలో ఉండటంతో విమాన ప్రమాదంలో మరణించారని వార్త వినిపించింది రేడియో.

• • • •

విమానం వెళ్ళిపోయిం దనుకొని విమానాశ్రయం నుంచి ఇంటికి వెళ్ళిపోతూ డా. రెడ్డిగారి పెద్ద కుమారుడు శ్రీ రవి ఆకాశంవైపు చూశాడు. విమానం కనిపించలేదు. కాని, అల్లంత దూరంలో దట్టమైన పొగ ఆకాశాన్నంటుకోవటం చూశాడు. గుండె గుబేలు మంటుండగా అక్కడారిన అగ్నిఅర్పడానికి పరుగెత్తి, అగ్నిమాపక దళంతోపాటు దూసుకొని పోయాడు. ఆయన ప్రగాఢ ప్రార్థనాబలం వలన అప్పుడు సురక్షితంగా విమానం నుంచి దూకి చిరునవ్వుతో పుష్పగుచ్ఛము స్వీకరిస్తున్న తండ్రిని చూడగానే వెంట కౌగిలిలో ఆనందబాష్పధారలు అయిపోయాడు. అప్పుడు ఢిల్లీలో ఉన్న ఆయన తల్లి కౌటిల్యము తీరుబడిగ అతన్ని బొట్టను పెట్టుకున్నది. ఇంటిలో ఉన్నవారందరూ, ఇంటిలో వెలసిన వెంకటేశ్వరుణ్ణి ఆనందబాష్పాలతో ఆరాధించారు.

• • • •

మానవుడు ఆలోచించడం నేర్చినప్పటి నుంచి, మానవాతీతమైన ఏ శక్తిని నమ్ముతున్నాడు. హేతువాదులు పదార్థం కొన్ని విచిత్రమైన సంఘటనలను చూసినప్పుడు "మానవాతీతమైన శక్తి అంటూ ఒకటి ఉన్నదా ?" అనే సందేహంలో పడతారు. దూరంగా, ఆకాశంలో పిట్టలా ఎగిరే విమానాన్ని మాత్రం చూసి ఆనందించే క్షణంలో పుట్టిన బిడ్డలు, మరి ఈ విమాన ప్రమాదంలో మరణించడం ఏమిటి ? అంత భయంకరమైన ప్రమాదం నుంచి, అగ్నిగోళం నుంచి, మృత్యుద్వారం నుంచి, రెండు మూడు నిముషాల్లో 120 మంది సురక్షితంగా బయటపడటం ఏమిటి ?

అలోకా—

తమ ప్రియతమ నాయకుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టరు మర్రి చెన్నారెడ్డిగారు అన్ని వసంతాలు చూసి షష్టిపూర్తికి సిద్ధమౌతున్న తరుణంలో అతిపెద్ద ప్రమాదంలో దిగ్భ్రాంతులను చేసి విమాన ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడి, పునర్జన్మ పొందిన సందర్భాన్ని పురస్కరించుకొని, ఆసేతాంధ్ర ప్రజలూ తమ తమ భక్తి


CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

దైవాల ఎదుట మోకరిల్లి భక్తి పారవశ్యంతో తమ సంతోషాన్ని తెలుపుకున్న ఆ రోజును, మనం ఎలా విస్మరించగలము ? చరిత్రలో నిలిచిపోయే రోజు అది !

ఆర్ష సంప్రదాయం ప్రకారం అరవై సంవత్సరాలు నిండిన వ్యక్తికి షష్టిపూర్తి వేడుకలు జరిపించి, శుభాకాంక్షలను తెలియజేస్తారు.

అరవై సంవత్సరాలు నిండిన మానవుడు పరిపూర్ణ మానవుడు అవుతాడని నమ్మకం.

సిద్ధిపొందిన మానవ జీవితానికి స్మృతిగా కొడుకులూ, కోడళ్లూ, అల్లుళ్లూ, బంధుమిత్రులూ, షష్టిపూర్తి దంపతులను పీటలమీద ఆసీనుల్ని చేస్తారు. నూతన వధూవరులకు మళ్లీ పెళ్లి వేడుకలతో వారిని ముంచెత్తుతారు. ఇది మన తెలుగువారి సంప్రదాయం.

ఆరోజునుంచి కొత్త జీవితానికి నాంది ఏర్పడుతుందని విశ్వాసం. అనగా అది పునర్జన్మగా భావించబడుతుంది.

డా. చెన్నారెడ్డిగారు, విమాన ప్రమాదం నుంచి బయటపడి పునర్జన్మను ఎత్తి, షష్టిపూర్తి మహోత్సవాన్ని జరుపుకోవడం అపూర్వం !

ఆనందకరం !

హరిజన గిరిజన, దీనజనోద్ధరణకు, నవసమాజ స్థాపనకు, రాష్ట్ర అభ్యున్నతికి దీక్ష పూనిన మన ప్రియతమ నాయకుడు అంత ప్రమాదం నుంచి బయటపడటం కేవలం భగవంతుని ప్రసాదంగానే భావించవలెను.

ఆయన ఇంకెన్నో గొప్ప కార్యాలను సాధించవలసి ఉన్నది.

అందుకే దీక్షాదక్షతతో ప్రజాసేవకు పునరంకితం అవుతున్న ఈ శుభసమయంలో, తెలుగు ప్రజ అందరూ సమైక్యతతో, మన నాయకునికి అండగా నిలిచి, వారి కృషికి చేయూత నిచ్చి, రాష్ట్ర అభ్యుదయానికి తోడుపడవలసిందిగా కోరుతున్నాను.

ఈ శుభతరుణంలో రెడ్డిగారికి పూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించవలసిందిగా భగవంతుని ప్రార్థిస్తున్నాను.

ఇవే నా హృదయపూర్వక శుభాకాంక్షలు !



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# అభినందన చందనము

కలుగోట్ల విజయాత్రేయ

ఆంధ్ర సామ్రాజ్య మహామాత్య శేఖరా ! ఆనంద పూర్ణ పూర్ణాయురస్తు
ఆజన్మ సహజ నాయక కళా విభ్రాజి శాంతి సౌభాగ్య విస్తారమస్తు
సుకుమార దరహాస శోభా ప్రవర్ధన అతిలోక ధౌత విఖ్యాతిరస్తు
మాకంద మకరంద మధుర వాగ్భూషణ రాగభోగైశ్వర్య యోగమస్తు
మర్రి వంశాబ్ధి సంభూత మాన్యచంద్ర !
చారుమూర్తి ! చెన్నారెడ్డి ధీరకీర్తి
రాజరాజేశ్వరీ కృపారమ్యలహరి
వేవిధమ్ముల నిన్ను దీవించుగాక.

విరిసిన రాజకీయ జయవీచి మరీచుల తూగుతోన నో
యరువది మాధుమంతములు హాయిగ తీయగ పల్లవించె—నూ
టరువది పూయుగాక మహితాంధ్రధరాభరణా ! జయోస్తు ! మీ
వరువు ప్రతిష్ఠ పెంపు సుమవాహినిగా ప్రవహించి మించుతన్.

ఏ మహా మంత్రుల శ్యామసుందర మూర్తి తెలుగురాలచ్చి క్రొవ్వలపు మలుపు
ఏ మహామంత్రుల హేమమందిర వీధి లలితకళలకు విలాసవాటి
ఏ మహామంత్రుల హృదయ సౌహార్దమ్ము పీడిత ప్రజకు దీవెనల వాన
ఏ మహామంత్రుల హిమసుధాలోకన మధురాంధ్ర జగతికి మలయవీచి
ఆ మహోదార కరుణా రసాల వాల
సరస సాహిత్య సంస్కార సాంద్ర తరల
హార నీహార కుంద మందార కీర్తి
వీరమూర్తి ! చెన్నారెడ్డి ! విజయమగుత.
ఉన్నత షష్టిపూర్తి విభవోత్సవ భవ్య శుభోదయాన వి
ద్యున్నత రీతి న్యగ్రరథు నుద్ధతికిన్ దగు శాంతి సల్పు ట
భ్యున్నత రాజమార్గము విభూ ! అది కోవిదు లాచరించు సం
పన్నత సాగిపోయినది—భావి జగద్ధితులై వెలుంగుడీ.
చిరకాలము వర్ధిల్లుము
పరిణత ఘన రాజకీయ వైభవధునివై
కరుణా కందళ హృదయా !
స్థిర యశమున ప్రజల సేవ చెన్నారెడ్డీ !



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# అభ్యుదయ పరంపరాభివృద్ధిగా...

ఇ. ఎస్. జోషి

డాక్టర్ చెన్నారెడ్డిగారి షష్ట్యబ్ది పూర్తి 1979వ సం. జనవరి, 11వ తేదీతో సరియగు చాంద్రమాన శ్రీ కాళయుక్తి నామ సంవత్సర పుష్యమాస శుక్లపక్ష త్రయోదశి గురువారము ఉదయం 8.33 వరకుండును. జన్మ తిథియైన త్రయోదశితోపాటు జన్మనక్షత్ర మగు మృగశిర సూర్యోదయాది నుండి సాయంకాలము నాలుగు గంటల వరకున్నది. బ్రహ్మనామ యోగము తైతులకరణము ఉన్నవి.

**మనుధర్మవర్తి**

మనుధర్మము ననుసరించి, జన్మించిన మాసమందు వచ్చు జన్మనక్షత్రమునే ప్రమాణముగా స్వీకరించి, అట్టి జన్మ దినమందు ఉత్సవములు, ఆయుష్యహోమము, యజ్ఞయాగాది క్రతువులు, బ్రాహ్మణసమారాధనలు, బ్రాహ్మణాశీర్వాదములు, దైవదర్శనము, పుణ్యపురుషుల దర్శనము, దీవనలు, పెద్దల ఆశీస్సులు మొదలగునవి యథావిధిగా జరుపుకొనవలయునని యున్నది.

డాక్టరు చెన్నారెడ్డిగారు, సత్యధర్మములను పాటించు మహావ్యక్తి గనుక ఇటువంటి ఆయుష్య హోమము మొదలగువానిని 1957 నుండి ప్రారంభించినాము. అంతకు పూర్వము కూడ, వారి పుట్టిన తేదియైన 13–1–1919 ననుసరించి ప్రతి జనవరి 13వ తేదీన గృహమందు పూజలు, దానధర్మములు, దేవాలయములందు పూజలు చేయుట మొదలగునవి జరుగుచుండెడివి. కాని, 13–1–1958 నాటి వారి జన్మదినమునకు ఉత్తరాయణ పుణ్యకాల ప్రవేశము జోడించి, ఆయుష్యహోమము, పూజలు, బ్రాహ్మణ పూజ, భోజనాదులు, దానధర్మాదులు యథావిధిగా జరుపుట ఇత్యాదులుండెడివి. తర్వాత మాకు శాస్త్ర పరిచయమువలన చాంద్రమానమందు ప్రతి సంవత్సరము వచ్చే జన్మ మాస మందలి జన్మ నక్షత్రమందే, పై శుభకార్యములు జరుపుట ఉత్తమమని తెలిసిన తదుపరి, పై విధముగా జన్మమాస మైన పుష్యమాసమందు వచ్చు మృగశిరా నక్షత్రమునే ప్రమాణముగా తీసికొని, ఆయుష్యహోమము, పూజలు, బ్రాహ్మణులకు దానధర్మములు, వారి ఆశీర్వాదములు, సాయంకాలమున దేవ దర్శనము, పూజలు, పుణ్యపురుషుల దర్శనము, పుణ్యక్షేత్రములైన నైమిశారణ్యము మొదలగు పుణ్యక్షేత్రముల దర్శనము, ఆ రాత్రి అచ్చట నిదురజేయుట, అచ్చట పుణ్యాత్మురాలైన ఆనందమయి మాత దర్శనము జేసి ఆ తల్లి ఆశీస్సు లందుట—ఇటువంటి ఉదాహరణలు ఎన్నో. వీరి జీవితముతో పెనవేసుకొని యున్నది దైవభక్తి. ఈవిధముగా 21 సంవత్సరములు మహోత్తరముగా వెలుగు దివిటీలకు తావియగ అవ్యయముగా సాగిపోయినవి. వీరి సన్నిధిలో దైవికముగా పాల్గొను మహాభాగ్యము నాకు కలిగియున్నది.

తుదకు, ఆ పరమేశ్వరి అనుగ్రహము వలన, ఆంధ్ర ప్రజల చిరకాల వాంఛితము ఫలించినట్లు, వారు ఆంధ్ర ప్రదేశమునకు ముఖ్యమంత్రి అయినారు. ఈ కాలమందే వారి షష్ట్యబ్దిపూర్తి ఉత్సవములు రావడము నిజముగా ఆ పరమేశ్వరి దయ. ఇందుల కా తల్లిని ఎన్ని వేల నోళ్ల పొగడవలయునో తెలియకున్నది. ఇది యొక మహా శుభోదయ కాలము. వారిని గురించి వ్రాయు మహానుభావు లెందరో కలరు.

డా. చెన్నారెడ్డిగారికిని నాకును 27–3–1953 నుండి ఆత్మీయ సంబంధము సాగుచున్నది. నేను ఉన్నన్నాళ్లు ఇది సాగుచునే యుండును. కావున, ఈ మహావ్యక్తి శుభసమయమున వారిని గురించి, వారి సంప్రదాయమును గురించి ముఖ్యమైనవి రెండు మాటలైన చెప్పవలయును. ఆ రెండు మాటలు— ఏలాటి అరమరిక, దాపరికము లేక మనసు విప్పి చెపుతాను.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

## మూర్తీభవించిన మానవతామూర్తి

వారి ఇంటిపేరు మర్రి. మర్రిని మరువనివా రుండరు. అటులనే మర్రి విత్తనము చాలమంది చూచియే యుందురు. మర్రి విత్తనమందు దాగియుండే మర్రి వృక్ష మెంత మహా వృక్షమో, అటులనే వారి హృదయపంజరములో దాగియుండు శక్తి సామర్థ్యములు, అంతులేని ఆత్మవిశ్వాసము, అనన్యములు; అప్రమత్తములు. అవి సమయానుకూలముగా— సుందరకాండ యందలి రామదూత ఆంజనేయుని కార్యదీక్షను, శక్తి సామర్థ్యములను గుర్తుకు తెచ్చుచుండును. కార్యదీక్షలో వీరిని మెచ్చియే ఇతరులను మెచ్చవలసి యుండును. ఒక్క మాటలో చెప్పవలసి వచ్చిన—వారి హృదయాంతరాళమున అచంచలమైన కార్యదీక్ష, అనన్యమైన ఆత్మవిశ్వాసము, ధైర్యస్థైర్య సాహసములు ప్రతిష్ఠించబడి యున్నవి.

తెలంగాణా ఉద్యమములో ఎన్నియో క్లిష్ట పరిస్థితులు తలెత్తినవి. కాని, ఆ పోరాటములో గన్నులు, బాంబులు, రాళ్ళు మొదలగు వాని ప్రయోగములందుగూడ వా రెన్నడును జంకలేదు, బెదురలేదు, ఘనులైన అధైర్యము ప్రకటించిన సమయము లేదు. సత్యమును దైవాభీష్టముగా భావించుచు తన కర్తవ్యమును తాను నిర్విరామముగా ఎదురు బెదురులు లేక తెలివితేటలతో సాగించు మహా కర్మయోగి, ఘనహృదయ వ్యక్తి డాక్టర్ చెన్నారెడ్డిగారు. వారికి వారే సాటి.

వారు అత్యంత ఆత్మవిశ్వాసముతో, సహజోజ్జ్వలమైన భావ పరంపరలను సందర్భానుసారముగా ప్రకటించి మానవులను ఆశ్చర్యపరచు మహామేధావియై, శీలియై వెలుగొందుచుందురు.

## ఆశ్రిత కల్పవృక్షము

చీకటిలో నున్న నేను 1953 వ సం. మార్చి 27 వ తేదిన ప్రప్రథమముగ ఈ మహానుభావుని వెలుగు చూడ గల్గితిని. ఏ తెలుపూ తెలియని బీద యువకుడను సామాన్య జ్యోతిష్యుడనైన నన్ను వా రెంతో ఆదరాభిమానములతో చూచి, నన్ను నా కుటుంబమును కాపాడి పోషించుచున్నారు. ఈ దిన మేమైనా గౌరవ మర్యాదలు నాకు జరుగుచున్న వన్నచో అన్నిటికిని వారిదే దయను. ఇద్యాది బహిరంగ సత్యము. వారి కుటుంబ సఖ్యంతోపాటు మెలగుట, పండితులు, శాస్త్రజ్ఞులు, వేద శాస్త్ర పారంగతులైన ఘనాపాఠీలు, భక్తులు మొదలగువారితో సాహచర్యము కలుగుట, ఒక పండితుడుగా నేను గౌరవ మర్యాదలం బడయుట ఇది యంతయు వారి భాగ్యమే. వారే నా కుటుంబమునకు తండ్రి; అమ్మగారే తల్లి. ఈ భావను నా మాతృమూర్తి (86 సంవత్సరముల వృద్ధురాలు) ఎల్లప్పుడు అమెను చూడవచ్చిన వారందరితో చెప్పుకొనుచుండును. ఆ కాలపు పెద్దల కృతజ్ఞతల కరువు లుండవు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డిగారు పాలసముద్రము వంటి వారు, వారి ధర్మపత్ని పవిత్రదేవిగారు, ధర్మపత్ని అంటే, ధర్మపత్నియే. అందుకు వేరే నిర్వచనము పనిలేదు. ఆ తల్లి కరుణయే నన్నింత చేసినది. ఆశ్రయించినవారిని ఆదరించు మహా కల్పవృక్షము.

నేను సామాన్యమైన ఒక బోయ (వాల్మీకి) తెగకు చెందినవాడనని తెలిసి కూడ యేవిధమైన మార్పు లేక ఇంత ఎక్కువ మక్కువగా చూచుచున్నారు. కులతత్వమువలన నేను వారి దగ్గర యుండుట సహించుకొనలేనివారు కొంద రుండ వచ్చును. కులతత్వము పెరిగిపోవుచున్న కాలములో ఇటువంటివి సహజమే. కాని, వీని నన్నిటికి అతీతులై ఆత్మశక్తి తత్పరులై అందరిని సమముగా జూచు గొప్ప మహాపురుషులలో వీరొకరు. ఈ కలికాలమందు దిట్టి రాజకీయ ప్రతిష్ఠను గలిగిన గొప్ప వ్యక్తి దగ్గర ఇన్ని సుగుణములు దాగియుండుట యొక దైవాంశమే. అందువలననే ప్రకృత్యానుసారముగా వారి కెన్ని అపాయములు, ఆపదలు, ప్రమాదములు సంభవించినను, ఆ పరమేశ్వరి తన యొడిలో పెంచుకొన్న ముద్దుబిడ్డవలె వారిని కాపాడుచున్నది.

## మూడు పూవులు : ఆరు కాయలు

ఈ పుణ్యదంపతుల శుభ సంతానము శ్రీ రవీంద్రా రెడ్డిగారు, శ్రీ శశిధరరెడ్డిగారు, సౌభాగ్యవతి శ్రీమతి వసుధాదేవి. ఏ దర్పములు లేక వినయసంపత్తితో, దైవభక్తితో, ధర్మబుద్ధితో మెలగుదురు. తల్లిదండ్రుల ఆజ్ఞాపాలనలో, శ్రద్ధాభక్తులతో సదా నిమగ్నులై యుందురు. వారి కోడళ్ళు శ్రీమతి సరళమ్మ (రవీంద్రారెడ్డి), శ్రీమతి ఇందిరమ్మ (శశిధర రెడ్డి) వారి వారి పనులను తీర్చిదిద్దుచుందురు. వారి అల్లుడు శ్రీ సుదర్శనరెడ్డి. వారిని అందరు ముద్దు పేరుతో 'రామన్నా' అని పిలుచుచుందురు. రామన్న మేలిమి బంగారము వంటి అల్లుడు. ఒక్కమాటలో చెప్పవలెనంటే తామరాకు వంటివాడు. వారి మనుమలు—చిరంజీవి కృష్ణ, చిరంజీవి ఆదిత్యం, చిరంజీవి కేదారి, అందరు ముద్దుబిడ్డలై తగు విద్యాభ్యాసమం



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

యుత్పన్నకేశయం యున్నారు. మా పెద్దవారు (అన్నగారెడ్డి) సంతానవంతులు యగుటకు ఆ పరమేశ్వరిని సర్వదా ప్రార్థిస్తూ ఉన్నాము. ఆ తల్లి కరుణకై యెదురుచూచుచున్నాము.

### సదన మొక సంస్థానము

డాక్టరు చెన్నారెడ్డిగారికి సదన ఉన్నను కేమున్నను వారిది సంస్థానమే! పండితులు, విద్యార్థులు, ప్రొఫెసర్లు, [illegible], పూర్వవైద్యులు, వేదపండితులు, కవులు, గాయకులు, కళాకారులు, గ్రామీణులు, కార్మికులు మొదలగువారిని ఎల్లప్పుడు ఈ సంస్థానము [illegible] గౌరవసత్కారములు జరుపుట యొక విశిష్ట సత్సంప్రదాయము. [illegible] సత్సంప్రదాయమును పాటించుట వీరికే తగును. నా పూర్వజన్మ సుకృత ఫలము 27-3-1953 న [illegible] వారి ఆస్థానమందు ప్రవేశము చేసితిని. ఆ కాలమున వారు వ్యవసాయము, [illegible], ప్రణాళిక శాఖలు నిర్వహించుచున్న మంత్రులు. పునరావాస శాఖ కూడ వారికడనే యుండెను. వారు శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారి మంత్రివర్గ సభ్యులందరిలోను చిన్న వయస్కులు. అప్పటి వీరి వయస్సు 33 సంవత్సరములు. మహా [illegible] గలవారు, ప్రతిభావంతులు, ధీశాలురు. ప్రతి విషయమును ప్రశ్నించిననే కానీ [illegible] వీరికి [illegible]. వీరి జీవిత చరిత్ర [illegible] ప్రశస్త పాలనములు గలది. వీరి జీవిత చరిత్ర ఎంతో [illegible] వ్రాయుట సాహిత్యవేత్తలకు, కవులకు, పండితులకు, చరిత్రకారులకు వదలి, వారి జాతకము [illegible] ముఖ్యాంశములను చేర్చుచున్నాను.

### ఉజ్జ్వల భవిష్యత్తు

శ్రీ కాళయుక్తినామ సంవత్సర, పుష్యమాస శుక్లపక్ష త్రయోదశి, సోమవారం రాత్రి 10 గంటల 49 నిమిషములకు (భారత కాలమాన ప్రకారము) మృగశిరా నక్షత్ర కన్యా లగ్నమందు వారి [illegible]–హైదరాబాదు సమీప గ్రామమైన వారి సొంత ఊరు శిరిపురములో జన్మించిరి. ఆంగ్లమాన ప్రకారము జన్మదిన తేదీ 13-1-1919 రాత్రి గం. 10.49 ని.

ఉత్తర ప్రదేశ్ గవర్నరుగా పెద్ద రాష్ట్రమును [illegible], [illegible], పూర్వ [illegible] మొదలగువాని [illegible] 1-10-1977 నాడు ఆ పదవిని వదలి, [illegible] ఆంధ్రప్రదేశమునకు ముఖ్యమంత్రియై [illegible], కాని [illegible] కాదు. మహా రాజకీయవేత్తలకు [illegible] గోచరించినది. వీరికి [illegible], ధర్మమందును, దైవమందును [illegible] భక్తికిని, మహా ఆత్మవిశ్వాసమునకును, వీరి శక్తి సామర్థ్యములకును ఇది యొక ప్రబల నిదర్శనము కాదా!

వీరు భవిష్యత్తులో [illegible] కాదు. మరల దేశ [illegible] వీరి సేవలు ప్రస్తుతము [illegible] దేశమున [illegible] ఉన్నవి. కాన, వీరిని, వీరి కుటుంబమును సర్వశక్తి సంపన్నురాలైన ఆ పరమేశ్వరి [illegible] ఆయురారోగ్య [illegible], [illegible] బలమును, సర్వదా విజయమును చేకూర్చను, వారి పరిపాలనలో [illegible], [illegible] యుండులాగున వారికి వరము ప్రసాదించుటకై వేడుకొనుచున్నాను.

> "సర్వమంగళ మాంగళ్యే శివే సర్వార్థ సాధికే
> శరణ్యే త్ర్యంబకే దేవి నారాయణి నమోస్తుతే."

> అదే మా సర్వస్వము!
> అదే మా వ్యక్తిత్వము!!
> సర్వలోక [illegible] అనుష్ఠానము!!!
> ఓం శాంతిః శాంతిః శాంతిః.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# మంగళ గీతి

దుర్గం తారాబాయి

శేషగిరివాసి భద్రాద్రి శిఖరవాసి
యాదగిరివాసి ముగ్గు రైక్యంబుతోడ
షష్టిపూర్త్యుత్సవమున నొసంగుగాత!
మఱ్ఱి చెన్నాఖ్యున కనేక మంగళములు.

తెలుగుజోదు చెన్నారెడ్డి ధీవరునకు
షష్టిపూర్తులు మరిమరి జరుగవలయు
విపుల శాఖోపశాఖల విస్తరిల్లి
మఱ్ఱివంగడము ప్రవర్ధమాన మగుత!

పోరులందున జన్మించి పోరులందు
పెరిగి పోరాటముల మున్గి పేరుగాంచి
దేశ దారిద్ర్యమును నే దెదిర్చి నిల్చి
పోరుసల్పు చెన్నారెడ్డి ధీరు నెంతు!

అల ప్రకాశము కున్న ధైర్యమ్ము, మరియు
బూర్గుల మనీషి కున్నంత బుద్ధిబలము
కలిగినట్టి వా డొక్కడే తెలుగునాట
నేతృమణి మఱ్ఱివంశమాణిక్య మతడు.

భక్తిపరుడు సదాచార వర్తనుండు
సుకవివాక్యామృతాస్వాదశోభితమతి
గురుకృపా ప్రాసితైశ్వర్యపరుడు నైన
మఱ్ఱివంశాగ్రణికి జయమంగళములు.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

# అక్షర శిల్పులు

ఆంజనేయులు, ఎ. వి. యస్. ఆర్. — డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థ, హైదరాబాదు.

ఇనాక్, కొలకలూరి — కవి, ఆంధ్రోపన్యాసకుడు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం.

ఉమాదేవి — ఎం. ఎల్. సి., ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

కరుణశ్రీ (జంధ్యాల పాపయ్యశాస్త్రి) — కవి, రిటైర్డ్ ఆంధ్రోపన్యాసకుడు, రవీంద్రనగర్, గుంటూరు.

కృష్ణ, ఎ. ఆర్. — రాష్ట్రశాఖాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ నాట్యసంఘం.

కేశవరావు, ఉమ్మెత్తల — రాజకీయ కార్యకర్త, డా॥ చెన్నారెడ్డిగారి మిత్రుడు.

జంగయ్య, నీలా — కవి, తెలుగు అకాడమీ, హైదరాబాదు.

జనార్దనరెడ్డి, ఎన్. — రెవెన్యూశాఖామంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

జోషి, ఇ. ఎస్. — డా॥ చెన్నారెడ్డిగారి ఆస్థాన జ్యోతిష్కుడు.

జ్ఞానానంద కవి, ఎస్. టి. — కవి, తెలుగు పండితుడు, కాకినాడ.

తారాబాయి, దుర్గం — కవయిత్రి, అశోక్‌నగర్, సికిందరాబాదు.

దాశరథి, (దాశరథి కృష్ణమాచార్యులు) — ఆస్థాన కవి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

నరసింహం, అంతటి — కవి, సాంస్కృతిక వ్యవహారాల ప్రత్యేకాధికారి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాదు.

నరసింహశాస్త్రి, కేశవపంతుల — కవి, రిటైర్డు సంస్కృత కార్యక్రమ దర్శకుడు, ఆకాశవాణి, హైదరాబాదు.

నాగేశ్వరరావు, అక్కినేని — సినీనటుడు, నిర్మాత, హైదరాబాదు.

నారాయణరావు, కోదాటి — రాజకీయ కార్యకర్త, అడ్వకేటు, డా॥ చెన్నారెడ్డిగారి మిత్రుడు, వివేక్‌నగర్, హైదరాబాదు.

నారాయణరెడ్డి, సి. — కవి, ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

నారాయణాచార్యులు, పుట్టపర్తి — కవి, మోచంపేట్, కడప.

పద్మనాభరాజు, కె. వి. ఆర్. ఎస్. — సోషల్ వెల్‌ఫేర్ శాఖామంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

బాపురెడ్డి, జె. — ప్రత్యేక కార్యదర్శి, ముఖ్యమంత్రి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

బ్రహ్మయ్య, గొట్టిపాటి — ఆంధ్రప్రదేశ్ విధానసభ మాజీ అధ్యక్షుడు.

భారతి, ప్రొఫెసర్ — కవి.

భాస్కరరావు, ఎస్. — న్యాయశాఖామంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

భాస్కరరావు, వేములపల్లి — రాజకీయ కార్యకర్త, డా॥ చెన్నారెడ్డిగారి మిత్రుడు, బీబీగూడెం, సూర్యాపేట తాలూకా.

భీమన్న, బోయి — కవి, ఎం. ఎల్. సి., ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

'మల్లెమాల' (మల్లెమాల సుందరరామిరెడ్డి) — కవి, చలనచిత్ర నిర్మాత, మద్రాసు.

మాలకొండయ్య, ఎల్. — కవి, మానేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ మైనింగ్ కార్పొరేషన్, హైదరాబాదు.

మాలకొండారెడ్డి, ఉండేల — కవి, ప్రొఫెసర్, సివిల్ ఇంజనీరింగు, రీజనల్ ఇంజనీరింగు కాలేజి, వరంగల్.

యశోదారెడ్డి, పి. — కవయిత్రి, రీడర్, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

యాసీన్, గులాం — కవి, హైదరాబాదు.

రవి (మర్రి రవీంద్రరెడ్డి) — డా॥ చెన్నారెడ్డిగారి కుమారుడు.

రామపదాసు, త్రిపురాన — చైర్మన్, డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హైదరాబాదు.

రాజన్నశాస్త్రి, కె. — కవి, ఆంధ్రోపన్యాసకుడు, సర్దార్ పటేల్ కళాశాల, సికిందరాబాదు.

రాజలింగం, ఎం. ఎస్. — అడ్వొకేట్, రాజకీయ కార్యకర్త, మాజీమంత్రి, వివేక్ నగర్, హైదరాబాదు.

రాజా, డి. వి. యస్. — చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్, హైదరాబాదు.

రామలింగం, డి. — పత్రికా రచయిత, రిటైర్డ్ ఫిలిం సెన్సార్‌బోర్డు ఆఫీసరు, హైదరాబాదు.

రామానుజరావు, దేవులపల్లి — కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు.

రామారావు, ఎన్. టి. — సినీనటుడు, నిర్మాత, దర్శకుడు, మద్రాసు.

రెడ్డి, బి. ఎన్. — కవి, వాస్తుశిల్పి, హైదరాబాదు.

లక్ష్మణశాస్త్రి, కప్పగంతుల — కవి, రిటైర్డ్ సంస్కృత శాఖాధికారి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ, హైదరాబాదు.

లక్ష్మీబాయి, సంగం — మాజీ ఎం. పి., వ్యవస్థాపకురాలు, ఇందిరా సేవాసదన్, హైదరాబాదు.


CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

| | | |
|---|---|---|
| లక్ష్మీరంజనం, ఖండవల్లి | — | రిటైర్డ్ ప్రొఫెసర్, తెలుగుశాఖాధ్యక్షుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు. |
| లక్ష్మీరమణ | — | కవయిత్రి, మెహిదీపట్నం, హైదరాబాదు. |
| వరదాచార్యులు, వానమామలై | — | కవి, మాజీ ఎం. ఎల్. సి., ఆంధ్రప్రదేశ్, చెన్నూరు, ఆదిలాబాద్ జిల్లా. |
| వసు (వసుధాదేవి) | — | డా॥ మర్రి చెన్నారెడ్డిగారి పుత్రిక, శ్రీ కె. సుదర్శన్ రెడ్డి గారి సతీమణి. |
| విజయాత్రేయ, కలుగోట్ల | — | కవి, గని, కర్నూల్ జిల్లా. |
| విద్వాన్ విశ్వం | — | కవి, సంపాదకుడు, 'ఆంధ్రప్రభ' సచిత్రవారపత్రిక, హైదరాబాదు. |
| 'విరించి' (ఎం. రంగకృష్ణమాచార్యులు) | — | కవి, ప్రధాన కార్యదర్శి, మెదకుమండల రచయితల సంఘం, సదాశివపేట. |
| విశ్వం, అరిపిరాల | — | కవి, ఆంధ్రోపన్యాసకుడు, న్యూసైన్సు కళాశాల, హైదరాబాదు. |
| వీరప్ప, ఆగిశం | — | పౌరసరఫరాల శాఖామంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. |
| వీరభద్రమూర్తి, ముదిగొండ | — | కవి, హైదరాబాదు. |
| వెంకటరావు, యడ్లపాటి | — | వ్యవసాయ శాఖామంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. |
| వెంకటరెడ్డి, సురవరం | — | డాక్టరు, డా॥ చెన్నారెడ్డిగారి మిత్రుడు. |
| వెంకట్రామారెడ్డి, భవనం | — | విద్యా సాంస్కృతిక వ్యవహారాల మంత్రి, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం. |
| వేంకట రామారావు, రావెళ్ల | — | ప్రధాన కార్యదర్శి, ఖమ్మం జిల్లా రచయితల సంఘం, గోకినేపల్లి. |
| వేంకట సత్యనారాయణరావు, రాపూరు | — | కవి, 'భాషాకుటీరం' వ్యవస్థాపకుడు, హైదరాబాద్. |
| వేంకటావధాని, దివాకర్ల | — | కవి, రిటైర్డు ప్రొఫెసర్, తెలుగుశాఖాధ్యక్షుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు. |
| వేణుగోపాలరెడ్డి, మల్లెమాల | — | కవి, డాక్టరు, అధ్యక్షుడు, కడపజిల్లా రచయితల సంఘం. |
| శర్మ, పి. వి. ఆర్. | — | విలేఖరి, 'ఆంధ్రపత్రిక', హైదరాబాదు. |
| శశి (మర్రి శశిధరరెడ్డి) | — | డా॥ చెన్నారెడ్డిగారి కుమారుడు. |
| శారదా అశోకవర్ధన్ | — | కవయిత్రి, ఇన్‌ఫర్మేషన్ డిపార్ట్‌మెంటు, ఆం. ప్ర. |
| శేషేంద్రశర్మ, గుంటూరు | — | కవి, జ్ఞాన్‌బాగ్, హైదరాబాదు. |
| శ్రీనివాసాచార్య, తిరుమల | — | కవి, ఆంధ్రోపన్యాసకుడు, సర్దార్ పటేల్ కళాశాల, హైదరాబాదు. |
| సత్యనారాయణరావు, బొమ్మకంటి | — | రాజకీయ కార్యకర్త, డా॥ చెన్నారెడ్డిగారి మిత్రుడు, బొమ్మకల్లు, ఖమ్మం జిల్లా. |



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

| | | |
|---|---|---|
| సత్యనారాయణశాస్త్రి, మధునాపంతుల | — | కవి, త్యాగరాజనగర్, రాజమండ్రి. |
| సత్యనారాయణాచార్య, ఉత్పల | — | కవి, ఆంధ్రోపన్యాసకుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సికిందరాబాదు. |
| సావిత్రీదేవి | — | డా॥ మర్రి చెన్నారెడ్డిగారి సతీమణి. |
| సీతారామమూర్తి, తుమ్మల | — | కవి, అప్పికట్ల, గుంటూరు జిల్లా. |
| సుబ్బరామశాస్త్రి, పైడిపాటి | — | కవి, మారుతీనగర్, విజయవాడ. |
| సుబ్బారావు, రాయప్రోలు | — | కవి, రిటైర్డు ప్రొఫెసర్, తెలుగుశాఖాధ్యక్షుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు. |
| సుబ్రహ్మణ్యం, జి. వి. | — | రీడరు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు. |
| హయగ్రీవాచార్యులు, టి. | — | సాంకేతిక విద్య, భారతీయవైద్య శాఖామంత్రి, ఆంధ్రప్రదేశ ప్రభుత్వం. |



CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org

CSR Memorial Foundation
www.CSRMemorialFoundation.org